# శ్రీ రామాయణానుభవము

## (అయోధ్యకాండ)




ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఎ.

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# శ్రీరామాయణానుభవము - అయోధ్యకాండ

# అంకితము



శ్రీ ఉ.వే.ప్ర. శిరిశినగల్ కృష్ణమాచార్య (శతావధాని) స్వామివారి
శ్రీచరణ సన్నిధికి

''గీతను ప్రవచించెనొకడు – కృష్ణుడనగ! గీతనొకపర్వమందుంచె – కృష్ణుడొండు
కవన కన్యకు నవనూత్న కాంచి గూర్చు ''శిరిశి నగళుకృష్ణచరణ–శ్రీల'' గొలుతు

– ఆచి శ్రీనివాసాచార్య

# శ్రీ రామాయణానుభవము

## (అయోధ్యకాండ)



ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఎ.

# Sri Ramayananubhavam - Ayodhya Kanda
By Achi Srinivasa Charya

# శ్రీ రామాయణానుభవము - అయోధ్యకాండ
- ఆచి శ్రీనివాసాచార్య

శ్రీనివాస ప్రచురణములు – 2
ప్రతులు – వెయ్యి
ప్రథమ ముద్రణము – మార్చి 1999
(సిద్దిపేట)

ధర : **40-00**

ప్రతులకు :
1) ఆచి శకుంతలా దేవి
బాంబే బిల్డింగ్, 12–5–41/5,
విద్యానగర్, సిద్దిపేట – 502 103

2) ఆండాళ్ గోష్ఠి
ముకరంపుర,
కరీంనగర్.

ముద్రణ :
శారద ఆఫ్‌సెట్ ప్రింటర్స్, కరీంనగర్.



మ. రా. శ్రీ మేచినేని నారాయణరావు గారు

(మాతాపితరుల సంస్మరణకై)

వావిలాలపల్లి, కరీంనగర్

ఫోన్ : 43123

(ద్రవ్య సహాయము 2,500 రూపాయలు)

శ్రీమతి పుష్పలత
మ.రా.శ్రీ సిరికొండ కమలాకర్ రావు గారు
(రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్)
మంకమ్మతోట, కరీంనగర్
ఫోన్ : 42530
(ద్రవ్య సహాయము 1,016 రూపాయలు)

శ్రీమతి ప్రమోద
మ.రా.శ్రీ సిరికొండ ప్రభాకర్ రావు గారు
మంకమ్మతోట, కరీంనగర్
ఫోన్ : 42017
(ద్రవ్య సహాయము 1,016 రూపాయలు)



శ్రీమతి చీటి విజయ

మ. రా. శ్రీ చీటి అయోధ్య రామారావు గారు

ముకరంపుర, కరీంనగర్

ఫోన్ : 42844

( ద్రవ్య సహాయము 10,000 రూపాయలు)



శ్రీమతి దొనకంటి స్వరాజ్యలక్ష్మి

మ.రా.శ్రీ దొనకంటి వెంకటేశ్వర్ రావు గారు

కాంట్రాక్టర్ (పోరుమల్ల, కరీంనగర్)

ఫోన్ : 42265

(ద్రవ్య సహాయము 7,000 రూపాయలు)

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| I. | ఆమోదము | I - II |
| II. | ఆస్వాదము | III - IV |
| III. | ముందుమాట | V |
| 1. | వేదంలో సీతాకళ్యాణము | 1-2 |
| 2. | శత్రుఘ్నుడు | 2-14 |
| 3. | కల్యాణ గుణాలు | 14-27 |
| 4. | పట్టాభిషేక ప్రయత్నము | 27-36 |
| 5. | మంథర | 36-42 |
| 6. | కైకేయి | 43-47 |
| 7. | కోప గృహంలో కైక | 47-59 |
| 8. | దశరథుడు | 59-72 |
| 9. | రామ దర్శనము | 73-76 |
| 10. | ఋషితుల్యుడు | 76-80 |
| 11. | సత్యవాక్య పాలనము | 80-89 |
| 12. | ధర్మాధర్మాలు | 89-91 |
| 13. | పాతివ్రత్యము | 91-97 |
| 14. | లక్ష్మణానుసరణము | 97-100 |
| 15. | సుమిత్రా సందేశము | 100-109 |
| 16. | రాముని వెంటే వెళ్లింది నాచూపు | 109-115 |
| 17. | సుమిత్ర ఓదార్పు | 115-116 |

| | | |
|---|---|---|
| 18. | వనగమనము | 116-117 |
| 19. | గుహుడు | 118-122 |
| 20. | ముందు నడువు! | 122-125 |
| 21. | నాకంటె ప్రియమైనది | 125-127 |
| 22. | భరద్వాజుడు | 127-128 |
| 23. | పరతంత్రుడను | 128-129 |
| 24. | దశరథ నిర్యాణము | 129-131 |
| 25. | భరతుని స్వప్నము | 131-136 |
| 26. | బ్రహ్మ సూత్రాలలో స్వప్న విశ్లేషణము | 136-138 |
| 27. | భరతుని రాక | 138-141 |
| 28. | భరతుని శపథాలు | 141-145 |
| 29. | అంత్యక్రియలు | 145-146 |
| 30. | రాజసభ | 146-150 |
| 31. | గుహుని సౌజన్యము | 150-153 |
| 32. | లక్ష్మణుని సద్భావన | 153-157 |
| 33. | భరతుని దుఃఖము | 157-157 |
| 34. | భరద్వాజ మహాముని | 157-160 |
| 35. | భరద్వాజుని విందు | 160-165 |
| 36. | చిత్రకూటము | 165-166 |
| 37. | లక్ష్మణుని తొందరపాటు | 167-168 |
| 38. | సోదర ప్రేమ | 168-170 |
| 39. | శ్రీరామ సందర్శనము | 170-173 |
| 40. | రాజనీతి | 174-178 |

| | | |
|---|---|---|
| 41. | భరతుని ప్రార్థన | 179-181 |
| 42. | పితృవాక్య పాలనము | 182-184 |
| 43. | జాబాలి నాస్తికవాదము | 184-187 |
| 44. | శ్రీరాముని సత్యనిష్ఠ | 187-190 |
| 45. | శ్రాద్ధము | 190-202 |
| 46. | వశిష్ఠుని ప్రబోధము | 202-206 |
| 47. | పాదుకా పట్టాభిషేకము | 206-209 |
| 48. | అనసూయ | 209-214 |
| 49. | కృతజ్ఞతాభివందనములు | |
| 50. | ద్రవ్యదాతలు | |

# ఉపయుక్త గ్రంథావళి


1. వాల్మీకి రామాయణము — శ్రీ గోవిందరాజ వ్యాఖ్యానము
2. మంథర (రామాయణ)ము — శ్రీ వావికొలను సుబ్బారావు
3. రామాయణంలో వేదాంతార్థాలు — శ్రీ తె.కం. కోపాలాచార్య స్వామి వారు
4. రామాయణ రత్నాకరము — శ్రీ తె.కం. గోపాలాచార్య స్వామి వారు
5. రామాయణ – తత్వదీపికలు — శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారు
6. అంతరార్థ రామాయణము — శ్రీ వేదుల సూర్యనారాయణ శాస్త్రి గారు
7. శ్రీ వాల్మీకి రామాయణ దర్శనము — శ్రీ పాండురంగ శాస్త్రి అఠవలె
8. శ్రీమద్రామాయణము–విశ్వశ్రేయము — డా. మల్లాది గోపాలకృష్ణ శర్మగారు
9. రామాయణము — ఉష శ్రీ

# ఆమోదం



శ్రీశ్రీశ్రీ త్రిదండి
చిన్న శ్రీమన్నారాయణ రామానుజీయర్‌స్వామి వారు
'ఉభయవేదాంతాచార్య పీఠము'
జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, సీతానగరము, గుంటూరు జిల్లా.

శ్రీమతేరామానుజాయనమః
ప్రియ శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్యస్వామిన్
శ్రీమతే నారాయణనమః
అనేక మంగళాశాసనాలు

నింగిని సూర్యచంద్రులున్నంతకాలం నేలను గిరులు నిలిచినంతకాలం, నదులు ప్రవహించినంతకాలం, అసలీ నేలా నింగీ ఉన్నంతకాలం నిలిచి ఉండేది శ్రీరామాయణం.

మానవజాతి మనుగడకు మార్గదర్శకం శ్రీరామాయణం మనిషి మనిషిగా ఇక్కడ బతకాలన్నా, మనిషిగా తరువాత తాను పొందాల్సిన దాన్ని పొందాలన్నా కరదీపికను చూపించి, కరావలంబమిచ్చి నడిపించేది శ్రీరామాయణం.

ఎన్ని ధర్మాలు, ఎన్ని నీతులు, ఎన్ని బాంధవ్యాలు, ఎన్ని రసరమ్య వృత్తాలు, ఎన్ని రమణీయదృశ్యాలు, ఎన్ని ఉదాత్తవ్యక్తిత్వాలు, ఎన్ని అపూర్వ సన్నివేశాలు, ఎన్ని అద్భుత సమావేశాలు, ఎన్ని సంఘర్షణలు, ఎన్ని పరిష్కారాలు, ఎన్ని మనస్తత్వాలు, ఎన్ని నాగరికతలు – అదో అద్భుత ప్రపంచం! బయటకు కనవచ్చే ఆ ప్రపంచంలో చూడగలవారికి మరో దివ్యలోకం!

ఇట్లాంటి సారస్వతం సృష్టిలోనే మరోటిలేదు!

వేదః ప్రాచేతసాదాసీత్ – ఈ వేదదృష్టిని, వేద్యదృష్టినీ అట్లా ఉంచండి.

మరో గుణవంతుణ్ణి, కావ్యనాయకుడు కాదగినవాణ్ణి చూపించమన్నారు కవులు!

విశ్వమానవజాతి ఏ కాలంలోనైనా తన మొగం చూచుకోదగిన, చూచి అలంకరించుకోదగిన మణిదర్పణం ఈ రామాయణం!

అందరూ శ్రీరామాయణాన్ని చూచిన తీరు వేరు

శ్రీ సంప్రదాయపరులు చూచినతీరువేరు, ఎన్ని రహస్యాలు చెప్పేరు

ఎంత ఉదాత్తంగా భావించేరు, ఎంత ఉత్తమంగా నిరూపించేరు!

నాటి శ్రీశైలపూర్ణుల నుండి నేటి శ్రీభాష్యం వారి వరకూ శ్రీరామాయణానికి

'మహోదార గంభీరమైన, వ్యాఖ్యానసరణి ఒకటి మౌలిక స్వరూపానికి క్షతిలేకుండా సంప్రదాయాన్ని అనుకరిస్తూ జనరంజకంగా సాగి వస్తోంది.

ఇటీవలి కాలంలో అస్మదాచార్యులు, కులపతులు, ఉ.వే. శ్రీమాన్ తె.కం. గోపాలాచార్యస్వామివారి 'రామాయణ రత్నాకరం' ఉ.వే. శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యస్వామివారి 'తత్త్వదీపిక' చెప్పుకోదగినవి.

తమ వరకు వచ్చిన పెద్దల కృషిని పర్యాలోచించి తమ అనుభవాన్ని పెనవేసి తమదైన బాణిలో 'శ్రీరామాయణానుభవాన్ని' ఆవిష్కరిస్తున్నారు. ఉ.వే.ప్ర. శ్రీమాన్ అచ్చి శ్రీనివాసాచార్యస్వామివారు.

వీరు ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వ పాలన శాస్త్రోపన్యాసకులు. సంప్రదాయకుటుంబానికి చెంది పెద్దలను సేవించి ఉభయ వేదాంతాలూ సంప్రదాయ పద్ధతిలో పొందిన పండితులు.

సరళ వ్యావహారికంలో సంగ్రహంగా కథాభివర్ణనం కావిస్తూ ఆయా ఘట్టాలను గడించుకొని వాటిపై సంప్రదాయానుగుణంగా చక్కని వివరణాన్నిచ్చేరు. శ్రీమాన్ శ్రీనివాసాచార్యస్వామి వారు. ఒక్క మాటా అప్రామాణికం కాదు, అసాంప్రదాయికం లేదు. పుస్తకం పట్టింది మొదలు తుదివరకూ ఒక్క ఊపున చదివించే శైలి వీరిది.

శ్రీరామాయణ – తద్వ్యాఖ్యానాల అనుశీలనం వల్ల తాము హార్దంగా అనుభవించినదాన్ని అర్థవంతో ఆసక్తికరంగా ఆవిష్కరించేరు శ్రీమాన్ అచ్చిస్వామివారు.

ఒక్కమాట

అయ్యో పాపం కైక! అనుకొని ఆమె మంచితనానికి శ్రీ విశ్వనాథను సాక్షిగా తెచ్చి నిలిపిన శ్రీనివాసాచార్యస్వామి ఆయన గారి భరతుని కంటబడిన పాదుకలనూ చూపిస్తే బాగుండును.

ఒక్క పాదుకలేమిటి, సంప్రదాయ నిర్వాహాల సౌరభాలతో చెడకుండా ఎల్లాగూ కల్పవృక్షచ్ఛాయల్లో కాస్సేపు సేదదీరేరు కనుక ఆ ప్రసూన సౌరభాలతో తమ అనుభవాన్ని గుబాళింపజేస్తే ఇంకా బాగుండేదేమో అనిపించింది.

ఉ.వే. శ్రీమాన్ శ్రీనివాసాచార్యస్వామి తమ 'శ్రీరామాయణానుభవం' అన్ని కాండలనూ ఇట్లాగే సుబోధంగా తెలుగువారికందించాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాం.

సీతానగరము — సం/-

విజయవాడ. — చిన్న శ్రీమన్నారాయణ రామానుజీయర్‌స్వామి

III

# 'రామాయణ అనుభవము' - ఆస్వాదము

ప్రవచన వాచస్పతులు, చతుశ్శాస్త్ర పారంగతులు
- శ్రీ ఉ.వే.ప్ర. శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారు
విశాఖపట్నం

ఉభయవేదాంత ప్రవక్తులైన శ్రీమాన్ అచ్చి శ్రీనివాసాచార్యులువారు కళాశాలలో ఉపన్యాసకులుగా ఉంటూ పితృపాదులవలన సంక్రమించిన రామాయణానుభవమును 'ఏకః స్వాదు నభుంజీత' మధుర పదార్థమును ఒంటరిగ తినరాదని అందరకు పంచవలెనని రామాయణానుభవమును గ్రంధరూపమున నిబంధించుచున్నారు. వెనుక మొదటి భాగము వచ్చినది. ఇప్పుడు రెండవ భాగము వెల్వడుచున్నది. ఇది అయోధ్యాకాండలో శ్రీ సీతారామలక్ష్మణులు 'అత్రి మహర్షి ఆశ్రమ సందర్శనము' చేయువరకు సాగినది.

ఇంతవరకు వచ్చిన రామాయణ వ్యాఖ్యాన రహస్యములు అన్నిటిని ఏకత్ర సంపుటిచేసి అనువాదముగ కాకుండా వ్యాఖ్యాన రూపముకాకుండ అనుభవ పరీవాహ రూపముగ ఈ గ్రంధము వెల్వడినది. ఇందు వీరి విశ్లేషణం హృదయంగమముగా ఉన్నది. చిన్న చిన్న శీర్షికలతో మనకు అందించవలసిన విషయములను సరసముగ మధురముగ అందించినారు. కథా కథనము చేయుచు, అందలి తత్వమును వివరించుచు, గభీరము అయిన విషయమును సుగమము చేసినారు. ప్రతిచోట అందలి తత్త్వమును కూడ నిరూపించినారు. ఆయా స్థలములలో అవసరమైన మూల శ్లోకములను అందించినారు. మూలమును అతిక్రమించకుండ విషయ ప్రతిపాదనను స్పష్టత, సౌశీల్యము తగ్గకుండ వివరించినారు. ఇది అజ్ఞులకు, ప్రాజ్ఞులకు, విశేషజ్ఞులకు కూడ ఉపకరించు గ్రంధము. అజ్ఞులు వారి కధాకధనములోని అందమును చూచి ఆనందింతురు. ప్రాజ్ఞులు అందు ధర్మము నీతి ఎట్లు ప్రతిపాదింపబడినదో ఎరింగి పాత్రల వైశిష్ట్యము గుర్తించి పరవశమగుచుందురు. ఇక విశేషజ్ఞులు కావ్యములోని ధ్వని రూపముగ వెల్వడిన వేదాంతార్థములను తెలిసికొని ఆనందింతురు. ఇంతవరకు ఈ విధమగు

విభజనతో రామాయణ వివరణము రాలేదు. వారి కృషి సార్థకము. ఇది చర్విత చర్వణముకాదు. నీరసముగాదు మనసునుపెట్టి చివరిదాకా చదివింపగల శక్తి ఈ గ్రంధమునకు ఉన్నది.

శ్రీరామాయణము పవిత్రము, పాపఘ్నము, పుణ్యమగుటచే వేదములతో సమానమైనదని నారదుడు చెప్పినాడు. అంతేకాక ఈ రామాయణము రసవదర్థ ప్రతిపాదనమగుటచే ధర్మశాస్త్రము. లోకుల ప్రవర్తనను సరిచేయుటకు ఉపయోగించు ఆయా పాత్రనిరూపణముచే నీతి శాస్త్రము. అర్థజ్ఞానములేకున్నను అక్షరరాశి పఠనముచేతనే ఫలము ఒసంగెడి మంత్రరాజము. ఇతిహాస పురాణములు, వేదములు, శాస్త్రములు ప్రతిపాదించు అర్థ పంచకమును నిరూపించుటచే ఇది ఉపనిషత్తుల్యము. రామాయాణమును ఈ దృష్టితో సంపూర్ణముగా అనుభవించిన ఆచార్యులవారు తాము శ్రమించి, సరళము, సులభము అగు తమ భాషచేతను, భావావిష్కరణము చేతను అందరను తరింప జేసినారు. వీరి కృషిని పాఠకులందరు అభినందించకతప్పదు. ఇందు సుమారు ముప్పది శీర్షికలున్నవి. అవి మనము చదివినచో మనకు విశదముగ రామాయణరహస్యము ఎరుంగ వీలగును. ఆంధ్ర పాఠకలోకము సహృదయతతో దీనిని చదివి ప్రయోజనమునంది, వారి కృషివలన ప్రయోజనమునందుదురుగాక.

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్ర ప్రభువు ఈ రామాయణమునంతను ఈ విధముగ విశ్లేషణముతో రచించు శక్తిని శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్యస్వామి వారికి ప్రసాదించుగాక.

విశాఖపట్నం — ఇట్లు

6-1-98 — శ్రీభాష్యం అప్పలాచార్యులు

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# ముందుమాట

మా వంశము 'కౌండన్య' మహర్షి వంశము. వశిష్ఠ మహర్షి ప్రధాన సంతతి మాది. వశిష్ఠుడు శ్రీరామచంద్రుని కులగురువు. వాశిష్ఠులైన మా పెద్దలకు సహజంగానే శ్రీరామునిపైన అనురాగము ఏర్పడుతూ వచ్చింది.

''జనిత్వాహం వంశే మహతి జగతి ఖ్యాతయశసాం
శుచీనాం యుక్తానాం గుణపురుష తత్వస్థితి విదాం
నిసర్గాదేవ త్వచ్చరణ కమలైకాంత మనసాం'' అన్నట్లు మా మూల పురుషులు ప్రఖ్యాతులు, పవిత్రులు, భగవత్తత్వము చక్కగా తెలిసినవారు. పుట్టుకతోనే భగవత్పారవిందముల యందు లగ్నమనస్కులయినారు.

మా పితామహులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ ఆచి రాఘవాచార్యస్వామి వారు విఖ్యాత విద్వద్వరులు. ''విద్యా ప్రదానం''తో, ''శ్రీరామాయణ ప్రవచనాల''తో తమకాలం గడుపుకొన్న పవిత్ర చరిత్రులు. వారి శ్రీమద్రామయణ కాలక్షేపాలు జగత్ప్రసిద్ధములై వారి అభివృద్ధి నిశ్శ్రేయసములకు కారణములయ్యాయి.

మా పితృదేవులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ ఆచి వేంకటనృసింహాచార్య (ఆవునూరు) స్వామివారు – వారి తండ్రి గారి శ్రీరామ భక్తిని పుట్టుకతోనే పుణికి తెచ్చుకొన్న మహనీయులు. శాస్త్ర గ్రంథాలలో, సంప్రదాయ ప్రబంధాలలో వారి వైదుష్యము అనన్య సామాన్యమైనది. వారి ప్రవచనాలు వేలాది శ్రోతల హృదయాలను ఉఱ్ఱూతలూగించేవి. ''ఉపన్యాసకేసరి'' అనే బిరుదము వారి విషయంలో సార్థకమైనది.

ముఖ్యంగా ''వాల్మీకి'' స్థానాన్ని అలంకరించి వారు దోసిళ్ళతో అందించిన ''శ్రీమద్రామాయణ'' ప్రవచన మకరందము భక్తుల మనస్సులను పరవశింపజేసి రసప్లావితముల కావించేది.

వారి ప్రవచన ప్రభావము వారి సంతానమైన నన్ను బాల్యములోనే ముగ్ధుని కావించింది. ఫలితంగా శ్రీసీతారాములు నా హృదయమునే సింహాసనము చేసికొని స్థిరంగా ప్రతిష్ఠితులయ్యారు.

శ్రీరాముని స్వభావము విచిత్రమైనది. తన జీవితాన్ని ఒక కమనీయ కావ్యంగా మలచుకోవడానికి వ్యాధుడైన వాల్మీకిని ఎన్నుకొన్నాడు. తేనెలొలుకు తేట తెనుగులో సుందరంగా సులభంగా తన ''వృత్తాన్ని'' మొల్లపూల పరిమళంతో సువాసితం చేయడానికి – ఒక కుమ్మరి కన్నెను ''మొల్ల''ను వరించాడు. ఇప్పుడు తన ''ఇతివృత్తాన్ని'' అజ్ఞుడైన

నాకు అప్పగించి వ్యాఖ్యానించుమని ఆదేశించి – నాకు తన అభయ హస్తావలంబనాన్ని అందిస్తున్నాడు.

ఆ లోకాభిరాముని చరిత్రలోని ఆదికాండను ''బాలకాండను'' ''శ్రీరామాయణానుభవము – బాలకాండ'' గా విజ్ఞాపనం చేసికొన్నాను.

ఇప్పుడు ''అయోధ్యాకాండ'' పెద్దల ''ఆమోదము'' ''ఆస్వాదములు''తో మీముందుకు వస్తోంది.

ద్రవ్య వరిష్ఠులందరు – తమ ద్రవ్యాన్ని వ్యాపార రాజకీయ రంగాలలో పెట్టుబడిగా పెట్టి పలురెట్లు అభివృద్ధిగావించుకోవాలని ఆకాంక్షించే ఈ రోజులలో తమ సంపదను మేధా సంపదను పరమ పవిత్రమైన విద్యా రంగంలో వినియోగించి ''వాణీ (విద్యా) నికేతన''ములను స్థాపించి సరస్వతీమాతల్లి శ్రీచరణ సేవలో ధన్యులవుతున్న మాన్యులు వదాన్యులైన మ.రా.శ్రీ అయోధ్య రామారావు గారిని, బంగారుకు పరిమళమబ్బినట్లు ద్రవ్య సంపదలలో దాన ధర్మాలలో వారికేమాత్రము తీసిపోకుండా ఉండి తమ జీవితాన్ని ధన్యంచేసికొంటున్న మాన్యులు మ.రా.శ్రీ దొనకంటి వేంకటేశ్వరరావు (పోరుమళ్ల) గారిని, శ్రీ సీతారాములకు కల్పింపబడే ఈ అక్షరాలయానికి అభిమానంతో ఆర్థిక సహకారాన్ని అందించే వదాన్యులు మ. రా.శ్రీ నారాయణరావు గారిని మ.రా.శ్రీ సిరికొండ కమలాకర్‌రావు గారిని, మ.రా.శ్రీ సిరికొండ ప్రభాకర్‌రావు గారిని ఇప్పుడు అయోధ్య (కాండ) అభిమానించింది. ''లోకనాథః పురాభూత్వా – సుగ్రీవంనాథమిచ్ఛతి'' అన్నట్లు సర్వలోకాలకు సకలాభీష్టములను ప్రసాదించే సర్వేశ్వరుడైన శ్రీరామచంద్రస్వామి – ఈ దాతల సహకారాన్ని ఆపేక్షించి, తన అయోధ్య (కాండ)కు అక్షరాకృతిని కల్పించుకొంటున్నాడు. వీరికి, వీరి వారికి శ్రియఃపతి ఆయురారోగ్యైశ్వర్యాలను మరింతగా ప్రసాదించి, వీరి సిరిసంపదలకు ఇతోధికంగా దానభోగావకాశాలను కల్పించుగాక! వీరి ఔదార్య స్వభావంతో ఉత్తేజితులై ఇతర ధనాధికులు కూడ తమ సంపత్ సమృద్ధులను సద్వినియోగం కావించి సర్వేశ్వరుని కృపకు పాత్రులగుదురుగాక!

అలాగే ఈ గ్రంథాన్ని సకాలంలో సర్వాంగ సుందరంగా ముద్రించి ఇచ్చిన శ్రీ శారద ప్రింటర్స్ యజమాని శ్రీ నాగభూషణం గారికి ఇతర కార్యకర్తలకు శ్రీ సీతారాములు సకల శ్రేయస్సులను కలిగించుదురు గాక!

విద్వజ్జన విధేయుడు

కరీంనగర్

23-2-99

ఆచి శ్రీనివాసాచార్య

శ్రీ రామాయనమః

# వేదంలో సీతా కల్యాణము

శ్రీ రామాయణంలో బాల కాండ సీతాకల్యాణము, అయోధ్యా పునరాగమనాలతో పూర్తి అయింది.

జగత్కల్యాణ దాయకమైన సీతాకల్యాణం వేదంలో ఎలా సంగ్రహంగా తెలుపబడిందో గమనిస్తూ శ్రీరామాయణానుభవంలో అయోధ్య కాండను ఆరంభిద్దామా ?

'ఇంద్రః సీతాం నిగృహ్ణాతు – తాంపూషాఅనుయచ్ఛతు

సానః పయస్వతీ దుహాం– ఉత్తరాముత్తరాం సమాం'

ఇంద్రః :–సమస్తలౌకిక,వైదిక శబ్దాలు పరమాత్మనే చివరలో తెలుపుతాయి 'ఇంద్ర' శబ్దము కూడ– త్రిలోకాధిపతిని సామాన్యంగా తెలిపినా – ఆ ఇంద్రుని 'ప్రకాశానికి'–వైభవానికి కూడా కారణమైన పరమాత్మే–ఆ ఇంద్ర శబ్దానికి ముఖ్యార్థము. ఆయన శ్రీరాముడు.

సీతాం:–స్వయం వరంలో సీతాదేవిని.

నిగృహ్ణాతు:–శివధనుర్భంగం గావించి–జయిస్తాడు.

తాంపూషాऽనుయచ్ఛతు:–తన వాగ్దానం ప్రకారము–ఆ సీతాదేవిని (పూషా) పోషించిన తండ్రి అయిన జనక మహారాజు–శ్రీరామచంద్ర స్వామికి–కన్యాదానం(చేయుగాక) చేస్తాడు.

ఉత్తరాముత్తరాం సమాం:–ఉత్తరోత్తరా–రాబోవు కాలమంతటిలో.

సానః:–ఆ సీతాదేవి మనకు.

దుహాం పయస్వతీ భవతు :–ఇచ్చువారందరిలో అత్యధికంగా శ్రేయస్సును కలిగించుగాక.

చూచారా!వేలమంది తల్లి దండ్రుల కంటె అధికంగా హితాన్ని కల్గించే వేదము–సంగ్రహంగా మంత్రపూరితంగా సీతారాముల కల్యాణాన్ని – తద్వారా మనందరికి శుభాశీస్సులను తెలియజేస్తుంది.

ఓం తత్సత్

శ్రీరామాయనమః

## శత్రుఘ్నుడు

(అయోధ్యకాండ ప్రారంభము)

''గచ్ఛతా మాతుల కులం। భరతేన తదానఘః

శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః నీతః ప్రీతిపురస్కృతః''

భరతుడు తన మేనమామ ఇంటికి వెళ్తుండగా–అతనిచేత అనఘుడు నిత్యశత్రుఘ్నుడైన శత్రుఘ్నుడు సంతోషంగా తీసుకపోబడ్డాడు.

శ్రీరామాయణములో –బాలకాండ యజ్ఞ ప్రధానమైనది. అందులో రామకథే ప్రధానమైనది. శ్రీరామ జననం నుండి–పరశు రామ విజయం–అయోధ్య కుతిరిగి రావడం వరకు కథ అంతా శ్రీరాముడే కేంద్ర బిందువుగా నడిచింది. పుత్రకామేష్టి నుండి జనకుని యాగం వరకు బాలకాండ యజ్ఞమయంగాసాగేది.

అయోధ్యకాండ ధర్మ ప్రధానమైంది ఇందులో రామానుజాల వృత్తాంతం ప్రధానంగా వుంటుంది అయితే ఇందులో రామ కథ ఉండదని కాదు. రామ కథ లేని రామాయణం దేవుడులేని గుడివంటిది. అతని కథతో పాటు అతని సోదరులగాథ కూడ అత్యంత ప్రధానంగా ఉంటుంది. అయోధ్య కాండ శత్రుఘ్నుని చరితంతో అరంభమై –లక్ష్మణుని అనుసరణము కేంద్రంగా కలిగి భరతుని మహనీయతతో పూర్తి అవుతుంది సత్సంగమే సకలశ్రేయస్సులకు మూలమని రామాయణంవివరిస్తుంది.

కేకయమహీపతి ''అశ్వపతి''. ఆయన తన మనుమని భరతుని చాలకాలం నుండి చూడాలను కొని తన కొడుకైన యుధాజిత్తు ను అయోధ్యకు పంపాడు. యుధాజిత్తు అయోధ్యకు వెళ్లేవరకు దశరధ చక్రవర్తి తన కుమారుల వివాహాల కొరకు మిధిలానగరం సపరివారంగా చేరాడు. అందువలన యుధాజిత్తు కూడ మిధిలకు వెళ్లాడు.

కుమారుల వివాహాలు జరిగాక దశరధుడు క్రొత్త కోడళ్లతో అయోధ్యకు చేరుకొని , కొన్ని రోజులు గడిచాక భరతుని తన మామతో కేకయ దేశానికి పంపుతున్నాడు. ఇక్కడనుండి ఆరంభమవుతుంది ''అయోధ్యకాండ''–ఇక్కడ నుండే మొదలవుతుంది రామసోదరుల మాహాత్మ్యము.

''వేదయతీతి వేదః'' అని వేదం యొక్క వ్యుత్పత్తి.వేదమంటే తెలిపేది. దేనిని తెలుపుతుంది వేదము ? పురుషార్ధాలను. పురుషార్థాలు అంటే పురుషులు (మానవులు) అందరిచేత కోరబడేవి. అవి నాలుగు.

ఈ నాలుగింటిలో ప్రధానంగా మనము కోర దగింది ఆచరించవలసింది ధర్మము. ఈ నాలుగింటిలో ధర్మము పెద్దన్న వంటిది. మిగిలిన మూడు పురుషార్థాలు అన్నను అనుసరించే తమ్ముల వంటివి.

అర్థ, కామ, మోక్షాలను ధర్మాన్ని అనుసరించే కోరుకోవాలి. అప్పుడవి ధర్మఫలాన్నే ఇస్తాయి. అంతే కాదు ఒక్క ధర్మాన్నే ఆచరించినా , అది ఒక్కటే నాలుగు పురుషార్ధాల ఫలాలను ఇస్తుంది.

రామాయణం ''ధర్మాన్ని – ప్రియురాలు – వశ్యురాలు, పుత్రవతి అయిన భార్యతో '' పోలుస్తుంది.

''భార్యేవ వశ్యా, అభిమతా, సుపుత్రా''

అనుకూలవతి అయిన అర్ధాంగితో పురుషుడు తన కోరికలను తీర్చుకొంటాడు. అంతేకాదు ఆమె వలన పిల్లలను పొందివారి ద్వారా తన వార్ధక్యంలో రక్షణను పొందుతాడు. ఆవిధంగా , ఆయన ఆమెతో తన కామానుభవాన్ని,ఆమె పిల్లల ద్వారా అర్థానుభవాన్ని పొందగల్గుతాడు.

ధర్మాన్ని విడిచి, కేవలము అర్థాన్ని కోరుకొంటె ''కైకేయి'' వలె లోకుల ద్వేషానికి గురి కావలసివస్తుంది.

''ద్వేష్యో భవత్యర్థపరోహిలోకే''

ధర్మాన్ని విడిచి కేవల కామసుఖాన్నే అభిలషిస్తే రావణునివలె లోకుల నిందకు పాత్రము కావలసివస్తుంది.

''కామాత్మతాఖల్వపి నప్రశస్తా''

అందువలన ధర్మార్థకామములనే త్రివర్గాలు ధర్మ బద్ధంగా ఆచరింపబడిననాడు అవి ధర్మఫలాన్నే ఒసగుతాయి.

''ధర్మార్థ కామాఖలు తాత లోకే!

సమీక్షితా ధర్మ ఫలోదయేషు!

ధర్మో యతస్స్యాత్ తదుపక్రమేత

యే తత్ర సర్వేస్స్యురసన్నివిష్టాః''

మనమందరము ధర్మాన్ని ముందుంచుకొనే అర్థకామాలను అనుభవించాలని రామాయణము మనకు సందేశాన్ని అందిస్తుంది.

''ధ్రియత ఇతి ధర్మః'' ధర్మము అంటే ధరింపబడేదని. ఆచరింపవలసిందని అర్థము.

ధర్మము రెండు రకాలు -1 .సామాన్య ధర్మము. 2: విశేషధర్మము.

'సామాన్య ధర్మం' అంటే ''సమాజంలో మనము ఇతరుల విషయంలో ఆచరించ వలసింది'' తండ్రి ఆచరింపవలసినది పితృ ధర్మము అలగే పుత్రధర్మము, భ్రాతృ ధర్మము, భర్త ధర్మము, భార్య ధర్మము మొదలైన వెన్నో సామాజిక (సామాన్య) ధర్మాలు ఉంటాయి. ఒక వ్యక్తి సామాజిక ధర్మాలన్నిటిని సంపూర్ణంగా ఆచరింపవచ్చో తాను ఆచరించి చూపాడు శ్రీరాముడు. అందువనలనే ఆయనను – ఆయన శత్రువైన మారీచుడు సైతము''శ్రీరాముడు ధర్మమూర్తి''

''రామో విగ్రహవాన్ ధర్మః'' అని మనసునిండా మెచ్చు కోక తప్పలేదు. ధర్మమే ఆకారం ధరించి రాముడుగా అవతరించింది.

ఆయన సత్యము, దానము భూతదయ, పితృ వాక్యపరిపాలనము, ఏకపత్నీవ్రతము మొదలైన సామాన్య (సామాజిక) ధర్మాలనన్నిటిని ఆచరించిన మర్యాదాభిరాముడు.

సామాన్య ధర్మము కంటె విశిష్టమైనది 'విశేష' ధర్మము. దానిఆచరణ అందరికి సాధ్యం కాదు అందరికి రుచికరమైనది కుడ కాదు. విశేష ధర్మము 'భగవద్విషయానికి' సంబంధించింది. రామాయణంలో సీతాదేవి, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, హనుమ, విశ్వామిత్రుడు మొదలైన మహనీయులెందరో శ్రీరాముని పరమాత్మగా గుర్తించారు. అందువలననే వారందరు అతని సేవలోనే తరించారు.

భార్యను, రాజ్య సౌఖ్యాలను విడిచి రాముని అనుసరణలో దాసత్వ (శేషత్వ) ధర్మాన్ని, (కైంకర్య) సేవా ధర్మాన్ని ఆచరించిన త్యాగమూర్తి లక్ష్మణుడు. రాముని అనుసరణ కంటె రామాజ్ఞను అనుసరించడమే ప్రధానమని ' ఇతరుల కొరకే ఉండడము' అనే పరార్థాన్ని (''పరతంత్ర ధర్మాన్ని '') ఆచరించిన మహాత్ముడు భరతుడు. ఆ ధర్మాలనూ, పూర్తిగా తానొక్కతే ఆచరించి చూపిన అనదృశ అర్ధాంగి సీతమ్మతల్లి. ఆత్మ యొక్క సాధారణ లక్షణాలు జ్ఞానానందామలకత్వములు. (అమలకత్వము అనగా నిర్మలత్వము) వాటి యొక్క విశేష స్వరూపాలే శేషత్వ జ్ఞానము, పరార్థా (పారతంత్ర్యా) నందము, కైంకర్యామలకత్వము అనగా సేవా నిర్మలత్వం.

తాను పరమాత్మ పట్ల 'దాసజ్ఞానాన్ని' కల్గిఉండడము శేషత్వము, తాను పరమాత్మకు ప్రాణములేని వస్తువువలె అత్యంత విధేయమని గుర్తించి ఆనందించడమే 'పారతంత్ర్యము' తాను పరమాత్మకు అన్ని విధాల సేవలు పవిత్రంగా చేయడమే కైంకర్యము.

శేషత్వ కైంకర్యాలకు లక్ష్మణుడు ప్రతీక అయితే, పారతంత్ర్యానికి భరతుడు ఉదాహరణము. ఈమూడు ఆత్మ లక్షణాలను సంపూర్ణంగా అనుష్ఠించిన అతిలోక

చరిత సీతాసాధ్వి. అయితే వీరందరిని మించిన వీరుడు, అనఘుడు, నిత్య శత్రుఘ్నుడయిన మహాభాగవతోత్తముడు శత్రుఘ్నుడు.

1''అనన్య శేషత్వము'' --- భగవంతుని కొక్కనికే దాస్యము చేయడము.

2''అనన్య శరణత్వము''--- భగవంతుని ఒక్కనినే శరణు వేడడం

3''అనన్య భోగ్యత్వము''--- భగవంతునికొక్కనికే భోగ్యముగా ఉండడము.

ఈమూడు స్వరూపాలే (లక్షణాలే) 'ఆకారత్రయము' అనబడుతాయి. ఈ మూడు లక్షణాలు కలిగి ఉండడము విశేషమే. శరణాగతి ధర్మమును అనుష్ఠించే మహాపురుషులలో ఈమూడు ధర్మాలు ఉంటాయి.

అయితే భగవద్విషయంలో ఈ 'ఆకారత్రయ సంపద'ను కలిగి ఉండము అంత దుర్లభమేమి కాదు. భగవంతుని యొక్క పరాక్రమానికి, సౌందర్యానికి వశంకాని వారు కూడా ఆయన కల్యాణ గుణలకు అవశులవుతారు. అందువలననే శ్రీరాముని కోదండ గుణానికంటే ఆయన కల్యాణ గుణాలే గొప్పవి.

అయితే భగవద్విషయంలో ఆకారత్రయ సంపదకంటే భాగవతుల (భక్తుల) విషయంలో 'ఆకారత్రయ'. సంపద మరింత అమూల్యమైనది.

లోకంలో మన వలెనే కొందరు కరచరణాది అవయవములను, మనవలెనే ఆకలి దప్పులను కలిగి ఉండవచ్చును. అయినా భగవద్విషయంలో వారికి, మనకు భూమ్యాకాశములంత భేదము ఉంటుంది. వారే జ్ఞానులు, భక్తులు, ప్రపన్నులు వారే భగవత్ప్రియులు. వారికి భగవంతుడు ప్రాణంకంటే ప్రియమైనవాడు. భగవంతునికి వారు కూడ ప్రాణాధిక ప్రియులే. ఆవిధంగా భగవంతుని ప్రాణాధికమగా ప్రేమించి, ఆయనచేత ప్రాణాధికంగా ప్రేమింపబడిన మహాత్ముడు భరతుడు.

భరతుడు– తనకు రాజ్యాన్ని అందించిన తల్లిని – రాజ్యాన్ని స్వీకరింపుమన్న వశిష్టాది కుల గురువులను సైతము ధిక్కరించి – శ్రీరాముని 'రాజలక్షణ

చిహ్నితములైన శ్రీపాద ములనే శిరస్సు పై ధరించాలి తద్వారా దుఃఖ శాంతిని పొందాలనుకొన్న మహానుభావుడు. భరతుడు ప్రభావవంతుడైన ప్రపన్నుడు.

అటువంటి అప్రతిమాన 'భక్తి భరితుడైన' భరతుని నీడలా అనుసరించి, ఆయన దుఃఖాల్లో పాలు పంచుకొని , ఆయనను ఓదార్చి, ఆయనకే అన్ని వేళలా అన్ని విధాల సేవలు చేసి తరించిన అనఘుడు శత్రుఘ్నుడు. ఆయనకు భరతుడంటే భగవంతుడైన శ్రీరామునికంటే అధిక ప్రేమ. భగవంతునికి తన వారిని ( భక్తులను భాగవతోత్తములను) ప్రేమించే వారంటే ఎక్కువ ఇష్టము . శ్రీరామునికి సీతా లక్ష్మణ, భరతులకంటే – శత్రుఘ్నుడంటేనే ఎక్కువ మక్కువ.

అరణ్యంలో శ్రీరామచుడు లక్ష్మణునితో సంభాషిస్తూ పలికిన పలుకులెంతవిచిత్రంగా ఉంటాయో చూద్దాము.

''కదాన్వహం సమేష్యామి – భరతేన మహాత్మనా

శత్రుఘ్నే వచవీరేణ – త్వయాచరఘునందన ''

''లక్ష్మణా నేను ఈ అరణ్యవాసాన్ని ముగించుకొని ఎన్నడు మహాత్ముడైన భరతునితో, వీరుడైన శత్రుఘ్నునితో – నీతో కూడ హాయిగా కలిసి ఉంటానో ?

చూచారా రామహృదయాన్ని ! తన ప్రాణప్రియ భార్యను, రాజ్య సౌఖ్యాలను, కన్నతల్లిని తృణప్రాయంగా వదిలి – శ్రీరామునే అనుసరించి – అతనితోపాటు అన్ని వనవాస ధుఃఖాలను అనుభవించే లక్ష్మణునితో కలిసి ఉండడము రామునికి అంతముఖ్యం కాదట. ఏదో లక్ష్మణుని ముఖ ప్రీతికి అన్నట్లు ( త్వయాచ) నీతో కూడ హాయిగా కలిసి ఉండే దెన్నడో అంటాడు ఆ సహోదరుడు.

రాముడు ఎక్కువ కలిసి ఉండాలనుకొనేది ఎవ్వరితో ? భరతశత్రుఘ్నులతో – రాముని ఉద్దేశ్యంలో వారెటువంటి వారు ? భరతుడు మహాత్ముడు –శత్రుఘ్నుడు వీరుడు. అందువలన వారితో కలిసి ఉండాలను కొంటున్నాడాయన.

రాముని – వెన్నంటి అడవులకు వెళ్లిన లక్ష్మణుని కంటే – అయోధ్య ( నంది గ్రామం) లో దూరంగా ఉన్న భరతుడు మహాత్ముడెట్లా అయ్యాడు ?

''భరణాత్ భరతః'', ''భరతో భక్తి భరితః''

భరతునికి రెండు వ్యుత్పత్తులు ఉన్నాయి. 1. భరించినందు వలన భరతుడు. 2. భక్తితో నిండిన వాడు భరతుడు. ఇంతకు ఏమి భరించాడు ఆయన ? తనకు అసహ్యములయిన రెండు విషయాలను భరించాడు.

1. రాజ్యాన్ని 2. రామ విరహాన్ని.

అంతే కాదు తనకు ఇష్టములేని ఈరెండు విషయాలను భరించుమని అజ్ఞాపించిన – రాముని విషయంలో భక్తి భరితుడు, పారతంత్ర్య పరిపూర్ణుడు ఆయన. అందుకే భరతుడు మహాత్ముడు.

ఇక శత్రుఘ్నుడెటువంటి వాడు? శ్రీరామ చంద్ర స్వామికే అర్థము కాని వీరుడు. వాల్మీకి భగవానుడు ఆయనను 'అనఘుడు', 'నిత్యశత్రుఘ్నుడ' ని వర్ణించాడు.

ఇంతకు శత్రుఘ్నుని అనఘత్వము ఏమిటి? అనఘుడు అంటే 'పాపర హితుడు' అని అర్థము. పాపమంటే ఏమిటి ? ప్రాప్తి ప్రతిబంధకము. తాను పొందాలను కొనే దానిని పొంద నీయకుండా అడ్డగించేది పాపము – అటువంటి పాపము ఏమాత్రము లేనివాడు శత్రుఘ్నుడు.

''గచ్ఛతామాతుల కులం – భరతేన తదానఘః

శత్రుఘ్నో – నిత్య శత్రుఘ్నః నీతః ప్రీతి పురస్కృతః''

భరతుడు తన మేనమామ యుధాజిత్తు ఇంటికి తండ్రి ఆజ్ఞతో – మేనమామ వెంట వెళ్లుతున్నాడు. (తదా) అప్పుడే పాపరహితుడైన శత్రుఘ్నుడు ప్రీతితో తీసికపోబడుతున్నాడు.

ఇక్కడ శత్రుఘ్నుడు భరతుని వెంట స్వయంగా వెళ్లడం లేదు. తీసుకపోబడుతున్నాడు. శత్రుఘ్నుడుప్రాణంలేని వస్తువా తీసుకపోబడడానికి ? కాదు కాని భరతుని పట్ల అయన ప్రేమ శత్రుఘ్నుని అవశుని చేసింది. ఆ ప్రేమ పారవశ్యమే అయనను తీసుక పోతుంది. భరతుని అవశంగా అనుసరించడమే

శత్రుఘ్నునికి ప్రీతికరము – అందుకే వాల్మీకి '' ప్రీతి పురస్కృతః నీతః'' ''భరతుని పట్ల ప్రీతిని కలిగి తీసుక పోబడ్డాడు '' అని తెలిపాడు.

కేకయ రాజ్యానికి భరతున్ని శత్రుఘ్నుడు అనుసరించాడు కదా ! ఎప్పుడు? ఎందుకు? ఎలా అనుసరించాడు ? – భరతుని అనుసరించాలని ముందు అనుకొన్నాడా? లేదు – ''తదా'' అప్పుడే – ముందు అనుకోకుండానే అనుసరించాడు.

ఎందుకు అనుసరించాడు ? భరతునితో అయునకు ఉండే స్నేహాన్ని గమనించి యుధాజిత్తు రమ్మన్నాడా ? లేదు.

దశరథుడు – అన్నకు తోడుగా వెళ్లమన్నాడా ? లేదు.

పోనీ భరతుడైనా పిలిచాడా ? లేదు.

మరెందుకు వెళ్లినట్లు ? అయన వెళ్లాలనుకొని వెళ్లలేదు – ''నీతః'' భరతుని పట్ల ఆయన నిరతిశయ సోదర ప్రేమ ఆయనను అయోధ్యలో నిలువనీయకుండా చేసింది . దానిచే అవశుడైతీసుకపోబడ్డాడు.

సరే – భరతుని అనుసరించాడు కదా శత్రుఘ్నుడు. అలా అనుసరించే రోజు –శత్రుఘ్నుడు –తనకు మంచి రోజు అవునో కాదో చూచుకొన్నాడా ? లేదే.

ధశరధుడు భరతునికి మంచి రోజు చూచి పంపి ఉంటాడు కదా ! సాధారణంగా భరతునికి మంచి అయిన రోజు శత్రుఘ్నునికి మంచిదై ఉండదు . కారణము వారిద్దరు ఒక్క రోజు తేడాతో జన్మించారు. భరతుని జన్మ తార ''పుష్యమి'' శత్రుఘ్నుని జన్మనక్షత్రము ''అశ్లేష''–భరతునికి సంపత్ , క్షేమ, సాధన, మిత్రతారలు – శత్రుఘ్నునికి మంచివి కావు. భరతునికి తొమ్మిదవ తార పరమ మిత్ర తార అవుతుంది . ఆ ఒక్క రోజే వారిద్దరికి మంచి రోజు.

అయితే వారిద్దరికి మంచిదయిన రోజే దశరధుడు భరతుని – మేన మామ ఇంటికి పంపాడని ఖచ్చితముగా తెలియదు. భరతుడే రోజు మేనమామ ఇంటికి బయలుదేరాడో రామాయణంలో తెలుప బడలేదు.

మొత్తము మీద భరతునికి మంచిరోజు చూచే మేన మామ వెంట భరతుని - దశరథుడు పంపి ఉంటాడు అనడంలో సందేహము లేదు . ఆయన వెళ్లిన రోజు శత్రుఘ్ననికి కూడా మంచి రోజు అని నమ్మకం లేదు.

తనకు మంచి చూచుకోకుండా శత్రుఘ్నుడు భరతుని వెంట వెళ్లడం తప్పు కాదా ? పాపము కాదా ?

'కాదు'. అదే విశేష ధర్మము - అదే ఆయన ''అనఘత్వము''. అదే పాపరాహిత్యము. భగవద్విషయంలో - పెద్దల విషయములో తన మంచిని చూచుకోవడం అఘము. (పాపము) అందులో స్వార్థ భావం ఉంటుంది కదా! తనంతట తాను తన మంచి కొరకు ఆశ్రయించడం ''స్వగత స్వీకారము'' అన బడుతుంది. అది ప్రమాదకరమైంది.

శత్రుఘ్నుడు - తన మంచిని చూచుకొని - తాను కావాలని భరతుని అనుసరించలేదు. ప్రాణం లేని వస్తువువలె పరతంత్రుడై ''నీతః'' తీసుకపోబడ్డాడు. ''అచిద్వస్తువత్ పారతంత్ర్యం'' ప్రాణం లేని వస్తువు వంటి స్థితిని కలిగి ఉండడమే పారతంత్ర్యము. ''తనక్కెన్నుమదుకళై అరుక్కిరదు'' తన కొరకు అని ఆశ్రయించడమనే కలుపు మొక్కను వేరంట నరుకాలని - లోకగురువుల శ్రీసూక్తి.

శత్రుఘ్నుడు అటువంటి స్వార్థ భావన లేశమైనాలేని వాడు అందుకే అనఘుడు.

శత్రుఘ్నుని గురించి - వాల్మీకి మహర్షి మరొక విశేషణం ప్రయోగించాడు. ఆయన ''నిత్యశత్రుఘ్నుడు'' లోకంలో అనఘులు ఎందరో ఉండవచ్చును . కాని నిత్యశత్రుఘ్నుడు మాత్రము శత్రుఘ్నుడొక్కడే. అందుకే వాల్మీకి ''శత్రుఘ్నో - నిత్యశత్రుఘ్నః'' అని రెండు పదాలను వెంట వెంటనే వాడాడు.

ఇంతకు శత్రుఘ్నుని నిత్య శత్రువు మరెవ్వరోకాదు మరేదో కాదు అది శ్రీరాముని సమ్మోహనకరమైన సౌందర్యమే.

రామ సౌందర్యము - శత్రుఘ్నునికి శత్రువా ? అది అంత బలమైన శత్రువా?

అవును. శత్రువు అంటే ఎవ్వరు ? ఏది ? తనకు కావలసిన వారిని - తనకు కావలసిన వాటిని అందనీయకుండా చేసేవాడో చేసేదో శత్రువు కదా !

శ్రీరాముడు శత్రుఘ్నుని అభిలాషను అడ్డగించాడా ? అవును. శత్రుఘ్నునికి కావలసింది భరతుని అనువర్తించడమే (వెంట ఉండడమే)- భరతునికి సకల సపర్యలను చేయడమే.

శత్రుఘ్నుడు భరతుని దగ్గరకు వెళ్లాలన్నపుడు రాముని ముందు నుండే వెళ్లాల్సి వచ్చేది. అప్పుడు రామసౌందర్యము ఆయనకు అంతరాయంగా నిలిచేది.

''సౌందర్యమంతరాయం'' - భగవంతుని సౌందర్యము భగవత్సేవకే అంతరాయమని (ఆటంకమని) లోకాచార్యుల శ్రీసూక్తి. ఇక ఆ సౌందర్యము భాగవతసేవకు ప్రతిబంధకము కావడంలో ఆశ్చర్యమేముంటుంది?

రాముని సౌందర్యమంటే మాటలా? రాక్షసి అయిన శూర్పణఖను వ్యామోహింపజేసింది. జితేంద్రియులైన తపస్వుల మనస్సులను పరవశంగావించింది.

''రాముని సౌందర్య విషయంలో జాగ్రత్త సుమా !'' అని లక్ష్మణుని సుమిత్ర హెచ్చరిస్తుంది. రాముని సౌందర్యాకర్షణలో పడి కొట్టుకపోతే – ఆయన కైంకర్యాన్ని మరచిపోయే ప్రమాదముంది – అటువంటి ప్రమాదము చేయకు సుమా !

''రామే ప్రమాదం మాకార్షీః'' అని రామానుజుని ఆ తల్లి హెచ్చరిస్తుంది. అటువంటి ప్రబల నిత్య శత్రువైన శ్రీరాముని సౌందర్యాన్ని శత్రుఘ్నుడు కన్నెత్తైనా చూచే వాడు కాదట. సర్వ ప్రాణి మనోహరమైన. సకల జనవశీకరణ సమర్థమైన తన సౌందర్యము శత్రుఘ్నుని ముందు ఎందుకు పని చేయడం లేదో స్వయంగా శ్రీరామునికే అర్థం కాలేదు. అందుకే శత్రుఘ్నుడంటే సామాన్యుడు కాదు లక్ష్మణా ! ఆయన ''వీరుడు'' అని ప్రశంసించాడు రాముడు.

అదిగో అంతటి అనఘుడు , అంతటి నిత్యశత్రుఘ్నుడు, అంతటి వీరుడు శత్రుఘ్నుడు. అందుకేశత్రుఘ్నుని భాగవతనిష్ఠ అంతగా లోకాదర్శమైనది.

"సంసార విషవృక్షస్య – ద్వేఫలే హ్యమృతో పమే

కదాచిత్ కేశవే భక్తిః – తద్భక్తైర్వాసమాగమః"

సంసారమొక విషవృక్షము – అవిషవృక్షానికి అహంకార, మమకార, కామ, క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యాది విషఫలాలు అనేకం చెట్టునిండా ఉన్నాయి. అయితే అన్ని విషవృక్షాలకు వలె కాకుండా సంసార వృక్షానికి మన అదృష్టవశాత్తు రెండు అమృత ఫలాలు కూడా ఉన్నాయి. ఆ అమృత ఫలాలు లభిస్తే – అంత వరకు మనము అనుభవిస్తున్న ఆ విషమంతా ఆ రెండు ఫలాలతో విరిగి పోతుంది.

ఏమా రెండు అమృత ఫలాలు ?

1. కేశవ భక్తి 2. తద్భక్త సమాగమము.

ఈ రెండు ఫలాలు సమానమేనా –? లేక రెండింటిలో ఏదైనా మరింత గొప్పదా?

(1.) కదాచిత్ – కేశవే భక్తిః – కేశవ భక్తి "కదాచిత్" (ఎప్పుడో ఒక్క సారి) ఫలించే అమృత ఫలము. అది తప్పక వెంటనే ఫలించేది కాదు. అందువలన అది సామాన్య ఫలం.

(2.) 'తద్భక్త (భాగవత) సమాగమము' అటువంటిది కాదు – అది విశేష ఫలము. ఎల్లపుడు తప్పక వెంటనే ఫలించే అమృత ఫలము. అందు వలన "కేశవ భక్తి" ఫలము కంటే – 'తద్భక్త సమాగమ ఫలమే' గొప్పది. తద్భక్త సమాగమమంటే – తదీయులైన భాగవతోత్తములను ఆశ్రయించడం.

తత్ భక్త సమాగమము – కేశవ భక్తి కంటే గొప్పదైతే – ఈ రెండు సమానమే అనే అర్థము వచ్చేట్లుగా "తద్భక్తైర్వాసమాగమః" కేశవ భక్తైనా భాగవత సహవాసమైనా అనే అర్థంలో "వా" ప్రత్యయాన్ని ఎందుకువాడినట్లు ?

భాగవతాభిమాన విశేషము భగవద్రామానుజులకు తెలిసినట్లుగా మరెవ్వరికి తెలియదు. అందువలననే వారు "వా" అంటే "అయినా" అనికాక 'ఏ' ("ఏవ") అనే అర్థం చెప్పారు . "తద్భక్తైర్వాసమాగమః" అంటే 'తద్భక్తైరేవ

సమాగమః' అని అర్థము. భాగవతాభిమానమే నిత్యామృత ఫలమని వారి నిర్ణయము.వారి అంతిమ కాలంలో వారి అంతేవాసులకు (శిష్యులకు) ఉజ్జీవ కరములయిన విషయాలను ''శ్రీ భాష్యం, ద్రవిడాగమ ప్రవచనం'' అని ప్రారంభించి. చివరకు ''యద్వా భాగవతాభిమానవసతిః'' అని భాగవతాభిమానమొక్కటే మనను ఉజ్జీంపజేసే నిత్య విశేషామృత ఫలమని తెలిపారు.

అయితే భగవద్భక్తి కంటె భాగవతాభిమానమే గొప్పదని వారు ఎందుకు నిర్ణయించారో రెండు శ్లోకాలు పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది.

''ఆరాధనానాం సర్వేషాం – విష్ణోరారాధనం పరం

తస్మాదతితరం ప్రోక్తం – తదీయారాధనం పరం''

సకల దేవతలను ఆరాధించడం కంటే విష్ణ్వారాధనమే గొప్పది. అయితే అంతకంటే కూడా తదీయులను (భాగవతోత్తములను) ఆరాధించడం విశేషమైనది.

భగవదారాధనము కంటే భాగవతారాధనమెందుకు శ్రేష్ఠమో ఇంకొక శ్లోకమును పరిశీలించి చూద్దాము.

'రక్షిష్యతీవానవేతి – సంశయోZచ్యుత సేవినాం

నసంశయోస్తి తద్భక్త – పరిచర్యతాత్మనాం

భగవంతుడు స్వతంత్రుడు కదా. ఆయనను ఆశ్రయించిన వారిని ఒకమారు జాలితో రక్షించవచ్చును. మరొక్కసారి వారి దోషాలను గమనించి దండించవచ్చు కూడ.

కాని భాగవతోత్తములు మన దోషాలను చూచి జాలి పడే వారే తప్ప కోపగించే వారు ఎంతమాత్రము కారు. తల్లి పశువు తన దూడ మాలిన్యాన్నంతా ప్రేమతో తన నాలుకతో తుడిచి వేసినట్లే భాగవతోత్తములు కూడ కరుణామయులు కనుక మన దోషాలను భోగ్యంగా స్వీకరించి – మనదోషాలను భగవంతునికి కనుపించకుండా చేసి – మనకు భగవదాశ్రయాన్ని కలిగిస్తారు. భగవంతుడు తన కత్యంత ప్రియులైనవారి జ్ఞానానుష్ఠానములకు పరవశుడై వారి పురుషకార కారణంగా

మనను తప్పక రక్షిస్తాడు. ఇందులో అనుమానం ఎంత మాత్రము లేదు.

అందుకే ''తద్భక్త పరిచర్య రతాత్మనాం – రక్షిష్యతివా నవేతి నసంశయః''

పెద్దలను సేవించిన వారికి పెరుమాళ్ల రక్షణలో అనుమానమే లేదు.

ఈ రహస్యాన్ని పూర్తిగా గ్రహించినందువలననే శత్రుఘ్నుడు ప్రబల నిత్య శత్రువు వంటి శ్రీరామసౌందర్యానికి వశుడు కాక – ''రామభక్తి భరితుడైన '' భరతుని సేవలో తరించిన ''వీరుడు '' అయ్యాడు. శత్రుఘ్నుని వలె మనము కూడ భాగవతాభిమానమే ఉజ్జీనవకరమని – అదే నిత్యామృత ఫలమని విశ్వాసంతో ఉండి వీరులమై తరిద్దామా !

''ఓం తత్సత్'

శ్రీరామాయనమః

# (2) కల్యాణ గుణాలు

సగుణ శృతులు ''భగవంతునికి గుణాలుఉన్నాయని'' (''సగుణః అని'') తెలిపితే –''ఆయన ఏ గుణాలు లేని వాడని'' (నిర్గుణః) నిర్గుణ శృతులు తెలుపుతున్నాయి. వేల మంది తల్లిదండ్రుల కంటే హితాన్ని కోరే వేదము ఈ విధంగా పరస్పరం విరుద్ధంగా తెలుపడం మంచిదా ? ఇందులో ఏభాగము సత్యము అనే ప్రశ్నలు తల ఎత్తుతాయి.

ఆది శంకరులు –''(1.) సగుణ శృతులు 'సావకాశములని''–అనగా ఖండించడానికి అవకాశములు కలవని.

(2.) నిర్గుణ శృతులు –''నిరవకాశములని'' –అనగా గుణములే లేవన్నపుడు వాటిని ఖండింపరాదు. అందువలన నిరవకాశములైన నిర్గుణశృతులే బలీయములని తెలిపారు.

అంతే కాదు వారి అభిప్రాయము ప్రకారము ''సగుణ శృతులు మొదటివి – నిర్గుణ శృతులు తరువాతవి.

''వేదంలో యజ్ఞాచరణ సమయంలో'' ''పూర్వాపరాపచ్ఛేద'' న్యాయమొకటుంది. ఇందులో బహిష్పవమానము కొరకు వరుసగా అధ్వర్యువు, ప్రస్తోత, ప్రతిహర్త, ఉద్గాత, బ్రహ్మ అనే అయిదుగురు ఋత్విజులు ఒకరినొకరు కలుపుకొని బయలుదేరుతారు. అందులో తరువాత – వారిని మొదటివారు విడిస్తే తక్కువ ప్రాయశ్చిత్తము, తరువాత వారు మొదటి వారిని (ఉద్గాత– ప్రతిహర్తను) విడిస్తే ఎక్కువ ప్రాయశ్చిత్తము ఉంటుంది.

ఇదే న్యాయాన్ని అనుసరించి పూర్వములయిన సగుణ శృతుల కంటే తరువాతవి అయిన నిర్గుణ శృతులు బలీయములు. అంతే కాదు గుణములు ఉపాసన కొరకు ఏర్పడ్డవి కనుక పరమార్థములుకావు.

వేదాలు అపౌరుషేయములు, దోష లేశము కూడ ఉంటుందని ఊహించడానికి వీలులేనివని'' శంకరులే అంగీకరిస్తారు

అటువంటి వేదాలలో ఒక భాగము బలహీనము కనుక అపరమార్థమని వేరొక భాగము బలవంతమైనది కనుక పరమార్థమని చెప్పడం సాధ్యమా ? అంతేకాదు సగుణ శృతులు పూర్వములు, నిర్గుణ శృతులు తరువాత వని నిర్ణయించడం వీలవుతుందా ?

వేదంలో ఎక్కడో కర్మ భాగానికి చెప్పిన ''పూర్వాపరాపచ్ఛేద న్యాయము'' – జ్ఞానభాగములయిన వేదాంతాలకు వర్తింపజేయడం సరియైనదా ?

నిజానికి సగుణ శృతులు, నిర్గుణ శృతులు పరస్పర విరుద్ధాలా ? ఈ రెండింటితో పాటు '' ఘటక'' (సమన్వయ) శృతులున్నాయే – వాటి గురించి పట్టించుకోవద్దా ?

భగవద్రామానుజులు నిత్యములు, నిర్దుష్టములైన వేదాలలో బలహీన భాగాలు ఉండడానికి వీలులేదని నిర్ధారించారు. సగుణ నిర్గుణ శృతులలో పౌర్వా పర్వములను నిర్ణయిము చేసి – పూర్వాపరాపచ్ఛేద న్యాయాన్ని వర్తింపజేయడానికి వీలు లేదని నిర్ణయించారు.

అన్నిటి కంటే ముఖ్య విషయము సగుణ శృతుల నిర్గుణ శృతుల మధ్య వైరుధ్యమే లేదు. అప్పుడు వాటిలో 'పూర్వాపరాపచ్ఛేద' న్యాయమని బలహీన, బలవంతశృతులని అనవసరంగా వాదించడానికే బుద్ధిమంతులు అంగికరింపరు. సగుణ, నిర్గుణ శృతుల మధ్య సమన్వయాన్ని ఘుటక శృతులు అందిస్తాయి. ఇందులో ఎవ్వరి వ్యక్తిగతాభిప్రాయాలు అవసరము లేదు. వేదమే ఈ విషయాన్ని స్పష్టము చేస్తున్నది.

''శృతిరేవ వివినక్తి''అంటారు శ్రీ భాష్యకారులు. వైరుధ్యమే లేదనే ఈ విషయాన్ని ఒక ''ఘటక'' శృతి ద్వారా పరిశీలిద్దాము.

''య ఆత్మా అపహత పాప్మా, విజరో, విమృత్యుర్విశోకః

విజిగిత్స ః అపిపాసఃసత్యకామః సత్యసంకల్పః''

ఈ శృతి భగవద్గుణాల గురించి చక్కగా వివరిస్తుంది. ఇందులో రెండు రకాల గుణాలను పేర్కొనడం జరిగింది . 1. హేయగుణములుః 2. కల్యాణ గుణములు.

అంతే కాదు ఈ శృతి నిర్గుణ సగుణ శృతుల మధ్య ఉందనుకొన్న వైరుధ్యమనేది ఏ మాత్రము లేదని వివరిస్తుంది. ఎలా ?

భగవంతునికి లేని గుణాలు ఆరని – ఉన్నగుణాలు రెండని ఈ శృతి తెలుపుతుంది.

లేని గుణాలేవి ? 1. అపహత పాప్మాః–పావములు లేవు

2. విజరోః– ముసలి తనము లేదు.

3. విమృత్యుః–మరణము లేదు.

4. విశోకః– దుఃఖము లేదు.

5. విజిగిత్సః–ఆకలి లేదు.

6. అపిపాసః– దాహము లేదు.

ఈ లేని గుణాలు ఎటువంటివి ? వీటిని సాధారణ మనుష్యులే అసహ్యించు కొంటారే ? ఇటువంటి హేయ గుణాలు భగవంతునికి ఉంటాయా ? లేవని శృతి వివరిస్తోంది.

ఇక భగవంతునికున్న గుణాలు రెండు

(1.)సత్యకామము (సత్యమైన గుణము కోరిక)

(2.)సత్య సంకల్పముః-(సత్యమైన ఆలోచన )

ఈ రెండు గుణాలెటువంటివి? ఇవి కల్యాణ గుణాలు అందరు గాఢంగా కోరుకొనేవి.

మొత్తము మీద ఈ శృతి తాత్పర్యమేమిటి ? భగవంతుడు హేయగుణములేవి లేని వాడని, కల్యాణ గుణాలు కలవాడని ఈ శృతి అభిప్రాయము కదా !

అందువలన సగుణ, నిర్గుణ శృతుల మధ్య నిజానికి వైరుధ్యవే లేదని,''సగుణుడు'' అంటే కల్యాణ గుణములు కలవాడని ''నిర్గుణుడు''అంటే హేయగుణములు లేని వాడని స్పష్టమవుతున్నది కదా ! అంతే కాదు గుణములు భగవంతునికి సహజములు. అవి ఏదో ప్రయోజనము ( ఉపాసన ) కోరకు కల్పింప బడ్డవి కావు ఈ తాత్పర్యాన్ని అనుసరించే రామానుజాలు ''అఖిల హేయ ప్రత్యనీక కల్యాణ గుణములు ( మాత్రమే) కలవాడని నిర్వచించారు.

పై శృతి భగవంతుని కున్న కల్యాణ గుణానేకములో ఉదాహరణ విధిగా ''సత్య కామ'' ''సత్యసంకల్పములని'' రెంటిని మాత్రమే పేర్కోంది -నిజానికి భగవంతుడు కళ్యాణ గుణ మహా సముద్రుడు.

రామానుజ సూర్యోదయముతో అజ్ఞానాంధకారము నశించి వేద భాగాల మధ్య సత్యాసత్యములనే తారతమ్యము తొలిగి వాటి మధ్య బాధ ( అంతర్వైరము) నిర్మూలింపబడింది. అంతే కాదు శృతులకు, స్మృతులకు, బ్రహ్మ సూత్రాలకు మధ్య బాధకూడ తొలగింది. వాటి మధ్య అంతర్వైరాన్ని నిర్మూలింపజేసిన ఘన వైదిక వైద్యులు శ్రీరామానుజాలయ్యారు.

''యః శృతి స్మృతి సూత్రాణామంతర్జ్వరమశీ శమత్''

భగవంతుడు సకలకళ్యాణ గుణసంపన్నుడని వేదార్థాన్ని భగవద్రామానుజులు మళ్లీ స్థాపించారు కళ్యాణ గుణ వంతుడైన శ్రియః ప్రతి కళ్యాణ గుణాలు - శ్రియఃపతి అవతారమైన శ్రీరామునికి కూడ స్వంతములే! అంతే కాదు ఆ కళ్యాణ గుణాలన్నింటికి పరమపదములో ప్రకాశమే లేదు. పట్ట పగలు పెట్టిన దీపానికి వెలుగు లేనట్లే భగవంతుని (నిత్య) పరమపద విభూతిలో వాటికి ప్రకాశము లేదు. అక్కడ భగవంతునితో పాటు ఉన్న నిత్య ముక్తులందరికి ''జ్ఞానానందామలకత్వములు'' (జ్ఞానము. ఆనందము, నిర్మలత్వము) ఎప్పుడు ఉండేవే కనుక వారికి భగవంతుని కళ్యాణ గుణ ప్రత్యేక ప్రకాశముతో అవసరము లేదు.

ఇక్కడ - ఈ లీలావిభూతిలో మనవంటి చేతనులందరము భగవంతుని కళ్యాణ గుణముల పైననే ఆధారపడి బ్రతికే వారము కనుక అవతారంలలోనే భగవంతుని కళ్యాణ గుణములకు అత్యధిక ప్రకాశము ఉంటుంది.

ఇక శ్రియః పతి అవతార స్వరూపుడైన శ్రీరాముని కళ్యాణ గుణముల గురించి పరిశీలిద్దామా?

శ్రీరామ భద్రుని కళ్యాణ గుణ వర్ణనము రామాయణమంతానిండి ఉంది. బాలకాండ ఆరంభంలోనే, వాల్మీకి నారదుని ''ఆ గుణాల గురించి ప్రశ్నిస్తాడు. అయోధ్యకాండలో వాల్మీకి భగవానుడు స్వయంగానే కాక, దశరథ, పౌరజానపదుల ద్వారా కూడ, రామ గుణ వర్ణనము నందిస్తాడు. వాటి ద్వారా రామభద్రుడు మన హృదయాలలో ''వరేణ్యుడు'' గా శాశ్వతంగా ముద్ర వేస్తాడు.

అదే విధంగా అరణ్య, యుద్ధకాండలలో రామచంద్రుని చల్లని గుణాల వర్ణనము ఉంది. కిష్కింధ, సుందరకాండలలో హనుమ స్వయంగా శ్రీరాముని కళ్యాణ గుణామృతాన్ని తాను అనుభవించి. మనకు ఆ ఆనందాన్ని అందిస్తాడు.

ఈ విధంగా ''రామాయణ మంతా రామగుణమయమే''

అయితే అన్నికాండలలో రామగుణ వర్ణనమొక ఎత్తు అయోధ్య కాండలో మరొక ఎత్తు.

వేదాలలో మనుష్యానందము సంపూర్ణంగా కలవాని లక్షణాలు వివరింప బడ్డాయి.

''యువాస్యాత్ సాధు యువాధ్యాయికః – ఆశిష్టో ద్రఢిష్ఠో బలిష్ఠః తస్యేయం పృధ్వీసర్వా విత్తస్య పూర్ణాస్యాత్ స ఏకో మానుష ఆనందః''

మానవుడు యవ్వనంలో ఉండాలి మంచి విద్యావంతుడు కావాలి చక్కని తిండి కల్గి దృడంగ బలంగా ఉండాలి. సకల సంపదలు ఉండాలి ''

ఈ లక్షణాలన్ని శ్రీరాముడిలో సంపూర్ణంగా ఉన్నాయి. రావణ వధార్థము దేవతల చేత ప్రార్థింపబడి స్వయంగా అవతరించిన శ్రియః పతియే శ్రీరాముడు. పన్నెండు మాసాలు తన గర్భంలో ధరించి శ్రీరాముని గన్న కౌసల్యాదేవి ఇంద్రుని, వామనుని కన్న అదితి కంటే కూడా ఎక్కువగా ప్రకాశించింది. ''కౌసల్యా శుశుభేతేన పుత్రేణామిత తేజసా'' రాముని అసంఖ్యాకములైన కళ్యాణ గుణాలను నోరాడకొనియాడడానికి సహస్ర ముఖాలుగల ఆదిశేషునికి కూడ అసాధ్యమే అందువలననే వాల్మీకి స్వయంగా రామ గుణాలను వర్ణించి తృప్తి తీరక దశరథుని ద్వారా, పౌరజానపదుల ద్వారా వర్ణింపజేశాడు.

శ్రీరామచంద్రుడు సౌందర్య రాశి. ఆయన అందము రాక్షసియైన శూర్పణఖను, జితేంద్రియులైన ఋషులను కూడ వ్యామోహపరిచింది. పురుషులకే పిచ్చి కలిగించే భువన మోహనుని స్నిగ్ధవర్ణ స్వరూపకాంతికి పరవశములైన పశు పక్ష్యాదులు కూడ తమ మేతను మాని చూస్తూ ఉండిపోయేవట''సమస్సమ విభక్తాంగః'' ఏ అవయవమెట్లాఉండాలో అలాగా తీర్చినట్లు ఉండేదట ఆయన దివ్య మంగళ శరీరము.

రామభద్రుడు అద్వితీయ శరీర సౌందర్య రాశి మాత్రమే కాదు. ఆయన గుణ సౌందర్యము కూడ అద్భుతమే.

ఆయన మహావీర్య వంతుడు - వీరుడు అనగా ప్రత్యర్థులనెంత వారినైనా చీకాకు పరిచి - తాను మాత్రము ఏ మాత్రము చలింపనివాడు.

ఆయన ప్రశాంత చిత్తుడు. ఆయన దృఢ మనస్సులో ఎటువంటి కోరికల అలలు కూడ అలజడిని కల్గించేవి కాదు. అదే విధంగా రాగద్వేషాదులు ఆయన మనస్సులో వికారాలను కలిగించేవి కాదు.

రాముడు మృదుభాషి. ఆయన మనస్సు సుకుమారమైనది కనుక ఆయన మృదువుగా మాట్లాడే వాడు. ఎదుటి వారు కఠినంగా మాట్లాడినా ఆయన స్థిర చిత్తుడు కనుక - వారి మాటలకు కలత చెందక మృదు సమాధానములనే ఇచ్చేవాడు.

శ్రీరాముడు కృతజ్ఞుడు. కృతజ్ఞుడు అంటే ఇతరులు చేసిన మేలును (కృతం) తెలిసికొనే వాడు (జానాతి.) తనకు అపకారము చేసిన వారిని కూడ క్షమించే వాడు.

ఆయన "పూర్వ భాషి"ః-సాధారణంగా మనము ఒకరితో మరొకరము కలిసినప్పుడు ఎదుటి వారిని పలుకరించకుండా మౌనంగా కాలాన్ని వ్యర్థంగా గడువుతాము. "ముందు మాట్లాడిన వారు తక్కువ వారు" అనే మిథ్యాభిమానాన్ని కలిగి ఉంటాము. రామభద్రుడు అటువంటి వాడు కాదు.ఎవ్వరు తనకు ఎదురైనా తానే ముందుగా ప్రియంగా పలుకరించే సహృదయుడాయన.

స్మిత భాషిః- ఎవ్వరితో నైనా ఎప్పుడైనా నవ్వుతు మాటాడే వాడు.

అతడు గ్రామ్యవిషయాసక్తి లేని వాడు. సాధారణంగా చాల మందికి ఒక బలహీనత ఉంటుంది. ఎక్కడ అశ్లీల (బూతు) విషయాలు మాట్లాడుతారో అక్కడ వారు చేరుతారు. ఆ అశ్లీల విషయాల సంభాషణలో వారికి ఆనందం కలుగుతుంది. రామునికి అట్టి ఆసక్తి అసలే లేదు.

రాముడు స్వధర్మాచరణకే ప్రాధాన్యమిచ్చేవాడు. క్షత్రియులకు దుష్టశిక్షణ, శిష్ట రక్షణ ముఖ్య ధర్మము. ఇక్ష్వాకు వంశములో పుట్టిన తాను ఆశ్రిత రక్షణమే ప్రధానవ్రతంగా భావించే వాడు.

సమాజంలో సౌభాగ్యం కొరకు, సుఖ శాంతుల కొరకు స్వధర్మాచరణమే అందరికి శ్రేయమని విశ్వసించేవాడు.

వాదములో బృహస్పతి :- తనకు, సమాజానికి శ్రేయస్కరములు కాని విషయాలలో రామునికి శ్రద్ధ ఉండేది కాదు. ఆయన ధర్మ పక్షపాతి. అధర్మ ప్రసంగాలు చేసే వారెంత వారైనా, వారిని వాదంలో ఓడించేవాడు. "జాబాలి నాస్తిక వాదం చేసినందుకు ఆయనను తీవ్రంగా నిందించిన విషయము రామాయణంలో స్పష్టమే కదా.

భావజ్ఞుడు :- ఆయన ఎదుటి వారు ఎంత గంభీరంగా ప్రవర్తించినా వారి మనస్సులో అభిప్రాయాలను – స్పష్టంగా గ్రహింపగల్గేవాడు. "ఆవులిస్తే ప్రేగులు లెక్క పెట్టగల్గిన " అసమాన ధీశాలి.

దోషజ్ఞుడు :- రామ భద్రుడు ఎదుటి వారిలో దోషాలను క్షణం లో ఆకలింపు చేసుకో గలిగినవాడు. అయితే "గురువిందగింజ – తన వీపును చూచుకోజాలదు " అనే న్యాయము ఆయన విషయములో అణుమాత్రం వర్తించదు. ఆయన తన దోషాలను కూడ స్వయంగా గుర్తింపగల్గేవాడు.

అంతే కాదు పరుల దోషాలను మనులో గ్రహించినా వాటిని వేలెత్తి చూపేవాడు కాదు. తన దోషాలను వెంటనే గ్రహించి, తనను సవరించుకొని – వాటిని తిరిగి తలెత్తకుండా నిగ్రహించే వాడు.

ప్రియహితవాది :- అందరికి హితాన్ని పలికే వాడు. అయితే హితాన్ని ప్రియముగా చెప్పడములో ఆయననేర్పరి.

సత్యవాది :- శ్రీరాముడు సత్యమును, త్రికరణ శుద్ధితో పాలించేవాడు. "ముందు మాటిచ్చినా తరువాత ఆయన అడవులకు వెళ్లడో ఏమో" అని అనుమానించిన కైకేయికి.

"రామోద్విర్నాభిభాషతే" రాముడెప్పుడు రెండు మాటలు మాట్లాడడు అని తన సత్య శీలాన్ని స్పష్ట పరిచిన సత్యవ్రతుడు.

అంతే కాదు ''సత్యేన లోకాన్ జయతి'' అని తన సత్యవ్రతంతో సమస్త పుణ్య లోకాలను సంపాదించుకొన్న మహానుభావుడు.

ఈ విధంగా ''గుణానామాకరో మహాన్'' అన్నట్లు శ్రీరామ భద్రుడు సకల కళ్యాణ గుణాలకు జన్మస్థానమైనవాడు.

శ్రీరామాయనమః

## పట్టాభిషేక ప్రయత్నము

వాల్మీకి భగవానుడు శ్రీరాముని కళ్యాణగుణాలను తనివి తీరక వర్ణిస్తూ వెళ్లాడు. జితేంద్రియుడైన ఆ మహామునినే రామగుణాలు అంతగా అకర్షించాయి.

యవ్వనంలో, దృఢ శరీరముతో సౌందర్యంతో మిసమిసలాడుతూ సకలకళ్యాణ గుణ సంపన్నుడైన శ్రీరాముని జూచి ''ఈయన రాజు కావడం నాజీవిత కాలంలో సాధ్యమేనా'' అని దశరథుడు చింతాక్రాంతుడయ్యాడు.

''నాకుమారుడు లోకుల వృద్ధిని కాంక్షించే వాడు . సర్వ భూత దయామయుడు. వర్షించే పర్జన్యునివలె లోక ప్రియుడు. యమేంద్రుల వలె పరాక్రమ సంపన్నుడు. బృహస్పతి అంతటి బుద్ధిమంతుడు – ధైర్యంలో పర్వతము వంటి వాడు. వేద వేదాంగ విదుడు, ధర్మార్థ కామ విషయాలను పూర్తిగా తెలిసిన వాడు. క్షమాగుణంలో భూదేవిని మించిన వాడు. సర్వ ప్రజలకు, కన్న తండ్రి నైన నాకు కూడ కిరణములతో సూర్యుని వలె – కళ్యాణ గుణములతో ప్రియమైన వాడు సకల సద్గుణ సముపేతుడైన నా రాముని రాజుగా చేసి సంతోషముతో స్వర్గానికి వెళ్తాను.'' అని నిశ్చయించు కొన్నాడు. అప్పుడు భూమ్యాకాశాలలో కలిగే భయంకర పరిణామాలను, తన వృద్ధాప్యాన్ని, ప్రజాహితాన్ని గమనించి రాముని రాజు చేయాలనుకొన్నాడు.

దశరథుడు తన ఆలోచనలకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాలను కొన్నాడు.ఆయన తన రాజ సభకు అనేక సామంత రాజులను, మంత్రి సచివాదులను, పౌర జానపదులను ఆహ్వానించాడు. భరతుని మాతా

మహుడైన అశ్వపతి మహారాజును, ధర్మ పక్షపాతి అయిన జనక చక్రవర్తిని మాత్రము అనాటి రాజ సభకు పిలువ లేదు. ఆహూతులందరు అతి త్వరలో రాజసభకు ఏతెంచారు. వారందరు వారి వారి ఆసనాలలో రాజాభిముఖంగా ఆసీనులయ్యారు.

దేవతాసభలో కొలువు తీరిన మహేంద్రుని వలె, రాజసభలో ప్రకాశిస్తున్న దశరథుడు రసయుక్త స్వరంతో :-

''సామంతులార! సచివులార! పౌర జానపదులార! మా తాత ముత్తాతల వలె, మా తండ్రి వలె నేను కూడ మిమ్మల్ని కన్న సంతానము వలె సుదీర్ఘకాలం మీకు ప్రియంగా పాలించిన విషయము మీకు సువిదితమే! ఈ తెల్ల గొడుగు క్రింద సుదీర్ఘరాజ్యపాలనలో నా శరీరము ముడుతలువడింది. నా దేహము విశ్రాంతిని కోరుతున్నది.

నాకు తగిన కుమారుడు, పెద్దవాడు శ్రీరాముడు ఆయనకు రేపు పుష్యమీ నక్షత్రంలో యౌవ రాజ్య పట్టాభిషేకం చేస్తాను. లక్ష్మణాగ్రజుడు లక్ష్మీసముపేతుడు అయిన శ్రీరాముని రాజుగా లభించి త్రైలోక్యము సమర్థుడైన నాధుని కలిగి ఉంటుంది.

ఒక వేళ నా ఈ ఆలోచన మీకు నచ్చితే మీ ఆమోదాన్ని తెలుపండి. లేక మీకు హితమైనది మీరేదైనా ఆలోచించండి. రాగద్వేషములు లేక చక్కగా విమర్శించి చేసే ఆలోచనే అభ్యుదయ కారణమవుతుంది! '' అని గంభీరంగా పలికాడు.

అప్పుడా చక్రవర్తి మాటలకు మేఘదర్శనమయిన ఆడనెమలి వలె ఆనందించి అక్కడి సభాసదులందరు ఏకగ్రీవంగా దశరథుని ప్రతిపాదనను ఆమోదించారు. వారి ఆమోద మహానాదము ఆ రాజ గోపురాన్నే కంపింప జేసింది.

''అనేక వర్ష సాహస్రో! వృద్ధస్త్వమసి పార్థివ!

సరామం యువరాజానం! అభిషించస్వ ధార్మికం!

''మహారాజా! నీవు వేలసంవత్సరాల ముదుసలి వయ్యావు అందువలన ధర్మమూర్తి అయిన మా రాముని యువరాజుగా అభిషేకించు''

''ఇచ్ఛామోహి మహాబాహుం । రఘువీరం మహాబలం

గజేన మహతాయాంతం । రామం ఛత్రావృతాననం'' (తని శ్లోకం)

ఇచ్ఛామః-1. ధరించిన మాలతో, పెట్టుకున్న కిరీటంతో, శ్రీరాముడు మాముందు కనువడాలని గాఢంగా కోరుకొంటున్నాము.

2. మాకుండేది కోరికే, పట్టాభిషేకం చేయాల్సింది నీవే కదా !

3. శ్రేయాంసి బహువిఘ్నాని '' మంచి పనికి అనేక ఆటంకాలు వస్తాయి కదా ! మా కోరిక తీరేది ఎన్నడో.

4. అనుకొన్నది జరుగనీ ! జరుగక పోనీ ! మంచి జరుగుతుందని ఆశ ఉంటుంది కదా !

5.ఇంత వరకు నీతో మా కోరిక ఎందుకు తెల్పలేదంబావా ? ఇంత కాలము మమ్ములను నిరపాయంగా పాలించిన నీవు, నీ స్థానంలో మా రాముని రాజుగా చేయుమంటే నీవు చిన్న బోతావని – మా నోరు విప్పి చెప్పలేదు. ఇప్పుడు నీవే అవకాశం కల్పించావు. ''భావంవిజ్ఞాయ సర్వశః'' అన్నట్లు అన్ని విధాల నీ మనస్సు తెలిసి మా మనోరథాన్ని తెలుపుతున్నాము.

6. ఎంత మంది రాముని రాజుగా కోరుకొంటున్నారని సంఖ్య అడుగుతావా ? ఒక్కరు తక్కువ కాకుండా మీ దేశవాసులము అందరము కోరుకొంటున్నాము.

1. మేము కోరుతునే ఉన్నాము. మా కోరిక నీకు ఎలా తెలుస్తుందంటావా ? ''విమానం కంపయన్ని వ'' సభాభవన గోపురం కంపించేట్లు మేము చేసిన మహాధ్వనిని నీవు వినలేదా ? మా ఆమోదము నీకు తెలియ లేదా ?

2. అకామయత మేదినీ :- మా కోరిక నీకు తెలియదా ? రాజును భూమి వరించే విషయము రాజువైన నీకు తెలియదా ?

3. ''లోకపాలోపమం'' :- ఏమిటి భూమి తనంతట తాను రాజును వరిస్తుందా అంటావా? శ్రీరాముడంటే ఎవ్వరు అనుకొన్నావు లోకపాలులతో సమానుడు కదా?

ఆయన స్వయంగా సమస్త లోకాలను పాలించేవాడు కదా! (మ) లక్ష్మీదేవిని (ఉప) దగ్గరగా కలిగిన ఉపముడు సాక్షాత్తు విష్ణువేకదా శ్రీరాముడు!

4.''పృథ్వీ గంధవతీ'' అని పృథ్వికి (భూమికి) గంధమే లక్షణము కదా! శ్రీరాముని వరించడానికి భూదేవి పై పై బడడంలో వింతేమి మహారాజ!

2. మహా బాహుం :- దశరథుడు :- మీరందరు ఇష్టపడ్డారని రాముని రాజుగా చేయాలని నేను అనుకొన్నా - ఆయన పరాక్రమవంతుడు కావద్దా?

ప్రజలు :- మహారాజా ''శక్త స్త్రైలోక్య మప్యేష: భోక్తుంకినుమహీకృతే''

శ్రీరాముడు త్రైలోక్యమును పాలింవగల సమర్థుడు. ఆయనకు భూమిని పాలించడమొక లెక్కా!

2. ఆయతాశ్చ సువృత్తాశ్చ బాహవ: పరిఘోపమా: '' పెద్దవై, గుండ్రంగా ఉండి ''ఆజాను బాహుం'' అన్నట్లు మోకాళ్ల వరకు విస్తరించి - సకల హస్త సాముద్రిక రాజలక్షణాలు కలిగిన విశాల బాహువులు గల శ్రీరామ భద్రుడు ఉభయవిభూతుల నేల గల్గిన వాడు కదా! ఆయన బాహువులే కావాలా?

''బాహుచ్ఛాయా మవష్టబ్ధో

లోకోయస్య మహాత్మన:

లోకములన్ని ఆశ్రయింపదగిన ఆ మహాత్ముని భుజముల నీడ చాలదా?

3. రఘువీరం :- ప్రజలార! దేశరక్షణకు ఒక్క బాహుబలమే సరిపోదు. ''ররక్ష ధర్మబలేన చైవ'', ''ధర్మత: పరిరక్షితా'' అన్నట్లు ప్రజారక్షణకు మహారాజుకు ధర్మ బలం కూడ కావాలి. మీ రామునిలో ధర్మ బలం కూడ ఉందా? అని దశరథుడు అడిగాడు.

ప్రజలు :-''రఘువీరం'' ''(1) మహారాజా! మా రాముడంటే ఏమనుకొన్నావు? రఘుకులానికే అలంకారము కాడా?

2.'' సత్యేన లోకాన్ జయతి దీనాన్ - దానేన రాఘవ:''

మా రాముడు సత్య బలంతో లోకాలన్ని జయించగల్గుతాడు. ఆయన దానంతో దీనులంతా పరవశులవుతారు.

3.అనృశంస్యం పరోధర్మః ("త్వత్త ఏవమయాశ్రుతః") అన్నట్లు భూతదయే అన్ని ధర్మాలలో పరమ ధర్మమని తానే స్వయంగా చెప్పినాడు మా రాముడు - అంతటి దయామయుడు మా రామయ్య తండ్రి.

4.ధర్మ పాలనలో రఘుమహారాజును మించిన వాడు మా రాముడు. రఘు మహారాజు కాలంలో ఒక రాక్షసుడు. "నిన్ను ఆశ్రయించి కూడ నేను ఆకలి తో చనిపోతే ఆ పాపము నీకు అంటుకోదా మహారాజా !" అని ప్రశ్నిస్తే విని కూడ నిరుత్తరుడయ్యాడు రఘువు.

కాని మా రాముడో "ఆశ్రితుల రక్షణ కొరకు నా ప్రాణాన్నైనా ఇస్తాను" అని ప్రతిజ్ఞ చేసే స్వభావం కలవాడు.

ధర్మ బలంలో మా రామునికి సమానుడున్నాడా ?

1.మహాబలం :- ప్రజా రక్షణలో దృఢ వ్రతం కావాలి కదా! మీ రామునిలో గట్టి పట్టుదల ఉందా ? లేక ఎవ్వరైనా వద్దని వారిస్తే వెనుకంజ వేస్తాడా ?" దశరథుడు ప్రశ్నించాడు.

ప్రజలు - మహారాజా ! మాట ఇచ్చి తప్పడం మా రాముని విషయంలో జరిగే పనేనా ?

"రామోద్విర్నాభిభాషతే"

రాముడెన్నడు రెండు మాటలు మాట్లాడడు, అని ధైర్యంగా చెప్పగల్గినవాడు (మా రాముడు) మాట తప్పి వెనుకంజ వేయగల్గుతాడా ?

2. "అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ"

"సకల ప్రాణులకు సంరక్షణ కల్పించడమే నావ్రత మంటాడే" అంతటి సర్వ ప్రాణి సంరక్షణ దీక్షాదక్షుడు మాస్వామి.

3.''మహర్షులందరికి అభయమొసగిన మా రాముడు – ఆశ్రితులకు ఇచ్చిన మాటను (ప్రతిజ్ఞను) ఎన్నటికి ఎంత కష్టమైనా విడవాడనంటాడే.

4. తమకు సంపూర్ణ శరణాగతి చేసిన వారినే కాదు. మైత్రిని ప్రదర్శించిన వారిని కూడ ''నత్యజేయం'' విడిచి పెట్టనంటాడే మా రాముడు.

5. ''ధైర్యేణ హిమవానివ'' :– మహారాజా ! మా రాముడంటే పిరికి వాడనుకొన్నావా ఆడిన మాటను తప్పడానికి ? ఆయన హిమాలయమంత ధైర్యము కలవాడు.

ఇక్కడ ''మహాబలము'' అంటే బాహుబలము కాదు. ''మహాబాహుం'' అన్నప్పుడే శ్రీరాముని శరీర బలము వర్ణింపబడింది. ఇప్పుడు ''మహాబలం'' అంటే మనోబలమని అర్థము.

5. గజేన మహతాయాంతం :– దశరథుడు :–మీరు రాజుగా వరించిన రాముడు అంతవాడా? అలాగయితే ఇప్పుడే అతనికి పట్టాభిషేకం చేస్తాను.

ప్రజలు :–ఆగు ! మహారాజా ! ఆగు ! రాముడున్నది ఉన్నట్లుగా అతనికి పట్టాభిషేకము చేయడముకాదు. ఎన్నో ఏర్పాట్లు చేయవలసి ఉంది కదా !

గజేన మహతాయాంతం :– రాముడు ఊరక నడిచి వచ్చినా కన్నులకు పండుగలాగే ఉంటుంది. కాని మహారాజు కాబోయే మారాముడు అలా నడిచిరాకూడదు.

సమస్త రఘు రాజన్యుల పట్టాభిషేకానికి వినియోగించే భద్రగజము – ''శత్రుంజయము'' ఉంది కదా! దానికి సకల అలంకారాలను సమకూర్చి – వీధులలో మా రాముని ఊరేగింపుగా తీసుకొని రావాలి. సహజంగానే నయనానందకరుడైన మా స్వామి భద్రగజముపై మరింత ఠీవితో వెలిగి పోవాలి.

దశరథుడు :– రాముని ఊరేగింపు కొరకు శత్రుంజయ మహాగజమే కావాలా? రథముపై ఊరేగిస్తే చాలదా ?

ప్రజలు :- రథము పై ఊరేగించడం మా రాముని ఠీవికి అనువుగా ఉంటుందా? ఏ మాత్రము ఉండదు.

మా రాముడు ''మత్త మాతంగ గామి'' మదించిన ఏనుగువలె నడిచే వాడు కాదా ! అందుకు గజవాహనము పై ఊరేగించడమే ఆయనకు తగినది.

దశరథుడు :- రామునికి ఏనుగు వాహనాన్ని కల్పించి ఊరేగింపు చేయాలా? అలాగైతే ఏదో ఒక ఏనుగు తెప్పిస్తాను.

ప్రజలు :- మా రాముడు సర్వశక్తిమంతుడు. సర్వ శక్తిని వహించడానికి సమర్థమైన శత్రుంజయమే కావాలి.

దశరథుడు :- శత్రుంజయమే కావాలా ! అలాగే దాని పై కూచో బెట్టుతాను.

యాంతం :- ప్రజలు :- ఊరకే కూచో బెట్టుతావా ? అలా కూచోబెట్టితే - ఆయనను ఎంతమంది చూడగల్గుతారు ? అందుకే పుర వీధులన్నిటిలో శత్రుంజయము పై మా రాముని కూచోబెట్టి త్రిప్పాలి.

2. ననందుః సప్రజాః ప్రజాః :- భద్రగజము పై అధిరోహించి మా రాముడు నగరమంతా ఊరేగింపుగా వస్తే ప్రజలందరు పిల్లా పాపలతో సహా చూచి ఆనందించాలి.

3. ముఖము పై రాజతిలకము, పెదాల పై చిరునవ్వుతో మెరిసే మా రాముని మేమంతా ఆనందంగా దర్శించాలి.

6. రామం :-తన సహజ స్వరూపంతో అందరిని (రమయతి) ఆనందింపజేసే రాముని చూచి మేము ఆనందించాలి.

రామంః- ''రముక్రీడాయం'' :- తారతమ్యాలు లేక అందరితో కలిసి మెలసి ఆడుతూ తిరిగే మా రాముడు గజారూఢుడై ఊరేగింపుగా వస్తే చూచి అందరము ఆనందిస్తాము.

7. ఛత్రావృతాననం :- శత్రుంజయ భద్రగజముపై ఊరకే ఎక్కి రావడం కాదు -సకల రాజలాంఛనాలతో మా రాముడు రావాలి. తెల్లని గొడుగు అధిరాజ్య

సూచకము కదా ! అటువంటి శ్వేత ఛత్రము క్రింద దాని ముత్యాల వరుస - మా రాముని ముఖారవిందాన్ని తెల్లని మబ్బుల్లా కొంత వరకు కప్పి వేస్తూ కొంతవరకు కనుపింపజేస్తుంటే ఆహ్లాదంతో మేము సేవిస్తూ ఆనందిస్తాము.

సభాసదుల సంభాషణ సార్వభౌముని మనస్సులో సంతోషము కలుగ జేసింది. అయినా ఏమి తెలియని వాని వలె దశరథుడు ''ప్రజలారా'' నేను అడిగినది వెంటనే అందరు కలిసి ఒక్కుమ్మడిగా శ్రీరాముని రాజా గా చేయుమని ఎందుకు అభిలషించారు ? అని అడిగాడు.

అప్పుడు ప్రజలందరు మళ్లీ ఒకే కంఠంతో ''మహారాజా ! మీ పాలనలో లోపముందని మా ఉద్దేశ్యము కాదు. కాని రాముని లో అనేక కళ్యాణ గుణాలున్నాయి.

''బహవః నృప ! కళ్యాణ గుణాః పుత్రస్య సంతితే''

ఆకాశములో నక్షత్రాలకు, సముద్రంలో జలబిందువులకు పరిమితి ఉండవచ్చునేమో కాని రాముని గుణాలకు అంతులేదు. శ్రీరాముని శరములకు అవశులు కాని వారు ఉండవచ్చునేమో కాని రామ గుణాలకు పరవశులు కాని వారు లేనే లేరు.

''రామః సత్పురుషో లోకే ! సత్య ధర్మ పరాయణః

సాక్షాద్రామాద్వినిర్వృత్తః ధర్మస్యాపి శ్రియాసహ ''

రాముడు సత్పురుషుడు - మూర్తీభవించిన మంచితనమే ఆయన తనకు కీడు చేసిన వారిని కూడ మనస్సులో ద్వేషించని మహానుభావుడు. అందరికి (సత్) మంచిని (పురుషుడు) అధికంగా ఇచ్చేవాడు.

సత్యము, ధర్మము విషయంలో ఆసక్తి గలవాడు. (సత్) ఆత్మలను (తి) ప్రకృతిని (అం) నియమించేవాడయిన పరమాత్మవట్ల ప్రీతి (జ్ఞానము) కలవాడు. అంతే కాదు ధర్మమును (సత్కర్మలను) ఆచరించడంలో ప్రవీణుడు. సత్యమును గ్రహించి ధర్మమును అనుష్టించవలెనని - ఆచరణ ద్వారా ప్రబోధించిన వాడు.

''సంగ్రామాత్ నావిజిత్య నివర్తతే''

శ్రీరాముడు ఒక్క సారి యుద్ధరంగంలో ప్రవేశించాడంటే అందులో గెలుపుతోనే తిరిగివస్తాడు. తాను ఇతరులపై దండెత్తి వెళ్లినా (అభియాతా), ఇతరులు తన పై దండెత్తి వచ్చినా (ప్రహర్తా) - శ్రీరాముని పరాక్రమము (సత్యమైనది) మొక్కవోనిది.

''దీనాన్ దానేన'' ఆర్తులను, దీనులను తన దానంతో సంతోషింపజేసేవాడు.

మహారాజా! అన్నిటికంటే మరొక ముఖ్యవిషయం తెలుపుతున్నాము విను.

''వ్యసనేషు మనుష్యాణాం! భృశం భవతి దుఃఖితః

ఉత్సవేషుచ సర్వేషు - పితేవ పరితుష్యతి''

మహారాజా! మాలో ఎవ్వరికి ఏకొద్ది అపాయం సంభవించినా - స్వయంగా తెలుసుకొని దానిని తొలిగించడమే కాదు మా దుఃఖానికి మా కంటే తానే అధికంగా దుఃఖిస్తుంటాడు. మా కష్టము తొలగగానే మా దుఃఖము తొలిగి పోతుంది కాని మాకు ఆ ఆపద గల్గినందుకు కన్నతల్లివలె తాను ఆగకుండా దుఃఖిస్తూనే ఉంటాడు.

ఒకవేళ మా ఇండ్లలో ఏదైనా శుభకార్యం జరిగితే - తాను దానికి తగిన సహాయం చేసి పూర్తి చేయించడమే కాదు -ఆ శుభం కలిగినందుకు కన్న తండ్రి వలె మా కంటే అధికంగా సంతోషిస్తాడు.

స్త్రియో వృద్ధాస్తరుణ్యశ్చ సాయంప్రాతస్సమాహితాః సర్వాన్ దేవాన్ నమస్యంతి - రామస్యార్థే యశస్వినః'' మహారాజా! రాముడు మా బహిః ప్రాణము. ఆయన శ్రేయస్సు కొరకు స్త్రీలు వృద్ధులు, యువకులు అని తేడాలేకుండా అందరము ప్రతి రోజు ఉదయంలో సాయంసమయంలో దేవతలందరికి నమస్కరిస్తుంటాము.

కాబట్టి మహారాజా! మా రాముని యువరాజుగా వెంటనే పట్టాభిషేకం కావించుమని ''ప్రజలందరు అంజలిఘటించి ప్రార్థించారు.

సామంత, సచివ, పౌర, జానపదుల మాటలు ఆలకించిన దశరథ సార్వభౌముడు అత్యంత సంతోష భరితుడై వసిష్ఠ వామదేవాదులతో, "ఈ చైత్ర మాసము సంవత్సరమైనది, పుణ్యమైనది" శ్రీరాముడు కిరీటధారణ చేయడానికి సూచనగా తాను పుష్పకిరీటాన్ని ధరించింది. రాముని యువరాజుగా రేపే చేస్తాను అని ప్రకటించాడు. అప్పుడు ప్రజల జయ జయ ధ్వానాలతో ఆ ప్రదేశమంతా మారుమ్రోగింది.

దశరథుని ఆజ్ఞమేరకు వసిష్ఠ వామదేవులు 'సువర్ణము రత్నములు, పూజాద్రవ్యములు, సర్వౌషధులు,తెల్లని మాలలు, పేలాలు, తేనే నెయ్యి క్రొత్త బట్టలు; రథము సర్వాయుధాలు, చతురంగ బలాలు, భద్రగజము, తెల్లని చామరాలు, తెల్లని గొడుగు, జండా నూరు బంగారు పాత్రలు, బంగారు కొమ్ములు గల మదించిన వృషభము,వ్యాఘ్రచర్మము మొదలైన పట్టాభిషేక సామగ్రిని తెప్పించారు.

అంతే కాక నగర, అంతఃపుర ద్వారాలను అలంకరించుటకు. ధూపాలను వేయుటకు, మంచిపాలు, పెరుగుతో అన్నరాశిని సమర్పించుటకు, బ్రాహ్మణులను దక్షిణలతో సత్కరించుటకు ఆజ్ఞాపించారు.

తెల్లవారి స్వస్తి వాచనముకై బ్రాహ్మణులను ఆహ్వానించుమని, వారికి ఆసనములను సమకూర్చుమని చెప్పారు.

రాజ మార్గాలన్ని పన్నీరుతో కడుగి, పతాకాలను కట్టి ధూపదీపాలతో అలంకరించు మన్నారు.

నర్తకీమణులను సత్కరించి 'రాజగృహము రెండవకక్ష్యలో' ఆలయాలలో చైత్యాలలో సిద్ధంగా ఉంచడానికి ఆజ్ఞలిచ్చారు.

యోధులను – మాలలను, విచ్చుకత్తులను ధరించి నూతన వస్త్రాలతో వేర్వేరు స్థలాలలో నిలబడడానికి సూచించారు క్షణంలో అన్ని ఏర్పాట్లు జరిగాయి.

– ❁ –

శ్రీరాముని సభకు తీసుక రావడానికి దశరథుడు సుమంత్రుని పంపాడు మహర్షులు, మరుత్తుల మధ్య మహేంద్రునివలె సకల రాజగణము మధ్య ఆ రాజర్షి ప్రకాశించాడు.

రాముడు వస్తున్నాడని తెలిసి మహారాజా సభాభవనము పై నుండి చూడ సాగాడు. రథము పై రాముడు గంధర్వ రాజావలె వెలిగి పోతున్నాడు. చంద్రుని మించిన ఆకర్షణతో అందంతో అతి ప్రియంగా ఉన్నాడు.

రాముడు తన రూపముతో, ఔదార్యముతో, కళ్యాణ గుణాలతో పురుషుల చూపులను, చిత్తాలనుకూడ ఆకర్షిస్తున్నాడు. ఎండవేడిలో వాడిన వారికి వర్షమేఘము హాయిని గల్గించినట్లు సకల మనోనయనాలకు రాముడు రమణీయంగా కనిపిస్తున్నాడు. ఆయనను ఎంతసేపు చూస్తున్నా దశరథునికి సభాసదులకు సంతృప్తి కలుగడంలేదు.

– ✿ –

శ్రీరాముడు రథాన్ని దిగి మహారాజాను సమీపించి అంజలి ఘటించి తన పేరును చెప్పుకొన్నాడు. మహారాజా ఆయనను తన బాహువులలోకి తీసి కొని ఒక ఉన్నతాసనంలో కూచోబెట్టాడు. సూర్య ప్రభలతో ప్రకాశించే మేరుపర్వతమువలె శ్రీరాముని రాకతో ఆ రాజ సభ మరింత శోభాయమానమైనది. శ్రీరాముని చూస్తుంటే మహారాజాకు అద్దములో అలంకృతమైన తన రూపాన్ని చూచుకొన్నట్లే ఉంది.

దశరథుడు సభలోని నిశ్శబ్దాన్ని చీలుస్తూ, ''రామా''! నీవు నా పెద్ద భార్యకు పెద్ద కుమారుడివై జన్మించావు. నీ రూపగుణాలతో ప్రజలందరిని ఆకర్షించావు. అందువలన నిన్ను రేపు 'పుష్య చంద్ర యోగం'లో పట్టాభిషిక్తుని చేస్తాను. నీవు సహజంగా సుగుణ శాలివే. ఆయినా వాత్సల్యం వలన నీకు కొన్ని విషయాలు తెలుపుతున్నాను.

రామా! నీవు ఎల్లప్పుడు వినయవంతుడివిగా ఉండాలి. జితేంద్రియుడివి కావాలి. కామ, క్రోధ వ్యసనాలను పరిత్యజించాలి. అమాత్య ప్రభృతులైన

ఉద్యోగులను ప్రజలను అలరింపజేయాలి. ధనాగారాన్ని ఆయుధాగారాన్ని ఎప్పుడు నిండుగా ఉంచాలి.

అనురక్తులైన ప్రజలు అమృతము లభించిన అమరులవలె మహారాజును అభినందిస్తారు. అందువలన నీవు నియమవంతుడివి కావాలి '' అని చక్రవర్తి శ్రీరామునికి ఉపదేశించాడు.

- ✿ -

శ్రీరాముని పట్టాభిషేక వార్త అయోధ్యా నగరంలో సుడిగాలిలా వ్యాపించింది. శ్రీరాముని స్నేహితులు పరుగున వెళ్లి కౌసల్యాదేవికి ఆ వార్త నివేదించారు. ఆ తల్లి ఆక్షణంలోనే ఆవులను బంగారాన్ని, రత్నాలను బ్రాహ్మణులకు దానం చేసింది.

శ్రీరాముడు దశరథునికి ప్రణమిల్లి రథమారోహించి ప్రజల అభినందనాభివాదాలను స్వీకరిస్తూ, తన భవనానికి చేరాడు. రాజాజ్ఞతో పౌరసామంత, సచివులు తమ తమ స్థానాలకు వెళ్లారు.

దశరథ మహారాజు తన భవనానికి వెళ్లి '' రేపే పుష్యమి నక్షత్రానికి నా రాముని రాజు చేయాలి'' అని నిశ్చయించుకొని సుమంత్రుని పిలిచి రాముని మళ్లీ పిలుచుకొని రా ! అని ఆజ్ఞాపించాడు.

అప్పుడే తిరిగి వచ్చిన సుమంత్రుని చూచి అనుమానంతో రాముడు కారణమడిగాడు. మహారాజు తనను మళ్లీ చూడదలుచుకొన్నారని విని వెంటనే ప్రయాణమయ్యాడు. మహారాజు రాముని తన అంతర్గృహము లోనికి తీసిక వెళ్లి ''కుమారా'' నేను వృద్ధుడనయ్యాను. చిరకాలము అనేక భోగాలను అనుభవించాను. అన్నమయములైన అనేకక్రతువులను భూరి దక్షిణలతో మంత్ర పూరితంగా ఆచరించాను. అనేక దానాలను చేశాను. అనేక గ్రంధాలను అధ్యయనం చేశాను దేవర్షి పితృ ఋణాలను తీర్చుకొన్నాను. అదృష్టవశంగా నాకు నీ వంటి సాటిలేని సంతానం కలిగింది. నాకింకా నీ అభిషేకము తప్ప వేరే కోరిక లేదు. నిన్ను ప్రజలందరు రాజుగా చూడాలని పరితపిస్తున్నారు.

నాకెందుకో ఈమధ్య దారుణాశుభాలు స్వప్నంలో గోచరిస్తున్నాయి. పిడుగు పాటుతో పాటు తోకచుక్క పడిపోతున్నట్లు కలలు వస్తున్నాయి. నాజన్మ నక్షత్రాన్ని భయకర రాహు సూర్యాగ్ని గ్రహాలు చుట్టుముట్టాయి. జ్యోతిష్కులు ఈ స్వప్న ఫలితాన్ని మరణంగానో, లేక అంతటి మహాఆపదగానో సూచిస్తున్నారు.

రాఘవా ! మనస్సుచంచలమైనది. నాప్రాణం పోకముందే రేపు చంద్రపుష్యయోగములోనే ముహూర్తాన్ని దైవజ్ఞులు నిర్ణయించారు. నీ అభిషేకం జరగాలని నా నిర్ణయం కూడ అదే.

అందువలన నీవీ రోజు నియమాలతో గడుపాలి నీవు భార్యతో కూడ ఉపవాసము చేయాలి దర్భపై శయనించాలి నీహితైషులు నిన్ను కంటికి రెప్పలా కాపాడాలి. అనేక విఘ్నాలు కలిగే అవకాశము ఉంది. తాతగారింటి నుండి భరతుడు తిరిగి రాక ముందే నీ అభిషేకము జరుగాలని నా అభిప్రాయము. భరతుడు మంచివాడే. భ్రాతృవత్సలుడే. ధర్మాత్ముడే, జితేంద్రియుడే. అయినప్పటికి అనుక్షణం మనుష్యుల మనస్సులు మారుతుంటాయి. నిత్య ధర్మనిరతులైన సజ్జనులకు పరస్పరోపకారమే శోభాకరము. అందువలన నీవు అభిషేకానికి సిద్ధంగా ఉండుమ''.

- ✿ -

శ్రీరాముడు తండ్రి భవనాన్నుండి తల్లి మందిరానికి వెళ్లాడు. కౌసల్యాదేవి కౌశేయ (పట్టు) వస్త్రముధరించి మౌనవ్రతము దాల్చి దేవతా మందిరంలో ఉంది. అంతకుముందే సీతా సుమిత్రా. లక్ష్మణులు అక్కడికి చేరారు.

రామాభిషేక వార్తను అంతకుముందే రామ మిత్రులద్వారా విని ఉన్న తన తల్లితో ''అమ్మా! రేపు పుష్య చంద్రయోగంలో నాన్న గారు నా అభిషేకాన్ని నిర్ణయించారు. ఈ రోజు నేను సీతా దేవితో సహా ఉపవసించి నియమాలను పాటించాలి. మాకు మంగళాన్ని కల్గించుమని'' రాముడు కోరాడు.

ఆకలితో ఉన్న వ్యక్తికి పరమాన్నము లభించినట్లు పరమానందము చెందిన కౌసల్యాదేవి నాయనా! నీవు చిరంజీవిగా వర్ధిల్లు. నీవు శుభ (పునర్వసు) నక్షత్రంలో

జన్మించావు. నీ గుణాలతో మీ నాన్నను సంతోషింపజేశావు . నా నిరీక్షణ ఫలించింది. కమల పత్రాక్షుడివైన నిన్ను ఇక్ష్వాకు రాజ్యలక్ష్మి వరించింది'' అని పలికింది.

రాముడు సోదరుడైన లక్ష్మణునితో ''తమ్ముడా !'' నీవు నాతో కలిసి ఈ భూమండలాన్ని హాయిగా పాలించు! నీవు నా రెండవ ప్రాణము. రాజ్యలక్ష్మి నిన్ను చేరింది. నీ ఇష్టభోగాలన్ని హాయిగా అనుభవించు. రాజ్యాన్ని, నా జీవితాన్ని కూడ నీ ఆనందం కొరకే కోరుకొంటున్నాను'' అని పలికి సీతాదేవితో తన నూతన భవనానికి వెళ్లాడు.

శ్రీరాముని పంపిన తరువాత మహారాజు వశిష్ట మహర్షిని పిలిపించి, ''ఆచార్యా! ఈ రోజు మీరు స్వయంగా సీతారాములను ఉపవసింప చేయాలి. వ్రతానుష్ఠానముల వలన సిరిసంపదలు కీర్తి ప్రతిష్ఠలు స్థిరంగా నిలుస్తాయి'' అని ప్రార్థించాడు. వశిష్ట మహాముని అందుకు అంగీకరించి, తెల్లని మేఘము వంటి రామచంద్రుని మందిరానికి వెళ్లాడు. మహామంత్ర వేత్త అయిన వశిష్టుడు. విధి విధానంగా సీతారాములతో ఉపవాసాది నియమాలను పాటింపజేశాడు. మళ్లీ ఆ విషయాన్ని మహారాజుకు తెలియజేశాడు.

సంతుష్టాంత రంగుడైన దశరథ సార్వభౌముడు సింహము గుహలో ప్రవేశించినట్లు సకల కార్యములు సమాప్తి గావించి కైకేయి అంతఃపురానికి వెళ్లాడు.

''సహపత్న్యావిశాలాక్ష్యా ! నారాయణము పాగమత్''

శ్రీరామ భద్రుడు మహర్షి వెళ్లగానే పవిత్ర స్నానమాచరించి, సీతాదేవితో కలిసి శ్రీరంగనాధుని మందిరానికి వెళ్లాడు. బ్రహ్మ ద్వారా ఇక్ష్వాకు మహారాజుకు ప్రసాద రూపంగా లభించిన భగవానుడు శ్రీరంగరాజు. అప్పటి నుండి ఆ అర్చామూర్తి ఇక్ష్వాకు కులధనంగా ఆవంశీయుల ఆరాధనను అందుకొంటున్నది.

ఆ మందిరంలో హోమ శేషాన్ని భుజించి సీతాదేవితో కూడ శ్రీరంగనాధుని ధ్యానించి దర్భాసనముపై నిద్రించాడు.

జాము రాత్రి మిగిలి ఉండగా, లేచి వందిమాగధుల స్తోత్రాలను అవధరిస్తూ స్నానాదులను పూర్తి జేసికొని పూర్వ సంధ్యా సమయంలో నిశ్చల మనస్సుతో జపము జేశాడు.

మధుసూదనునికి శిరసా నమస్కరించి సంప్రీతుని గావించాడు. శుభ్రమైన పట్టు బట్టలతో బ్రాహ్మణులకు నమస్కరించాడు. వేద విదులైన విప్రుల ధ్వని అయోధ్య నగరమంతా మారుమ్రోగింది.

సీతా దేవితో కలిసి శ్రీరామభద్రుడు పట్టాభిషేకానికి సిద్ధంగా పూర్వోపవాసాది నియమాలన్ని పాటించాడని తెలిసి అయోధ్యా ప్రజలందరు ఆనందంతో పరవళ్లు త్రొక్కారు.

## మంథర

శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక వార్తను విన్న ప్రజ సముద్రము వలె సంతోష తరంగాలతో నిండి పోయింది. నగరమంతా ఒక వనమువలె పుష్పాలతో అలంకరింపబడింది.

గానాలతో, నాట్యాలతో, కేరింతలతో అయోధ్య అంతా ఆనందంతో కోలాహలంగా ఉంది.

అప్పుడు అనుకోకుండా కైకేయి దాసి మంథర చంద్ర సంకాశమైన కైకేయా సౌధము పైకి వచ్చింది ఆమె ఎక్కడ పుట్టిందో ఎవరికి తెలియదు. కేవలము జాలి వలన కైకేయి ఆమెను చేరదిసింది . అయితే క్రమక్రమంగా ఆమె కైకేయి అభిమానాన్ని సంపాదించింది.

మంథర అయోధ్య మహానగరంలోని కోలాహలాన్ని గమనించింది. ఆమెకు కారణము అర్థము కాలేదు. ప్రక్కనే కౌసల్యా భవనము పై అటు ఇటు ఆనందంతో సంచరించే ధాత్రిని మంథర కారణాన్ని అడిగింది. కౌసల్యా దాసి ధాత్రి – సకల జగత్కళ్యాణ సంధాయకమైన శ్రీరామచంద్రుని పట్టాభిషేక సమాచారాన్ని మంథరకు మహానందముతో తెలిపింది.

ఆ వార్త మంథరకు అకస్మాత్తుగా ఆగ్రహాన్ని కలిగించింది. కోపముతో బుసలు కొడుతూ, సర్పము వలె చరచరా సౌధాగ్రము నుండి క్రిందికి వచ్చి కైకేయిని పిలిచి, ''ఓసి పిచ్చి కైకా! వెంటనే లే! అత్యంత భయము నిన్ను ఆవేశించబోతుంది. నీకు

తెలియడం లేదు''. జన జీవన కరములైన వర్షధారలు జిల్లెడు చెట్టు ఆకులను నేల రాల్చినట్లు, విశ్వశ్రేయస్కరమైన శ్రీరామభద్రుని పట్టాభిషేక వార్త మంథర మనస్సులో మాత్సర్యాన్ని రేకెత్తించింది.

మంథర మహాగ్రహాన్ని గమనించిన కైకకు కారణము తెలియలేదు. ఆదేవి మంథరను అనునయించింది, కాని మళ్లీ మంథర ''దేవి! నేను బాగానే ఉన్నాను. కాని నీరేడు రేపు ఉదయమే రామునికి పట్టాభిషేకం చేస్తున్నాడు. రాజ వంశంలో పుట్టిపెరిగి కూడ నీ భర్తలోని క్రౌర్యాన్ని నీవు గమనించడం లేదు. నీభర్త నయవంచకుడు. గోముఖవ్యాఘ్రము నీతో ప్రియంగా మాట్లాడుతూనే, నీ వెనుక గోతులు తవ్వుతున్నాడు నీతో సర్వసౌఖ్యాలను అనుభవిస్తూ కౌసల్యకు మేలు చేస్తున్నాడు కౌసల్యా కుమారుడైన రాముని రాజు గావిస్తున్నాడు. నీవు వెంటనే జాగ్రత్త వహించి, నిన్ను, నీ కొడుకును రక్షించుకో

మంథర మాటలు కైక మనస్సులో మహానందాన్ని కలిగించాయి. శరత్కాలంలోని చంద్రలేఖ వలె ఆమె హర్షముతో తన ఆసనమునుండి లేచి మంథర మెడలో ఒక బంగారు హారాన్ని బహుమతిగా వేసి '' మంథరా! నీవు ఎంత మంచి వార్త చెప్పావే! నీకు నేను ఏ ప్రత్యుపకారాన్ని చేయగల్గుతానే ? నాకు రాముడు భరతుడు సమానులే కదా! ఇంత మంచి వార్తను తెలిపిన నీకు నీ వేమి అడిగినా కాదనకుండా ఇస్తానే!'' అని అమాయకంగా అంది.

మంథర మరింత కోపంతో, ఆ ఆభరణాన్ని నేలకు కొట్టి మండి పడుతూ ''ఓసీ బుద్ధిలేని కైకేయి! నీవు సంతోషించే సమయమా ఇది ? నిన్ను చూస్తేజాలి వేస్తుంది. రామ పట్టాభిషేకం నాకు మహా భీతిని కల్గిస్తుంది. లక్ష్మణుడు మహా ధానుష్కుడు. రామునికి అత్యంత ప్రియుడు.

ఇక శత్రుఘ్నుడెప్పుడూ భరతుని నీడలా అనుసరిస్తూ ఉంటాడు. అయితే శత్రుఘ్నుడు బాలుడు. రామునికి ఆయన వలన అణు మాత్రము భయము లేదు కనుక రామునికి శత్రుఘ్నుడంటే అయిష్టమేమి లేదు.

రాముని భయము భరతుని వలననే కలిగే అవకాశముంది అందు వలన నీ కొడుకును రాముడు ఊరకే వదలడు. ఎంత ప్రమాదాన్ని కల్గిస్తాడో తలచుకొంటేనే నాకు మహా భయము కలుగుతోంది.

కౌసల్య ఎంతటి భాగ్యవంతురాలు ! ఆమె కొడుకు రాజవుతున్నాడు. రేపటి నుండి ఆమెకు ఆమె దాసిజనానికి అపూర్వమైన అతిశయము ఏర్పడుతుంది. ఇక నీదేముంటుంది ? నీవు కూడ మావలె కౌసల్యా దేవికి దాసివి అవుతావు. నీ కొడుకు, కోడలు కూడ దాస్యము చేస్తారు''. అని మంథర కైకేయి మనస్సులో విభేదవిషాన్ని నింపడానికి ప్రయత్నించింది.

అయితే రాముని పెంచిన మమత కైకేయి మనస్సులో మంథర మాటల ప్రభావాన్ని ఇంకా దూరంగానే ఉంచింది. ఆమె మంథరను వారిస్తూ: '' మంథరా రాముడంటే ఏమనుకొంటున్నావే? ఆయన కళ్యాణ గుణరాశి ! కృతజ్ఞుడు, సర్వ ప్రాణి ప్రియుడు. నన్ను కన్న తల్లి అయిన కౌసల్యా దేవి కంటే ఎక్కువగా అభిమానిస్తాడు. దశరథ చక్రవర్తి పెద్ద కుమారుడు. ధర్మమూర్తి – నాకు రాముడు రాజయినా భరతుడు రాజయినా ఒకటే. రాముడు తన తరువాత తన తమ్ముడైన భరతునే రాజుగా చేస్తాడు ''అని మందలించింది.

కైకేయి మందలింపు మంథర మనస్సులో మరింత పట్టు దలను పెంచింది. మళ్లీ మాట్లాడుతు మంథర ''ఓసీ కైకా నీవు మూర్ఖురాలివే '' రాముడు రాజు కావడం భరతుడు రాజు కావడం ఒకటా ? రాజ్యాధికారము రాజు పెద్ద కుమారునికే సంక్రమిస్తుంది. అప్పుడు రాముని తరువాత రాముని కొడుకే రాజవుతాడు. కాని భరతునికా భాగ్యము ఎలా అబ్బుతుంది ? భరతుడు ఆయన పుత్ర పౌత్రులందరు రాజు సేవకులు గానే ఉండిపోతారు.

అంతే కాదు ! తనకు భయకారకుడైన భరతుని రాముడు ఊరకే వదిలి పెడతాడను కొంటున్నావు. రాజు ఎప్పుడు తన అనుజాలను అనుమానిస్తు ఉంటాడు. రాముడు భరతుని వధిస్తాడు – దేశాంతరానికైనా పంపిస్తాడు. దూరంగా ఉన్న భరతుని – ప్రజలు క్రమంగా మరిచి పోతారు రాముని పై వారి అభిమానము

క్రమంగా అధికము అవుతుంది. అందువలన నీ కొడుకును అక్కడి నుండే రామునికి అందనంత దూరంగా పంపి - రక్షించడం మంచిది. సింహాన్నుండి గజసమూహాన్ని కాపాడు కొన్నట్లు - నీవు నీ కొడుకును వెంటనే కాపాడుకో! అంతే కాదు రాముడు రాజవుతే కలిగే ప్రమాదాన్ని నివారించడానికి రాముని రాజు గాకుండా నిలిపి, నీ కొడుకునే రాజు గావించెడు ఉపాయమాలోచించు.'' అని కైకేయి మనస్సులో గరళాన్ని విరజిమ్మింది.

క్రమంగా కైకేయి మనస్సులో విషబీజాలు నాటుకొన్నాయి. ఆమె స్వాంతము విషాదంతో నిండిపోయింది. ఆమె అసహాయంగా, ''మంథరా! నీ మాటలను జాగ్రత్తాగా విని ఆలోచిస్తే నిజమే అనిపిస్తుందే! ప్రమాదసముద్రాన్నుండి. గట్టెక్కే ఉపాయాన్ని నీవే బోధించవే ? ఏ విధంగా నా కొడుకు రాజయి రాముడు రాజపదాన్నుండి తొలగిపోతాడే ? అని మంథర సహాయాన్ని సలహాను కోరింది.

మంథర - తన పాచిక పారినందుకు మనస్సులో సంతోషించి.'' దేవి! నీకు నీ కొడుకు రాజయ్యే మార్గమే తెలియదా ? లేక కావాలని నన్ను అడుగుతున్నావా?

నీవు కాదా! పూర్వము శంబరాసురునితో సంగ్రామంలో నీ భర్త అవశుడై పడిపోగా - అయునను సురక్షిత స్థానానికి తీసుక వెళ్లి - నీవు సంరక్షించినందుకు, ఆయున ఆనంద పరవశుడై నీకు రెండు వరాలనిచ్చినట్లు నాకు తెలిపావు.

ఆ రెండు వరాలను ఇప్పుడు యాచించు. మొదటి వరంతో రాముని మహారణ్యానికి పంపించి రెండవ వరంతో నీ కొడుకును రాజుగా చేయి. పదునాల్గేండ్లు రాముడు అడవులకు వెళ్తే ప్రజలకు రాజయిన భరతుని పైన స్థిరమైన అభిమానము కలుగుతుంది. భరతుడు రాజుగా స్థిరపడుతాడు. దీర్ఘకాలము తరువాత తిరిగి వచ్చిన రాముని పట్టించుకొనే వారు ఉండరు. అప్పుడాయన వలన భరతునికి అణుమాత్రమైనా ప్రమాదము ఉండదు.

అయితే నీవు ఒక పని చేయాలి. మహారాజు మనస్సు నీవైపు మరల్చుకోవాలి. అందుకు నీవు వెంటనే దుఃఖాగారములో ప్రవేశించి మలిన వస్త్రధారిణివై, ఎంత

బ్రతిమిలాడినా అనునయించినా నీవు వినకూడదు – నీ మనస్సును దృఢంగా రాతివలె చేసుకో – నీ భర్త లాలింపులకు లొంగిపోవద్దు.'' అని ఆమె కైకేయికి నూరిపోసింది.

మంథర దుర్బోధ కైకేయి మనస్సును విషమయం చేసింది ఆమెకు ఆ క్షణంలో కుబ్జలో అప్సరస అగుపడింది. ఒక హిత కామిని దర్శనమిచ్చింది. ఆమె ఆనందంతో ''కుబ్జ లోకంలో కుబ్జలు ఎంత వికారంగా ఉంటారే ! కాని నీవో గాలికి వంగిన కమలంలా ఉన్నావు. నీ శరీరము సమస్త అవయవ సంపదతో ఎంత శోభిస్తుందే ! నా ముందు నీవు నడుస్తు ఉంటే రాజహంసలా ఉన్నావు. నీలో అన్ని విద్యలు అన్ని మాయలు ఉన్నాయి. ఇప్పుడొక స్వర్ణమాలతో నిన్ను సత్కరిస్తాను. భరతుడు రాజయిన తరువాత నీ శరీరమంతా బంగారంతో నింపుతాను. అర్హమైన ఆభరణాలతో ఉన్న నిన్ను జూచి నీ శతృవులు పారిపోతారు. మిగిలిన కుబ్జలందరు లర్వాభరణాలతో నీ కాళ్ల దగ్గరపడి ఉంటారు''

ఆమె మాటలతో అమితానందం పొందిన మంథర ''దేవి ! నీవీ విధంగా ఆలస్యం చేస్తే ''గతజల సేతు బంధనమే'' అవుతుంది. వేదిపై అగ్ని శిఖవలె నీవు ''కోపగృహంలో క్రోధంతో ప్రవేశించు'' మని కైకకు ఉపదేశించింది.

తక్షణమే కైక తమోగుణంతో క్రోధాగారంలో గర్వంతో ప్రవేశించింది. తాను ధన రాశులకు కాని ఆభరణాలకు కాని, ఇతర అనునయాలకు వేటికి లొంగనని, ఒక వేళ భరతునికి రాజ్యాభిషేకం చేయడానికి సమ్మతించక రామునే దశరథుడు పట్టాభిషిక్తుని కావిస్తే తాను ప్రాణ త్యాగానికైనా తెగిస్తానని దృఢంగా విశ్వయించుకొంది. కైకేయి పట్టుదల పరిశీలించిన మంథర – ''ఇక కైకేయి కోరిక తప్పక నెరవేర వలసిందే '' అని ప్రకటించింది.

కైకేయి – తన సర్వాభరణాలు తొలగించివేసి కటిక నేలపై మలిన వస్త్రాలతో – పడుకొంది. అప్పుడు తారక అస్తమించ చీకట్లు నిండిన అకాశము వలె కైకేయి అంతః పురము అమంగళంగా అనిపించింది.

లోకంలో మనకు ఎంతో మంది మంథరలు తారసపడుతారు. వారి పనల్లా తమ చుట్టున్న వారి మనస్సులను దుర్బోధలతో మలినం చేయడమే. పైపైకి వారు ఎంతో ప్రియకరులుగా కనబడుతారు.

''మంథం రాతి ఇతి మంథరా'' మంచి ఆలోచనలను తలక్రిందులు చేసే మంథానం (చల్లను చిలికే కవ్వం) వంటిది మంథర

మంథర శారీరకంగా వికారంగా ఉండడమే కాదు. ఆమె మనస్సు కూడ వికారమయమే. అంతే కాదు అందరి మనసులలో వికారాలను కల్గించే విచారాలనే ఎప్పుడు చేస్తుంది. ఆమె పైకి అమృతములా కనిపించే తన మాటలతో ఎదుటి వ్యక్తి మనస్సులో హాలాహలాన్ని నింపగల్గుతుంది.

మంథర వంటి వికారి అయోధ్యలో ఎలా పుట్ట గలిగింది ? అనే ప్రశ్నతల ఎత్తకుండా ఆమె ''యతో జాతా'' ఎక్కడో – ఎవ్వరికీ తెలియకుండా పుట్టిందని తెలిపాడు వాల్మీకి మునీంద్రుడు.

కైక మొదట మంథర మాటలు లెక్క చేయలేదు. అయితే కైకను మంథర అంతటితో వదిలిందా ? లేదు. తన దురాలోచనా విషము ఆమె మనస్సునిండా నిండేదాకా వదల లేదు.

ఫలితంగా అంతటి వివేకవతి అయిన కైకేయి కూడ మంథర మాయ మాటలకు లొంగిపోయింది చూచారా ! దుర్జన సాంగత్యమెంత ప్రమాదకరమో ఎంతటి అనర్థదాయకమో కదా !

మంథర – మంథర పర్వతము వంటిది. పాలసముద్రాన్నుండి కూడ హాలాహల విషాన్ని ఎగజిమ్మింది కదా ఆమంథరాచలము ! అయితే అంతటితో ఆగలేదు దేవ దానవులు. తమ బుద్ధితో పాల సంద్రాన్ని ఇంకా తరిచారు. పాలసముద్రంలో పైపై విషము అయిపోయాక – అనంతరము ఉద్భవించారు ఆకర్షణీయ అప్సరసలు – ఆతరువాత కలిగాయి – ఐరావతాదులు అయినా ఆగలేదు ఆ అమరులు, అసురులు. ఆకర్షణీయములైన వస్తువులతో ఆగిపోకుండా మథించిన

ఫలితంగా అమృతమే ఉద్భవించింది. దైత్యుల, అదితేయుల ఆశ అలా నెరవేరింది అంతిమంగా.

మనమనస్సే పాలసముద్రము. మనలోని మంచి చెడు ఆలోచనలే అమరులు అసురులు. మన బుద్ధే కవ్వము.

బుద్ధి అనే కవ్వంతో మన మనస్సు చిలికినప్పుడు ముందుగా ఉద్భవించేది తమో గుణమే కలిగేవి విషపుటాలోచనలే. ఆ విషాన్ని గరళకంఠుని వలె దిగమ్రింగి మళ్లీ మన మనస్సును చిలికితే రజో గుణ ము తల ఎత్తి ఆకర్షణల ప్రభావము ఏర్పడుతుంది.

అప్పటికి ఆ ఆకర్షణలకు తల వంచక – ముందుకు వెళ్లి మరింత మనస్సును మథిస్తే సత్వగుణము ప్రవృద్ధమై భగవద్జ్ఞానామృతము లభిస్తుంది.

అలా లభించిన భగవత్ జ్ఞానామృతాన్ని స్వార్థ బుద్ధితో అనుభవించాలను కొన్నపుడు, ఇతరులను వంచించాలను కొన్నప్పుడు, దైత్యుల వలె భగవన్నిగ్రహానికి గురికావలసివస్తుంది. మోసమతో పొందాలనుకొన్నప్పుడు భగవంతుని ''సుదర్శనముతో తల మొండెము వేరుచేయ బడుతాయి.

అలా కాకుండా భగవదమృతాన్ని భగవత్ సంకాల్పాన్ని అనుసరించే అందుకొవాలనుకొని ఎదురు చూస్తూ సిద్ధంగా ఉన్నప్పుడు ఆ అమృతము లభించి అమరులమై భగవత్ప్రీతి పాత్రులమవుతాము.

పాపము ! కైక మనస్సులో మంధర – దుర్బోధ మధనంతో అశుభాలో చన హాలాహలము ఉద్భవించింది. ఆవిషాన్నే అమృతంగా భావించింది ఆ అమాయకురాలు ! కైకకు మిగిలిందేమిటి భర్తృమరణము, భరతుని ఛీత్కారము, లోకులనింద తప్ప !

కైక లాంటి అమాయకులు, మంధరల మాయమటలు విని ఎలా అనర్థాల పాలవుతారో మంధర, కైక పాత్రల ద్వారా శ్రీరామాయణము లోకానికి తన సందేశాన్ని అందిస్తుంది.

ఇతి శం.

## కైకేయి

(వాల్మీకి – విశ్వనాధల భావ సాదృశ్యము)

కైకేయి – కేకయ దేశాధిపతి అయిన అశ్వపతి మహారాజ కుమారి. ఆమెయుధాజిత్తు సహోదరి. ఆమెతల్లి చాలా మొండిస్వభావం గలది . తండ్రి చాలా గారాబంగా పెంచాడు ఆమెను. అందువలన తాను అనుకున్నది సాధించాలనే పట్టుదల కలది కైక

కైకేయి బాల్యమునుండి వీరోచితములైన శస్త్రాస్త్రవిద్యలందు అసమాన పాండిత్యమునుసముపార్జించింది.

చిన్నప్పటి నుండి ఆమెకు తండ్రితో సాన్నిహిత్యము వలన రాజకీయాలంటే అభిమానము ఏర్పడింది.

కైకేయికి వివాహవయస్సు వచ్చింది. అపురూపరూపరేఖా విలాసాలు అద్భుత యవ్వనం ఆమె స్వంత మయ్యాయి,

దశరధ సార్వభౌముడు సంతానాపేక్షతో ఆరమణిని తన అర్ధాంగిగా అశ్వపతిని యాచించాడు అప్పటికే దశరధ చక్రవర్తికి కౌసల్య సుమిత్రలనే ఇద్దరు భార్యలున్నారు ఆయన పెళ్లివయస్సు ఎప్పుడో దాటి పోయింది. అశ్వపతి ఆయోమయంలో పడ్డాడు. దశరధ చక్రవర్తి ఆజ్ఞను అతిక్రమించడానికి వీలు లేదు అంతవయస్సు పైనపడ్డవానికి తనముద్దుల కూతురును – అర్ధాంగిగా చేయడం తన మనస్సు అంగీకరించటంలేదు. అశ్వపతి పరిస్థితి ముందునుయ్యి వెనుక గొయ్యి.

''కన్యా వరయతే రూపం'' – కన్య వరించేది వరుని రూపాన్నే కదా !

అశ్వపతి కైక అభిప్రాయాన్ని తెలుసుకున్నాడు ఆమెకైక'' క + ఏక భోగమాత్ర పరాయణురాలు. సార్వభౌముని సగము శరీరమై సకల రాజసంపదలను స్వంతం చేసుకోవాలనే ఆమెస్వాంతము ఉవ్విళ్ళూరింది. ఆమెకు ధశరధుని అతీత వయస్సు అవరోధమనిపించలేదు

అశ్వపతి ఆలోచించాడు. వృద్ధుడైనా వరునైనిదువుత నంతటంతానే వరించింది తన చిక్కు ముడివింది. అంతేకాక తనతనయకుసార్వభౌమ సంపదలన్ని స్వంతమవుతాయి

ధశరధునికి కైకేయితో ఆమె ఇష్ట ప్రకారమే వివాహమయింది. ఎంత కాలము గడిచినా ఆమెవలన కూడా అపత్య(సంతానం) లాభము కలుగ లేదు.

చివరకు 'పుత్ర కామేష్టి' క్రతువు వలన దశరధుని ముగ్గురు రాణులుసంతాన వంతులయి, నలుగురు కుమారులు-నాలుగు కల్పవృష శాఖలుగా ఆయనకు జన్మించారు.

వారిలో " తేషాం కేతురివజ్యేష్టో రామోరతికరః" ఇక్ష్వాకు కుల ధ్వజం వంటి రాముడంటే దశరధునికి ప్రియమైన వాడు. ఆయున దశరధుని తనూజులందరిలో పెద్దవాడు. రాముడు తండ్రి అయిన దశరధునికొక్కనికే ప్రియుడు కాదు "ఇష్టస్సర్వ లోకస్య " సకల ప్రాణి మనోహరుడు.

దశరధ చక్రవర్తి సభాసమయాలలో తప్ప సర్వ వేళలలో సకలానందాలు లభించేది కైకేయి సాన్నిధ్యంలోనే అయితే ఆయున రాముడిని అరగడియ సమయమైనా విడిచి సహింపగల్గే వాడుకాదు అందు వలన నానగారినయనములముందేమెదిలే రాముడు-కైకేయి గృహంలోనే ఆటపాటలతో సమయము గడిపేవాడు. కౌసల్యా నందనుడైన శ్రీరాముడు కైకేయికి కుడా అనందవర్ధనుడే.

విశ్వనాధవారు కైకేయి శ్రీరాముల స్నేహాన్ని

"కాళ్ళు వచ్చిన దాదిగా-కైకకొరకు

పర్వులెత్తును శ్రీరామ- భద్రమూర్తి

నిద్రమేల్కొన్నదేరామ- భద్రు కొరకు

అంగలార్చుచుజనకేక- యాత్మజాత"

అని అపురూపంగా వర్ణించారు. కైకేయికి సుప్రభాతమయ్యేది. రామ సందర్శనంతోనే శ్రీరాముడు పర్వులెత్తేది కైక సన్నిధికే.

ధనుస్సును ఎలా పట్టుకోవాలో శరాన్ని ఎలా సంధానించాలో శ్రీరామునికి చక్కగా శిక్షణ గరిపింది కైకయే.

అంతేగాదు – కైకేయి తన పూర్వ సామ్రాజ్య వైభవాన్ని గురించి విన్నది.

'ఇక్ష్వాకూణా మియంభూమిః

సశైలవన కాననా–మృగపక్షి

మనుష్యాణాం–నిగ్రహ ప్రగహోపపి'

పర్వతాలు, వనాలు, కాననాలతో నిండిన సమస్త భూమండలం లోని మనుష్య మృగ పక్షులు మొదలైన సకల ప్రాణులు ఇక్ష్వాకు రాజుల నిగ్రహానుగ్రహాలపై ఆధారపడి వుండేవి.

అంతటి సువిశాల సామ్రాజ్యము ధశరథుని కాలంలో మధ్యోత్తర భారతంలోని కోసల దేశానికే పరిమితమైంది. మళ్లీ పూర్వ సామ్రాజ్య వైభవాన్ని సముపార్జించాలని సంకల్పించింది కైక. ఆ వీర వనిత దశరథుని పుత్రుల పరాక్రమాలను పరీక్షించి చూచింది.

'యధా ప్రజితి సంగ్రామం – గ్రామార్థేనగరస్యవా

గత్వా సౌమిత్రి సహితో – నావిజిత్యనివర్తతే'

సంగ్రామంలో పరాజయం ఎరుగని – మహావీరుడు శ్రీ రామభద్రుడు.

'అభియాతా' శత్రువెంతటి బలవంతుడైనా – ఆయనవున్న చోటికే వెళ్లి ఆయనను నిర్జించగలిగిన వాడు.

అంతేకాదు అకస్మాత్తుగా తనపై ఆక్రమణకు వచ్చిన ఎంతటి ప్రబలశత్రువునైనా మట్టి కరిపించగల మహావీరుడు శ్రీ రాముడు. (ప్రహర్తాచ)

శ్రీ రాముడు సకల జనుల సమక్షంలో నరుడుగా తిరుగుతున్నాడు. కాని ఆ 'నరుని' లో నారాయణుని దర్శింపగల తత్వదర్శిని కైక.

శ్రీ రాముని బదులు – తాను కాననాలకు వెళ్తానన్న భరతునితో ఆ వైరాగ్యశీలి

'రామచంద్రుడనినన్ – ప్రధ్నాంశుతేజో వినూతన

నారాయణ మూర్తి – శాసిత సమస్త ప్రాణి' అంటుంది.

శ్రీ రామునికి ఉపనయనం జరిగింది – ఆ రాకుమారుని ఉపనయనంలో అనేకులు అనేకములైన కానుకలు అర్పించారు. అయితే అన్నింటిలో కైకమ్మ ఒసగిన కానుకే అపురూపమైనది.

'వజ్రపుంఖితమ్ము – వాలుటమ్ము' వజ్ర ఖచితమైన బాణాన్ని రాముని ఉపనయనంలో ఉపాయనంగా ఇచ్చింది. కైకమ్మ కానుక గమనించిన రాముడు,

'మొగమున నింతయై, మురిసి పోయెను రాముడు'

రాముడు ముఖమంత కనులు చేసుకొని మురిసి పోయాడు.

'కైక కన్నులుందిగముమరింతయయి యేళ్ళులువారె'

కైక కన్నులలో ఆనందము నదులై ప్రవహించింది. శ్రీ రాముని జగదేక వీరునిగా చూడాలనుకున్న కైక కాంక్ష – ఆమె కాంక్షను పూర్తి చేయాలన్న రాముని దృఢ విశ్వాసము, వారిద్దరి కండ్లలో ప్రతిఫలించి మహానందము కలిగించింది.

వాల్మీకి కూడా ఆ శ్రీ రామ చంద్రుని పట్టాభిషేక వార్తను విని, మహానందంతో కైక – మంథర దురూహలను ఖండిస్తూ

'యథామే భరతో మాన్యః – తథాభూయోऽపి రాఘవః

కౌసల్యాతోऽతిరిక్తంచ – సోऽను శుశ్రూషతేచమాం''.

నాకు భరతుడు ప్రియ కుమారుడైతే – అంత కంటే ప్రియమైన వాడు రాముడు. రాముడు కూడా కౌసల్యా దేవి కంటే నన్నే ఎక్కువగా సేవిస్తాడు'. అని స్వాభిప్రాయమును స్పష్టంగా వివరించిందని – వర్ణించాడు.

వాల్మీకి - విశ్వనాథుల మనోగత అభిప్రాయాల సారూప్యం ముఖ్యంగా గమనింపదగినది కదా!

శ్రీ రామాయనమః

# కోపగృహంలో కైక

(వాల్మీకి విశ్వనాథల సాన్నిహిత్యము)

మంథర మాయ మాటల సుడిగాలి వలన శ్రీ రామ చంద్రుని భరతునికంటే విశేషాభి మానంతో చూచిన కైక మనస్సు అరణ్యమువలె అల్లకల్లోలమై అసూయా దావాగ్నితో నిండిపోయింది. తక్షణమే రాముని పట్టాభిషేకాన్ని నిలిపివేయాలని, అదే ముహూర్తానికి భరతునికి అభిషేకం చేయించాలనే విపరీతబుద్ధి కలిగిందికైకకు. అందుకు అవసరమైతే తన ప్రాణాలను సైతము త్యజించాలని ఆమె తెగించింది. ఎంతటి ఆపత్తునైనా ఎదుర్కోవడానికి సిద్ధపడింది.

దశరథ సార్వభౌముడు రామభద్రుని పట్టాభిషేక ప్రయత్నాలన్ని పూర్తిగావించి అందరి కంటె ముందు ఆ సంతోష వార్తను తన అనుంగు అర్ధాంగి అయిన కైకకు తెలుపాలని కోరికతో గుహలో సింహము ప్రవేశించినట్లు తన ప్రియపత్ని సౌధములో ప్రవేశించాడు.

కాని ఆయన మనస్సులో క్రమంగా ఒకవైపు ఆశ్చర్యము మరొకవైపు ఆవేదన - ఆక్రమింపసాగాయి. ఎప్పుడు తనకు ఎదురుగా వచ్చి ప్రేమతో పలుకరించి - తన అంతఃపురంలోనికి తీసికవెళ్లే కైకేయి - తన కనుల ముందు కనుపడడం లేదు చిలుకల పలుకులు, నెమిళ్ల కేరింతలు తన చెవులకు ఆనందంగా వినపడడం లేదు. క్రౌంచ, హంస పక్షుల కలకలారావము తన కర్ణాలకు తమకాన్ని కల్గించడం లేదు. సకలాభరణ భూషితలయిన కుబ్జల పరుగుల హడావిడి అసలే గోచరించడం లేదు. అగ్ని పర్వతము బ్రద్దలయ్యే ముందు కలిగే భయంకర నిశ్శబ్దము వంటి ప్రశాంత స్థితి అయన మనస్సులో ఆందోళనను కలిగింపసాగింది.

అక్కడ మౌనంగా నిలిచి ఉన్న ప్రతీ హారిని కైకేయి గురించి దశరథుడు ప్రశ్నించాడు.

'దేవి క్రోధాగారములో ఉంది'' అని ప్రతీహారి ప్రత్యుత్తరమిచ్చాడు.

ఆకుల చిత్తంతో మహీపాలుడు కైకేయి అంతఃపురంలోని క్రోధాగారములో ప్రవేశించాడు. అక్కడ కైక స్వరూపము దశరథుని దిగ్భ్రాంతుని చేసింది.

ఏక వేణితో, మాసిన వస్త్రంతో - మహాదుఃఖంతో కటిక నేల పై పడుకొన్న కైకను జగత్పతి చూచాడు.

అప్పుడా ధరాధిపతి కన్నులకు ''కైక తెగిన లతలా అని పించింది. నిర్ధూత అయిన కిన్నరి కనుల ముందు నిలిచింది. వ్యాధుని విషబాణ విద్ధ అయిన ఆడ ఏనుగు అగుపించింది. పాశబద్ధ అయిన ఆడలేడి కనిపించింది.''

దశరథుడు కైకేయికి దగ్గరగా కూచొన్నాడు. తమకంతో తన దేవేరి తనువునంతా తడిమాడు - ఆమె కేశముల పరిమళాన్ని ఆఘ్రాణించాడు. ఆమెను లేవనెత్తి తన అంకంపై ఉంచుకొన్నాడు. తన దేవి దైన్యము దశరథునికి అపరిమిత దుఃఖాన్ని కలిగించింది. ఆయన ఆవేశ భరితుడై ఆమె దుఃఖ కారణాన్ని తెలిసికోదలచి. తీవ్ర స్వరంతో.

'దేవి ! నీ ఆగ్రహానికి కారణము తెలుపు. నిన్నెవ్వరైనా నిందించారా ? అవమానించారా? కళ్యాణి ! నాకు అమంగళకరంగా కటిక నేలపై దుమ్ములో పడి ఉన్నావు. భూత మావేశించిన దానివలె నాకు చిత్త భ్రమను కలిగిస్తున్నావు. నీకు ఏదైనా వ్యాధి వచ్చిందా ? నా ఆస్థానంలో ఘన వైద్యులున్నారు. చిటకెలో నీకు ఆరోగ్యాన్ని కలిగిస్తారు.

నీ వెవ్వరికైనా ఉపకారం చేయాలనుకొన్నావా ? లేక అపకారం చేయాలనుకొన్నావా ? నిర్ధనుని ధనికునిగా చేద్దామనుకొన్నావా ? ధనికుని నిర్ధనుని చేయాలనుకొన్నావా ? క్షణములో నీ ఏ కోరికనైనా తీర్చడానికి, నేను, నా వాళ్లందరు లేమా ? అందరము నీ వారమే కదా ! నా శక్తిని తెలిసికొని కూడ నీ విహ్వాలతనాన్ని కల్గి ఉండడము నీకు తగునా ? నా పట్ల నీకు సందేహమా ?

సమస్త సామంత రాజన్యుల సకల సంపదలను నీ పాదాల ముందు

కుమ్మరిస్తాను. దేవి! నీ దైన్యానికి కారణం తెలుపు ఇప్పుడే తొలిగిస్తాను' అని దశరథుడు అడిగాడు.

మన్మథ బాణ పీడితుడైన మహారాజుకు స్వార్థ పూరిత దుష్ట చిత్త అయిన కైకేయి ఈ విధంగా సమాధానమిచ్చింది.

'దేవా ! నాకెవ్వరు అపకారము చేయలేదు. నన్నెవ్వరు నిందించలేదు. అవమాన పరుచలేదు. అయినా నా కొక కోరిక ఉంది. దానిని నీవు నెరవేరుస్తానంటే ప్రమాణం చేయి. అప్పుడు నా మనోరథాన్ని తెలుపుతాను'.

దశరథునికి తన గుండె బరువంతా ఒక్కసారి దిగినట్లు అనిపించి. తేలికగా ఊపిరి పీల్చి చిరునవ్వుతో 'కైకా! నీకంటే ప్రియమైన వారు మరెవ్వరున్నారు చెప్పు? పురుషులలో నాకు ప్రాణప్రియుడు నా రాముడు. ఎవ్వరిని విడిచి క్షణమైనా జీవించి ఉండజాలనో, అట్టి నా రాముని మీద ప్రమాణం చేసి తెలుపుతున్నాను. నీ కిష్టమేదైనా తప్పక నెరవేరుస్తాను. నన్ను సందేహింపకు' మని ఒట్టు పెట్టుకొని గట్టిగా చెప్పాడు.

కైకకు ఆవేశము మరింత అధికమైంది. ఆమె దశరథుని ప్రమాణాన్ని బలపరిచి. 'అగ్ని మొదలైన ముప్పది మూడు కోట్ల దేవతలారా! సూర్య చంద్రులారా! గ్రహములారా! దివారాత్ర దేవతలారా! గంధర్వ యక్షరాక్షసులారా! గృహదేవతలారా! పంచ భూతము లారా! సత్యసంధుడైన దశరథ ధరాధిపతి ఇదిగో మీ అందరి సమక్షంలో మీరందరు సాక్షులుగా చూస్తుండగా నాకు వరమిస్తున్నాడు వినండి' అని ఆవేశంతో పలికింది. ఆ తరువాత కామవశుడైన భర్త హస్తాన్ని గ్రహించి 'మహారాజా! పూర్వము దండకాధిపతియైన 'తిమిధ్వజుడని' పేరుగల శంబరాసురునితో దేవతలకు యుద్ధమేర్పడింది. అప్పుడు మీరు దేవతలకు సహాయంగా వెంట నన్ను తీసికొని వెళ్లారు. అసురుల అస్త్రాలతో మూర్ఛితులైన మిమ్మల్ని వారికంట బడకుండా తప్పించి కాపాడినందులకు నాకు మీరు రెండు వరాలను అనుగ్రహించారు కదా! వాటిని ఇప్పుడు అడుగుతున్నాను. ఒకవేళ నాకా వరాలను ఇవ్వకుండా మీ మాటను జవదాటితే నా ప్రాణాలనే తీసికొంటాను' అని కైక తన వాక్పాశములతో ఆ కామమోహితుని ముందుకాళ్లకు బంధము వేసింది.

మొదట 'మహారాజా! రేపు నీవు రామునికి రాజ్యాభిషేకం చేయాలనుకొంటున్నావు కదా! అదే ముహూర్తంలో రాముని అరణ్యాలకు పంపివేయాలి.

నా రెండవ వరము :- 'భరతున్ని రామునికి బదులు పట్టాభిషిక్తుని గావించాలి.'

శ్రీరాముడు తాపసి అయి - దూరకాననలకు వెళ్లాలి. ఆ పదునాలుగు సంవత్సరాలు భరతుడు నిష్కంటకంగా (భారత) దేశ పాలనము చేయాలి.

రాజా! నా రెండు వరాలను నాకిచ్చి నీవు సత్యవాక్యుడవై నీ కులాన్ని శీలాన్ని నీ జన్మను రక్షించుకో! తపస్వులందరు సత్య వాక్యాన్నే నిశ్రేయససాధనంగా తెలుపుతారు కదా!' అని క్రూరంగా పలికింది.

ఇది వాల్మీకి రామాయణంలో కైక వృత్తాంతము. వాల్మీకి రామాయణము ఇతిహాస ప్రధానమైంది. ఒక సంఘటన ఇలా జరిగిందనే ఉన్నది ఉన్నట్లుగా తెలుపుతుంది. కాని ఆ సంఘటన అలా ఎందుకు జరిగింది ? అని సంఘటన కారణాన్ని తెలుపదు.

కైకేయి శ్రీరాముడిని పుట్టినప్పటి నుండి ప్రేమించిందే! పుట్టడం కౌసల్యకైనా పెరిగింది కైకమ్మ ఇంట్లోనే కదా! భరతుని కంటే కూడ రాముడే తనకు అధికంగా ప్రియమైన పుత్రుడని తెలిపిందే! రాముడు కన్నతల్లి కౌసల్యను సేవించడం కంటే తనకే అధిక సేవలు చేసే వాడని తెలిపిందే.

ఇంతకాలము శ్రీరాముని విషయంలో ఏర్పరుచు కొన్న ఇంత మమతను ఇంత హఠాత్తుగా మంథర మాటల మాయాజాలంలో పడి దూరం చేసికొందా ? అది సాధ్యమేనా ?

దశరథుని ప్రమాణానికి సకల దేవతలను సాక్షులుగా ఎందుకు పిలిచింది ? అలా పిలిచినప్పుడు ఆమెకు ఆవేశం కలిగింది. వారిని సాక్షులుగా పిలిచినప్పుడు ఎందుకు ప్రాణాంతకంగా మహాఘోరంగా పిలిచింది? సంతోషంతో దేవతలను

సాక్షులుగా ఆహ్వానింపవచ్చును కదా ! తన పని నెరవేరబోతున్నదని సంతోషింపవచ్చును కదా ?

నిజానికి తానెంత ప్రియపత్ని అయినా తన మాటను తన భర్త కాదనక రాముని సంతోషంగా అడవులకు పంపుతాడనుకొందా ? తన కోరిక ఫలించి భరతుడు రాజవుతాడని - తాను భర్తతో సంతోషంగా ఉంటానని అనుకొందా ? అంతటి అమాయకురాలా కైకేయి ? భవిష్యత్తు పట్ల ఏ మాత్రము అవగాహన లేని బాలనా అశ్వపతి తనయ ? ఈ ప్రశ్నలకు వాల్మీకి రామాయణంలో స్పష్టమైన సమాధానము లభించదు.

'అనుక్తమ్ అన్యతో గ్రాహ్యమ్' అని ఒక న్యాయము ఉంది. ఒక దగ్గర చెప్పని విషయాన్ని మరొక చోట గ్రహించాలి.

'విద్వానేవహివిజానాతి - విద్వజ్జన పరిశ్రమమ్'

ఒక విద్వాంసుని శ్రమను మరొక విద్వాంసుడే కదా గ్రహించేది.

అందువలన వాల్మీకి కవీంద్రుని రామాయణము స్పష్ట పరచని రహస్యాలను విశ్వనాథ కవి సమ్రాట్టు విరచించిన రామాయణ కల్ప వృక్షము వివరిస్తోంది. అది మనకు గ్రాహ్యమే.

వాల్మీకి మునీంద్రుడు కూడ వేరు వేరు చోట్లలో ఈ రహస్యాల చిక్కు ముడులను స్వయంగా విప్పుతాడు.

ఉదా: సీతాదేవిని రావణాసురుడు అపహరించి - మార్గ మధ్యలో అడ్డు వచ్చిన జటాయువును సంహరించాడు. సీతాదేవిని ఆమె వెంట్రుకలలో యముని వలె క్రూరంగా పట్టుకొని ఈడ్చుక పోతున్నాడు. ఎంత హృదయ విదారకమైన దృశ్యమది! ఆ సమయంలో సీతాదేవి భయంతో తీగలా వణికి పోతోంది. దొరికిన చెట్టు నల్లా పట్టుకొంటోంది. రావణాసురుడామెను విడువకుండా కనికరమేమాత్రము లేకుండా లాగుకొని వెళ్తున్నాడు. ఆ దృశ్యాన్ని బ్రహ్మాది దేవతలు మహర్షులు వీక్షించారు.

అప్పుడు వారి భావాలు ఎలా ఉన్నాయో చూద్దామా!

'తాం లతామివ వేష్టంతీం – ఆలింగంతీం మహాద్రుమాన్

జీవితాంతాయ కేశేషు – జగ్రాహాంతక సన్నిభః

(అరణ్య – 52వ సర్గ 11 శ్లోకం)

'దృష్ట్వా సీతాం పరామృష్టాం – దీనాం దివ్యేన చక్షుషా

కృతం కార్యమితి శ్రీమాన్ – వ్యాజహార పితామహః'

(అ.కాం 52–12)

బ్రహ్మదేవుడు అటువంటి దీనావస్థలో రావణునిచే నిర్బంధింపబడి తీసికపోబడే సీతను చూచి – 'మనకార్యము సఫలమైంది కదా!' అన్నాడట. సీతాదేవి అపహరణము బ్రహ్మది దేవతలకు వారి పనిని నెరవేర్చిందట. స్వార్థపూరిత స్వభావులైన దేవతల మాట అటుండనీయండి పరమ కారుణికులయిన మహర్షులున్నారే! వారి విషయమేమిటి?

'ప్రహృష్టాః వ్యధితాశ్చాసన్ సర్వేతే పరమర్షయః

మహర్షులందరు సీతాపహరణమును చూచి 'ప్రహృష్టాః' చాలా సంతోషించారట.

ఎంత అన్యాయము! ఆర్తురాలయి భయంకర రాక్షసునిచే నిర్బంధింపబడిన సీతాదేవిని చూచి 'చాల సంతోషించడమా? అంటే సీతాపహరణాన్ని పరమ దయా స్వరూపులైన మహర్షులు కూడా కోరుకున్నారా?

మరొక్క చోటకూడ శ్రీరాముని వనవాసాన్ని కైకేయి కోరుకోవడం లోని పరమార్థాన్ని వాల్మీకి వివరిస్తాడు.

రావణవధ జరిగింది. బ్రహ్మది దేవతలు శ్రీరాముని పరత్వాన్ని ప్రస్తుతించారు. అంతలో స్వర్గలోకం నుండి దశరథుడు కూడ శ్రీరాముని చూడటానికి లంకకు వచ్చాడు. ఆయన శ్రీరామునితో అన్న మాటలను శ్రద్ధగా ఆలోకించండి.

'కైకేయ్యా యాని చోక్తాని! వాక్యాని వదతాం వర !

తవప్రవ్రజనార్థాని ! స్థితాని హృదయే మమ

ఇదానీంతు విజానామి! యధా సౌమ్య! సురేశ్వరైః

వధార్థం రావణ స్యేదం ! విహితం పురుషోత్తమ!'.

(యుద్ధకాండ 122 సర్గ 15–18 శ్లోకాలు)

ఓ పురుషోత్తమా! ఆనాడు నీ వనవాసం కొరకు కైకేయి అన్న మాటలన్ని నా హృదయములో అలాగే నిలిచి ఉన్నాయి. అప్పుడామె స్వార్థమే కారణమనిపించింది.

కాని ఈనాడు నాకు నిజము తెలిసింది. ఇది రావణ వధార్థము దేవతలందరు పన్నిన పన్నాగమని' అంటాడు దశరధుడు.

ముందు రామ వనవాసానికి కైకేయి మూర్ఖత్వమే కారణమని ఆమెను నిందించి, బహిష్కరించి ఆమె కాని, ఆమె కొడుకైన భరతుడు కాని తన శవాన్ని కూడ తాకకూడదని ఆంక్షలు విధించిన దశరధుడు సైతము, కైకేయి నిమిత్త మాత్రమే అని రామ వనవాసానికి ముఖ్యకారణము దేవతల ఆలోచనే అని నిర్ణయానికొచ్చాడు.

ఈవిధంగా కైకేయి వరాలకు – మంథర దుర్బోధే ప్రధాన కారణమని అయోధ్య కాండలో తెలిపిన వాల్మీకి అరణ్యకాండ, యుద్ధకాండలలో – దేవతల ఆలోచనే ముఖ్య కారణమని సూచించాడు.

వాల్మీకి ఎక్కడో సూచించిన 'దేవతల ప్రయత్న కారణాన్ని అయోధ్య కాండలోనే మరింత స్పష్టంగా మనోహరంగా మనకందించిన కవీంద్రుడు శ్రీ విశ్వనాధ సత్యనారాయణ. వారి 'రామాయణ కల్పవృక్షాన్ని' పరిశీలిద్దామా!

దశరధుడు రాముని రాజ సభకు రావించి ప్రజాభీష్ట కారణంగా రామునికి రాజ్యాభిషేకం జరుగుతుందని ప్రకటించాడు. వశిష్ట మహర్షిని పిలిచి సీతారాములతో ఉపవాసాది పూర్వ వ్రతాలను అనుష్టింపజేయుమని అర్థిస్తాడు. అలాగే బ్రహ్మర్షి అయిన వశిష్టుడు సీతారాములతో వ్రతాలన్ని ఆచరింపజేస్తాడు.

అప్పుడొక విచిత్రం జరిగిందని కల్పవృక్షము తెలుపుతుంది. శ్రీరాముడికా రోజు ఒకవింత స్వప్నము వంటి అనుభూతి కల్గింది. ''ఆకాశములో దేవతలందురు బారులుగా నిలుచున్నారు. అందరి ముఖాలలో దైన్యమే తాండవిస్తున్నది. వారిలో వారు దీనంగా ఈ విధంగా మాట్లాడుకొంటున్నారు.

'స్వామికి జ్ఞప్తి యుండదు – ప్ర–సన్నత కల్గదు, నిర్వికార సత్తామహనీయ వార్ధికిని – దానవ సింహము పంక్తికంధరుండే మయిపోయె? మానవుడు – ఏమయిపోయెె? భవత్ప్రతిజ్ఞ – తానేమయిపోయెె? కోసల – న–రేశ్వర యజ్ఞహవిస్సమా హృతిన్?'

'అయ్యో! రామచంద్రస్వామికి జ్ఞాపకం లేదు – మాపై దయలేదు ఆయన నిర్వికార సత్తా సముద్రుడే! ఆయనకు రాజ్యాపేక్ష ఉండడమా? రాక్షసేశ్వరుడైన రావణుని విషయమేమైంది? తాను మానవుడుగా స్వామి అవతరించింది రావణ సంహారము కొరకే కదా! ఆ మానవత్వమేమయింది? స్వామి జ్ఞప్తి (రావణ వధార్థము) ఏమయింది? దశరథుని పుత్రకామేష్టి యజ్ఞ సదస్సులో బ్రహ్మపురస్సరంగా సకల దేవతలకు అభయమిచ్చాడే స్వామి? రక్షిస్తానని మాట ఇచ్చాడే?'

శ్రీరాముడు స్వప్నమునుండి వెంటనే మేల్కొని దేవతల దీనవాక్కులను మననం చేసికొంటాడు. ఆయనకు పట్టాభిషేకంపై ఆసక్తి నశిస్తుంది. తాను దేవతల కిచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అనుకొంటాడు. అయితే ఎలాగా తన అభిషేకం నిలిచిపోవడం? తనకు తాను తన తండ్రి మాటను కాదనజాలడు – తన కన్న తల్లి కౌసల్య మనస్సు తనకు తెలుసు. ఆమె భర్తకు ఎన్నడు ఎదురు చెప్పదు. అంతే కాదు ఆమె తన పట్టాభిషేకం కొరకు సకల దేవతలను శరణువేడుతుంది. తనంతట తానుగా దశరథుడు తన నిర్ణయాన్ని మార్చుకొనే ప్రశ్నే లేదు. మంత్రి సామంత, సచివ, పౌర జానపదులు తన పట్టాభిషేకం కొరకు తన్మయత్వంతో ఎదురు చూస్తున్నారు.

తనకిష్టములేని తన పట్టాభిషేకాన్ని నిలిపివేయగలిగిన శక్తి ఒకరికే ఉంది. ఆమె తనను తల్లికంటే ఎక్కువగా ప్రేమించిన కైక. ఆమె దగ్గర సమస్యను చెప్పుకొనే చనువు తనకు ఉంది. ఆమె తనను తప్పక అర్థము చేసికొంటుంది. ఆమె తన భర్త

అయిన కోసల నరేశ్వరుని కూడ వినిపించగల్గుతుంది. ఎన్ని కష్టనష్టాలకైనా ఓర్చి తనను తప్పక ఈ సమస్యనుండి గట్టెక్కింప గల్గుతుంది.

వెంటనే శ్రీరాముడు కైకేయి మందిరానికి వెళ్తాడు. ఆమెకు తన సమస్యను అర్థము చేయిస్తాడు.

'అమ్మ సమాధిలో – నిటల మందున వేల్పులు వచ్చి, నన్ను రాజ్యమును సేయవద్దనిన – యట్లయితోచిన, యేమితో చకే, నిమ్మయి వచ్చితిన్, నిజమ – దేమియొ నాకును కూడనట్లే రాజ్యమ్మున యందుకోర్కెయను నట్టిది గుండియ బట్టి లేదనున్'

'కైకమ్మ తల్లీ దేవతలకు నేనిప్పుడే రాజ్యాభిషిక్తుని కావడం ఇష్టంలేదు. రావణ సంహారమే వారికి తక్షణము కావాలి. నాకు కూడ ఎందుకో రాజ్యమంటే కోర్కెలేదు. నాకేమి తోచక నీ దగ్గరికి వచ్చాను.

'నేను రాజ్యమును సేయుట – నిక్కవముగ
లేదు, వేల్పుల కిష్టమ్ము – లేద నంగ
రామచంద్రుని తీక్ష్ణనేత్రముల జూచి
తాను కైకేయి సౌధమ్ము – లోని కరిగె''

అమ్మా – నేనెన్ని విధాల చెప్పినా రాజ్యము సేయను. అది నా నిర్ణయము తల్లీ! 'అని తన అభిప్రాయాన్ని ఖచ్చితంగా తెలుపుతాడు. అప్పుడా 'అమ్మ' పరిస్థితి ఎట్లా ఉంది? తన గారాబాల కొడుకు' కూడని విషయము కావాలని కోరుకొంటున్నాడు. ఇంత వరకు రాముడు కోరింది ఏది తాను కాదన లేదు. రాముని మొండి తనము కైకేయికి కోపాన్ని – దుఃఖాన్ని కల్గించింది. 'రాముని రాజుగా చూడాలని తానెంతో మురిపంగా ఎదురు చూస్తుందే? తానే రాజ్యాభిషేకాన్ని ఆపడమా? కాని తప్పదు – రాముని మాట తాను చెల్లింపక తప్పదు. ఆమె రాముని తీక్ష్ణంగా చూచి అంతఃపురంలోకి వెళ్లిపోయింది. ఆమె కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. మనస్సు మొద్దుబారి పోయింది.

ఇంతలో మంథర వచ్చింది. రాముని అడవులకు పదునాల్గేండ్లు పంపి - భరతుని రాజు గావింపుమని దుర్బోధ చేసింది. కైకేయికి శ్రీరాముని ఇష్టాన్ని సాధించే మార్గము తోచింది.

ఆమె వెంటనే కోపగృహంలో ప్రవేశించింది. దశరథుడు ఆ సాయంత్రము సన్నాహాలు పూర్తిజేసికొని ఆమె భవనానికి వెళ్లాడు. ఆమెను ఆమె దుఃఖకారణాన్ని అడిగాడు. తన దుఃఖానికి కారణము 'రాముని రాజ్యాభిషేకము' అని ధైర్యాన్ని కూడదీసికొని చెప్పింది. ముందుగా తాను అడిగినది ఏదయినా తప్పక ఇస్తానని ప్రమాణం చేయుమంది. దశరథుడు ప్రమాణమే చేయడనుకొంది - ఒకవేళ రాముని రాజ్యాభిషేకం తప్ప మరేదైనా ఇస్తానని' అంటాడేమో అని ఆశపడింది.

అయితే దశరథుని పరిస్థితి వేరుగా ఉంది. అతడు తీవ్రమైన కామావేశంతో ఉన్నాడు. అప్పుడు తన కామాగ్నిని చల్లార్చే ఒకే ఒక సౌందర్య శక్తి కైక.

కామము అగ్ని వంటిది. ఎంత నేయిధార పోస్తే అంత తీవ్రంగా అగ్ని తన నాలుకలను చాచుకొంటూ పై పైకి లేస్తుంది. కామము కూడ ఎంత అనుభవిస్తుంటే అంత తీవ్రంగా అధికమవుతుంది.

'నజాతు కామః కామానాం - ఉపభోగేన శామ్యతి

హవిషా కృష్ణ వర్త్మేవ - భూయో భూయో2పి వర్ధతే'

గీతాచార్యుడు కూడ కామాన్ని 'మహాశనో, మహాపాప్మా' ఎంత ఆహారాన్నిచ్చినా శాంతించని మహా పాపమని -'విద్ధ్యేన మిహవైరిణం' - దానిని క్రూర శత్రువుగా గుర్తించి వేరంట లేకుండా తొలిగించడమొకే మార్గమని ఉపదేశించాడు.

దశరథుడిప్పుడు అటువంటి బలిష్ఠమైన కామపాశ బంధంలో ఇరుక్కున్నాడు. ఆయనకు ఊపిరాడడం లేదు. ఇటువంటి సమయంలో కైక ఏది కోరుకొన్నా కాదనే స్థితిలో లేడు. అవివేకమనే గుడ్డితనము ఆయనను ఆవరించింది. వెనుకా ముందు చూడకుండా కైక అడిగినట్లు ప్రమాణం చేయడానికి సిద్ధమయ్యాడు.

కైక పంచభూతములను, సకల దేవతలను సాక్షులుగా పిలిచింది దశరథుడు ప్రమాణం చేయడానికి సిద్ధం కావడము ఆమెకు శోకాన్ని కోపాన్ని తెప్పించాయి. ఘోరున ఒక్కసారి విలపించింది.

'అనినన్ గైకయి శోకకోపములు పెల్లై యేడ్వ'

అంతవరకు 'దశరథుడు ప్రమాణము చేయనిరాకరిస్తాడేమో అని ఉన్న ఒకే ఒక చిన్న ఆశకూడ వ్యర్థము కాగా - అంత వరకు ఆమె అవుకొన్న దుఃఖము ఒక్కుమ్మడిగా పెల్లుబికింది.

దశరథుని బలహీనత - ఆయన కామ వివశత్వము ఆయనను కట్టివేసింది. కామము శృతిమించితే మహాపాపము. అది అధర్మము. ఎక్కడ అధర్మము తల ఎత్తుతుందో - అక్కడ ధర్మము కొంత వరకైనా దూరమవుతుంది - దశరథుని అధర్మ (కామ)మే 'రామోవిగ్రహ వాన్ ధర్మః అన్నట్లు ధర్మ స్వరూపుడైన రాముని పదనాల్గేండ్లు కాననలకు తరిమివేసింది.' వరాలనే నెపంతో ఆయన సత్య పాశబద్ధుడు కూడ అయ్యాడు. జరిగింది జరిగినట్లు మాత్రమే తెలిపే ఇతిహాస (ప్రధాన)మైన వాల్మీకి రచన అయోధ్యాకాండలో 'రామవనవాస కారణాలను' విశ్వనాథ కల్పవృక్షము వలె అన్ని కోణాల నుండి పూర్తిగా వివరించి కైకేయి పాత్రను సమగ్రంగా దర్శింప జేయలేదు.

శ్రీరాముని వనవాసం నిశ్చయమైనందుకు అది తనమూలంగానే నిర్ణయింపబడినందుకు కైక అపరిమితంగా బాధపడుతున్నది. సర్వజ్ఞుడైన రాముడు ఆమె ముఖంలో విషాద ఛాయలను స్పష్టంగా గమనించి ఓదారుస్తున్నాడు :

'తల్లీ బాధవడకు - పుత్రుని కతమున నగు బాధలు

జనని సహింపక యేరు సైరింతురు?

'అమ్మా! కొడుకు పెట్టే బాధలను తల్లి తప్ప ఎవ్వరు సహిస్తారమ్మా ! నా కొరకు నీవు బాధలను భరించక తప్పదమ్మా!' శ్రీరాముడు కైకేయిని మళ్లీ ప్రార్థిస్తున్నాడు.

శ్రీరాముడు అడవికి బయలు దేరుతూ కైకేయి పాదాలకు ప్రణమిల్లుతున్నాడు.

'నీవాశీస్సులీకున్న పోవనన్నట్లన్నన్'

అమ్మా! నీవు ఆశీర్వాదము ఇవ్వకుంటే నేను పోజాలనమ్మా' అన్నాడు.,

కైకేయి దుఃఖంతో 'మూర్ఛగని – లిప్తం దేరి' నార బట్టలను ధరించి అడవులకు పయనమయి వెళ్ళే రాముని రూపాన్ని చూచి దుఃఖముతో మూర్చిల్లింది. వెంటనే లేచి – తన గుండెను బండగా చేసుకొని.

'పోవోయి నీవనముల్ – నా కొడు కిందు రాజగును

నీ బాహాధనుః క్రూర మార్గణముల్ – జేయును పద్రవంబున

మహా కాంతారముల్ ఘోషిలున్'

వెళ్లవయ్యా రామా! నీకేమి భయము? నీకేమి తక్కువ? నీ ధనుస్సు నుండి వెలువడే క్రూర బాణవులు అడవినంతా దద్దరిల్ల జేస్తాయి'' – అని ఆశీర్వాదమిచ్చింది.

కాని వెంటనే తన పరిస్థితి గుర్తుకొచ్చింది. లోకులు తనను ఎంత చీదరించుకొంటారు? మనస్సులో కృంగిపోయింది.

'నిరభిమానను, నిర్లజ్జ నిర్భయాత్మ జేసితివి, నన్ను సర్వ

సన్న్యాసినిన్–వనిన్ జనుమునన్ ! సవతి తల్లిన్ ననున్ శపించి.

సవతి తల్లిగనే చూపించినావు'

రామయ్యా! నిన్ను నీ కన్నతల్లి కౌసల్య కంటే ఎక్కువగా, భరతుని కంటే మిన్నగా ప్రేమించాను కదయ్యా! ఇప్పుడు లోకుల దృష్టిలో నన్ను దుష్టురాలైన సవతి తల్లిగా చూపించావు కదయ్యా ! లోకులు నన్ను లజ్జాభయము, అభిమానము లేని దానిగా నిందిస్తారు కదయ్యా? అన్ని సహించి, భరించడానికి నన్ను సర్వ సన్న్యాసిని చేశావు కదయ్యా! అయినా నాకు ఇవొక లెక్క కాదు – నాకు ప్రాణాధిక

ప్రియ పుత్రుడివైన నీ కోరిక తీర్చడమే ముఖ్యమయ్యా రామా!' అంటుంది కైకమ్మ తల్లి.

ఓహో ఎంతటి గొప్పవ్యక్తి కైకేయి ! ఎంత సానుభూతికి తగింది ఆ తల్లి! రాముని కోరిక చెల్లించడానికి తాను తన మనస్సును ఎంత చంపుకొంది! ఎంత లోకుల అసహ్యాన్ని సహించింది! తన బాధనంతటిని తన మనస్సులోనే మౌనంగా భరించిన సహన శీలి కైక. – లోకుల ఛీత్కారాన్ని మౌనంగా భరించిన భూదేవి వంటి క్షమా శీలి కైకమ్మ. ఇప్పటికి లోకులు 'కైకేయి' పేరును తమ పిల్లలకు పెట్టుకోవడానికి ఇష్టపడరు – ఎంతటి అవమానాన్ని మోసింది కైక!

అమ్మా! కైకమ్మ తల్లీ! నీకివే జోహారులమ్మా! నీ రాముని ప్రేమ అమోఘమమ్మా! రాముని కొరకు నీ అభిమానాన్ని కూడ వదలుకొన్న ధన్యురాలవమ్మా.

రామునికి కూడ కైక అంటే ఎంత ఇష్టమో! ఆమెపై ఈగ వాలినా భరింపలేడు. అందుకే భరతునితో 'నతేఽంబా మధ్య మా తాత గర్హితవ్యా కదాచన'

భరతా! మీ తల్లిని ఒక్క పరుషవాక్యాన్ని అన్నా నేను సహింప జాలను. నా మీద, మీ వదిన మీద ఒట్టు పెట్టుకొని మరీ చెప్పుతున్నానుసుమా!' అని అంటాడు ఆ కృతజ్ఞుడు.

## దశరథుడు

అయోధ్యను పాలించిన మహారాజులలో దశరథుడు ప్రముఖుడు.

అయన సూర్య వంశమును ప్రకాశింప చేసిన మణి దీపము. ఇక్ష్వాకు మాంధాత, దిలీపుడు, రఘువు మొదలైన మహాచక్రవర్తులు ఏలినధరతలాన్ని వారసత్వంగా పొందిన మహారాజా అయన.

ధశరధ చక్రవర్తి సహజముగా పరాక్రమవంతుడే. ఆయన తనరథాన్ని దశదిశలలో కూడా అప్రతిహతంగా పరిగెత్తింప గలిగిన వీరుడే. దేవతలకు సహాయంగా వెళ్లిమహామాయావి అయిన శంబరాసురుని సంహరింప గల్గిన సమర్థుడే.

అయినప్పటికి దశరథుని మనస్సు శౌర్యపరాక్రమములవైపు నిలిచిపోలేదు. ప్రారంభములో ఉన్న పరాక్రమము స్థానంలో కామోపభోగాలు ఆయన మనస్సును ఆక్రమించాయి. తరువాత కాలంలో కామమే ఆయన ప్రధాన పురుషార్థం అయింది.

దశరథ చక్రవర్తికి కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే ముగ్గురు రాణులు ఉన్నారు. వారేకాక మూడ వందల యాభైమంది ఇతర కాంతలు ఉన్నారు.

పరశురాముడు ఇరవైఒక్క పర్యాయాలు క్షత్రియ సంహారము కొరకు జైత్రయాత్రలు కావించాడు. అయితే ఆయన ముందుగానే ఒక ప్రకటన చేశాడు. తన దండయాత్రలో 'వివాహ దీక్షితులను' 'యజ్ఞశీలుర' ను బాధించనని ఆయన ప్రమాణం.

నిరంతర కామాభిలాషి అయిన దశరథుడు పరశురాముని దండయాత్రల కాలాన్ని తన నూతన వివాహాల కొరకు ఉపయోగించాడు. సంతత ధర్మకర్మాభిలాషి అయిన జనకుడు ఆకాలాన్ని ధర్మకార్య నిర్వహణకై గడిపాడు. లోకంలో ఎవ్వరి కాలక్షేపం వారిదే కదా! దుష్కామంతో జనులు అవినీతిని ఆశ్రయిస్తున్నారు. కాని సత్కామంతో పరమాత్మను ఆశ్రయించడం లేదు. లోకులెంత వెఱ్ఱివారో కదా!

దశరథుని కామవివశత ఇతర మహీపాలురకు మహావరమైంది. ఒక్కొక్కరే ఆయన సామ్రాజ్యమును ముక్కలు చేసి ఆక్రమించు కోసాగారు.

ప్రధానంగా ఆకాలంలో ఇద్దరు ఆక్రమణ శీలురు ఉన్నారు. ఒకడు అతిపరాక్రమవంతుడైన వాలి, రెండవవాడు వరబలగర్వితుడైన రాక్షసరాజు రావణబ్రహ్మ.

వాలి వరుసగా అడవులన్నిటిపై ఆధిపత్యాన్ని సంపాదించుకొంటుంటే జనపదాలను రావణాసురుడు ఆక్రమించుకొంటూ ఖరదూషణాది రాక్షసులను తనకు ప్రతినిధులుగా నిలిపాడు. తన సామ్రాజ్య పతనానికి దశరథుడు స్వయంగా సాక్షిగా ఉండిపోయాడు. కారణం ఆయన యుద్ధవైముఖ్యమే, భోగలాలసత్వమే. క్రమంగా యుద్ధాలు చేయకపోవడంతో ఆయన మహాసామ్రాజ్యము కోసల దేశం వరకే పరిమితమైంది.

కామపరశతకు తోడు, సంతానహీనత కూడ దశరథుని మనస్సును వ్యాకుల పరిచింది. ఎవ్వరి వలన తన ఇంట్లో చిరుదీపము వెలుగుతుందో అనే ఆశతో వృద్ధాప్యంలో కూడ ఆయన వివాహాలు మానలేదు. ఆయన ముదిమిప్రాయంలోనే తన మురిపాల భార్య కైకను పెండ్లాడాడు.

అయితే కైకతో వివాహము మామూలుగా జరుగలేదు. దశరథ సార్వభౌముని సామంతుడు అశ్వపతి. స్వయంగా వృద్ధుడనే కారణం చెప్పి సార్వభౌముడంతటి వానికి తన కూతురునివ్వడానికి నిరాకరిస్తే తాను దశరథుని అగ్రహానికి గురికావలసివస్తుంది. కాని చూస్తూ చూస్తూ తన కన్న కూతురును ఆముగ్గుబుట్టకెలా అర్పించేది? – అశ్వపతి పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి.

కేకయ మహారాజు 'కన్యావరయతే రూపం' అనేమాటను మనస్సులో పెట్టుకొని 'చక్రవర్తి మా కూతురు మిమ్మల్ని వరిస్తే తప్పక కన్యాదానం చేస్తాను' ని తెలిపాడు. అయితే అశ్వపతి ఊహకు విరుద్ధంగా కైకేయి సార్వభౌముని స్వరూప వయస్సుల కంటే ఆయన సంపదలకే ప్రాధాన్యమిచ్చి అంగీకరించింది.

ఇంకొక షరతు విధించాడు కేకయాధీశుడు 'సార్వభౌమా! ఇప్పటి వరకు కౌసల్య సుమిత్రలకు సంతానం కలుగలేదని, నాకుమార్తెను పెళ్లాడుతున్నారు కదా, ఇక ముందు కూడా వారికి సంతానం కాదనే విశ్వాసములేదు. ఒకవేళ వాళ్లకు, మా అమ్మాయికి కూడా సంతానమయితే మా మనుమడికే మీ తరువాత రాజ్యాధికారం సంక్రమించడానికి అంగీకరిస్తే అప్పుడు మీ కాళ్లు కడగడానికి నాకింకే అభ్యంతరంలేదు'

దశరథునికి – 'అశ్వపతి షరతు ఆమోద యోగ్యంగానే అనిపించింది. ఇంతవరకు కలుగని సంతానం కౌసల్య సుమిత్రలకు మాత్రం ఇకముందు కలుగుతుందనే నమ్మకము ఎక్కడిది? ఒకవేళ వాళ్లకుకూడా సంతానం కలిగితే రాజ్యాభిషేక సమయంలో అప్పుడు, అశ్వపతి కోరికను గురించి ఆలోచించవచ్చును భవిష్యత్తులో ఏదో జరుగుతుందని ప్రస్తుతము తన చేతి కందిన స్త్రీరత్నాన్ని చేజార్చుకోవడం దశరథునికి ఇష్టంలేదు. అందుకే అశ్వపతికి మాటిచ్చాడు.

ఉమాసంహిత '– యదిమమ తనయా భవేయుః

త్వర్థితేషాం పట్టాభిషేక సమయే

భవేయం స్మారితో యదిత్వయా వాక్యేన

భూపాల! తదాచేత్తత్కరవాణ్యహం'

'భూపాలా! ఒక వేళ నాకు అందరు భార్యలవలన కూడా తనయులు కలిగితే – వాళ్ల పట్టాభిషేక సమయంలో ఒకవేళ నీవునాకు జ్ఞాపకం చేస్తే అలాగేనీ దౌహిత్రునికే రాజ్యాధికారాన్ని ఇస్తాను' అని దశరథుని వాక్యాన్ని ఉమాసంహిత ద్వారావాయు పురాణం తెలుపుతుంది.

'పురాభ్రాతస్సన స్తాతః– మాతరంతే సముద్వహన్

మతామహే సమాశ్రౌషీత్ – రాజ్యశుల్కమనుత్తమం'

'తమ్ముడా! పూర్వము మన నాన్నగారు మీ అమ్మగారిని పెళ్ళి ఆడుతూ అమూల్యమైన రాజ్యశుల్కాన్ని మీ తాత గారికి దత్తం చేశారు.

వాల్మీకి స్వయంగా శ్రీరాముని ద్వారా చెప్పించిన మాటలివి! ఆ విధంగా దశరథుని ద్వారా తన మనుమడికి రాజ్యాధికారాన్ని సంపాదించుకొని అశ్వపతి తన తనూజను దశరథునికి ఇచ్చాడు.

దశరథుడు తన నవ వధువుతో సుదీర్ఘ కాలము స్వర్గ సౌఖ్యాలను అనుభవించాడు. ఆమె అద్భుత స్త్రీత్వము, అతిలోక సౌందర్యము పరిపూర్ణయవ్వనము దశరథున్ని అపూర్వ కామసుఖాలలో ఓలలాడించాయి. కాని ఆమెవలన కూడ ఆయనకు పుత్రలాభము చేకూరలేదు. ఆయన మనస్సులో అనపత్య (సంతానహీనత) దుఃఖము రోజు రోజుకు పెరుగసాగింది. అటువంటి పరిస్థితులలో ఒకనాడు ఆయన సచివుడు సుమంత్రుడు ఆయనకు ఒక రహస్యాన్ని తెలిపాడు.

'మహారాజా! ఒకనాడు సనత్కుమారుడు ఋషుల సభలో మీ విషయాన్ని ప్రస్తావించాడు. మీకు 'చాలా కాలము సంతానము కలుగదని చివరకు ఋష్యశృంగుని అధ్వర్యములో పుత్రకామేష్టి యాగం చేయడం ద్వారా మీకు

నలుగురు పుత్రులు కలుగుతారు.' అని ఆ మహర్షి తెలిపాడు.' ఆ కాలంలో ఋషుల, దేవతల సభలలో భవిష్యత్తును సూచించే చర్చలు జరుగుతుండేవి.

ఆకలి గొన్న వానికి పరమాన్నము లభించినట్లయింది ఆ మహారాజుకు. తక్షణమే తనకు ప్రాణమిత్రుడైన అంగదేశ మహీపాలుడు రోమపాదుని దగ్గరకు వెళ్ళి ఆయన అంగీకారముతో శాంతా ఋష్యశృంగులను అయోధ్యకు సాదరంగా పిలుచుక వచ్చాడు. ఋష్యశృంగుని అనుమతితో సంతాన ప్రాప్తి ప్రతిబంధకములైన పాపములను పరిహరించుటకు 'అశ్వమేధాన్ని' సంతానం కలుగడానికి 'పుత్రకామేష్టి' క్రతువును ఒనర్చాడు. యజ్ఞాగ్ని మధ్యనుండి ప్రాజాపత్య పురుషుడు వెడలి అందించిన పాయస పాత్రను ( భగవచ్ఛక్తిని) అందుకొని ఆపాయసాన్ని తన ముగ్గురు ధర్మ పత్నులకు పంచి వారిద్వారా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులనే నలుగురు కొడుకుల పొందాడు.

'తేషాం కేతురివ జ్యేష్ఠో'

వారందరలో ఇక్ష్వాకు కులధ్వజము వంటి పెద్ద కుమారుడు శ్రీరాముడు దశరధునికి మిక్కిలి మనః ప్రియుడు.

రాజ కుమారులందరు శస్త్రాస్త్రా దిసకల విద్యాసంపన్నులయ్యారు. వారి వివాహాల గురించి దశరథుడు ఆలోచిస్తున్నాడు.

ఇంతలో దశరథుని సభా ద్వార పాలకుడు 'విశ్వామిత్రాగమనం' గురించి తెలిపాడు. మహారాజు మహర్షికి ఎదురేగి ఆయనను యథావిధిగా సత్కరించి ఆ మునీశ్వరుని దర్శనము తనకు సకల సంపత్కారమైనదని, మహర్షి కోరినదేదైనా తప్పక ఇస్తానని భూపాలుడు వాగ్దానం చేశాడు.

తానొనర్చే యాగాలకు మారీచ సుబాహువులనే రాక్షసులు విఘ్నమొనర్చుతున్నారని దీక్షాధారి అయిన తాను ఏమిచేయలేని స్థితిలో ఉన్నానని యజ్ఞ సంరక్షణార్థము మహాత్ముడైన శ్రీరాముని పంపుమని కోరాడు.

పుత్ర వ్యామోహంతో దశరథుడు రాముని పంపుటకు నిరాకరించినా వశిష్ఠుని ఆదేశము ప్రకారము రాముని మునివెంట పంపాడు. 'శృతిని స్మృతి

అనుసరించినట్లు' రాముని వెంట లక్ష్మణుడు కూడ వెళ్లాడు.

చాల కాలం వరకు దశరథునికి తనయుల సమాచారము తెలియలేదు. బీటలు వారిన భూమిపై తొలకరి వాన కురిసినట్లు ఆయన నిరీక్షణ ఫలించి జనకరాజు దూతలు దశరథ చక్రవర్తి సభకు ఏతెంచి 'శ్రీరాముడు శివధనుర్భంగము కావించాడు. జనకునితో వియ్యమందుకోవడానికి మిధిలా నగరానికి పుత్రకళత్ర పరివార సమేతంగా రావలసింద' ని జనకుని ఆహ్వాన మందించారు.

పరమానంద భరితుడై తక్షణమే సపరివారంగా మిధిలా నగరానికి వెళ్లి రామలక్ష్మణులకు జనక తనయులైన సీతా ఊర్మిళలతో భరత శత్రుఘ్నులకు ఆయన తమ్ముని కూతురులైన మాండవి శ్రుతకీర్తులతో పరిణయాలు జరిపించాడు.

అయోధ్యకు తిరుగు ప్రయాణంలో హఠాత్తుగా భార్గవరాముడు ఎదురయ్యాడు. ఆయనను చూడగానే దశరథుని పై ప్రాణాలు పైనే పోయాయి. అయినా ధైర్యాన్ని కూడదీసుకొని తన కుమారుడైన శ్రీరాముని కాపాడుమని బ్రతిమిలాడాడు. కఠినుడైన పరశురాముని చూచి భయంతో మూర్ఛిల్లి – తరువాత శ్రీరాముని చే ఓడి పరశురాముడు వెళ్లిపోయాడని చెవులారా విన్నాక దశరథుడు పూర్తిగా స్వాస్థ్యాన్ని పొందాడు.

అయోధ్యలో పన్నెండు సంవత్సరాలు సీతారాముల సుఖజీవనానికి కావలసిన అన్ని సౌకర్యాలను దశరథుడు సమకూర్చాడు. అందుకే సీతాదేవికి మామగారంటే అత్యంత అభిమానము. 'స్నుషా దశరథస్యాహం' తనను 'దశరథుని కోడలుగా' చెప్పుకోవడమే ఆమెకు గర్వకారణము.

సుందరకాండలో హనుమతో సంభాషిస్తూ సీతాదేవి :

'సమాద్వాదశ తత్రాఽహం రాఘవస్య నివేశనే

భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామ సమృద్ధినీ

పన్నెండు సంవత్సరాలు తాను శ్రీరామునితో కలిసి తన మామగారి ఇంటిలో సకల మానుష్యభోగాలను సమృద్ధిగా అనుభవించానని తెలుపుతుంది.

దశరథునికి తాను జీవించి ఉండగా తన పెద్దకుమారుడైన శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలని కోరిక కలిగింది. నిజానికి ఆ కోరిక అధర్మమైంది ఏమికాదు. అది అనాది ఆచారము కూడ. అందులో రామభద్రుడు రాజపుత్రుడంటే వద్దనే ప్రాణిలేదు.

అయితే కైకేయిని పెళ్ళిచేసుకొనేప్పుడు ఆమె కొడుక్కే రాజ్యమిస్తానని దశరథుడు ప్రమాణం చేశాడు కదా! శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలని దశరథుడు సంకల్పించే సమయానికి అశ్వపతి ఇంకా జీవించేఉన్నాడు. ఒకవేళ తన మనుమడికే రాజ్యం కావాలని అశ్వపతి రాజసభలో తెలిపితే తన ప్రయత్నమంతా 'బూడిదలో పన్నీరు పోసినట్లు' అవుతుంది. ఎలాగా అని ఆ మహారాజు ఆలోచించాడు.

ముందు భరతుని రాజధానిలో లేకుండా చేయాలనుకొన్నాడు దశరథ భూపాలుడు. అదివరకే భరతుని మేనమామ యుధాజిత్తు తన మేనల్లుడిని పిలుచుకవెళ్లడానికి వచ్చాడు. అది దశరథునికి బాగా తోడ్పడింది. భరతుని పిలిచి 'నాయనా! మీ తాతగారు నిన్ను చూడాలనుకొని మీ మేనమామను పంపారు. నీవు ఆయన వెంట మీ మాతామహుని ఇంటికి వెళ్లిరా' అని ఆజ్ఞాపించాడు. అశుభం శుభం తెలియని భరతుడు 'అలాగే' అని కేకయదేశం వెళ్లాడు.

భరతుడు లేకుండా చూచి దశరథుడు 'రాజసభ'ను ఏర్పాటు చేశాడు. దానికి అశ్వపతి, జనకుని తప్ప మిగిలిన రాజులందరిని పిలిచాడు. ఆ సభలో హడావిడిగా 'శ్వఏవ పుష్యోభవితా- శ్వోభిషేచ్యస్తు మేసుతః-. రామోరాజీవతామ్రాక్షో' రేపే పుష్యమి నక్షత్రము రేపు రాజీవమువలె ఎఱ్ఱని కన్నులు గల నా కొడుకు రాముడు పట్టాభిషిక్తుడవుతాడు' అని ప్రకటించాడు.

ఇక్కడే అతిగా ఆలోచించి దశరథుడు తప్పటడుగు వేశాడు. ఒక వేళ నిజంగా అశ్వపతి రాజసభకు వచ్చి దశరథరాజు ప్రతిజ్ఞను సభముందు ఉంచినా భరతుడు రాజ్యాన్ని అంగీకరించే వాడా? ఎంత మాత్రము అంగీకరించేవాడు కాదు.

దశరథుని నిర్యాణం, రామవనవాస ప్రయాణము తరువాత వారసుడే లేని

రాజ్యాన్ని స్వీకరించుమని కులగురువు బ్రహ్మర్షి వశిష్టుడు ఆజ్ఞాపిస్తేనే,

సభ మధ్యలో బ్రహ్మర్షి కులగురువని కూడా చూడకుండా, 'ఏమయ్యా నీవు మా కులగురువువా? నీవు చెప్పేది ధర్మమా? ఆలోచించి చెప్పొద్దా! ఏది తోస్తే అదేనా చెప్పడం? నేను ఎవ్వరిని? నాకు రాజ్యానికి ఏమైనా తేడావుందా? రాజ్యమెల్లా పరతంత్రమో దానితో పాటు నేనుకూడా రామునికి పరతంత్రుని కానా? ' అని అందరిముందు బిగ్గరగా చీవాట్లు పెట్టి దులిపాడే, అటువంటి చీవాట్లనే మాతామహునికి, తల్లికి ఇంకా ఎవ్వరెవ్వరు తనకు రాజ్యాన్ని ఇవ్వాలను కుంటున్నారో వారందరికి పెట్టి దులిపేవాడు.

తండ్రిగారు చనిపోయాక 'కథం దశరథాత్ జాతః దశరథునికి పుట్టిన వాడు భవేద్రాజ్యాపహారకః దొంగ ఎల్లా అవుతాడు అని అడిగాడే? తండ్రిగారు జీవించి ఉన్నప్పుడు భరతుడు రాజ్యాన్ని అంగీకరించేవాడా?

నిజానికి అశ్వపతి మహారాజుకు కూడా ఆ ఆలోచన వున్నట్లు అగుపడదు. దశరథునికి సంతానమయినప్పటినుండి ఇప్పటికి కూడా అశ్వపతి తన మనుమడికి 'రాజ్యమిస్తానన్న వాగ్దానాన్ని' దశరథునితో ఎప్పుడు ప్రస్తావించలేదు.

అంతేకాక తన కూతురు కైక కూడా రాముని సవతి కొడుకని చూడకుండా తన కన్న కొడుకుకంటే మిన్నగా చూచుకుంటున్నది 'యథామే భరతోమాన్యః- తదాభూయోపి రాఘవః-' 'నాకు భరతుడు ఎంత కావలసినవాడో రాముడు అంతకంటే ప్రియమైనవాడు!' అని కైక స్వయంగా చెప్పుకుంది కదా! అటువంటి సమయంలో జోక్యం కల్గించుకోవాలని అశ్వపతి ఆలోచించలేదు. వాళ్ళ కుటుంబ విషయాలు వారే చూచుకుంటారు – వాళ్ళందరు సంతోషంగా వున్నారు. మధ్యలో మనకెందుకు ' అని అశ్వపతి ఉపేక్షించి వూరుకోని వుంటాడు.

ఇంకొక ముఖ్య విషయం – భరతునికి రాజ్యాధికారము వాగ్దానం జరిగిన విషయం దశరథుడు, అశ్వపతి, వశిష్టాది ఏకొద్ది మందికి మాత్రమే తెలుసు – అంతే కాదు అశ్వపతి ఈ విషయాన్ని తన కన్న కూతురు కైకకు కూడా చెప్పలేదు. ఆ రోజులలో పెద్దవాళ్ల మధ్య జరిగే వ్యవహారాలను చిన్నపిల్లలకు తెలియనిచ్చేవారు

కాదు. పిల్లలు అడిగేవారు కాదు.

ఒకవేళ అశ్వపతి కైకేయికి ఇదివరకే ఈ విషయాన్ని తెలిపివుంటే ఆ విషయాన్నే దశరథుని ఆమె అడిగివుండేది శంబర సంగ్రామంలో ఆయన ఇచ్చిన రెండు వరాల గురించి అడుగడం దేనికి? 'ద్రవిడ ప్రాణాయామము' వలె అనవసర ప్రయాసే కదా!

పోనీ 'మొదటినుండి ప్రస్తావించటం దేనికి? సమయం వచ్చినప్పుడే తెలుపుదామని 'అశ్వపతి ఊరుకున్నాడనుకున్నా, అప్పటి వరకు ఆగినా, అశ్వపతిరాజ్య సభలో అడిగినా భరతుడు రాముని బదులు తాను రాజా కావాలని కోరుకునే వాడుకాదు. రాజ్యాన్ని తృణప్రాయంగా భావించిన మహాత్ముడు భరతుడు.

అందువలనే తనకుతానే అతిగా ఊహించి తప్పటడుగు వేశాడు ధశరథుడు

భరతుని మాతా మహుని ఇంటికి పంపించాడు. దాని వలన మంథర దుర్బోధ – కైకేయి పట్టుదల ఏర్పడి రామవనవాసము, దశరథనిర్యాణం సంభవించాయి. కోరి మహోపద్రవాన్ని కొనితెచ్చు కున్నాడు కోసల నరేశ్వరుడు. కొరివితో తల గోక్కున్నాడు. తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుంది ' అనే సామెత రుజువైంది. అయితే దశరథుని ప్రవర్తనను కూడా మనము పూర్తిగా తప్పు పట్టడానికి వీలులేదు. ఆయన పుత్రవ్యామోహం అటువంటిది 'అతి స్నేహం పాపమా శంకతే' అనే నానుడి వుందికదా ఎక్కడ అధిక ప్రేమ వుంటుందో అక్కడే ప్రమాద భయము కూడా వుంటుంది.

అంతవరకు అశ్వపతి తన వాగ్దానం ఎప్పుడు ప్రస్తావించని మాట నిజమే అయితే అవసరం వచ్చినపుడు ఆ వి షయాన్ని అందరికి తెలిపితే తన రాముని గతి ఏమవుతుంది ? భరతుడు ఇప్పటి వరకు మంచివాడే శ్రీరాముని ప్రేమించినవాడే కాని రాజ్యము తనకే చెందుతుందని తెలిశాక కూడా ఆయనలో ఆ మంచితనం, అన్న మీద ప్రేమ అలాగే వుంటాయో ఉండవో? – ఇవి దశరథుని మెదడును పట్టి పీడిస్తున్న స్మమస్యలు సందేహాలు.

మొత్తంమీదాయనతను అనుకున్నట్లు భరతుని లేకుండా చేసి అశ్వపతి ని రాకుండా చూచి శ్రీరాముని పట్టాభిషేకం గురించి ప్రస్తావించాడు. సభలోని మంత్ర సామంత, సచివ, పౌర, జానపదులందరు సభాగోపురం కంపించేట్లుగా

'ఇచ్ఛామోహి మహాబాహుం

రఘువీరం మహాబలం

గజేన మహతా యాంతం

రామం ఛత్రావృతాననం'

'మహాబాహువు (శరీర బల సంపన్నుడు) మహాబలుడు (ధర్మ బల సముపేతుడు) రఘువీరుడు అయిన రాముడు శత్రుంజయ మహాగజముపై శ్వేతఛ్ఛత్రము క్రింద (రాజ లాంఛనముతో) అయోధ్యా నగర వీధులలో ఊరేగింపుగా రావాలని దృఢంగా కోరుకొంటున్నా మని తెలిపారు. ఆ మహారాజా ఆనందానికి అవధులే లేవు.

తెల్లవారే పుష్యమీ చంద్రయోగంలో రామునికి రాజ్యాభిషేచనం జరుగుతుందని ఆ మహాసభలో రాముని ముందు ఆ సదస్యులందరి ముందు ప్రకటించాడు. శ్రీరాముని మళ్లీ తన అంతఃపురానికి రావించి తనకు కనపడుతున్న ప్రమాద సూచనలను గురించి హెచ్చరించాడు. వశిష్ఠమహర్షిని పిలిపించి సీతారాములతో ఉపవాసాది అభిషేక పూర్వ వ్రతాలన్నిటిని ఆచరింపజేయు మని అభ్యర్థించాడు. అన్ని సన్నాహాలు పూర్తి జేసుకొని- అందరికంటే అభిమతురాలయిన తన చిన్నరాణి- ప్రియరాణి అయిన కైకేయికి అందరి కంటే ముందు ఆ విషయాన్ని తెలుపాలని ఆనందంతో కైకేయి అంతఃపురానికి వెళ్లాడు కాని ఆయన ఆనందము ఎంతోసేపు నిలువలేదు. మంథర దుర్బోధ విషము పూర్తిగానిండి- 'ఆవేశమా' వహించిన కైక 'రామునికి 14 సం.ల అరణ్యవాసము' – 'భరతుని అభిషేచనము' అనే తన రెండు కోరికలను తీర్చకుంటే తన ప్రాణత్యాగము చేస్తానని పట్టుబట్టింది. అంతే కాదు శిబి- అలర్కుడు మొదలైన మహాత్ములు సత్యపాలనము కొరకు చేసిన మహా త్యాగాలను గుర్తుచేసింది.

దశరధుడు స్తబ్ధుడయ్యాడు. నిర్విణ్ణుడయ్యాడు. కైకను బ్రతిమిలాడాడు. ఆమెకు రామునిపై గల ప్రేమ గుర్తుచేశాడు. శ్రీరాముడు ధర్మాత్ముడని – కలలో కూడ చీమకు సైతము ప్రమాదము తలపెట్టని మహాత్ముడని చెప్పాడు. కన్నతల్లి కంటే కైకమ్మకే అధిక సేవలు చేశాడని తెలిపాడు. చివరకు కైక కోరిక వలన తన మరణము తధ్యమని చెప్పాడు. రామానుజుడైన భరతుడు ఆమె కోరికను తీర్చడని స్పష్టము చేశాడు. ఎన్ని రకాల బ్రతిమిలాడినా నచ్చజెప్పినా తన పట్టువిడువలేదు. వశిష్ఠాదులు గర్హించారు.

సుమంత్రుడు కైకేయిని తీవ్రంగా నిందించాడు. 'భర్త ప్రాణాలను కూడ లక్ష్యపెట్టకుండా తనకు చీమల సంభాషణ గురించి తెలుపాలని పట్టుపట్టి చివరకు అశ్వపతి చేత బహిష్కృతురాలైన తల్లి బిడ్డవే నీవు' అని కైకేయి మాత యొక్క దుష్ట స్వభావాన్ని తెలిపి – ఆమె దుష్టస్వభావము ఆమె సంతానమైన కైకేయికి కూడ అలవడిందని అభిశంసించాడు. ఎవ్వరెన్ని విధాల ఛీత్కరించినా కైకేయి తన పట్టును విడువలేదు.

దశరధుడు కైకేయి మొండి తనాన్ని చూచి 'కాగల కార్యము కాకమానదు' ని నిశ్చయించుకొని సుమంత్రుని పిలిచి శ్రీరాముని తోడుకొని రమ్మని ఆజ్ఞాపించాడు. మహారాజు ముఖంలో దుఃఖఛాయలను గమనించిన సుమంత్రుడు కొంత సంశయించగా దశరధుడు తన ఆదేశాన్ని రెట్టించాడు. రాజాజ్ఞా నిర్వహణము సుమంత్రునికి తప్పలేదు.

– ✿ –

దశరధుడంటే దశదిశలలో అడ్డులేకుండా తన రధాన్ని పరుగెత్తించేవాడు.

'దశసు దిశాసు అప్రతిహతో రధో యస్యసః'

మనమందరము దశరధులమే – మన మనస్సే ఒక రధము దానికి అడ్డేలేదు. అది ఐదుకర్మేంద్రియములు – ఐదు జ్ఞానేంద్రియములు మొత్తము పది ఇంద్రియాల (దిశలలో) విషయాల్లో అప్రతిహతంగా పరుగెత్తుతుంది. విశ్వామిత్రాదులు రామతత్వాన్ని ఆవిష్కరించినా పుత్రవ్యామోహమే కలిగినవాడు దశరధుడు. మనము

మాత్రం ఎందరు పెద్దలు ఉపదేశించినా పరమాత్మ జ్ఞానం లేక దశరథునివలె పుత్ర, కళత్ర, వ్యామోహములో పడిపోవటంలేదా? దశరథుని భార్యలు ముగ్గురు కౌసల్య, సుమిత్ర, కైకేయి. మనకు సత్వరజస్తమస్సులని త్రిగుణాలున్నాయి కౌసల్య శ్రీరాముని కన్నది. శ్రీరాముడు జ్ఞాన స్వరూపుడే. 'సత్వాత్సంజాయతేజ్ఞానం' సత్వము జ్ఞానాన్ని కల్గిస్తుంది. అందువలన కౌసల్య అంటే సత్వగుణమే. కౌసల్య దశరథుని పెద్ద భార్య. మనకుండే మూడుగుణాలలో సత్వగుణము మొదటిది.

దశరథుని రెండవ భార్య సుమిత్ర – మన రెండవ గుణము రజస్సు. సుమిత్ర – కౌసల్య, కైకేయిల మధ్య పత్ని. రజోగుణము కొంతవరకు ఒకరెక్కను సత్వమువైపు మరో దళాన్ని తమస్సువైపు వ్యాపింపజేస్తుంది.

అయితే సుమిత్ర దశరథుని మధ్య భార్య అయినా ఆమె ఎప్పుడు అనుసరించేది కౌసల్యనే ఆమెకు కైకేయితో స్నేహమేలేదు అందువలన 'కౌసల్య' అనే 'మంచి మిత్రురాలునే అనుసరిస్తుంది' – కనుక ఆమె సుమిత్ర.

'రజః కర్మణి భారత' రజోగుణము కర్మలను చేయిస్తుంది సుమిత్ర శ్రీరంగనాధుని (నారాయణుని) అర్చించడం వంటి శుభకర్మలను ఆచరించేది. అందుకే ఆమె కొడుకులిద్దరు భగవత్, భాగవత సేవా ధర్మాలను అనుసరించారు. మనరజో గుణముకూడ జ్ఞానానుకూల శుభకర్మా చరణకు కారణం కావాలి.

కైకేయి దశరథుని మూడవ భార్య– మన మూడవ గుణము తమస్సు –

'ప్రమాదమోహౌ తమసో –భవతో2 జ్ఞానమేవచ'

కైకేయి తన పట్ల దశరథునికి వ్యామోహాన్ని కల్గించింది. శ్రీరాముని వనవాసాన్ని కోరి– ప్రమాదాన్ని కలిగించింది. (జ్ఞాన స్వరూపిణి అయిన) కౌసల్య పట్ల అనాదరాన్ని కల్గించడం ద్వారా అజ్ఞానాన్ని కలిగించింది.

మనకు కూడ తమో గుణము ప్రపంచ విషయాలపట్ల వ్యామోహాన్ని కలిగిస్తుంది. పెద్దల పట్ల ప్రమాదాన్ని కల్గిస్తుంది. –జ్ఞానము పట్ల అనాదరాన్ని విస్మృతిని (మరుపుని) కల్గిస్తుంది. అభ్యాసంలో లేనిచో ఉన్న జ్ఞానము – తొలిగి అజ్ఞానమేర్పడుతుంది.

శాస్త్రజ్ఞానమును భగవద్భాగవతాచార్య అనుగ్రహముచే లభించి కూడ ఆ జ్ఞానమును మరచి పోవడం మహాదోషము. అవిద్యాదోషము అన్ని రకాల అనర్థాలకు కారణము.

అందువలన మనము మన సాధారణ దశరధుని స్థాయి నుండి పైకి ఎదుగాలి. కౌసల్యా సుమిత్రలను (సత్వ (శుభ) రజస్సులను) అనాదరించి –కైకేయి–(తమోగుణము)వల్ల వ్యామోహాన్ని కల్గి ప్రమాదమును కొని తెచ్చుకొనే ప్రాధమిక దశరధ స్థాయినుండి పైకి ఎదుగాలి.

అలా పైకి ఎదుగడానికి 'కఠోపనిషత్' జ్ఞానాన్ని అలవర్చుకోవాలి. ఆ ఉపనిషత్తు ఏమి తెలుపుతుంది?

'ఆత్మానం రధినం విద్ధి శరీరం రధమేవతు

బుద్ధింతు సారధిం విద్ధి మనః ప్రగ్రహమేవచ'

ఇంద్రియాణి – హయాన్యాహుః విషయాస్తేషు గోచరాన్॥'.

విజ్ఞాన సారధిర్యస్తు–మనః ప్రగహ వాన్నరః

సోధ్వనః పారమాప్నోతి–తద్విష్ణోః పరమంపదం॥

మనమే (ఆత్మే) రధముపై కూర్చొన్న రధి–మన శరీరమే ఒక రధము–ఇంద్రియములే గుఱ్ఱములు–వాటిని అదుపులో ఉంచే మనస్సే పగ్గము. మనస్సును చేతిలో ఉంచుకోవలసిన బుద్ధే సారధి, ఇంద్రియ విషయాలే మార్గాలు.

ఎవ్వరి బుద్ధి (విజ్ఞానము) సారధిగా ఉంటుందో, ఎవ్వడు మనస్సునే చేతుల్లో ఉంచుకొంటాడో – ఆయన ప్రయాణ మార్గాన్ని సాంతము చూడగల్గుతాడు. ఆ మార్గము చివర లభించేది విష్ణువు యొక్క పరమపదమే.

అందువలన మనము కూడ దశరథ నృపాలుని (ప్రాథమిక) స్థాయిని అధిగమించి పరమ పదమార్గాన్ని అనుసరించాలి. కఠోపనిషత్ మార్గాన్ని అనుసరించాలి.

ఆ పరమ పదములో మనకు లభించేవాడు కూడ దశరథుడే.

దశ = పక్షి

రథము = వాహనము కలవాడు శ్రియఃపతే విష్ణువే ఆ దశరథుడు.

ఆ విష్ణువు (దశరథుడు) కూడ ముగ్గురు భార్యలు కలవాడు.1. శ్రీదేవి - 2. భూదేవి - 3. నీళాదేవి

ఈ ముగ్గురు దేవులు కూడ తమ భర్త అయిన దశరథునికి (శ్రీమన్నారాయణునికి) మూడు గుణాలు కలిగిస్తారు.

కాని ఆ మూడు గుణాలు మన త్రిగుణాలయిన సత్వ రజస్త మస్సులవంటివి కావు. అవి అన్ని కల్యాణ గుణాలే. 1. అద్వేషము - 2. సహనము - 3. స్నేహం

1. శ్రీదేవి - భగవంతునికి మనతో మనకు భగవంతునితో (ఘటకత్వమును) కలయికను కల్గిస్తుంది. - ఇద్దరి మధ్య అద్వేషాభి ముఖ్యాలను కలిగిస్తుంది. పురుషకారాన్ని చేస్తుంది.

2. భూదేవి = మన దోషములను సహించడానికి ఆయనకు దగిన క్షమాగుణాన్ని కల్గిస్తుంది.

నీళాదేవి = భగవంతునికి మనను రక్షించడానికి కావలసిన వాత్సల్యాన్ని (ప్రేమను) స్నేహాన్ని కలిగిస్తుంది.

ఈ విధంగా కౌసల్యా సుమిత్రలను నిర్లక్ష్యం చేసి, కైక వ్యామోహంలో ప్రవాదము పాలయిన దశరథుని (సత్వ, రజస్సులను నిరాదరణచేసి తమోగుణావిష్టుడై మృత్యువును (అవిద్యను) కొని తెచ్చుకొనే) స్థాయినుండి పైకి ఎదిగి మనము పరమపదమార్గాభిలాషతో - ఆ మార్గచింతనతో శ్రీభూనీళాదేవుల ద్వారా అద్వేష, క్షమా స్నేహ గుణసంపన్నుడైన (విష్ణువు) శ్రీమన్నారాయణుని శ్రీపాదములను ఆశ్రయించడమే మన కర్తవ్యమని రామాయణము దశరథుని పాత్ర ద్వారా ముఖ్య సందేహాన్ని అందిస్తోంది.

# రామ దర్శనము

కైక నిశ్చయాన్ని గమనించిన దశరథుడు ఇక శ్రీరాముని రాజ్యాభిషేచనము అసంభవమనే నిర్ణయానికి వచ్చి సుమంత్రుని పిలిచి శ్రీరాముని తోడ్కొని రమ్మని ఆదేశించాడు. సుమంత్రుడు మహారాజు ముఖంలో దుఃఖఛాయలను గమనించి కొంత వరకు సందేహించగా దశరథుడు తన ఆదేశాన్ని రెట్టించాడు. అప్పుడు తప్పని సరై సుమంత్రుడు శ్రీరాముని అంతఃపురం చేరుకున్నాడు.

శ్రీరాముని అంతఃపుర సౌధము అత్యంత సౌందర్యశోభాయమానమైనది. అందులోని ప్రతి కక్ష్య ఎంతో ఆకర్షణీయమైనది. దశరథ సార్వభౌముడు తన ప్రియ కుమారుని కొరకు జగత్తులోని అందాలన్నిటిని రాశి పోసినట్లు రమ్య హార్మ్యాన్ని నిర్మించాడు. అందులోని ప్రత్యంగుళం కూడ అద్భుతాలంకారాలతో నిండి ఉంది. సాధారణ జనులు ఆ సౌధంలోని ఏ కక్ష్యను చూచినా దాని సౌందర్యాతిశయానికి అప్రతిభులై నిశ్చలులవుతారు.

అయితే అందరి వంటివాడు కాడు సుమంత్రుడు.

ఆయన సదాలోచనా పరుడు. సు = మంచి ( భగవద్విషయకమైన) మంత్రుడు= ఆలోచనలు కలవాడు. ఆయనను ప్రకృతిలోని ఏ ఆకర్షణ కూడ బంధింపజాలదు.

మనము కూడ సుమంత్రులమైతే సదా సదాలోచనాపరులమైతే మనను కూడ ఏ భౌతిక ఆకర్షణ బంధించదు. అప్పుడప్పుడు కొందరు కొన్ని ఆలయాలను సందర్శించడానికి వెళ్తారు. ఆ ఆలయాల అందము అద్భుతంగా ఉంటుంది. ఆ ఆలయపు గోడలపై అనేక చిత్రాలు చిత్రింపబడి ఉంటాయి. అవి ఎంతో మనోహరంగా ఉంటాయి. వాటిలో ప్రకృతి రామణీయక దృశ్యాలు ఉండవచ్చు. కొన్ని గ్రామ్య ( బూతు) చిత్రాలు ఉండవచ్చు.

సాధారణ సందర్శకులయితే వాటిని చూచి తన్మయులవుతారు. ఆ దృశ్యాలే వారి మనస్సంతా నిండిపోతాయి. ఆలయము అంతర్ భాగంలో ముఖ్య దైవాన్ని కూడ చూస్తారు కాని వారి మనస్సులో భగవన్మూర్తి ముద్రపడదు. దైవ దర్శన

సమయంలో కూడ వారి మనస్సులో ప్రకృతి దృశ్యాల, గ్రామ్య చిత్రాల ప్రభావమే అధికంగా ఉంటుంది. నిజానికి అటువంటి ఆకర్షణలే ముఖ్యమనుకొంటే ఆలయాల దాకా వెళ్లాల్సిన పనిలేదు. ప్రపంచంలో ఏమూలలో చూచినా కావలసినన్ని అశ్లీల దృశ్యాలు అగుపడుతాయి.

నిజానికి ఆలయం వెళ్లేది ఈ ఆకర్షణలన్నిటికి అతీతంగా భగవన్మూర్తిని తన మనస్సులో శాశ్వతంగా ముద్రించుకోవడానికి. అప్పుడు అంత వరకు ఉవ్విళ్లూరుతున్న శ్రియఃపతి సందర్శనము పారవశ్యాన్ని కల్గిస్తుంది. అంతకు ముందు గోడలమీద చూచిన దృశ్యాలేవి గుర్తుకు రావు. ఆ సౌందర్యాధికుని సందర్శనమే సర్వస్వమై నిలిచి పోతుంది. సుమంత్రుడటువంటి స్థిర చిత్తుడు. ఆయన కర్తవ్య పాలనము దృఢమైనది. నిశ్చయమైనది. ఆ సౌధ సౌందర్యము అతనిని విస్మయపరచలేదు. వడివడిగా అడుగులు వేస్తూ అంతఃపురద్వారాన్ని, కక్ష్యలను దాటి వెళ్లాడు. వాల్మీకి ఆ సుమంత్రుడు – ద్వారాన్ని, కక్ష్యలను దాటిన విధానాన్ని హృద్యంగా వర్ణించాడు.

'సతదంతః పురద్వారం – సమతీత్య జనాకులం

ప్రవిక్తాం తతః కక్ష్యాం – ఆససాద పురాణవిత్'

సకల శాస్త్రవేత్త అయిన సుమంత్రుడు జన సందష్టమైన (అంతఃపుర ద్వారమతీత్య ) 'అంతఃపురద్వారాన్ని దాటి – కాదు' (సమతీత్య) చక్కగా దాటి' అన్నాడు వాల్మీకి మహర్షి అంటే ఆ అంతః పురద్వార సౌందర్యము సుమంత్రుని చూపుల అడ్డగించలేదు సంయమనంతో ఎక్కడ ఆగకుండా దాటాడు.

లోపలి కక్ష్యలో సుమంత్రుడు సందర్శించిన దృశ్యమెంత మనోజ్ఞమైనదో ! చూడండి.

'తంవైశ్రవణ సంకాశం! ఉపవిష్టం స్వలంకృతం

దదర్శ సూతః పర్యంకే । సౌవర్ణే సోత్తర చ్ఛదే'

ఆ మందిరంలో ఒక మంచముంది. అది బంగారు మంచము దానిపై మెత్తని పట్టు పరుపు బట్టలున్నాయి. వాటిపై సర్వాలంకార భూషితుడైన

శ్రీరామచంద్రస్వామి కూచొని ఉన్నాడు. అప్పుడాయన వైశ్రవణుని (కుబేరుని) వలె ప్రకాశిస్తున్నాడు.

కుబేరుడు (వైశ్రవణుడు) విశ్రవసు బ్రహ్మకుమారుడు. ఈశ్వరానుగ్రహముతో సకల సంపదలకు స్వామి అయ్యాడు. అటువంటి వైశ్రవణునివలె శ్రీరామచంద్రస్వామి వెలిగిపోతున్నాడు.

శ్రీరామచంద్రునికి సీతాదేవి స్వయంగా చందనాన్ని అలిమింది. సుగంధ భరితమైన ఎఱ్ఱని చందనమును ఆ శ్యామసుందరుని కుసుమ సుకుమార గాత్రానికి లేపనము చేసింది.

సీతాదేవి చందనాన్ని తన చేతితో తీసుకొని, రామునికది యోగ్యమా కాదా అని చూచి ఆ తరువాత ఆ మేఘశ్యాముని మేనుకు లేపనం చేసింది. చందనచర్చిత నీలకళేబరుని సౌందర్యము వాక్కులకందేదా? తాను స్వయంగా చామరము చేత పట్టుకొని ఆ సుకుమార గాత్రునికి నెమ్మదిగా వీస్తూ ఆ ప్రభువు ప్రక్క నిలిచి ఉంది. చిత్రానక్షత్రంతో కూడిన చంద్రునివలె రామచంద్రుడు సీతాదేవితో విరాజిల్లుతున్నాడు. ఆ స్వామి తేజస్సు ముందు ఆదిత్యుని తేజస్సు వెలవెల బోతోంది.

ఇక్కడ మరొక రహస్యముంది. పరమ పదములో శ్రియఃపతి తనకత్యంత ప్రియులైన నిత్యముక్తులకు సందర్శనాన్ని ప్రసాదిస్తూ శేషపర్యంకముపై ఆసీనుడై ఉంటాడు. ఆపర్యంకము ముప్పయి రెండడుగుల సింహాసనము పై ఉంటుంది.

ఆ పర్యంకముపై స్వామి కుడికాలును ముడుచుకొని, ఎడమకాలు క్రిందికి చాచి ఠీవిగా కూచొని ఉంటాడు 'సవ్యం పాదం ప్రసార్య – ఆశ్రిత దురిత హరం దక్షిణం కుంచయిత్వా'

పరమ పదానికి తన కృపతో వచ్చిన ముక్త పురుషుని తన ఎడమ కాలుపైకి ఎక్కించుకొని తన దగ్గరికి తీసికొంటాడా దయామయుడు.

'పాదేనాధ్యారోహతి' అంటుంది వేదము భగవంతుని శ్రీపాదము ద్వారానే భగవంతుని దగ్గరకు అధిరోహించ గల్గుతాడట ముక్త పురుషుడు.

పరమ పదములోని ఆ పరమ పురుషునికే 'వైశ్రవణుడు' ని పేరు. సర్వశబ్దములు పరమాత్మ పర్యంత వాచకములని శాస్త్రము వివరిస్తుంది. అన్ని శబ్దాలు పరమాత్మనే భోధిస్తాయని శాస్త్ర తాత్పర్యము. అంతే కాదు.

(నారాయణాది ఉపనిషత్తులు పరమాత్మను వైశ్రవణుడని సంబోధిస్తున్నాయి.

'నమో వయం వైశ్రవణాయ కుర్మహే।

సమే కామాన్ కామ కామాయ మహ్యం

కామేశ్వరో వైశ్రవణో దదాతు'

'మేము వైశ్రవణునికి నమస్కారము చేస్తున్నాము. ఆ వైశ్రవణుడు కామ కాముడనైన (కోరికలను కోరే) నాకు కోరికలనిచ్చు గాక' అంటుంది వేదము.

పరమ పదములోని శేష పర్యంకముపై ఆసీనుడైన శ్రియః పతివలె సౌవర్ణ పర్యంకముపై సీతాపతి ఆసీనుడైన దివ్య దృశ్యాన్ని మహా భాగుడైన సుమంత్రుడు కనులారా సేవించాడు – తన జన్మను పండించుకొన్న సౌభాగ్యశాలి సుమంత్రుడు.

ఇతి శం

## ఋషితుల్యుడు

సువర్ణాసనాసీనుడైన శ్రీరాముని సుమంత్రుడు సందర్శించి, వందన మాచరించి 'కౌసల్యా తనయా! మిమ్మల్ని కైకేయి అంతఃపురానికి తోడుకొని రమ్మని మహారాజు గారు నన్ను పంపారు' అని తెలిపాడు.

శ్రీరాముడా వార్త విని సీతాదేవితో 'దేవి! మా నాన్న గారు ప్రియకామిని అయిన కైకేయితో కలిసి నా పట్టాభిషేకాన్ని గురించి సంభాషించు కొంటూ, వారి ఆలోచనలకు అనుగుణుడైన సారథి సుమంత్రుని నా దగ్గరికి దూతగా పంపారు. నన్ను తప్పక యువరాజుగా నేడు అభిషేకిస్తారు. నేను వెంటనే వెళ్లి వాళ్లను సేవించాలి. నీవు నీ పరివారముతో ఇక్కడే ఉండి వారితో ఆనందించు' అని తెలిపాడు.

రాముని పలుకులతో హర్ష పరవశ అయిన సీతాదేవి 'ఆర్యపుత్రా! వేదవేత్తలయిన బ్రాహ్మణులందరు సంతోషించగా 'బ్రహ్మ ఇంద్రుని పట్టాభిషిక్తుని చేసినట్లు' మహారాజా అభిషేకము జరుపుగాక! మీకు సకల దేవతా సంరక్షణ లభించుగాక' అని మంగళములను పలుకుతూ శ్రీరామచంద్రుని అంతఃపుర మహాద్వారము వరకు అనుసరించింది.

'పతి సమ్మానితా సీతా । భర్తారమసితేక్షణా ।

ఆద్వారమనువవ్రాజ । మంగళాన్యభిదధ్నుషీ'

తనను అనుసరిస్తూ వచ్చిన అసితేక్షణ అయిన సీతా దేవిని శ్రీరాముడు సన్మానించాడట. ఇంతకు సీతకు లభించిన 'పతి సన్మాన మేమిటో' వాల్మీకి వర్ణించలేదు.

అయితే వ్యాఖ్యాతలు ఆబహుమానాన్ని వివిధములుగా వర్ణించారు.

1. భర్తను విడిచి అరక్షణమైనా భరించజాలని సీతను అంతఃపుర ద్వారం వద్దే ఆగిపొమ్మని సీతాదేవి చరణాలను గ్రహించి శ్రీరాముడు ప్రార్థించాడట.

భర్త భార్య పాదాలను పట్టుకోవచ్చా? అని ప్రశ్న కలుగుతుంది సాధారణంగా!

వివాహంలో 'సన్నికల్లు త్రొక్కించేప్పుడు మట్టెలను పెట్టేప్పుడు' భార్య పాదగ్రహణం భర్తకు తప్పుకాదు. విహితమే అంతేకాదు ఆలుమగల మధ్య అనురాగము ఏర్పడినప్పుడు విధి నిషేదాల ప్రసక్తి ఏకాంతంలో తల ఎత్తదు కదా'

2. మరొక వ్యాఖ్య :– సీతాదేవిని అంతఃపుర ద్వారము దగ్గరే ఆగిపొమ్మని అడుగుతూ – తన కంఠహారాన్ని భార్యకు శ్రీరామచంద్రుడు బహూకరించాడట.

సీతాదేవి – శ్రీరాముని బోసిమెడను తన నల్లని చూపులతో చూచింది. అప్పుడాయన కంఠము నల్ల కలువ పూలతో అలంకరింపబడినట్లు అగుపించింది.

శ్రీరాముడు సుమంత్రుని వెంట కైకేయి అంతఃపురానికి చేరుకొన్నాడు. మార్గమధ్యలో ఆ మోహన మూర్తిని ప్రజలందరు జేజేలతో అభినందించారు.

కైకేయి భవనంలో ఆసనాసీనుడైన తన తండ్రికి కైకేయి దేవికి శ్రీరాముడు పాదాభివందనము చేశాడు.

దించిన తల ఎత్తకుండానే దశరథుడు దుఃఖావేశముతో 'హా రామా!' అని అనంతరము నోట మాట రాక ఊరుకున్నాడు. తండ్రి దీన వదనాన్ని చూచి రాముడి మనస్సు తల్లడిల్లింది. ఏమిటిది? ఈ రోజు మా నాన్నగారు నన్ను ఆప్యాయతతో తమ దగ్గరకు తీసికోవడం లేదు? ఎంత కోపంలో ఉన్నా నన్ను చూచిన తక్షణమే నవ్వుతూ పల్కరించే మా నాన్నగారు నాతో మాట్లాడడమే లేదు 'అని చింతాక్రాంతుడై శ్రీరాముడు కైకేయి వైపు మరలి 'అమ్మా! పుత్రవాత్సల్య భరితులైన మా నాన్నగారు మౌనంగా ఎందుకున్నారు? నా వలన ఏదైనా తప్పు జరిగిందా? వారు కోపంతో ఉన్నారా? లేక శారీరకంగానో, మానసికంగానో వారికి బాధ ఏర్పడిందా? మాతుల గృహానికి వెళ్లిన మా సోదరులు భరత శత్రుఘ్నులకు ఏమైనా ప్రమాదం కలిగిందా? మా తల్లులకేదైనా మహోపద్రవం ఏర్పడిందా? అమ్మా! పరిహాసం కొరకు నీవేదైనా అనరాని మాట అని వారిని అవమానించావా? ఎందుకమ్మా! ఈ వేళ మహారాజు గారు మౌనంతో విచారంగా ఉన్నారు?' అని పరివరి విధాల ప్రశ్నించాడు.

అందుకు అణు మాత్రమైనా సంకోచంలేని కైక 'రామా! మహారాజు శరీరానికి కాని మనస్సుకు కాని ఏ వ్యాధి బాధలు లేవు. ప్రియ పుత్రుడివైన నీతో ఒక అప్రియము ఎలా పలుకాలో తోచక బాధపడుతున్నారు. నాకు పూర్వము దేవదానవ (శంబరాసుర) సంగ్రామంలో రెండు వరాలనిస్తానని మాట ఇచ్చి) ఆ ప్రతిజ్ఞను మీ తండ్రి గారు మన్నించడం లేదు 'లోకాలన్ని సత్య ధర్మాలపైననే శాశ్వత ప్రతిష్ఠను పొందుతాయి కదా! మహారాజు గారి మాటనీకిష్టమైనా – కాకున్నా నీవు తప్పక నిలపెట్టు తానంటే నేను తెలుపుతాను' అని అడిగింది.

శ్రీరాముడు కైకతో 'అమ్మా! ఎంత మాట! రాజాజ్ఞ అయితే నేను అగ్నిలో సైతము అడుగిడుతాను విషాన్ని సైతము భక్షిస్తాను. సముద్రంలో సైతము మునుగుతాను' నాకు మహారాజు రాజు, తండ్రి, గురువు, దేవము, ప్రియకరుడు,

హితకరుడు కూడ. రాముడెన్నడు రెండు మాటలు పలుకడమ్మా ! నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను' అని తన స్థిరాభిప్రాయాన్ని తెలిపాడు.

ఆమె దశరథుడు తనకిచ్చిన రెండు వరాలను, తాను కోరిన రెండు కోరికలను వివరించి – ఒకవేళ నీవు నీ తండ్రిని అసత్య దోషాన్నుండి తరింపజేయాలనుకొంటే – ఈ రాజ్యాన్ని భరతునికిచ్చి నీవు పదునాల్గేండ్లు అడవులకు వెళ్లు' మని అడిగింది.

కైకేయి భయంకర భాషణము విని కూడ శ్రీరాముడు ఇసుమంత అయినా చలింపలేదు 'అమ్మా ! మీకు, మా నాన్నగారికి ఇష్టమైతే నేను వెంటనే అడవులకు వెళ్తాను. నాకు నిజంగా రాజ్య సంపదలంటే ఏమాత్రము ఆకర్షణలేదు. నేను కోరికలనన్నిటిని సన్యసించినవాడను. నేను ఋషివంటి వాడనని తెలుసుకో.

'విద్ధి మాం ఋషిభిస్తుల్యం'

నీవు వెంటనే మా తమ్ముడిని పిలుచుక రావడానికి శీఘ్రంగా దూతలను పంపు. భరతుడే నాకు బదులు రాజగు గాక ' అని తన నిర్ణయాన్ని తెలిపాడు. తనపట్టు ఫలించినందుకు సంతసించిన కైక 'రామా ! నీవు వెంటనే బయలుదేరు' మని త్వరపెట్టింది. అలాగే మా తల్లికి, సీతకు నచ్చచెప్పి వెంటనే బయలుదేరుతానని చెప్పి అభిషేక భాండానికి ప్రదక్షిణం చేసి, తండ్రికి పిన తల్లికి పాదాభివందనము చేసి బయలు దేరాడు.

కైకేయి – శ్రీరామభద్రుల సంభాషణ అంతా విన్న లక్ష్మణుడు ఆగ్రహంతో బుసలు కొడుతూ అన్నను అనుసరించాడు.

రాజ్యాన్ని కోల్పోయి, అడవులకు వెళ్తున్న రాముని ముఖంలో అవగింజంత అయినా వికార ఛాయ కనపడలేదు. 'నవనంగంతుకామస్య–త్య జతశ్చ వసుంధరాం। సర్వలోకాతి గస్యేవ –లక్ష్యతే చిత్త విక్రియా'

అక్కడి జనులెవ్వరు ఆయన ముఖంలో ఎలాంటి మార్పును గమనించలేదు 'నా లక్షయత రామస్య –కించిదాకారమాననే'

రాజ లక్షణాలయిన తెల్లని గొడుగును, వింజామరలను అక్కడే నిలిపివేసి పాదచారి అయి తన తల్లి అంతఃపురానికి వెళ్లాడు. తల్లి మందిరంలో అందరు తనను

రాజు కాబోతున్నాడని అనుకొని సంతోషంతో స్వాగతం చెప్పడానికి నిలుచొని ఉన్నారు.

సాధారణంగా ఎవ్వరైనా తమ మనస్సును ఎంత నిగ్రహించుకొన్నా తమ ఆత్మీయుల ముందు తమ మనో నిగ్రహము దూదిపింజవలె ఎగిరిపోయి కట్టలు తెంచుకొని దుఃఖము ముంచుకొస్తుంది.

కాని తన వారి ముందు నడుస్తున్నా శ్రీరాముని వదనంలో ఎటువంటి వికారపు గుర్తులు అగుపడలేదు. మనస్సు అల్లకల్లోలం కాలేదు.

'నచైవ రామోఽ త్ర జగామ విక్రియాం'

అహో ! ఎంతటి తపోనిష్ఠాగరిష్ఠులకు మాత్రము ఇంతటి స్థిర చిత్తము సాధ్యమవుతుంది? ఎంతటి సంయమీంద్రులకు మాత్రము ఇంతటి మనస్సంయమనము వీలవుతుంది? సర్వలోకాతిగుడైన సర్వేశ్వరునికి శ్రీరామునికి మాత్రమే ఇంతటి 'స్థిత ప్రజ్ఞ' సాధ్యము. ఓహో శ్రీరాముడెంతటి ఋషికల్పుడో కదా!

## : సత్యవాక్య పాలనము :

దశరథ మహారాజు సత్యవాక్యాన్ని పాలించాడని, ఆయనను సత్య వచనుని కావించి శ్రీరాముడు స్వయంగా పితృ వాక్యపాలకుడయ్యాడని శ్రీరామాయణము వివరిస్తుంది.

అయితే నిజంగా దశరథుడు సత్యవాక్యుడయ్యాడా? ఆయన సత్యాన్ని ఎలా పాలించాడు? అనేవి పెద్ద ప్రశ్నలు.

దశరథ మహారాజు అన్న ముఖ్యమైన మాటలేవో ముందుగా పరిశీలిద్దాము.

ఒక పర్యాయము దశరథుడు దేవతల ప్రార్థనపై వారికి సహాయంగా శంబరాసురునితో సంగ్రామానికి వెళ్లాడు. దండకను పాలించే తిమిధ్వజునికే

శంబరామరుడని మరో పేరు. ఆయన మహామాయావి. ఆయనను ఎదిరించడం దేవతలకు కూడ సాధ్యము కాలేదు. అందవలన వారు దశరథుని సహాయము అపేక్షించారు.

శంబరాసురునితో ఘోర సంగ్రామం జరుగుతోంది. పగలు యుద్ధంలో మరణించిన వీరులను రాత్రి అసురులు భక్షింస్తుండేవారు. అందువలన మృతుల కళేబరాలు కూడ లభించేవి కావు.

శంబరునికి – దశరథ మహారాజుపై అమితమైన ఆగ్రహముకలిగింది. తన శత్రువులైన దేవతలకు సహాయంగా వచ్చిన దశరథుని సర్వ సైన్యాలతో చుట్టుముట్టాడు. ఎంత వీరుడైనా దశరథుడు రాక్షసుల ఆయుధాల వర్షానికి తట్టుకోలేక పోయాడు. రథముపై మూర్ఛిల్లిన తన భర్తను కైకేయి శత్రువులబారినుండి కాపాడింది. ఆమె చాతుర్యానికి – రక్షణకు సంతసించిన శంబరాంతకుడైన దశరథుడు ఆమెకు రెండు వరాలనొసగాడు. అయినప్పటికి అప్పుడు చక్రవర్తి ప్రియపత్ని అయిన కైకేయికి కావలసింది ఏమిలేక పోవడంతో తరువాత కోరుకోవచ్చులే అని ఊరకుంది. మంథర దుర్బోధ ద్వారా ఆవేశము కలిగి శ్రీ రామ వనవాసాన్ని – భరతాభిషేకాన్ని రెండు వరాలుగా కోరుకోంది. ఆ వరాలను ఇవ్వకుంటే అసత్యవాక్యుడవుతావని ఆమె భర్తను బెదిరించింది.

అయితే అంతకువుందే ఆ రోజు ఉదయాన్నే రాజ సభను పిలిచి ప్రజాభిప్రాయముతో సభలో రాముడు రాజవుతాడని ప్రకటించాడే – అది ముందు మాట – సభలో ఇచ్చిన మాట.

కైకేయి వరాలను కోరింది సభాప్రకటన తరువాత.

కైకేయికి ఇచ్చిన వరాలకు కట్టుబడి దశరథుడు సభాప్రకటనను గౌరవించకపోవడం సత్య వాక్య పాలన మవుతుందా?

కైకేయికి వరాలను ఇచ్చింది ఎంతో పూర్వము శంబరసంగ్రామంలో కదా! ఆ వరాలే ముందని, సభాప్రకటన తరువాతది కనుక ఆమె వరాలనివ్వడమే సత్య పాలన మవుతుంది అనవచ్చునా?

శంబర సంగ్రామంలో వరాలనిస్తానన్నాడే కాని ఆ నాడే కైకేయి రామ వనవాసాన్ని, భరతాభిషేకాన్ని కోరుకొందా ?

కాదు, మరి కైకేయి వ్యామోహంతో రాజ సభా ప్రకటనమనే సత్యమును ఉల్లంఘించాడు కదా. అప్పుడు వాల్మీకి ఏమని వర్ణించాలి.

'సోऽ సత్యవచనా ద్రాజా। మోహపాశేన సంయతః

వివాసయామాస సుతం । రామం దశరధః ప్రియం'

మోహపాశబద్ధుడై దశరథ మహారాజా అసత్య వచనముతో తన ప్రియసుతుడైన రాముని అడవులకు పంపాడు' అని వివరించాలి. కాని వాల్మీకి మహర్షి ఏమన్నాడు

'ససత్యవచనా ద్రాజా । ధర్మ పాశేన సంయతః'

వివాసయామాస సుతం'

ధర్మపాశ బద్ధుడై సత్య వాక్యమువలన రాజా తన సుతుని అడవులకు పంపాడు.

అప్పుడు కైకేయికి వరాల నివ్వడం సత్యపాలనమని, రాజ్య సభా ప్రకటనను అమలు చేయడం అసత్య పాలనమని అర్థము కాదా ? అవును.

రాజ సభా ప్రకటనము అసత్యమా? వంచనతో కూడినదా ? అవును. ఎందుచేత ? కైకేయి వరాలకు విరుద్ధమనా ? కాదు. మరెందుచేత ? దశరథ మహారాజా అశ్వపతి భూపతికి కైకేయి వివాహకాలంలో చేసిన వాగ్దానానికి విరుద్ధంగా రాజ సభను మోసంతో పిలిపించి ప్రజాభిప్రాయము పేరుతో రాముని రాజా చేస్తున్నానని ప్రకటించడం వంచనతో కూడినది.

ఒకవేళ రాజ సభా ప్రకటనము వంచనతో కూడినదే కాకపోతే 'భరతుడు మేనమామ ఇంటినుండి తిరిగి రాకముందే నీవు రాజా కావాలి' అని రామునితో దశరధుడెందుకనాలి ? రాజసభకు అశ్వపతిని ఎందుకు పిలువలేదు ? పోనీ తన వియ్యంకుడైన జనక మహారాజానెందుకు పిలువలేదు ?

జనకుడు ధర్మపక్షపాతి కనుక ఒకవేళ అశ్వపతికిచ్చిన మాట ఆయనకు ఎలాగైనా తెలిస్తే రామ రాజ్యాభిషేకాన్ని అంగీకరించడు.

అశ్వపతి – దశరథుని మామగారే – అయినా తన మనుమడికి రాజ్యమిస్తానన్న దశరథుని వాక్యాన్ని సభ ముందు తెలుపుతాడు. అశ్వపతి జనకులు రాకున్నా. భరతుడు ఉండగా రాజ సభా ప్రకటన చేస్తే ఆయన తన తాతగారికి తెలుపవచ్చు).

ఇవన్ని దశరథుని ఊహలు. అవి సదూహాలో, దురూహాలో – ఏవయినా శ్రీరామునిపై పుత్ర వ్యామోహంతో వారెవ్వరు లేకుండా చూచి హడావిడిగా రాజసభను పిలిచి తొందర తొందరగా రాముడు రాజౌవుతాడని సభా సదుల ముందు ప్రకటించాడు.

తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది. మంథర దుర్బోధ చేసింది. ఎంతగానో రాముని ప్రేమించే కైకేయి మనస్సు మారింది. శంబర సమరంలో దశరథుడిచ్చిన రెండు వరాల ఫలితాలను రామవనవాసము – భరతాభిషేచనాన్ని కోరింది ఆమె.

తప్పని సరిఅయి – దశరథుడు కైకేయి వర బద్ధుడయ్యాడు. కైకేయి వరాలను అనుసరించి రాముని అడవులకు పంపాడు. నిజానికి కైకేయిపై వ్యామోహంకంటే దశరథునికి రాముని పైననే ప్రేమ అధికము. అందువలననే రామునిపై ఒట్టుపెట్టుకొని కైకేయి వరాలనిస్తానని శపథము చేశాడు.

అందువలన ఆయన అనుకొంటే కైకేయి వరాలను శ్రీరాముని రాజ్యాభిషేకం కొరకు నిరాకరించేవాడు. కైకేయి వ్యామోహము ఆయనకు అడ్డురాలేదు. కాని కైకేయి వరాలను నిరాకరిస్తే ఆ విషయం అశ్వపతికి తెలిస్తే ఆయన తన వాగ్దానాన్ని అందరికి తెలిపితే – తాను అధర్మ పరుడననే శాశ్వత ముద్ర లోకంలో తనపై పడుతుందనే భయముతో వీలులేక కైకేయి వరాలను ఆమోదించాడు.

కనుక రామ వివాసనము (అడవులకు పంపుట) ప్రత్యక్షంగా కైకేయి వరమూల మనిపించినా – నిజానికి దానికి కారణము అశ్వపతికిచ్చిన మాటకు కట్టుబడడమే.

అందువలన అశ్వపతికిచ్చిన వాగ్దానాన్ని మనస్సులో పెట్టుకొని కైకేయి వరాలను ఆమోదించి రాముని అడవులకు పంపాడు. కనుక దశరధుడు చేసింది సత్యవాక్య పాలనమే.

అందుకే వాల్మీకి మహర్షి :– దశరధుని గూర్చి 'ససత్య వచనా ద్రాజా – ధర్మ పాశేన సంయతః

వివాసయహావమాస సుతం' – ధర్మానికి కట్టుబడి –సత్యవాక్యాన్ని పాలించడానికి – దశరధుడు రాముని వనాలకు పంపాడని వివరించాడు – ముఖ్యంగా కైకేయి రెండవ వరమైన భరతాభిషేకానికి అయిష్టముతో నైనా అంగీకరించి, అశ్వపతికి ఇచ్చిన మాటను దశరధుడు పరోక్షంగా నైనా నిలబెట్టుకొని సత్యవాక్యుడయ్యాడు.

## : ధర్మాధర్మాలు :

కైకేయి భవనమునుండి బయలు వెడలిన శ్రీ రామభద్రుడు తన తల్లి కౌసల్యాదేవి అంతఃపురంలో అడుగుపెట్టాడు. అక్కడ అనవరతము వ్రతదీక్షతో ఉండే తల్లిని దర్శించాడు.

ఆ అమాయకురాలు ఇంకా తన తనయుడు రాజ్యాధికారి కాబోతున్నాడనే ఆనందంతో శ్రీరామునికి శుభాశీస్సులనందించింది.

గంభీర మనస్కుడైన శ్రీరాముడు తన వనవాసాన్ని గురించి తన తల్లికి తెలిపాడు. ఆమె మొదలు నరికిన వృక్షమువలె నేలపై పడిపోయి – తీవ్ర దుఃఖంతో

'ఏక ఏవహి వంధ్యాయాః– శోకో భవతి మానసః

అప్రజాస్మీతి సంతాపః – సహ్యన్యః పుత్ర ! విద్యతే,

కొడుకా! గొడ్రాలుకు –పిల్లలు లేరనే ఒకే దుఃఖమే ఉంటుంది. కాని వేరే దుఃఖము ఉండదు.

కాని నాకో నీ వంటి లోకోత్తరపుత్రుడున్నప్పటికి అనేక దుఃఖాలు తప్పడంలేదు.

మా వివాహమైన ఏ కొద్దికాలమో తప్ప నాకు భర్త ప్రేమ మిగులనే లేదు. సవతుల నిర్లక్ష్యము మరింత సంతాపకరమైంది. జీవచ్ఛవమైన నా జీవితాన్ని తిరిగి నీవు ప్రేమతో ఆర్ద్రం చేసి ఆశా పల్లవితం చేశావు. అటువంటిది ఇప్పుడు నా జీవిత తరువు మళ్లీ మోడువారిపోతున్నది. దేనిని చూచుకొని నేను జీవించాలి ? అని కన్నీరు మున్నీరుగా విలపించ సాగింది కౌసల్యాదేవి.

కైకేయి మాటలతో కలిగిన లక్ష్మణుని దుఃఖావేశాలు, కౌసల్యాదేవి దైన్యాన్ని చూచి కట్టలు తెంచుకొన్నాయి. ఆయన కౌసల్యాదేవి వైపు తిరిగి.

'అమ్మా! రామవనవాసము నాకు కూడ నచ్చలేదు. 'మృదుర్హి పరిభూయతే' అన్నట్లు మనవంటి మెత్తని వాళ్లకు అవమానాలు, బాధలు అవశ్యం కలుగుతుంటాయమ్మా! ఇప్పుడు మా తండ్రి గారు చేసిన దుష్కార్యానికి ఆయనను మనము ఆదరించ వలసిన అవసరం లేదు.

'గురోరప్య వలిప్తస్య – కార్యాకార్యమజానతః

ఉత్పథం ప్రతి పన్నస్య – కార్యం భవతి శాసనం'

గర్వంతో కళ్లు గానక – కార్యాకార్యములను గమనించక విఱ్ఱవీగినపుడు – గురువు గారినైనా శిక్షింపవలసిందే నని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి.

మహారాజు అంటే నాకెంత మాత్రము పితృ గౌరవము లేదు – నా పరాక్రమంతో సమస్తలోకాలెదురు వచ్చినా నిగ్రహించి శ్రీరామునికి పట్టాభిషేకం చేస్తాను. నా విక్రమాగ్నితో దుఃఖ తమస్సును తొలిగింప జేస్తాను. ఎట్టి పరిస్థితిలోనైనా నేను రామునికి నీడవలె తోడు ఉంటాను.' అని ప్రతిజ్ఞ చేశాడు.

కౌసల్యకు లక్ష్మణుని మాటలు ఓదార్పును కలిగించాయి. ఆ తల్లి తన కుమారునితో 'రామా! లక్ష్మణుని మాటలు నాకు కూడ ఇష్టమే.

'మాతృదేవోభవ' అని మొదటి వేదవాక్యము కదా! పూర్వము కశ్యపుని పుత్రుడు కేవలము తల్లి సేవ ద్వారా స్వర్గానికి వెళ్లాడు.

తల్లిని నిర్లక్ష్యం చేయడం బ్రహ్మహత్యా పాతకంతో సమానమైంది. అంతే

కాదు నన్ను నీవు విడిచి వెళ్తే నేను ప్రాయోపవేశం చేసి మరణిస్తాను' అని కౌసల్య ఏడువసాగింది.

''రామో విగ్రహవాన్ ధర్మః'' – రాముడు ధర్మమూర్తి కదా. ఆయన ధర్మ మార్గాన్నుండి ఒక అంగుళమైనా ప్రక్కకు జరుగదలచుకోలేదు. ఆయన తన తల్లితో, 'అమ్మా! పితృవాక్యపాలనమును మించిన ధర్మమేలేదు. తల్లిదండ్రుల ఆజ్ఞల మధ్య తేడావస్తే – తండ్రి ఆజ్ఞనే తల్లికి అయిష్టమయినా పాటించాలని శాస్త్రాలు నిర్ణయిస్తున్నాయి. తన తండ్రి క్రూరుడై తన తల్లిని హింసించినప్పుడు ఆమెకు ఏ దిక్కు లేనప్పుడు మాత్రము మాతృ రక్షణము ధర్మ బద్ధమే' పూర్వము పరశురాముడు తన తండ్రి అయిన జమదగ్ని ఆజ్ఞతో తల్లి అయిన రేణుకను గండ్ర గొడ్డలితో నరికాడు. 2) సగర చక్రవర్తి కుమారులు తండ్రి మాట కొరకు భూమినంతా గుంటగా త్రవ్వుటలో అనేక అమాయక ప్రాణి హింస చేశారు. 3) కండు మహర్షి పిత్రాజ్ఞతో గోవధ గావించాడు.' అని లక్ష్మణుని వైపు తిరిగి, 'తమ్ముడా! నీకు నేను అత్యంత ప్రియుడనని నాకు తెలుసు. కాని మనము మాల్లాడేప్పుడు ఇంద్రియ నిగ్రహము కోల్పోయి అధర్మమును ఆశ్రయింపకూడదు. తండ్రి మాటను మన్నించడమే ఉత్తమ ధర్మము మన తండ్రి స్వయముగా నన్ను అడవులకు వెళ్ళుమని ఆజ్ఞాపింపలేదు కనుక అడవులకు వెళ్ళాల్సిన అవసరం లేదనడం కూడా న్యాయము కాదు. మన తండ్రి సమక్షములోనే కదా కైకేయి అడవులకు వెళ్లుమని ఆదేశించింది. ఆమె మాటలు ఆయన అభిప్రాయములే' అని నేను నమ్ముతాను. మా తండ్రి గారి బలహీన స్థితిని ఆసరా చేసికొని –ఏదో ఒక సాకును కల్పించుకొని – నేను అధర్మాన్ని ఆశ్రయింపజాలను.

అంతేకాదు పురుషార్థాలన్నిటిలో ధర్మము క్రమంలో ప్రాధాన్యంలో కూడ మొదటిది. పెద్దన్నను చిన్న తమ్ములు అనుసరించడం ఎలా ముఖ్యమో అలాగే ధర్మానికి అనుకూలంగా అర్థకామ మోక్షాలు వర్తించాలి. అప్పుడు అర్థకామానుభవం కూడ ధర్మ ఫలాన్నే ఇస్తుంది.

ధర్మాచరణము ధర్మ పత్ని అనుభవము వంటిది. తనకు విధేయురాలై కావలసిన కామ సుఖాలను అందిస్తూ, తనకు తోడు నీడగా ఉంటూ, సమర్థురాలైన

పుత్రులకు జన్మనిచ్చే తన అర్ధాంగితో జీవితాన్ని పంచుకోవడం అవశ్యాచరణీయము కదా.

'ధర్మార్థ కామాఖలు తాత లోకే

సమీక్షితా ధర్మ ఫలో దయే షు

ధర్మోయతస్స్యాత్ తదుపక్రమేత'.

'భార్యేవ వశ్యా అభిమతా సుపుత్రా!'

ధర్మాన్ని విడిచి కేవలము అర్థాన్ని ఆర్జిస్తే లోకుల ద్వేషానికి గురి కావలసి వస్తుంది.

'ద్వేష్యో భవత్యర్థ పరో హిలోకే'

ధర్మాన్ని విడిచి కామాన్నే అనుభవిస్తే లోకుల ఛీత్కారానికి పాత్రము కావలసి వస్తుంది.

'కామాత్మతా ఖల్వపి నప్రశస్తా'

దశరథుడు మనకు ఒక తండ్రే కాదు. గురువు, మహారాజు కూడ' అని స్థిరంగా పలికాడు.

తిరిగి తన తల్లివైపు తిరిగి, 'అమ్మా! భర్త మరణించిన తరువాత భార్య పుత్రునాశ్రయించవచ్చును. కాని భర్త జీవించి ఉండగా, ఆయన వృద్ధుడనో, అసమర్థుడనో అప్రియుడనో అని ఆయనను వదిలి వెళ్లడం ధర్మము కాదు – అత్యల్పమైన జీవితాన్ని అధర్మమయం చేయడం తగదు. నీవు నా తండ్రిని ఆయన దుస్థితికి వదిలి నావెంట రావడానికి కూడ నేను సమ్మతింపను' అని నిష్కర్షగా పలికాడు.

శ్రీ రామభద్రుడు మళ్లీ లక్ష్మణుని వైపు తిరిగి 'సోదరా! నా వనప్రస్థానానికి కైకేయీ దశరథులు కారణం కానే కాదు. దైవమే ముఖ్య కారణము. లేకపోతే నన్ను భరతుని కంటే మిన్నగా ప్రేమించే కైకేయీ మాత అలాంటి అప్రియాదేశాన్ని ఇస్తుందా? నన్ను విడిచి క్షణం కూడ ఉండజాలని నా తండ్రి అందుకు

అంగీకరిస్తాడా? – లక్ష్మణా! నా కన్నతల్లి అయిన కౌసల్యా దేవినెంత ప్రేమిస్తానో, ఆదరిస్తానో అంతటి ప్రేమాదరాలు మిగిలిన తల్లులయిన కైకేయీ సుమిత్రలకిస్తాను.

'సుఖః దుఃఖే భయ క్రోధౌ । లాభాలాభౌ భవాభవౌ

యచ్చకించిత్తథా భూతం। నను దైవస్య కర్మతత్'.

ఈలోకంలో సుఖఃదుఃఖాలు, భయ క్రోధాలు, లాభా లాభాలు, జనన మరణాలు, జరిగే ప్రతి సంఘటన – దైవము వలననే జరుగుతుంది.' అని అదృష్టాన్ని బట్టే అన్ని ఫలితాలు కలుగుతాయని వివరించాడు.

రామభద్రుని ఈ మాటలు లక్ష్మణునికి రుచింపలేదు. ధర్మాధర్మాల గురించి ధర్మమూర్తి అయిన రాముడు ప్రవచిస్తుంటే లక్ష్మణునికి నోటి మాట రాలేదు. కాని 'దైవమే అన్నిటికి ముఖ్య కారణ'మని అన్నగారు అనడం ఆయనకు అంగీకారము కాలేదు. అదృష్టాన్ని కేవలము అసమర్థులు మాత్రమే అన్నిటి కంటే ముఖ్య కారణమని అనుకొంటారు. కాని పరాక్రమ వంతులు తమ పౌరుషంతో దైవాన్ని కూడ తిరస్కరించగలుగుతారు.

'విక్లబో వీర్యహీనో యః సదైవ మనువర్తతే।

వీరః సంభావి తాత్మాయో నదైవ మనువర్తతే'

'దైవం పురుష కారేణ – యస్స మర్థః ప్రబాధితుం

న దైవేన విపన్నార్థః – పురుషస్సోవసీదతి'

ఎవ్వరైతే తమ సామర్థ్యముతో దైవాన్ని ఎదుర్కొంటారో అటువంటి వారి విషయములో అంతటి అదృష్టము కూడ అసమర్థమే అవుతుంది. మదించిన మహాగజాన్ని సైతము మావటి తన అంకుశంతో మళ్లింపగల్గుతాడు కదా!

అన్నా! నా బాహువులు అందము కొరకే లేవు. నా ధనుస్సు అలంకారము కొరకు కాదు నాకత్తి ఊరకే మొలకు కట్టుకోవడానికి కాదు. నా బాణాలు నిశ్చేతనంగా స్తబ్ధంగా ఉండడానికి కాదు.

నేను ఆయుధం ధరిస్తే ఆజిలో అరి భయంకరంగా నిలిస్తే – నన్ను అడ్డగించే

మగవాడున్నాడా? –నేను నీ అజ్ఞాబద్ధుడను, విధేయుడను, శత్రు సంహారము కొరకు నీ ఆజ్ఞ కొరకు మాత్రమే వేచి ఉన్నాను.

కామంతో కళ్లు మూసుకొని ఆడదాని ఆజ్ఞకు అవశుడై అధర్మాన్ని అవలంబించిన మహారాజు అంటే నాకు లక్ష్యము లేదు. ఆయన తండ్రి అన్న తలపే అవసరము లేదు.

'అహంతావన్మహా రాజే–పితృత్వం నోపలక్షయే '

నాకు నీవే తండ్రి దైవము గురువు అన్ని కూడ ' అనితన అభిప్రాయాన్ని ఖచ్చితంగా తెలిపాడు.

శ్రీరాముడు సౌమిత్రితో 'సోదరా! అదృష్టాన్ని దైవాన్ని అంత అసమర్థం అనుకొంటున్నావా? దైవమంటే నీ ఎదుట నిలిచే ఒక సామాన్య వ్యక్తి అనుకొంటున్నావా? కాదు.

'అసంకల్పితమే వేహ –యదకస్మాత్ ప్రవర్తతే

నివర్త్యారంభ మారబ్ధం – నను దైవస్య కర్మతత్ '

మనము ఎంతో పట్టుదలతో తలపెట్టి పరాక్రమంతో సాగిస్తున్న పనిని ఒకేసారి పూర్తిగా ఆపేది అదృష్టము. హఠాత్తుగా మన ఆలోచనల కతీతంగా ఒక ఫలితాన్ని కలిగించేది దైవము. సృష్టిలో సర్వము దైవాధీనమే' అని దైవ స్వరూపాన్ని ఆవిష్కరింపజేశాడు రామభద్రుడు.

అంతేకాదు లక్ష్మణా! నాకు రాజ్యమైనా –అరణ్యమైనా ఒక్కటే – అంతేకాదు నాకు వనవాసమే భాగ్య ప్రదము.

'వనవాసో మహోదయః'

అని తన నిశ్చయాన్ని తెలిపాడు.

అనంతరము మళ్లీ కౌసల్యాదేవి వైపు తిరిగి 'అమ్మా! భార్యకు పతియే దైవము. సురార్చన చేయని సుదతి కూడ భర్తృశుశ్రూషవలన స్వర్గాన్ని చేరుకొంటుంది.

భర్తను భార్య పరిత్యజించాలని మనస్సులో అనుకొన్నా అది మహాపాపమే' అవుతుంది' అని స్థిరంగా పలికాడు.

ఇక ఆ తల్లికి తన తనయుడు తన మాట వింటాడనే ఆశ అడుగంటింది. ఆ దేవి ఆ స్థితప్రజ్ఞునికి 'అభ్యుదయం కలుగాలని' ఆశీర్వదించి పంపింది. అర్చనాక్షతలను చందనముతో అనులేపనం చేసి అతని శిరస్సుపై వేసింది. 'విశల్య కరణి' అనే ఓషధిని అభిమంత్రించి – రక్షా కంకణాన్ని అతని హస్తానికి కట్టింది. అమె శ్రీరాముని చుట్టు తిరిగి అతడిని హృదయానికి హత్తుకొంది.

రామభద్రుడు కూడ తన తల్లికి ప్రదక్షిణం చేసి ఆమెకు పాదాభివందనం చేసి – సీతా దేవి భవనానికి చేరుకొన్నాడు.

– ❁ –

శ్రీ రామాయణము విశ్వశ్రేయస్సును కలిగించే కావ్యము. అది అడుగడుగునా మనకు తన సందేశాన్ని అందిస్తుంది.

కౌసల్యా, రామలక్ష్మణుల సంభాషణము ప్రపంచానికే ఆదర్శమైంది. కౌసల్య ద్వారా మాతృహృదయాన్ని అవిష్కరింపజేయడమే కాక, వాల్మీకి మాతా పితరుల అజ్ఞా పాలనంలో తారతమ్యాలను రాముని ద్వారా దర్శింపజేశాడు. లక్ష్మణుని ద్వారా మానుష శక్తి ప్రాబల్యాన్ని ప్రదర్శింపజేసి – అంతకంటే ముఖ్యమైన దైవ శక్తి ప్రాధాన్యాన్ని మనకు స్థిత ప్రజ్ఞుడైన శ్రీరాముని ద్వారా ప్రబోధించాడు. సుమిత్రా సుతునికి ధర్మసూక్ష్మము తెలియదని కాదు. కాని సామాన్య ధర్మమైన మాతా పితృభక్తి కంటే జన్మ జన్మలకు తండ్రి అయిన జగన్నాధుని ఆశ్రయణమే జన్మ సాఫల్య కరమని సౌమిత్రి నిరూపించాడు. అదే విశేషధర్మాచరణమని అందరికి అదర్శాన్ని నెలకొల్పాడు.

అయితే లోకములో అందరికి సామాన్య విశేష ధర్మాల ఆంతర్యము అవగతము కాదు. అంతే కాదు ఆ రెండు ధర్మాల మధ్య సంఘర్షణ కలిగి సామాన్య ధర్మాన్ని ఆచరింపని నాడు సాధారణ జనుల మనస్సులలో ధర్మ సమ్మోహము కలిగి ధర్మంపట్ల ఆదరము తగ్గిపోతుంది. విశేష ధర్మమని విపరీతంగా వ్యాఖ్యానించి

ఏదో ఒక చిన్న కారణాన్ని చూపెట్టి – ధర్మాచరణ నుండి తప్పుకొంటారు మూఢులైన జనులు.

అందువలన అందరికి అవసరమై అందుబాటులో ఉండే సామాన్య ధర్మాన్ని సంస్థాపించడమే – ధర్మ స్వరూపుడైన పరమాత్మ ప్రయత్నము. అవతార మూర్తి అయిన శ్రీరామచంద్రమూర్తి కూడ అందరికి ఆదర్శంగా సామాన్య ధర్మాన్ని స్థాపించాడు. కౌసల్య లక్ష్మణుల మాటలు కథాభాగాలు మాత్రమే కాదు, అవి మన ఆలోచనలకే అద్దం పట్టేవి మన అందరి మనస్సులలో కూడ కలిగే మాతృవ్యామోహం, మానుష శక్తి పట్ల విపరీతాభిమానాలను తొలిగించి ధర్మాచరణ విషయంలో ఆదర్శాన్ని తిరిగి కలిగించాడు శ్రీరాముడు. ఆ ఆదర్శమూర్తినే – శాశ్వత ఫలదాయకమైన విశేష ధర్మాన్నే అనుసరించాలని మన అందరికి తెలియజేశాడు సౌమిత్రి.

## పాతివ్రత్యము

శ్రీరాముడు సీతాదేవి అంతఃపురంలో తనకు స్వాగతం కొరకు ఏర్పడ్డ ఆడంబరాలు చూచి – అవనత శిరస్సుతో వెళ్లసాగాడు.

సీతాదేవి ఇంగితజ్ఞురాలు. ఎవ్వరు చెప్పకుండానే ఇతరుల మనస్సులను చదువగలిగేది. తన మనస్సులోని దుఃఖావేశాన్ని అదిమి పట్టడానికి శ్రీరాముడు చేసిన ప్రయత్నాన్ని అయన ముఖంపై స్వేదాన్ని (చెమటను) పసిగట్టింది.

ఆమె ఆందోళనతో రాముని వెంట రాజలక్షణాలు లేక పోవటం గురించి ప్రశ్నించింది. శ్రీరాముడు తన వనప్రస్థానాన్ని గురించి తెలిపాడు. సీతాదేవిని అయోధ్యలోనే వుండుమని, కాబోయే మహారాజైన భరతునికి అప్రియమును ఆచరింపవద్దని తెలిపాడు.

శ్రీరామునికి – రాజ్యాధికారము తొలగి వనవాసము కలిగిందనే మాటకంటే – తనను రాముడు వదిలి వెళ్తున్నాడనేమాట విని ఉలికి పడింది సీత. ఆమె తన భర్తతో 'ఆర్యపుత్రా! తల్లి తండ్రులు, సోదరులు, పుత్రులు, కోడలు, మిగిలిన బంధువులందరు తమతమ పుణ్యపాపముల మూలంగా భాగ్యాన్ని అనుభవిస్తారు.

కాని భార్య ఒక్కతే భర్త యొక్క భాగ్యంలో (సుఖదుఃఖాలలో) పాలుపంచుకుంటుంది.

'భర్తుర్భాగ్యంతుభార్యైకా - ప్రాప్నోతి పురుషర్షభ'

స్త్రీలకు పతి ఒక్కడే కదా గతి 'నారీణాంపతిరేకోగతిస్సదా' అందువలననే నేనుకూడా మీతోపాటు వనవాసంలో పాలుపంచుకుంటాను. అంతేకాదు కఠినమైన కాంతారములలో మీకంటే ముందుగా నడిచి -సుకుమారములైన మీపాదరవిందములకు శ్రమకలుగకుండా వుండటానికి క్రూరములైన దర్భలను, ముళ్లను ఏరిపారేస్తాను.

'అగ్రతస్తే గమిష్యామి-మృద్నంతీ కుశకంటకాన్'

ఇక్కడ పెద్దలు మరొక విశేషార్థాన్ని సెలవిస్తారు.

'కుశకంటకము' అంటే సామాన్యంగా దర్భలు ముళ్ళని అర్థము. కాని విశేషార్థములో 'కుశకంటకా!' అంటే భూజనుల సుఖాలకు ఆటంకాలను కలిగించే రాక్షసులని అర్థము.'శ్రీరామభద్రా! నీకంటే ముందే నేను లంకలో ప్రవేశించి -రావణ కుంభకర్ణాదులను నీబాణములకు లక్ష్యమయ్యేట్టు రంగాన్ని సిద్ధము చేస్తాను' అని సూచిస్తుంది ఆలోక జనని.

అంతేకాదు అడవులలో ప్రయాణం నాకు అసాధ్యము అనుకుంటావేమో? అదికూడా సరియైన ఆలోచనకాదు. ఏనుగులతో నిండిన, దుర్గమములైన అడవులలో నీవెంట నడిచి -తల్లిగారి ఇంట్లో ఉన్నట్లు హాయిని అనుభవిస్తాను.

'అహంగమిష్యామి-వనంసుదుర్గమమ్

'మృగాయుతం' -'వానరవారణైర్యుతం'

వనే నివత్స్యామి -యదాపితుర్గృహే

తవైవ పాదావుప గృహ్యసంయతా!

శ్రీరామాయణం నిజంగా రత్నాకరమే. ఆ మహాసముద్రంలో ఏరుకొనగలిగేవారికి కావల్సినన్ని రత్నాలు లభిస్తాయి ఈ శ్లోకానికి కూడా ప్రాజ్ఞులు

విశేషార్థాన్ని వివరిస్తారు. 'వనం' మృగాయుతం–వానరవారణైర్యుతం' ఈ వాక్యానికి సామాన్యంగా 'అనేక మృగాలతో, కోతులలో, ఏనుగులతో కూడకొన్న అడవి' అని అర్థము.

కాని వాల్మీకి కవీంద్రుడు 'అయుతం' 'యుతం' అనే పదాలు చిత్రంగా ప్రయోగించాడు. 'మృగాయుతం' ఒకలేడిచే వేరుచేయబడి తిరిగి మహాగజముల వంటి వానరులతో కలుప బడుతావను. 'వానరవారణైర్యుతం' అని భవిష్యత్తును సూచిస్తుంది సీతాదేవి వాక్కు. ధ్వని ప్రధానమైనది కదా ఉత్తమ కావ్యము.

ఒకవేళ తనను అయోధ్యలో వదిలి వెళ్ళితే అనతి కాలంలోనే రామ వియోగాన్ని సహింపలేక మరణిస్తానని సీతాదేవి తనస్వభావాన్ని వివరించింది. కాని ప్రేమావేశంతో సీతాదేవి పలికిన పలుకులతో స్థిరచిత్తుడైన శ్రీరాముడు కదిలిపోలేదు. స్త్రీ సహజంగా ముఖ్యంగా భార్య తనభర్త కష్టాన్ని చూచి భరింపజాలదు తాను తన సుఖాలను తనపతి కొరకు త్యాగము చేయడానికైనా సిద్ధపడుతుంది. కాని కాలక్రమంలో తన త్యాగమార్గంలో ఎదురయ్యే కష్టాలను బాధలను తట్టుకొజాలదు. ఏ భర్తకూడ తన వలన భార్య కష్టాలకు గురికావడానకి ఇష్టపడదు.

శ్రీరాముడు ఆదర్శ భర్త – తన ప్రాణాలకంటే ప్రియురాలయిన తన భార్యను కష్టాలకు గురిచేయడం ఆయన అభిమతము కాదు. అందువలన అడవులలో ఎదురయ్యే కష్టాలను నష్టాలను బాధలను వనవాస నియమాలను ఆమెకు వివరించాడు. అత్త మామలకు సేవచేస్తూ అయోధ్యలోనే హాయిగా పదునాలుగు సంవత్సరాలు గడిపి తన రాకకై భగవత్ ప్రార్థనతో ప్రతీక్షించుమని సలహా చెప్పాడు. కాని నారీమణులలో ఉత్తమురాలైన, పతివ్రతా శిరోమణి అయిన సీతాదేవి – కష్టాలకు వెరచి భర్తకు దూరమై బ్రతుక గల్గుతుందా?

అందువలన శ్రీరామునితో ఆదేవి 'ఆర్యపుత్రా ! అందరివలె మీరు సామాన్యులుకారు. మీ సామర్థ్యము నాకు పూర్తిగా తెలుసు. మీ అద్భుత, అపురూప స్వరూపాన్ని చూడగానే క్రూర మృగాలు కూడా భయంతో పారిపోతాయి.

సురాసురులుకూడా మీ ముందు నిలువ జాలరు. నా బాల్యంలో బ్రాహ్మణోత్తములు, సోదికత్తె నా జాతకాన్ని పరిశీలించి నాకు వనవాసయోగమున్నదని సూచించారు. మీ వెంట ఆ అరణ్యాలలో తిరుగడం ఎంతో హాయినిస్తుంది.

అంతేకాదు భర్తకు ధారాదత్తము చేయబడిన భార్య జీవించినా మరణించినా – ఆయనకే భార్యగా ఉంటుందని 'శాస్త్రములు ఉద్ఘోషిస్తున్నాయి. ఇంతకు ముందు కూడ గంగా తీర వన భూములలో విహరించాలనే నా మనోభీష్టాన్ని మీకు తెలిపాను. మీరు తోడులేని నాడు నాకు మరణమే శరణ్యము' అని తన పట్టుదలను మరొక సారి తెలియజేస్తూ దుఃఖింప సాగింది.

అయినప్పటికి శ్రీరాముడు సీతాదేవిని తన వెంట తీసికవెళ్లి వనవాస క్లేశానికి ఆమెను గురిచేయడానికి అంగీకరింవలేదు.

సీతాదేవి మనస్సు చివుక్కుమంది. ఆమెకు పతిపట్ల ప్రణయము, రోషాభిమానము కలిగింది. భర్తను చూచి 'అయ్యో! రామా! నిన్ను ధనుర్భంగము సమయంలో చూచి మా తండ్రి మిథిలాధిపతి ఏమని (ఎంత వీరుడవని) అనుకొన్నాడో – కాని పురుష వేషంతో ఉన్న స్త్రీవే అని గుర్తించాడో లేదో' అని పరిహసించింది.

'ప్రణయాచ్చాభిమానాచ్చ – పరిచిక్షేప రాఘవం'

'కింత్వామన్యత వైదేహః – పితామే మిథిలాధిపః

రామ! జామాతరం ప్రాప్య – స్త్రియం పురుష విగ్రహం'

ఎంత అపచారము! ఒక సామాన్య పురుషుని చూచి 'నీవు మగవాడివి కాదా? అని ఎవ్వరో ప్రశ్నిస్తేనే – ఆయన ఆవేశపరుడవుతాడే ? ఇక స్వంత భార్యే – తన భర్తను అలా అవమానింపగల్గుతుందా ? పరమ పురుషుని పట్టుకొని 'నీవు పురుష వేషధారివైన స్త్రీవి' అని స్వయంగా భార్యే అంటే అది ఎంత పెద్ద తప్పో! ఆ మాట అనేప్పుడు సీతాదేవికి అర్థం కాలేదు కాని అనంతరము లంకలో ఆమె తన అపరాధాన్ని గుర్తించింది – అదే మాటను హనుమతో అంది.

'మయైవ దుష్కృతం కించిన్మహదస్తినసంశయః'

నా లంకా నివాసానికి నాదే దోషము – సందేహము లేదు' అని తన దోషాన్ని అంగీకరించింది.

అయితే లోకంలో కూడ స్త్రీలు తమ పురుషుల పట్ల చనువుతో పరిహాసాలు పలుకడం సాధరణమే కదా! అలాగే సీతాదేవి తన భర్త పట్ల ప్రణయంతో, అభిమానంతో ఆ మాటలు అంది.

అంతే కాదు 'ఆర్యపుత్రా! ఎన్ని తప్పులు చేసి అయినా తన భార్యను పోషించడం భర్త భాద్యత' అని మనువు కూడా ఉపదేశించాడు కదా!

సత్యవంతుని సావిత్రి అనుసరించినట్లు నేను మిమ్మల్ని అనుసరిస్తాను. నాటకంలో కూడా తన భార్యను మరొక నటునికి భార్యగా నటించడానికి సాధరణ పురుషుడు అంగీకరించినట్లు మీరు నన్ను మరొకరికి సేవ చేయుడానికి నియమింపవద్దు. రామచంద్రా! మీ సహవాసమే నాకు స్వర్గము – అది అయోధ్యలోనైనా అరణ్యంలోనైనా ఒకటే – మీరు తోడుగా లేకుంటే నాకు స్వర్గమైనా నరకమే.

య'స్త్వయా సహ సస్స్వర్గో –

నిరయో య స్త్వయా వినా'

ఇక్కడ కూడ సీతాదేవి పలుకులలో సాధారణంగా ఒక భార్య పలుకులు వినబడుతాయి. కాని విశేషంగా ఆలోచిస్తే పరమాత్మతో జీవాత్మ అనాల్సిన మాటలు అర్థమవుతాయి.

జీవాత్మలన్ని సీతాదేవి వలె పరమాత్మకు భార్యారూపులే – పరమాత్మ ఒక్కడే పురుషుడు, పరమ పురుషుడు. 'స్త్రీప్రాయమితరంజగత్' మిగిలిన జనులందరు స్త్రీలవంటివారే.

పరమాత్మతో సహవాసమే పరమపదము. పరమాత్మ సంబంధములేని ఒక క్షణమైనా జీవాత్మలకు నరకప్రాయమే.

'యన్ముహూర్తం క్షణం వాపి

వాసుదేవో నచింత్యతే

సాహానిః తన్మహచ్ఛిద్రం'

వాసుదేవ చింతలేని క్షణమైనా ముహూర్తమైనా గొప్ప అపత్కారమని ప్రహ్లాదుడంటాడు.

సీతాదేవి ధృఢ భక్తి శ్రీరాముని హృదయాన్ని కదిలించింది. ఆమె దుఃఖము ఆయన మనస్సును ద్రవింపజేసింది. అప్పుడు ఆమెకు తన హృదయాన్ని అవిష్కరింపక తప్పలేదు ఆయనకు.

'సీతా! నీవు దుఃఖిస్తే నాకు స్వర్గమైనా అక్కర లేదు. నీ సంతోషమే నా స్వర్గము' అని ఆమెను ఓదార్చాడు.

' న దేవి! తవదుఃఖేన – స్వర్గమప్యభిరోచతే'

నిజంగా సీతారాముల దాంపత్యమే దాంపత్యము. నరులలోనే కాదు సురులలో కూడ అటువంటి అనన్యదాంపత్యము లేదు. వారిద్దరిది ఒకే మాట – తనువులు కలిసి ఉన్నా – వేరుగా ఉన్నా వారి మనస్సులొకటే – వారి మాట ఒక్కటే.

'రామునితో కలిసి ఉండడమే సీతాదేవికి స్వర్గము వేరుగా ఉండడమే నరకము.'

'సీతాదేవి శోకిస్తే రామునికి స్వర్గమైనా రుచింపదు'

వారిమాటలు వేరైనా వారి భావమొక్కటే. ఎంతటి ఆదర్శ దంపతులు సీతారామచంద్రులు! లోకంలో ఏ దంపతులైనా కోరుకొనేది అటువంటి సాన్నిహిత్యమే కదా!

శ్రీరాముడు సీతాదేవిని అనునయిస్తూ – గాఢాలింగనం చేసికొని 'సీతా! సువర్చల సూర్యుని అనుసరించినట్లు నీవు నన్ను అనుసరించి రావచ్చును. సర్వ జగత్కర్త అయిన స్వామికి ఏ సత్వము వలన భయములేనట్లే నాకు కూడ ఎవ్వరి

వలన ఎన్నడు భయము లేదు.' అని ఓదార్చి ఆమెకు ఇష్టము వచ్చినట్లు – కావలసినన్ని వస్తువులను దానము చేసి తనతో బయలు దేరుమని' తెలిపాడు.

శ్రీరాముని ధర్మపాలనాన్ని – సీతాదేవి అనురాగంతో అనుసరించింది.

## లక్ష్మణానుసరణము

లక్ష్మణుడు కూడ శ్రీరాముని వెంటనే సీతా భవనానికి చేరి – భవనము బయటే ఉండి సీతారామ సంభాషణము అంతా విని, అదే తనకు కూడ మంచి అదను అని భావించాడు. 'రాముడు తనసతి అయిన సీతను తన వెంట రావడానికి సమ్మతించాడు కదా! నీడవలె అన్ని వేళలలో తోడయిన తనను రానివ్వడా?' అని ఆశ పడ్డాడు. తాను ఒంటరిగా అడిగితే రావద్దంటాడేమో? అందువలన సీతాదేవి సన్నిధిలో ఉన్నప్పుడే శరణు వేడడం మంచిదనుకొన్నాడు.

తన అన్న శ్రీ పాదముల నాశ్రయించాడు లక్ష్మణుడు. ఆశ్రయించడమంటే మామూలుగా ఆశ్రయించడము కాదు. గాఢంగా ఆశ్రయించాడు. సీతాదేవి వైపు చూస్తూ ఆశ్రిత రక్షాదీక్షుడైన శ్రీరాముని శరణువేడాడు. అలా సీతా సమక్షంలో శ్రీరాముని ఆశ్రయించి లక్ష్మణుడు మహాకీర్తి మంతుడయ్యాడు. ఆశ్రయించే వారందరికి ఆదర్శమయ్యాడు.

'సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః

సీతాముఉవాచాతియశాః రాఘవంచ మహావ్రతం'

సీతాదేవి స్వయంగా శ్రీదేవియే. ఆమె పురుషకార స్వరూపిణి అనగా పరమాత్మతో ఆశ్రితుల కార్యాలను చేయింపగల్గే స్వభావం కలది. శ్రీదేవికి ఆరుగుణాలున్నాయి. అవి రెండు రకాలు. మూడు పనులు ఆమె చేసేవి – మూడు పనులను తన పతితో చేయించడానికి తోడ్పడేవి.

1. శ్రీయతే = స్వయంగా స్వామిని ఆశ్రయించేది.

2. శ్రావయతి = పరమాత్మకు ఆశ్రితుల మొర వినిపించేది.

3. శ్రీణాతి = పరమాత్మతో ఆశ్రితుల పాపముల హింసింపజేసేది.

పై మూడు ఆమెకు – ఆమె భర్తతో ఉన్న గాఢానుబంధము వలన శ్రియః పతితో ఆశ్రితుల కార్యాలను చేయించడానికి తోడ్పడే గుణాలు.

ఇంకొక మూడు గుణాలు ఆమె స్వయంగా ఆశ్రితుల విషయంలో చేసే పనులకు సంబంధించినవి.

1. శ్రయతే = ఆశ్రితులచే ఆశ్రయింపబడుతుంది.

2. శృణోతి = ఆశ్రితుల మొరను స్వయంగా వింటుంది.

3. శృణాతి = ఆశ్రితుల పాపములను స్వయంగా హింసిస్తుంది.

ఈ లక్షణాల వలననే శ్రీదేవి పురుష కారస్వరూపిణిగా మహర్షులచే నిర్దేశింపబడింది. శ్రీదేవి అవతార స్వరూపిణి అయిన సీతాదేవికి కూడ ఈ ఆరులక్షణాలున్నాయి. కనుకనే సీతాదేవి సమక్షంలో చేసిన శరణాగతి తప్పక ఫలిస్తుందనే విశ్వాసంతో లక్ష్మణుడు శ్రీరాముని శరణువేడాడు.

'కురుష్వ మామనుచరం। వైధర్మ్యం నేహవిద్యతే

కృతార్థోఽ హంభవిష్యామి। తవచార్థః ప్రకల్ప్యతే'

శ్రీరాముని శ్రీపాదములను ఆశ్రయించి – తన ప్రార్థనను లక్ష్మణుడు వినిపిస్తున్నాడు.

అన్నా! నీవు నన్ను నీతో వెంట తీసుకవెళ్తే నేను కృతార్థుడనవుతాను. నీ ప్రయోజనము కూడ నెరవేరుతుంది.

ఇక్కడ కూడ జీవాత్మలు పరమాత్మను ప్రార్థించ వలసిన విధానము చెప్పబడింది.

'దాస భూతాస్స్వతస్సర్వే హ్యాత్మానః పరమాత్మనః

పరమాత్మకు దాసులే జీవాత్మలందరు. ఈ దాస్యము ఏదో అవసరానికొరకు ఏర్పరుచుకొన్నది కాదు. సహజంగా శాశ్వతంగా ఉండేదే. పరమాత్మ శేషి – అనగా స్వామి. జీవాత్మలందరు శేషులు అనగా దాసులు. వారు పరమాత్మను

ఆశ్రయింపవలసినవారే.

అయితే జీవాత్మలు ఆ పరమాత్మను ఆశ్రయించడం వారి కార్యం కాదు. ఇందులో 'స్వగత స్వీకారము' లేదు. తానే స్వామి నాశ్రియిస్తున్నాని అనుకొంటే అది 'మర్కట కిశోరన్యాయము' వుతుంది. తల్లి కోతి తన ఇష్టము వచ్చినట్లు గంతులు వేస్తుండే – పిల్ల కోతి – ఆ తల్లిని పట్టుకోవడం వంటిది. అది ప్రమాద భరితమైనది. పిల్ల కోతి పట్టుతప్పి ఎప్పుడు ఎక్కడ క్రింద పడిపోతుందో తెలియదు.

పరమాత్మే స్వయంగా జీవాత్మలతో తనను ఆశ్రయింపజేసి కోవడం 'పరగత స్వీకారము' అవుతుంది. అదే 'మార్జాలకిశోరన్యాయం' తల్లి పిల్లి ఎక్కడికైనా వెళ్లాలనుకొన్నప్పుడు తానే స్వయంగా తన పిల్లి పిల్లను గట్టిగా పట్టుకొని వెంట తీసుక వెళ్తుంది. ఇందులో పిల్లి పిల్లకు ఏలాంటి ప్రమాదము ఉండదు సర్వభారాలు తల్లిపై వేసి నిశ్చింతగా ఉంటుంది.

లక్ష్మణుడు తాను స్వయంగా 'అనుచరుడునవుతాను' అని అనడం లేదు. తనను 'అనుచరుడిగా చేసికొమ్మ' ని ప్రార్థిస్తున్నాడు తాను తమ్ముడు కనుక అన్నకు సేవ చేయడం ధర్మ విరుద్ధమేమి కాదు. దానివలన తన కోరిక నెరవేరుతుంది.

ఈ విధంగా కైంకర్యము చేయడము దానుడు తెచ్చుకొని పెట్టుకొనేది కాదు. అది నిత్యమైనది. కైంకర్యము నిత్యమైనాపరమాత్మను ప్రార్థించే పొందవలసినది.'

కైంకర్యంవందేరియన్మ్ – స్వరూప ప్రయుక్తం అకిలుంప్రార్థిత్తే – పెరవేణుం'

ఇక లక్ష్మణుడు తాను చేయబోయే సేవలను మనవి చేసికొంటున్నాడు.

'భవాంస్తు సహవైదేహ్యా! గిరిసానుషు రంస్యతే

అహం సర్వం కరిష్యామి! జాగ్రతః స్వపతశ్చతే'

అన్నా! నీవు సీతాదేవితో కూడ పర్వతలోయలలో ఆనందంగా విహరించు – నేను మీరు పడుకొన్నా – తెలివితో ఉన్నా అన్ని విధాల కైంకర్యములు చేస్తాను. అయోధ్యలో లభించని సేవలన్ని అడవిలో చేస్తాను.

లక్ష్మణుడు కైంకర్య లక్ష్మీ సంపన్నుడు. ఎన్నికైంకర్యములు చేసినా తృప్తి పొందే వాడు కాదు. 'వార్చిన అన్నము – ఉడికే అన్నం రెండు తనకే కావాలనుకొనేవాడు'. గుట్టమీది ప్రయోజనం, గుట్ట క్రింది ప్రయోజనము రెండు తనవే అనేవాడు. ఇక్కడ శ్రీ రామ కైంకర్యమే లక్ష్మణునికి అన్నము, ప్రయోజనము కూడ.

లక్ష్మణుడు ఆదిశేషాంశ సంభవుడు. ఆదిశేషుడు శేషులు (జీవాత్మలు) అందరిలో మొదటి వాడు – శ్రీమన్నారాయణునికి సకల విధ సేవలను చేసేవాడు. ఉండడానికి ఇల్లుగా, పడుకోడానికి పడుకగా, కూచోవడానికి ఆసనంగా, నడిచేప్పుడు పాదుకలుగా ధరించడానికి పై కండువాగా, దిండుగా, వర్షాతపాల నుండి కాపాడే గొడుగుగా తన శరీరాన్ని మలిచి – పరమాత్మకు సకల విధ సేవలను చేసేవాడు.

లక్ష్మణుని ప్రార్థన – మనందరికి వర్తిస్తుంది. మనము అందరము కూడ అన్ని వేళలలో అన్ని విధాలుగా పరమాత్మకు సేవ చేయాల్సిన వాళ్లమే.

శ్రీరాముడు మొదట లక్ష్మణుని అయోధ్యలోనే ఉండి మాతాపితరులకు జాగ్రత్తగా శుశ్రూష చేస్తుండుమని ఆదేశించాడు. అయితే మళ్లీ మళ్లీ ప్రార్థించినందు వలన తమ వెంట ఆయన రావడానికి అనుమతించాడు.

ఇతిశం

## సుమిత్రా సందేశము

శ్రీ రామాయణంలో పరిమాణంలో సుమిత్ర పాత్రచాల స్వల్పము కాని ప్రభావంలో చాల పెద్దది.

నిజానికి సుమిత్ర కౌసల్యా దేవి వలె శ్రీ మంతులైన తల్లిదండ్రుల నుండి (కోసల వంటి భూములను) స్త్రీ ధనం తీసుక రాలేదు. ఆమె తల్లి దండ్రులు అంత ప్రసిద్ధులైన రాజన్యులు కూడ కారు.

సుమిత్ర కౌసల్య వలె పట్ట మహిషికాదు. శ్రీ రాముని వలె తన వైపు అందరిని

ఆకర్షించే తనయులను ఆమె కనలేదు. ఆమె కొడుకులిద్దరు ప్రధాన గ్రహముల చుట్టూ తిరిగే ఉపగ్రహాల వలె తమ తమ సోదరులకు పరతంత్రులుగా ఉండడమే ప్రధాన మనుకొన్నారు.

ఆమె దశరథునితో భార్యగా అనుభవించిన ఆనందము కూడ అల్పమై పరిణయ మాడిన ప్రారంభ దినాలకే పరిమితమైనది. కైకేయి పాణి గ్రహణము తరువాత కౌసల్యాదేవినే పట్ట మహిషినే పట్టించుకొన్న వారు లేరు. ఇక సుమిత్ర సంగతిని అడిగే వారు ఎవ్వరు ?

సుమిత్ర నిజంగా కౌసల్యా దేవికి సుమిత్రే. రజస్సు సత్వాన్ని చేరినట్లే రామమాతను ఆమె చేరి అనవరతము దుఃఖములో అనునయించింది. సుమిత్ర ఓదార్పే లేకుంటే కౌసల్య తన శోకావేశాన్ని సహించగలిగేది కాదు. తనకే ఓదార్పు కరువైనా తాను కౌసల్యను ఎల్లవేళలలో ఊరడించిన ఉదారచరిత ఆవిడ.

మౌనంగా – పంటి క్రింద తన బాధ నంతా అణచుకొని జీవించినా అన్ని జీవిత మర్మాలను అవగతం చేసికొన్న మహనీయురాలు సుమిత్ర. పరమాత్మ తత్త్వాన్ని పరిపూర్ణంగా గ్రహించ గలిగిన ముగ్గురు పరమజ్ఞానులైన రామాయణ స్త్రీలు ఉన్నారు. వారు సుమిత్ర, తార, మండోదరి.

వాల్మీకి కవీంద్రుడు సుమిత్ర స్వభావం గురించి రెండే శ్లోకాలలో వర్ణించాడు. అయితే ఆ రెండు శ్లోకాలే ఆ మహనీయురాలి అసాధారణ వ్యక్తిత్వానికి అద్దం పట్టాయి.

సీతా సమక్షంలో శ్రీ రాముని ప్రార్థించి, మెప్పించి, తాను ఆయన వెంట వెళ్ళడానికి శ్రీ రాముని సమ్మతి వడసిన సౌమిత్రి తన తల్లి సుమిత్రా దేవి అంగీకారము కొరకు ఆమెను సమీపించాడు. అప్పుడా వివేకవతి తన తనయుడికిచ్చిన ఆదేశము ఎంత అద్భుతమైనదో గమనిద్దాము. వాస్తవానికి సుమిత్రా దేవి తన సుతునికిచ్చిన సందేశము ప్రపంచ సాహిత్య చరిత్రలోనే పరమాద్భుతమైనది.

'సృష్టస్త్వం వనవాసాయ – స్వనురక్తస్సుహృజ్జనే

రామే ప్రమాదం మా కార్షీః – పుత్ర భ్రాతరి గచ్ఛతి' (తని శ్లోకం)

'సౌమిత్రీ! నీ స్వభావాన్ని వాస్తవంగా గ్రహిస్తే నీవు వనవాసం కొరకే సృష్టింపబడినట్లు స్పష్టమవుతుంది. రాముని పట్ల నీ అనురక్తి అపారమైనది. అయినప్పటికి పుత్రా! నీవు మీ అన్నను అనుసరించేప్పుడు మీ ప్రయాణంలో ఆయనకు ఎటువంటి ప్రమాదాన్ని అయినా కల్గించడానికి పాలుపడవద్దు సుమా'.

ఏమిటి సుమిత్ర అభిప్రాయము? సకల రాజ్య సంపదలను, చివరకు అనుకూలవతి అయిన అర్ధాంగిని కూడ పరిత్యజించి అన్నకు అన్ని విధాల సేవచేయడానికి అడవులకు వెంట వెళ్లడానికి సిద్ధమైన సౌమిత్రి రామునికి ప్రమాదాన్ని కల్గిస్తాడా ? శ్రీ రామునిపట్ల ద్వేషంతో ఆయనకు అపకారం చేయడానికి వెంట వెళ్లుతున్నాడా ? సీతా దేవి పట్ల చెడు ఉద్దేశ్యంతో వెళ్లుతున్నాడా? ఈ రెండు ఆలోచనలు కూడ ఎంత క్రూరమైనవి? సౌమిత్రి స్వభావానికి తగినవా ? ఎంత మాత్రము కాదు. సుమిత్ర వంటి మహనీయురాలి మనస్సులో తన తనయుడైన సౌమిత్రి పట్ల ఇటువంటి వికృతాలోచనలు కలుగుతాయా ? కలుగవు - మరి సుమిత్రా సంభాషణములోని అంతరార్థమేమిటి ?

శ్రీ రాముడు పుంసాంమోహనుడు. ఆయన సౌందర్యము సకల ప్రాణి మనోహరమైనది. ఆయన వన సంచారము అడవికే అందాన్ని కలిగించింది.

'శోభయన్ దండకారణ్యమ్' అని వాల్మీకి వర్ణించాడు.

రాముని నడకలో నాలుగు గతులున్నాయి. 1) గర్వంతో అడుగులు వేసే ఆబోతు గతి, 2) మందంగా అడుగులిడే మత్తేభగతి, 3) ఆగ్రహంతో చిందులు త్రొక్కే వ్యాఘ్రగతి, 4) శౌర్యంతో నడయాడే సింహగతి.

శ్రీ రాముని గమన సౌందర్యానికి తపోధనులైన మునులే తన్మయులయ్యేవారు. పశువులు కూడ పరవశమయ్యేవి. అటువంటి శ్రీ రాముని సంచార సౌందర్యము వెంట వచ్చే సౌమిత్రికి మనోహరంగా ఉండదా ? ఆయన పాదన్యాసానికే పరవశుడయితే లక్ష్మణుడు రామకైంకర్య లక్ష్మిని ఎలా లభింపగలుగుతాడు ? రమణీయమైన రామగమన సౌందర్యాన్ని కనులార సందర్శించిన సుమిత్ర స్వానుభవంతో సుతునికి ఈ విషయాన్ని తన సందేశములో

సూచిస్తోంది.

'సౌందర్యం అంతరాయం' స్వామి సేవలో ఆయన సౌందర్యమే అంతరాయాన్ని కల్గిస్తుందని లోక గురువుల శ్రీ సూక్తి. కనుక కొడుకా! రాముని మోహనమైన నడకకు ముగ్ధుడివై సీతాసమేతుడైన ఆ స్వామికి చేసే పరిచర్యలలో పరాకుగా ఉండకూడదు సుమా'! అని సుమిత్ర సూచిస్తుంది.

'ప్రమాదోZనవధానతా' అంటుంది శాస్త్రము. ప్రమాద మంటే పరాకుతో ఉండడమే.

శ్రీ రామానుసరణములో పరాకు పనికి రాదని సూచించడమే సుమిత్రా సందేశములోని ఆంతర్యము.

అంతే కాదు సుమిత్ర జీవాత్మ పరమాత్మల సహజ సంబంధాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకొన్న అఖండ ప్రజ్ఞాధురీణ. కనుక ఈ శ్లోకంలోని విశేషార్థాన్ని కూడ అవలోకిద్దామా !

'త్వం వనవాసాయ సృష్టః' అని జీవాత్మకు పరమాత్మతో సంబంధాన్ని సూచిస్తుంది ఆసుదతి.

జీవులెప్పుడు తమ కొరకు తాము ఉండరు. స్వాతంత్ర్యం వారి సహజ స్వభావం కాదు.

'దాస భూతాః స్వతస్సర్వే హ్యాత్మానః పరమాత్మనః'

ఆత్మలన్ని పరమాత్మ (సేవ) కొరకే ఉంటాయి. శ్రీ రాముడెవ్వరో కాదు. పరమాత్మే – శ్రీ మన్నారాయణుడే.

'వనవాస' శబ్దము నారాయణునే సూచిస్తుంది. 'వనము' అన్నా – నారములు (జలములు) అన్నా ఒకే అర్థము.

'నారములు ఆయనముగా' కలిగిన వాడు నారాయణుడు. వనము వాసస్థానముగా కలవాడు వనవాసుడు. అనగా నీరు నివాస స్థానంగా కలవాడు 'క్షీరాబ్ధిశాయి' అని అర్థము.

'వనవాస' శబ్దానికి మరొక అర్థము ఉంది 'వనమనే' శబ్దానికి పరమాత్మ అనే అర్థాన్ని శృతి వివరిస్తుంది. అందువలన లక్ష్మణా! నీవు వనముతో (రామునితో) కలిసి (వాసాయ) నివసించడానికే సృష్టింపబడ్డావు అనగా జన్మనివ్వబడ్డావు.

అంతే కాదు లక్ష్మణా! నీ పూర్వ జన్మను ఒక్క సారి జ్ఞాపకం చేసుకో, నీవెవ్వరివో తెలుసా! నీవు ఆదిశేషుడివి – (వనముతో) పరమాత్మతో నిత్య నివాసము కలిగి ఉన్నవాడివి కదా! ఇప్పుడు కూడ శ్రీ రామునితో వనవాసము చేయడానికే జన్మించావు, పాము సంచరించేది అరణ్యాల (వనాలలోనే కదా!)

లక్ష్మణా! నీ స్వభావమేమిటో తెలుసా? నీకు ప్రియుడు (సుహృత్తు) అయిన రామచంద్రుని విషయంలో స్వనురక్తిని (సు అనురక్తిని) గాఢాను రాగాన్ని కలిగి ఉండడమే.

'సుహృత్తు' అని పరమాత్మ పేరు. భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు' తనను సర్వ భూతములకు 'సుహృత్తు' అని గుర్తించి నందు వలననే శాంతి లభిస్తుంది.' అని తెలిపాడు.

'సుహృదం సర్వ భూతానాం ! జ్ఞాత్వామాంశాతి మృచ్ఛతి'

'గతిర్భర్తా ప్రభుస్సాక్షీ! నివాసశ్శరణం 'సుహృత్'

భగవంతుడే గతి – భర్త, ప్రభువు, సాక్షి, నివాసము, శరణము, సుహృత్తు ఆయనే మనకు 'సకల విధ బంధువు' అని భగవద్గీత వివరిస్తోంది.

'సుఘోషః సుఖదః సుహృత్' అని 'విష్ణు సహస్రనామము పరమాత్మకు 'సుహృత్' అనే పేరుందని తెలుపుతోంది.

'మాతా పితా, భ్రాతా, సుహృత్, గతిర్నారాయణః' అని ఉపనిషత్తు కూడ పరమాత్మను సుహృత్తుగా వివరిస్తుంది. ఈ విధంగా 'సుహృత్తు' అయిన పరమాత్మ పట్ల నీవు స్వనురక్తః గాఢ ప్రేమగల వాడవు.

'రామే ప్రమాదం మా కార్షీః' నాయనా లక్ష్మణా! నీవు ఆదిశేషుడివి కదా!

'నివాసశయ్యాసన పాదుకాంశుకోపధాన

వర్షాతపవారణాదిభిః శరీర భేదైస్తవ

శేష తాంగతైర్యథోచితం శేష ఇతీర్యతే బుధైః

స్వామికి నివాసస్థానంగా, శయ్యగా, పాదుకలుగా, ఉత్తరీయంగా గొడుగుగా నీ శరీరాన్ని మలచి సకలావస్థలలో సర్వ విధ కైంకర్యాలను అప్రమత్తతో చేస్తావు కదా. ఇప్పుడీ జన్మలో కూడ రాముని వెంట వెళ్తూ జాగ్రత్తగా అన్ని రకాల సేవలను చేయి'.

అయితే నీవు ఆదిశేషాంశ కలిగిన వాడవు కదా ! శేషుడు 'చక్షుశ్శ్రవుడు' – సర్పానికి కన్ను, చెవి ఒకటే – అందువలన నీవు చూస్తే వినలేవు. వింటుంటే చూడ లేవు. అనగా నీవు చూచేప్పుడు ఇంకే పనులు చేయడం నీ స్వభావం కాదు. ఇప్పుడీ జన్మలో కూడా అలాగే శ్రీ రాముని సుందరగమనాన్ని సందర్శిస్తూ ఉండి పోతే నీవు చేయాల్సిన సేవలను మరిచిపోయే ప్రమాదముంది సుమా'.

ఇది సుమిత్రాదేవి లక్ష్మణునికి చేసిన 'సృష్టస్త్వం' ఉపదేశములోని విశేషార్థము.

ఇక రెండవ శ్లోకాన్ని గమనిద్దాము.

'రామం దశరథం విద్ధి – మాం విద్ధి జనకాత్మజాం

అయోధ్యాం అటవీం విద్ధి – గచ్ఛ తాత యథా సుఖం' (తని శ్లోకం)

'లక్ష్మణా నీవు శ్రీ సీతారాములకు అప్రమత్తతో సేవలు చేయాలని చెప్పాను కదా! ఇప్పుడు నీవు వారిని ఏ భావంతో సేవించాలో తెలుపుతాను విను' అని సీతారాముల అవతార రహస్యమును ఆవిష్కరిస్తుంది ఆ విజ్ఞానవతి.

మొదట సుమిత్ర ఉపదేశంలో సామాన్యార్థాన్ని పరిశీలిద్దాము.

1) లక్ష్మణా! రాముని వెంట వెళ్ళాలనుకొంటున్నావు కదా! బాగా ఆలోచించుకో. అయోధ్య వేరు, అడవి వేరు. సకల సౌఖ్యాలకు ఆవాసము అయోధ్య ఆయాసములకు ఆలయము అడవి.

అయోధ్యలో మీ నాన్న గారు నీకు ఇంత కాలం అన్ని సౌఖ్యాలను కల్పించారు

కదా. ఆయనను విడిచి - అన్న అయిన రామునితో వెళ్తున్నావు. నాన్న వేరు, అన్న వేరు గుర్తుంచుకో.

ఇక్కడ నేను నీ తల్లిని ఉన్నాను. నిన్నెంతో మురిపెంగా పెంచాను, లాలించాను. కన్న తల్లిని నన్ను విడిచి మీ వదిన సీతాదేవితో వెళ్తున్నావు. నీ గారాబాలకు అక్కడ అవకాశము ఉండదు సుమా! నీవు వారికే అక్కడ కష్టమైన సేవలు చేయాలి.

2) నాయనా! నీవు ఇప్పుడు దుఃఖాక్రాంతుడైన నాన్న గారిని విడిచి వెళ్తున్నావు. రాముడు సర్వసమర్థుడు. నీవు వెంట వెళ్లి సేవలను చేయకున్నా ఆయనకేమి తక్కువ లేదు. కాని పుట్టెడు దుఃఖంలో ఉన్న పుట్టుకనిచ్చిన తండ్రిని విడిచి వెళ్లడం న్యాయమా ?

మీ నాన్న గారు దఃఖంతో ఉన్నప్పుడు నేను మాత్రము సంతోషంగా ఉంటానా? విచారగ్రస్తురాలనైన కన్న తల్లిని నన్ను విడిచి వెళ్లడం ధర్మమా ?

అయినా నీకు అయోధ్యలో ఏమి తక్కువ ? అడవిలో నీవేమి సాధించాలని వెళ్తావు ? మాతా పితృశుశ్రూషకంటే మించిన మరో ధర్మము లేదు.

3) సౌమిత్రీ! దశరథుడు ఇంకెంతో కాలము జీవించడు. నేను (ధవుడు) భర్తలేని దానను అవుతాను. రాజు లేని అయోధ్య అడవి అవుతుంది. సీతారాములంటావా ? వాళ్లు అడవిలో ఉన్నా అయోధ్యలో ఉన్నట్లే హాయిగా ఉంటారు.

వారొకరితో ఒకరు కలిసి ఉండడమే వారి సంతోషానికి కారణమైతే, వన సౌందర్యము, ప్రశాంతత, తపోవనాలు కూడ వారి సంతోషాన్ని అధికం చేస్తాయి.

ఇన్ని కష్టాలలో ఉన్న కన్న తల్లి దండ్రులను విడిచి చేతికి ఎదిగిన కొడుకువు చేయూత నివ్వకుండా వెళ్లడం మంచిదా ? ఆలోచించు నీవు కన్న కొడుకుగా నీ ధర్మం నిర్వర్తించ వద్దా.

విశేషార్థాలు

4) మా పరిస్థితి ఇంతగా తెలిపినా శ్రీ సీతా రాముల వెంట ప్రస్థానానికే నిశ్చయించుకొంటావా? అయితే వెళ్లు కాని నీ వక్కడ ఎలా మెదులుకోవాలో విను.

'రామం' 'దశరథం' శ్రీ రాముని దశరథుని వలె కన్న తండ్రిగా భావించు.

'జ్యేష్ఠోభ్రాతా పితుస్సమః' – అన్న తండ్రితో సమానమని శాస్త్రము వివరిస్తుంది.

మీ వదినను సీతను ఏ దృష్టిలో చూడాలో తెలుసా ? (జనకాత్మజాం)

'మాం' కన్న తల్లిని నన్ను చూచినట్లే మాతృభావనతో సేవించాలి.

'అయోధ్యామటవీం' కావాలని కాననలకు వెళ్తున్నావు కదా. అక్కడి కష్టాలను చూచి విచారించక అయోధ్యలో ఉన్నట్లే భావించి తృప్తిపడు.

5) రాముడు దశరథుని వంటివాడే. దశరథుడు కైకేయి వరాలకు కట్టుబడి దుఃఖాల పాలయినట్లే రాముడు కూడ సీతా దేవి కోరికకు కట్టుబడి మారీచమృగము వెంట పడుతాడు. సీతా దేవి పరిస్థితి నా వలెనే అవుతుంది. నిన్ను ఇప్పుడు నేను ఎలా పోగొట్టుకొంటున్నానో అలాగే సీతాదేవి స్వయంగా నిర్బంధించి నిన్ను దూరము చేసికొంటుంది. ఇప్పుడు అయోధ్యను విడిచి అడవికి వెళ్తున్నావే ? అప్పుడు అడవిని కూడ విడిచి సముద్రానికి చేరుకొంటావు. జాగ్రత్త సుమా!

6) నీకు దశరథుడు ఈ శరీరాన్ని మాత్రమే ఇచ్చిన తండ్రి, ఔపాధిక బంధువు. నేను కూడ అలాగే ఈ జన్మను మాత్రమే ఇచ్చిన తల్లిని.

'శ్రీరాముడే' మా తండ్రియు – సీతమ్మే మాకు తల్లి.

ఇక శ్రీరాముడంటావా? నిరుపాధిక బంధువు. అన్ని జన్మలకు ఆయనే తండ్రి అని భావించు అలాగే జన్మ జన్మలకు సీతమ్మే తల్లి. అందువలన వారినే యథేచ్ఛగా అనుసరించు.

'మాతాచ కమలాదేవి! పితాదేవో జనార్ధనః

(లక్ష్మి) శ్రీ దేవే మన కన్నతల్లి – శ్రీమన్నారాయణుడే మన తండ్రి వారే మన తల్లి దండ్రులు.

7) రాముడంటే ఎవ్వరు అనుకొన్నావు. ఆయన దశరథుడే. (ధశ=పక్షి ని=రథుడు=వాహనము కలవాడు) గరుడవాహనుడే. శ్రీమన్నారాయణుడే.

సీతాదేవి అంటే ఎవ్వరో కాదు. 'మా రమా మంగళ దేవతా' మంగళ దేవత అయిన లక్ష్మీదేవియే.

అడవికూడా శ్రీ శ్రీయః పతులు నివసించినందువలన అయోధ్యే – 'దేవానాం పూరయోధ్యా ' శ్రీ శ్రీయః పతులు నివసించే పురమే అయోధ్య 'యాZ యోధ్యేత్య పరాజితే తి విదితా నాకం పరేణ స్థితా' – అయోధ్య, అపరాజిత అనే పేర్లుగల పరమ పదమే అయోధ్య. అందువలన సుఖంగా వెళ్ళిరా !

'యత్ర నాస్తి హరిస్తత్ర – నవస్తవ్యం కృతాత్మనా'

నీవంటి ధన్యులు హరిలేని చోట ఉండజాలరు కదా. వెంటనే ఈ అయోధ్యను హాయిగా విడిచి వెళ్ళు.

8) 'గుణైర్ధ శరథోపమః' రాముడు శంబరాంతకుడైన దశరథుని వంటి మహావీరుడు. సురాసురుల సమరంలో గెలిచి వచ్చిన మీ తండ్రిని చూచి నేను సంతోషించినట్లే – రాక్షస సంహారకుడైన రాముని చూచి సీత సంతోషిస్తుంది. అందువలన ప్రమాద భరితమైన అడవి కూడ భయరహితమైన అయోధ్య అవుతుంది. నీవు హాయిగా వెళ్ళిరా.

9) శ్రీరాముని రాజ్యహీనునిగా అనుకోవద్దు. దశదిశలలో రథాన్ని ఆ ప్రతిహతంగా పరుగెత్తించే దశరథ సార్వభౌముని వలె రాముడు సకలలోక సార్వభౌముడు. సీత నా వలె రాజ మహిషి అవుతుంది. వారు ఉండే అడవి అయినా అయోధ్య వలె రాజధాని అవుతుంది. అందువలన నీవు హాయిగా వెళ్ళిరా ! చూచారా సుమిత్ర మాటలలో ఎన్నెన్ని అర్థాలో.

ఇది సుమిత్ర సందేశములో విశేషార్థం.

## రాముని వెంటే వెళ్లింది నా చూపు

సీతా లక్ష్మణ సమేతుడైన రాముడు అడవులకు తరలి వెళ్తూ చివరసారి దశరథుని దర్శనానికై కైకేయి అంతఃపురానికి వెళ్ళాడు. ఎవ్వరెన్ని రకాల చెప్పినా ఎంతమాత్రము సడలని మూర్ఖత్వంతో నల్ల సరపు బండవలె నిలిచి ఉంది కైకేయి.

సీతా రామ లక్ష్మణులు కాననలకు వెళ్తున్నారు కనుక ఋషులవలె నార చీరలను ధరించాలని అమూల్య వస్త్రాలను ఆభరణాలను ఇక్కడే వదిలి వెళ్ళాలని – కైక –ప్రకటించింది. ఆ సుందర సుకుమార శరీరులు నార చీరలను ఎలా ధరింపగల్గుతారో అని అంతఃపుర జనులంతా హాహాకారాలు చేశారు.

రామ లక్ష్మణులు నార చీరలు ఎలాగో ధరించారు. శ్రీదేవి అయిన సీతాదేవికి మాత్రము వాటినెలా ధరించాలో తెలియక అయోమయంతో హస్తంలో ఆ వస్త్రాన్ని పట్టుకొని నిలిచి ఉంది. శ్రీరాముడు ఆ వస్త్రాన్ని ఆమెకు ఇదివరకు ఉన్న వస్త్రాలపైననే కట్టి చూపాడు. ఆ దృశ్యాన్ని చూచి భరింపలేక అంతఃపురమంతా గొల్లుమని ఆక్రందించింది.

దశరథ మహారాజు ఆగ్రహంతో కైకేయిని నిందించి సుకుమారి అయిన తన కోడలుకు కావలసినన్ని పట్టు బట్టలను ఆభరణాలను తెప్పించి ఇచ్చాడు.

సీతారామలక్ష్మణులు – కడసారి దశరథునికి తల్లులకు, పెద్దలకు ప్రణమిల్లి ప్రయాణానికి సిద్ధమయ్యారు. 'రామా! నీవు నా ఆజ్ఞను ధిక్కరించు! నీవు వెళ్తే నా ప్రాణాలు నిలువవు 'అని దీనంగా విలపించసాగాడు దశరథుడు. రాళ్ళు కూడ కరిగే దయనీయ స్థితి అది.

అయినా స్థిత ప్రజ్ఞుడైన శ్రీరాముడు – తండ్రిని 'అసత్య వచనుడిని' చేయడానికి అంగీకరింపలేదు. తన తండ్రిని – సత్యవాక్య పాలకునిగా – తనను పితృవాక్య పాలకునిగా చరిత్రలో నిలుపాలనే ఆయన సంకల్పించాడు.

దశరథుని ఆదేశము మేరకు సుమంత్రుడు రథాన్ని సిద్ధం చేశాడు. రథముపై

సీతారామలక్ష్మణులు అధిరోహించారు. రథము కదిలింది. దశరథుడు అంతఃపుర కాంతలు అనుసరించారు. కాని రథాన్ని అందుకోలేకపోయారు. రథాన్ని ఆపుమన్నాడు దశరథుడు. నడుపుమన్నాడు రాముడు. సుమంత్రునికి ఎటు తోచలేదు. దశరథుని మాట రథ ధ్వనిలో వినరాలేదని తరువాత మహారాజుకు చెప్పవచ్చునన్నాడు రాముడు.

అయ్యో ఇదేమివింత ? సత్యమే తానయిన రాముడు సుమంత్రుని అసత్యము చెప్పుమని ప్రోత్సహించడమా ? ఇది తగునా ?

ఇక్కడ సుమంత్రుడు అసత్యము చెప్పడము ప్రధానము కాదు. అంత కంటే పెద్ద విషయము దశరథుని సత్యపాలనము. స్వామిని సత్య వాక్యుని కావించడానికి దాసుడు అసత్యము మాట్లాడడం తప్పుకాదు. ఒక గోవును కాపాడడానికి అసత్యము పలుకడం దోషము కాదు ! గోరక్షణ విశేషధర్మము. అలాగే స్వామిని సత్య వాక్యుని చేయడము విశేష ధర్మము.

రథము దశరథుని కనుచూపు మేర దాటిపోయింది. రాముని వెంటే దశరథుని మనస్సు పోయింది. మనస్సు వెంటే చూపుకూడ పోయింది. ఈ దృశ్యాన్ని వాల్మీకి హృద్యంగా వర్ణించాడు.

'రామం మేZనుగతా దృష్టిః ! అద్యాపిననివర్తతే

నత్వా పశ్యామి కౌసల్యే ! సాధు మా పాణినా స్పృశ' (తని శ్లోకం)

శ్రీరాముడు అడవికి వెళ్లిన తరువాత దశరథుడు ఒక్క క్షణం కూడ కైకేయితో గడుపడానికి ఇష్టపడలేదు. అంతే కాదు తన శవాన్ని కూడ ఆమె, ఆమె కొడుకు తాకకూడదని ఆంక్ష విధించాడు. తనవలనే ప్రియ పుత్రుని పోగొట్టుకొన్న కౌసల్యా భవనానికి వెళ్లాలనుకున్నాడు. కాని ఆయన దృష్టి ఆయన దగ్గర లేకుండా రాముని వెంట వెళ్లింది. ఎదుట ఉన్న కౌసల్య కూడ కనబడటంలేదు. ఆ రామ పిత రామ మాతతో ఇలా అంటున్నాడు.

రామం మేZనుగతా దృష్టిః :- కౌసల్యా ! నా రాముడు కల్యాణ గుణ

సముద్రుడు. సముద్రములో పడిన ఏ వస్తువూ తిరిగి రానట్లే రాముని అనుసరించిన నా చూపు తిరిగి రావడం లేదు.

నా రాముడు (రమయతి) ఆనంద ప్రదుడు కదా! ఆ ఆనందకరుని చూడడానికి అలవాటు పడ్డ నా చూపు దుఃఖ మయమైన ఈ ప్రపంచాన్ని చూడడానికి తిరిగి రావడంలేదు.

రూపాన్ని కన్ను గ్రహిస్తుంది కదా ఎక్కడైనా ! కాని రాముని రూపము నా కన్నునే (చూపునే) గ్రహించి తీసుకవెళ్లింది చూడు.

శ్రీరాముని చేతనుడనైన నేను అనుసరరించాలి కదా ! కాని ఇప్పుడు చేతనుడనైన నేనేమో ఇక్కడే ఉన్నాను. అచేతనమైన నా కన్ను ఆయనను అనుసరించింది.

పరమ పదంలో పరమాత్మను సేవించాల్సిన నా కన్ను సంసారంలో రాముని చూడడానికి వెళ్లింది.

జగత్తుకే నేత్రమైన రాముని వెంట నా సాధారణ నేత్రం వెళ్లిందే.

నా కన్ను నా స్వాధీనములో ఉండాలి కదా ! ఇప్పుడది రాముని స్వాధీనమైనది.

సారాసారాలను విశేషంగా గ్రహించేది దృష్టే కదా ! ఇప్పుడు నా దృష్టి సారాన్నే గ్రహించి వెళ్లింది.

నా వశంలో ఉండాల్సిన నా చూపు నా వశంలో లేకుండా పోయింది.

నా మనస్సును అనుసరించాల్సిన దృష్టి నా మనస్సు మాట వినకుండా రాముని వెంట పడింది.

కౌసల్యా ! కైకేయి, మంధరల దృష్టివంటిది కాదు నా దృష్టి –(నందామి పశ్యన్నపి దర్శనేన) – శ్రీరాముని దర్శనంతోనే ఆనందాన్ని పొందే నా దృష్టి ఇప్పుడాయనతోనే శాశ్వతంగా వెళ్లిపోయింది. నా కన్ను ఎంత మంచిదో చూడు ! ఇతర కన్నులన్నిటికి చూపు నిచ్చింది నాకన్ను.

చూచిన ప్రతి వస్తువుపై వ్యామోహం చెందిన నా కన్ను ఇప్పుడెంత మంచి పని చేసిందో చూడు.

దశరథుని దృష్టి ఆయన స్వాధీనంలో లేకుండా పోయినప్పటికి – తన దృష్టి రామానుసరణమనే మంచి పని చేసినందుకు 'నాకన్ను' ( మే దృష్టిః) అని మురిసిపోతున్నాడా రామ పిత.

అద్యాపిననివర్తతే :– రాముని వెంట వెళ్లితే మాత్రమేమిటి? వెంట వెళ్లింది తిరిగి రాదా మహారాజా? అని కౌసల్య అడిగింది. "ఏది? ఇప్పటి వరకు తిరిగి రాలేదు చూడు." అంటున్నాడు రాజు.

"తన విషయమైన శ్రీరాముడు దాటి వెళ్ళినా నాచూపు ఇంకా తిరిగి రాలేదు చూడు.

తిరిగి వస్తే మళ్లీ కైకేయి ముఖాన్ని చూడాల్సి వస్తుందో ఏమో అని నా దృష్టి తిరిగి రావడంలేదు చూడు.

ఎవ్వరికైనా ఏదైనా దుఃఖము కల్గితే ఆయన పరికరము ఆయన వెంటే ఉండాలి కదా! శ్రీరామ వియోగంతో పుట్టెడు దుఃఖములో నేను మునిగి ఉంటే నా పరికరమైన నా కన్ను నన్ను విడిచిపోయింది.

ఇంత కాలము నాతో కలిసి ఉన్న నా దృష్టి – ఇప్పుడు రాముడు కలువగానే తన వాడినైన నన్ను పూర్తిగా మరచి ('నోపజనంస్మరన్నిదం శరీరం') పోయింది.

అడవికి వెళ్ళిన రాముడు తిరిగి రాలేదు సరే ! ఆయన వెంట వెళ్ళిన నా దృష్టి అయినా తిరిగి రావచ్చు కదా ! వెళ్ళిన వాడు, ఆయనను వెదుక వెళ్లిన వాడు ఇద్దరు అటే వెళ్తే ఎలా?

కౌసల్యా ! రాముని స్వభావమే అటువంటిది కాబోలు. తాను తీసుక వెళ్లిన దేనినయినా తిరిగి పంపడేమో (నావర్తయిష్యతి).

కౌసల్య :– మహారాజా! మీరు మీ కన్ను ఎక్కడికో వెళ్లిందంటున్నారు కదా! కాని మీ కన్ను ఎక్కడికి వెళ్లలేదు. మీ దగ్గరే ఉంది.

దశరథుడు :– 'నత్వా పశ్యామి కౌసల్యే' అయ్యో కన్ను అంటే బయటికి కనుపడే గోళమా? కాదు పైకి కనుపడే నేత్ర గోళం లోని చూపు. నా కన్ను నా దగ్గరే ఉంటే నిన్నెందుకు చూడ జాలకున్నానే ? ఇక నాకన్నెక్కడిది ?

దేవీ ! నిన్ను చూడనప్పుడు నా కనులు ముడుచుకొని, నిన్ను చూచేప్పుడే నా కన్నులు విచ్చుకొంటాయే ? అటువంటి నిన్నే చూడజాలకున్నానే ఇప్పుడు ?

దూరంలో ఉన్న రాముని చూడకుంటే చూడకపోనీ – కాని దగ్గరలో ఉన్న నిన్నే చూడజాలకుందే నా కన్ను ?

రాముని చూడకుంటేనే ఉండజాలనే – అటువంటిది రామమాతవైన నిన్ను కూడ చూడకుంటే ఎలా జీవించగల్గుతాను ?

కౌసల్యా ! నీవు మాట్లాడే మాటను బట్టి నీ విక్కడ ఉన్నావను కొంటున్నాను – కాని నీవు కనపడడం లేదు.

కౌసల్యే :– కంటితో చూడ జాలకున్నా – నోరార పిలిచి అయినా తృప్తి పడుదామనుకొంటున్నాడు దశరథుడు – అందుకే కౌసల్యా! అని నోటినిండా పిలుచుకొంటున్నాడు.

కౌసల్యా! నీ వెంత మంచిదానవు! రామునికి అభిషేకం చేస్తే తాను మరణిస్తాను అన్న ఆ కైకేయి ఎక్కడ ? నీవెక్కడ ? రాముని విడిచి క్షణమైన నీవు జీవించనన్నావే?

దేవీ ! ఆనాడు నేను, నాతో పాటు లోకమంతా సంతోషించగా లోకభర్తను కన్నావే ? ఇప్పుడు నేను, లోకమంతా దుఃఖిస్తుంటే మాతో పాటు అయ్యో నీవు కూడ ఏడుస్తున్నావా ?

కౌసల్యే ! నత్వా పశ్యామి :– ఇంత వరకు అనర్థాన్ని కల్గించే కైకేయిని ఎంతో వ్యామోహంతో చూచాయే నా కన్నులు ! ఇప్పుడు దుఃఖాన్ని పోగొట్టే నీవు ఎదుటే ఉన్నా నిన్ను చూడలేకున్నాయి ఆ కన్నులు. ఎంత విపరీతమో చూడు ?

దశరథ మహారాజా అత్యంత దుఃఖ భరితుడయ్యాడే ! ఇక ఈయనను

ఒంటరిగా విడువవద్దు అనుకొని

కౌసల్య :- అయ్యో నేనిక్కడే ఉన్నాను మీకేమి కావాలి ? అంటే

సాధు మా పాణినా స్పృశ :- నా దుఃఖ మంతా తీరేలా నీ చేతితో నన్ను తడుము ! నిన్ను చూడజాలనందున – నాకంటి దృష్టిపోయిందనుకొంటున్నాను. అయినా నీ మాటలు వింటున్నందు వలన నాచెవులు సరిగానే ఉన్నాయి. నిన్ను పిలుస్తున్నాను కనుక నా నాలుక (మాట) సరిగానే ఉంది.

శ్రీ రాముని శిరస్సును వాసన చూచిన నా నాసికకు ఇప్పుడే వాసనలు రావడంలేదు. కనుక నా నాసికేంద్రియము కూడ దెబ్బ తిన్నట్లే ఉంది. ఇక నా చర్మము సంగతి చూడాలి నా చర్మానికి స్పర్శను గుర్తించే శక్తి ఉందాలేదా చూచుకోవాలి. నాకు నీ స్పర్శ తెలిసేలా గట్టిగా హత్తుకో !

సాధుస్పృశ:– 'ఇంత వరకు కైకేయితో గడిపి – నా రాముని కానలకు పంపి ఇప్పుడు నాతో ఇచ్చకములాడుతున్నాడే' అని నన్ను అసహ్యించు కోక – అయ్యయ్యో! అవిద్య వలన ఈయనకు కైకేయితో సంగమము కలిగి ఇటువంటి పని చేశాడు పాపము అయ్యో ! అని జాలితో నన్ను కౌగిలించుకో !

ఆనాడు మన వివాహకాలంలో అగ్ని సాక్షిగా నాతో పాణిగ్రహణం అత్యంత ప్రేమతో చేశావే! ఇప్పుడా ప్రేమనంతా చూపుతూ నా శరీరాన్ని తడుము.

సకలేంద్రియాలతో ఇచ్చే తృప్తిని ఒక స్పర్శతోనే కలిగించు.

సాధు మా పాణినాస్పృశ :- శ్రీ రాముని పడుకోబెట్టి లేపి అతని స్పర్శతో ఉత్తేజితమైన నీ (సాధుపాణినా) ఉత్తమ హస్తంతో తనివితీర నన్ను స్పృశించు!

సాధు స్పృశ :- రామ స్పర్శ కలిగితే ఉజ్జీవించి, లేకుంటే వాడిపోయే నన్ను – రామ మాతవైన నీవు నీ ఉజ్జీవన కరమైన చేతితో స్పృశించు.

'మాస్పృశ' ! నేనింత కోరినా కౌసల్యా ! నీవింకా నన్ను అసహ్యించుకొంటూనే ఉంటే – నన్ను తాకవద్దులే.

అయినా కౌసల్యా ! 'రామ స్పర్శ ఇప్పుడు నేరుగా లభించకున్నా రామ

మాత్రమైన నీ స్పర్శే నాకు ధారకంగా ఉంటుంది' అనుకొంటున్నాను - నీ స్పర్శతో నన్ను జీవింపచేయి (సాధుస్పృశ)

❀ ❀ ❀

మనకు భగవత్ స్పర్శ కావాలని ఎంత గాఢంగా కోరుకొన్నా అది ప్రత్యక్షంగా లభించదు కదా! అప్పుడు భగవత్ బంధువుల స్పర్శ అయినా మనకు ఉజ్జీవనకరమే!

'యం యం స్పృశతి పాణిభ్యాం' । యం యం పశ్యతి చక్షుషా

స్థావరాణ్యపి ముచ్యంతే । కింపున ర్బాంధ వాజనాః'

ఒక భాగవతోత్తముడు లేక భాగవతోత్తమురాలు దేనిని కంటితో చూచినా చేతులతో తాకినా అది పవిత్రమవుతుంది. ఇక బంధువుల మాట వేరే చెప్పాలా ?

దశరథుడా విధంగా కౌసల్యా హస్తాన్ని ఆధారంగా గ్రహించి - ఆ దేవి అంతఃపురానికి వెళ్లాడు.

ఇతిశం

## సుమిత్ర ఓదార్పు

కౌసల్యాదేవి - భర్త సన్నిధిలో శ్రీ రాముని గురించి విలపించ సాగింది. ఆమె ఒకసారి రాముని కాననలకు కారణమైన కైకేయిని నిందిస్తుంది. మరొక సారి దశరథుని అకార్యాన్ని ఖండిస్తుంది. రాముని అరణ్యానికి పంపడం కంటే అయోధ్యలో ఆయనను భిక్షమెత్తుకొమ్మన్నా బాగుండేది కదా అని నిట్టూరుస్తుంది. ఆ మాతృ హృదయం మళ్లీ ఎన్నడు సీతారామలక్ష్మణులకు అయోధ్యా వాసులు ఆనందంతో హార్దిక స్వాగతమిస్తారో అని ఆశతో ఎదురుచూస్తుంది.

కౌసల్యాదేవిని నిరంతరము నీడగా అనుసరించే సుమిత్రాదేవి రామమాతను ఓదారుస్తోంది.

''అక్కా ! పరమపదములోని నిత్యముక్తులు మార్పులేనివారు అక్షరులు. ఇక్కడ ఉండే బద్ధ జీవులు క్షరులు (మార్పు గలవారు) వీరిద్దరికంటే ఉత్తముడైన

పురుషుడు పరమాత్మ. అట్టి వాడే రాముడు. ఆయన ధర్మ స్థాపన కొరకే ధరణిపై అవతరించాడు. లక్ష్మణుడు ఆయనకు పరతంత్రుడైన జీవుడు – సీతా దేవి స్వయంగా లక్ష్మీదేవి. ఆమె పాతివ్రత్య ధర్మమును ఆచరించి చూపుటకే రాముని అనుసరించి వెళ్ళుచున్నది.

శ్రీ రాముడు స్వయంగా శంబరాసురుని కుమారుని చంపి బ్రహ్మాదులచే దివ్యాస్త్ర సంపదను లభించాడు.

శ్రీ రాముడు సూర్యునికే సూర్యుడు. అనగా సూర్యునికే వెలుగునిచ్చేవాడు. ప్రభువులకు ప్రభువు. శ్రీ దేవికి శ్రీలనిచ్చేవాడు. కీర్తికి కీర్తినొసగేవాడు. సహనానికే సహనము. దేవతలకు దేవత – సకల ప్రాణులకు సత్తాదాయకుడా స్వామి.

'నహి రామాత్పరోలోకేవిద్యతే సత్పధేస్థితః'

సన్మార్గాన్ని అవలంబించే శ్రీ రాముని కంటే మించిన వాడీ లోకంలోనే లేడు. ఆయన సీతా లక్ష్మణులతో అరణ్య వాసమును ముగించుకొని అయోధ్యకు తిరిగివచ్చి నిన్ను ఆనందింపజేస్తాడ'' ని భగవద్‌జ్ఞానము కలిగిన సుమిత్రాదేవి కౌసల్యాదేవిని ఊరడించింది.

కౌసల్య సత్వగుణ ప్రతీక. జ్ఞానవంతురాలు. అయినా పుత్రదుఃఖము ఎంత వారినైనా క్రుంగదీస్తుంది. అటువంటి సమయంలో భగవద్‌జ్ఞానము కలిగిన సు(మంచి) మిత్రులు (సుమిత్రలు) ఆదుఃఖాన్ని పోగొట్టడానికి ప్రయత్నించాలి. కౌసల్యాదేవి వంటి మన అందరికి దాని వలన దుఃఖోపశమనం కలిగి భగవత్కృపకై ఎదిరిచూడడానికి వీలు అవుతుంది.

## వనగమనము

రథముపై అరణ్యములకు వెళ్ళు చున్న రాముని వెంట మొత్తం అయోధ్యయే తరలి వెళ్తున్నదా అన్నట్లు ప్రజలనేకులు వెళ్ళతున్నారు వారందరు రాముని విడిచి తాము ఉండజాలమని రాముని తిరిగి రమ్మని ప్రార్థిస్తున్నారు. రాముడు వినడం లేదని గుఱ్ఱాలను వేడుకొంటున్నారు. గాలికి ఊగేచెట్లు – కలకలారావము చేసే

పక్షులు రాముని తిరిగి రమ్మని పిలుస్తున్నాయా అన్నట్లుండెను. వారు ఆ రాత్రి తమసానదీ తీరానికి చేరారు.

అది అరణ్యవాసానికి ఆరంభ దినము కనుక ఆ రాత్రి వారెవ్వరు ఆహారమును స్వీకరించలేదు.

తెల్లవారక ముందే రాముడు మేలుకొని అలసట వలన గాఢనిద్రాగతులయిన అయోధ్యా ప్రజలెవ్వరు తెలివికి రాకముందే సుమంత్రుని ఆజ్ఞాపించి రథమును సిద్ధము చేయించి – ఎవ్వరికీ రథచక్రాల గుర్తు కూడ తెలియకుండే విధంగా అరణ్యాలలోనికి ముందు ప్రయాణము చేశాడు. ఆ తరువాత మేల్కొన్న అయోధ్యా ప్రజలు హతాశులై ఇండ్లకు తిరిగి వెళ్లారు. అయోధ్యకు తిరిగి వచ్చిన భర్తలను చూచి భార్యలు సంతసించలేదు. రాముడు రాకుండా ఒంటరిగా తిరిగి వచ్చినందుకు వారిని పరిపరి విధాల నిందించారు.

శ్రీ రాముడు ఉత్తర కోసలము దాటి దక్షిణ కోసలములో ప్రవేశించాడు. అక్కడ ప్రజలందరు రామునికెదురు వచ్చి దుఃఖింపగా – వారిని ఆయన ఓదార్చి పంపాడు. త్రోవలో వేదశ్రుతి, గోమతి, స్యందికానదులను దాటి – అయోధ్యా పురానికి కడసారి ప్రణమిల్లాడు. వారు పావన గంగా తీరాన్ని చేరుకున్నారు. అక్కడే శృంగి బేరపురముంది. ఆ రాత్రి వారు అక్కడే ఆగారు. శృంగి బేరపురమనగా కొమ్ములు గల మృగ చర్మాలు వ్రేలాడుతూ ఉండే ఊరు. అక్కడ నిషాదులు ఉంటారు. ఆ నిషాదులు అంటే హీనజాతి వారు కాదు. వేదాధికారము యజ్ఞాధికారము కలవారు. 'నిషాదఃస్థపతింయాజయత్' అనే మాట వారికి యాగాధికారాన్ని బలపరుస్తుంది.

ఆ నిషాదులకు అధిపతి గుహుడు. ఆ మహానుభావుడు అన్ని యజ్ఞయాగముల కంటే రామభక్తే మిన్న అని గ్రహించిన వాడు. శ్రీ రాముడాయనను 'ఆత్మ సమః సఖా' తనతో సమానమైన స్నేహితుడని సంభావించాడు.

# గుహుడు

'గుహయతీతి గుహః' తన జ్ఞానాన్ని దాచుకొన్నవాడు గుహుడు. అందుకే ఆయన శ్రీ రామునికి ఆత్మ సముడు. 'జ్ఞానీత్వాత్మైవ' పరమాత్మకు జ్ఞానే ఆత్మ.

'జ్ఞానీతు పరమైకాంతీ – తదాయత్తాత్మ చేతనః తత్సంశ్లేషైక సంతుష్టఃత ద్వియోగైక దుఃఖితః.'

లోకుల దృష్టికి దూరంగా ఉండి భగవత్ సంశ్లేషనే సౌఖ్యంగా భగవద్విరహాన్నే దుర్భర దుఃఖంగా భావించేవాడు జ్ఞాని. గుహుడు అటువంటివాడే. అందుకే ఆయన ఆత్మ సముడైన సఖుడు. 'ద్వాసుపర్ణా సయుజాసఖాయా' అని వేదము జీవాత్మను పరమాత్మకు సఖునిగా పేర్కొంది.

గుహునికి శ్రీ రాముడు సీతా లక్ష్మణులతో కలసి తన దగ్గరికి వచ్చాడని తెలిసి – పట్టరానంత హర్షము కలిగింది. ఆయన తన పరివారాన్నంతా తీసికొని – అతిధులకు కావలసిన ఆహార పదార్థాలను పూజా ద్రవ్యాలను తీసుకొనివచ్చాడు.

శ్రీ రామునికి గుహుడు ప్రేమతో తనను కలుసుకోవడానికి రావడమే మహానందాన్ని కల్గించింది. 'పరమాత్మ ఎంత అల్ప సంతోషో – ఎంత సులభుడో' చూడండి.

' పద్భ్యాం అభిగమాచ్చైవ స్నేహ సందర్శనేనచ'

'గుహా ! ఇందరితో కలసి నన్ను కలువడానికి నడిచి వాచ్చావా ? ఎంత స్నేహాన్ని చూపావో కదా' అని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తాడు.

గుహుడు అడవిలోనే పుట్టి అడవిలోనే తిరిగేవాడు. ఆయన నడచి రాక విమానంలో రాగల్గుతాడా? కానల నడిస్తేనే కంది పోవడానికి ఆయన శ్రీ రామునివలె మధురమూర్తా ? అంత సుకుమారుడా? భగవంతుడు తన విషయంలో భక్తుడు పడ్డ ఏ కొద్దికష్టానికైనా విలవిలలాడుతాడు. గుహుడు పూర్వజన్మలో కూడ గొప్ప రామభక్తుడు.

శ్రీ రాముడు గుహుని ప్రేమతో గాఢాలింగనం చేసికొన్నాడు. అమరులకు

సైతము అపూర్వమైన రామాలింగనాన్ని లభించిన ధన్యుడు గుహుడు.

రాముడు రథాశ్వములకు మాత్రమే ఆహారముల నిప్పించి జలములను మాత్రమే తాము స్వీకరించి – సీతా దేవితో కలిసి భూమిపై నిద్రించాడు.

❀ ❀ ❀

గుహుడు వేదాధికారం కలవాడైనా కానలలో దివారాత్రాలను గడిపేవాడు. తన అంతర్జ్ఞానానికి ప్రకాశములేని వాడు. అటువంటి వానిని పరమాత్మ ఆత్మ సముడైన సఖునిగా సంభావించి – తన సర్వస్వమైన కౌగిలిని ఆయనకు అందించాడు.

భగవత్ప్రీతికి శరీర, జాతి భేదాలు, జ్ఞాన భేదాలు అడ్డురావని గుహుని సంఘటన నిస్సందేహంగా నిరూపిస్తుంది.

❀ ❀ ❀

ధర్మాభిమాని అయిన దాశరథి ఆ రాత్రి నేలపై నిద్రించాడు. కాని సౌమిత్రికి ఆ దృశ్యము సహించడమే అసాధ్యమైంది. ఆయనకు ఆ రాత్రి నిద్రే కరువైంది. కన్నీరుమున్నీరుగా కారుస్తూ అలాగే చూస్తుండి పోయాడు.

గుహుడు – తాను తన పరివారంతో కాపలాకాస్తానని – లక్ష్మణుని నిద్రపొమ్మని తెలిపాడు. కాని అయన పడుకొంటాడా ?

'కథం దాశరథౌభూమౌశయానే సహ సీతయా

శక్యా నిద్రా మయా లబ్ధుం జీవితంవా సుఖానిచ'

గుహా ! దశరథ చక్రవర్తి సుకుమార కుమారుడు కఠిన భూమిపై అత్యంత సుకుమారి అయిన సీతాదేవితో పడుకొన్న దృశ్యం నా హృదయాన్ని ద్రవింపజేస్తోంది. నాకు నిద్రవస్తుందా? నాకు జీవితము ఇష్టమవుతుందా? సుఖాలు రుచిస్తాయా? అన్నాడు సౌమిత్రి.

నిజానికి లక్ష్మణుని నిద్రపొమ్మని గుహుడు చెప్పడం – తనకు నిద్రేరావడం లేదని అతను తెలుపడం వెనుక ఒక రహస్యాన్ని రసజ్ఞులు ఆవిష్కరిస్తారు.

అయోధ్యా వాసులందరు వెళ్లిపోయాక ఆరాత్రే రాముడు అడవిలో మొదటిసారి నిద్రించడం. గుహుడి మనస్సులో ఒక అనుమానం మొలకెత్తింది. 'ఒక రామానుజుడు తాను స్వయంగా దగ్గరలో లేకుండానే అన్నను అడవులకు పంపాడే మరొక అనుజుడు అన్నను అనుసరించి అడవులకు వచ్చాడు. కాని రాత్రి సమయంలో నిద్రాగతుడైన రామునికి మేల్కొని ఉన్న లక్ష్మణుడు ఏ అపకారాన్ని కావిస్తాడో' – అనే అనుమానంతో గుహుడు లక్ష్మణుని నిద్రించుమన్నాడు.

'అతి స్నేహఃపాపమాశంకతే' ప్రేమగల విషయంలో భయము సహజమే కదా!

సౌమిత్రి మాత్రము సామాన్యుడా? అనవరతము అరణ్యాలలో నివసిస్తూ కఠినమైన జీవనం గడిపే గుహుడు నిద్రాగతులయిన సీతారాములకు ఏ ప్రమాదం కల్గిస్తాడో అనే అనుమానం ఆయన మనస్సులో కూడ కలిగింది. అందుకే ఆయన తనకు నిద్రరావడం లేదని – జాగ్రత్తగా ఉన్నాడు.

'అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చతే'

రామా! నీవు మేల్కొన్నా – నిద్రించినా అన్ని రకాల పరిచర్యలను కావిస్తానని మాటిచ్చాడు కదా! తన రక్షణ ఆరాత్రే మొదలైందని అనుకొన్నాడు ఆసేవానిరతుడు.

శూలహస్తుడై శ్రీరాముని చుట్టూ తిరుగుతున్న తమ నాయకుడైన గుహుని ధనుర్బాణధారి అయిన లక్ష్మణుని గుహానుచరులు విశ్వసించలేదు. వారిద్దరి ప్రతి చిన్న చర్యనైనా జాగ్రత్తగా గమనించారు. ఆ అటవీ వాసులు. అణువంత అనుమానం కల్గినా వారిద్దరిని అంతంచేయడానికి విల్లమ్ములు చేత ధరించి సిద్ధంగా ఉన్నారు అనుచరులు. అద్భుతమైనదికాదా రామ ప్రేమ!

తెల్లవారింది. సీతారాములు మేల్కొని కాలకృత్యాలు తీర్చుకున్నారు. శ్రీరాముడు సుమంత్రుని అయోధ్యకు వెళ్లిపొమ్మని ఆదేశించాడు. కైకేయి

మనస్సుకు కష్టం కలుగకుండా చూడమని, ఆమెకు తాను సీతాలక్ష్మణులు కూడా పాదాభివందనం చేశామని తెలుపమని – భరతుని పట్ల అనురాగంతో ఆయనను గాఢాలింగనం చేసుకొన్నట్లు తెలుపమని ఆజ్ఞాపించాడు.

సుమంత్రునికి రామాదేశంతో హఠాత్తుగా అంతాశూన్యమనిపించింది. ఇంతవరకు అడవిలో అయినా రామానుసరణము ఆనందాన్నే కల్గించింది. ఆ మహాత్మునికి అకస్మాత్తుగా రామాజ్ఞతో ఆ ఆనందమంతా ఆవిరి అయిపోయింది. రామవిరహమే తనకు తప్పకపోతే తాను రథాశ్వములతోపాటు అగ్ని హోత్రునికి ఆహుతి అవుతానని అన్నాడాయన. అరణ్య వాసకాలాన్ని తాను రామునితోనే గడిపి, అనంతరము అదే రథముపై వారిని అయోధ్యకు తీసుక వెళ్ళాలన్నదే తన అభిమతమని అన్నాడు.

అందుకు రాముడు అంగీకరించలేదు. సుమంత్రుని చూడనిదే తాము అరణ్యాలకు వెళ్ళామని కైక విశ్వసింపదని – దశరథుని ఆమె అనుక్షణం సాధిస్తుంది – కనుక తప్పక వెళ్ళిపోవాలని సుమంత్రుని శ్రీరాముడు అనునయించాడు.

గుహుడు రాముని పదునాలుగు సంవత్సరాలు తనతోనే గడుపవలసిందని ప్రార్థించాడు. కాని జనసంచారము గల ఆ ప్రదేశములో ఉండడానికి రాముడు అంగీకరింపలేదు.

రామాజ్ఞతో గుహుడు మఱ్ఱిపాలను తెచ్చివ్వగా రామలక్ష్మణులిద్దరు ఆ పాలతో జడలుకట్టుకొని తాపస వేషము ధరించారు. అడవిలో ఉన్నంతవరకు అటవీ వ్రతనియమాలతో బ్రహ్మచర్య దీక్షతో గడిపి – అయోధ్యకు తిరిగి రాగానే గృహస్థాశ్రమాన్ని స్వీకరించడానికి తగిన 'వైఖానస' దీక్షను వారు స్వీకరించారు.

గుహుడు నౌకను తెప్పించగా సుమంత్ర గుహులను అక్కడే నిలిపి వారు నౌకపై గంగను దాటారు. గంగాజలము మధ్యలో 'తాము క్షేమంగా వనవాస దీక్షను పూర్తిచేసికొని వచ్చాక లక్షగోవులను బ్రాహ్మణులకు దానమిస్తామని రుచికరమైన అన్నాన్ని అర్పిస్తామని – నదీతీర దేవాలయాలలో అర్చనలు జరిపిస్తామని సీతాదేవి దండము సమర్పించింది.

నౌక గంగా దక్షిణ తీరాన్ని చేరాక వారు దిగి ముందుకు వెళ్లారు. కనుచూపు అందనంత దూరము వెళ్లాక సుమంత్రుడు హతాశుడై అయోధ్యకు తిరిగివెళ్లాడు.

## ముందు నడువు

సుమంత్రుడు కనుచూపు మేర దాటిపోగానే శ్రీరాముడు లక్ష్మణునితో 'సోదరా! ఈ నాటినుండి మనము ముగ్గురం మాత్రమే అటవీ సంచారము చేయాలి. మనమిద్దరము ముఖ్యంగా సీతను జాగ్రత్తగా సంరక్షించాలి. ఈ అడవి మనకు క్రొత్తది. ఇందులో తిరుగుతున్నప్పుడు ఏ ప్రమాదాలు ముంచుకొచ్చి మీదపడుతాయో తెలియదు. అందువలన ఏమరిపాటు తగదు.

'అవశ్యం రక్షణం కార్యం! అదృష్టే విజనే వనే

అగ్రతో గచ్ఛ సౌమిత్రే! సీతా త్వామనుగచ్ఛతు

పృష్ఠతోऽహం గమిష్యామి – త్వాంచసీతాంచ పాలయన్'

వారు ముగ్గురు సంచరింపవలసిన విధానాన్ని శ్రీరాముడు లక్ష్మణునికి తెలుపుతున్నాడు.

'లక్ష్మణా ! – అడువులలో ప్రమాదాలను పసిగట్టుతూ – నీవు ముందుగా వెళ్లాలి. నిన్ను అనుసరిస్తూ సీతాదేవి నడుస్తుంది. ఆవిడ వెనుక కాపాడుతూ నేను వస్తుంటాను.

శ్రీరామాయణము ఒక సముద్రము. ఒక రత్నాకరం. లోతుల్లోకి వెళ్లగల్గిన వాళ్లకు కావలిసినన్ని రత్నాలు లభిస్తాయి.

చూడటానికి శ్రీరాముని మాటలు ఎంత సాధారణంగా కనిపిస్తాయి! కాని ఆ మాటల లోతు తెలిసిన వాళ్లకు ఎంత అర్థ సంపద లభిస్తుందో కదా! లక్ష్మణుడు ముందు వెళ్లాలి. సీతాదేవి ఆయనవెంట నడుస్తూ వెళ్లుతుంది. వారిద్దరి వెనుక రాముడు వెళ్తాడు. ఇదే కదా రాముని మాటలకు అర్థము ?

రాముని మాటలకు ఇంతే అర్థమయితే – వాల్మీకి కవిత్వములోని

గొప్పదనమేమిటి? ఆయన కవితా సౌందర్యమేమిటి?

అతి సాధారణంగా కనిపించే వాల్మీకి వాక్కులలోని అర్థ వైచిత్రిని గమనిద్దామా!

సీతా రామ లక్ష్మణుల – వన సంచారాన్ని సూచిస్తున్న ఈ పలుకులలోని పసిడిని పదిల పరుచుకొందామా!

శ్రీరాముని ఈ ఆదేశంలో 'జీవాత్మ ప్రకృతి పరమ పురుషుల యాత్రా విధానము' రహస్యంగా దాగి ఉంది. ఈ రహస్యము మన జీవిత యాత్రకు కూడ ఎంతో ప్రధానమైంది. అందువలన ఈ రహస్యాన్ని మనము ప్రకాశింపజేసికోవాలి. ఏమిటా రహస్యము ?

లక్ష్మణుని ముందు నడువుమని – సీత ఆయన వెనుక వస్తుందని రాముడు నిర్దేశిస్తున్నాడు.

లక్ష్మణుడొక జీవుడు. మన అందరికి ప్రతీక సీత ప్రకృతి. రాముడు పరమాత్మ.

మనమందరము జీవులమే. సాధారణంగా మనమెలా నడుచుకొంటాము ? మన దేహాన్ని ముందుంచుకొని నడుస్తుంటాము. మనకు దేహమే ప్రధానమనిపిస్తుంది. దేహసౌఖ్యాలే ప్రధానమనిపిస్తాయి.

ఆ దేహ సౌఖ్యాల వెంటే మన పరుగు. ఎంత పరుగెత్తినా ఎన్ని సౌఖ్యాలను అందుకొన్నా మనకు సంతృప్తి లేదు. వాటిని అందుకొనే ప్రయత్నంలో మనము ఎన్ని పాపాలను చేయడానికైనా వెనుకాడము. ఆ ప్రయత్నంలో పరమాత్మను పట్టించుకోము. అటువంటి మనకు మన జీవన యాత్ర జరుపుకోవలసిన విధానాన్ని రామ పరమాత్మ తెలియజేస్తున్నాడు.

'అగ్రతో గచ్ఛ సౌమిత్రే – సీతా త్వా మనుగచ్ఛతు'

సౌమిత్రీ ! నీవు వెనుకకు చూడకుండా ముందు నడువు! సీత నిన్ను అనుసరిస్తుంది.

మనము మన శరీరాన్ని - శరీర సౌఖ్యాలను వెనుక వేసి - శ్రీ రామచంద్ర స్వామి ఆజ్ఞను పాలిస్తూ జీవన యాత్రను కొనసాగించాలి.

అప్పుడు తనను నిర్లక్ష్యం చేసి - కృత నిశ్చయంతో ముందు అడుగు వేస్తూ వెళ్లే దృఢమైన జీవుని - విధిలేక ప్రకృతి అనుసరిస్తుంది. ఇక ప్రకృతి - తనకు సౌఖ్యాలు కావాలని జీవుని నిర్బంధింపజాలదు. తనకు ఇంత కాలము పరవశుడయిన జీవునికి ప్రకృతి తానే వశమై పోతుంది. జీవుడు ప్రకృతిని జయిస్తాడు. పరమాత్మ ఆదేశాన్ని పాటిస్తూ ముందు వెళ్లుతాడు. తనతో పాటు తన ప్రకృతిని కూడ పరమాత్మ సేవలో వినియోగిస్తాడు. జీవునికి ఇంతకంటే చేయవలసింది ఇంకేమి లేదు.

అప్పుడు పరమాత్మ ఏమి చేస్తాడు?

'పృష్ఠతోZహం గమిష్యామి

త్వాంచ సీతాంచ పాలయన్'

జీవ ప్రకృతుల నడవడికి సంతుష్టుడై తన రక్షణ ధర్మాన్ని తాను నిర్వహిస్తూ పరమాత్మ వాటి వెంటే ఉంటాడు.

పరమాత్మ రక్షణను పొందిన ప్రకృతి జీవులకు కావలసిన ఆనందము మరొకటి ఉంటుందా?

శ్రీ రామ చంద్ర స్వామి మన జీవన గమన విధానాన్ని సూచిస్తూ మనందరికి ఎంత అభయాన్ని ప్రసాదించాడు! ఆ స్వామి ఆదేశాన్ని అక్షరాల పాటిస్తూ ఆయన సేవలోనే మన ప్రకృతి ఆత్మలను తరింపజేయడమే మనకు శ్రేయస్కరమైన విషయము - ఆ స్వామి అభయాన్ని అనవరతము స్మరించుకోవడమే మనకు భద్రమైన విషయము మనను.' మన శరీరాన్ని రక్షించే వాడు రామభద్రుడే కదా!

శ్రీరాముడు రామానుజానికిచ్చిన సందేశాన్ని శ్రీకృష్ణుడు అర్జునునికి కురుక్షేత్రంలో అందించాడు. 'తతోయుద్ధాయ యుజ్యస్వ' -అర్జునా నీవు నా ఆజ్ఞననుసరించి యుద్ధం చేయి 'అహంత్వా సర్వపాపేభ్యోమోక్షయి ష్యామి' నేను

నిన్ను అన్ని పాపాల నుండి విడుదల గావిస్తాను ‘ఆ సర్వశక్తి అభయమే మనకు శ్రీరామరక్ష.

❀ ❀ ❀

‘మన్యే ప్రీతి విశిష్టాసా’

## నాకంటే ప్రియమైనది

అడవిలో రామభద్రుడు లక్ష్మణునితో కైక కారణంగా కౌసల్యా దేవికి కలిగిన బాధను తలచుకొని ముచ్చటించాడు.

లక్ష్మణా! నేనెన్నడు నిజంగా మా అమ్మకు ప్రియాన్ని కల్గించలేదు. ఆమెను నిర్లక్ష్యంచేస్తూ వచ్చాను. తనకు అప్రియాన్ని కలిగంచిన కైక గురించి – ఒక్క మాటైనా కఠినంగా నేను మాట్లాడలేదు. నాకంటే మా అమ్మ అంతఃపురంలో పెరుగుతుండే ఒక గోరువంకే మా అమ్మకు ప్రియాన్ని కలిగించింది.

‘మన్యే ప్రీతివిశిష్టాసా – మత్తో లక్ష్మణ శారికా!

యస్యాః తద్రూయతే వాక్యం – శుక పాదమరేర్దశ’

కౌసల్యాదేవి ఒక రోజు భగవదారాధన కొరకు పాయసాన్ని ఒక పాత్రలో సిద్ధంచేసి ఉంచింది. అంతలో హఠాత్తుగా ఒక పిల్లి వచ్చి పాయసపాత్రవైపు వెళ్ళుతోంది. దానిని గమనించిన గోరువంక ‘ఓ చిలుకా! వెంటనే శత్రువైన పిల్లి పాదాన్ని కొరికి వేయి’! అని పలికింది. చిలుక గోరువంకల పలుకులాలకించి కౌసల్యాదేవి అటువైపు రావడం, పిల్లి పారిపోవడం జరిగింది. కౌసల్యాదేవి తనపాయసాన్ని కాపాడిన గోరువంకను ఎంతో మురిపెంతో ముద్దాడింది.

శ్రీరామభద్రునికి సంఘటన ఎంతో ప్రీతి దాయకమైంది. ఈ సంఘటన ఒక పరమార్థాన్ని బోధిస్తుంది.

–: విశేషార్థము :–

'శారికా' అనే స్త్రీలింగపదానికి 'గోరువంక' అని అర్థము. దీనితో భగవద్విషయంలో స్త్రీప్రాయంగా విధేయుడైన ఆచార్యుడు సూచింపబడుతున్నాడు.

'శుకః' అనే పులింగ పదంతో చిలుక అనే అర్థం ద్వారా పరమాత్మ సూచింపబడుతున్నాడు.

గోరువంక చిలుకను ప్రార్థించినట్లుగా ఆచార్యుడు పరమాత్మతో 'పరమపురుషా! మా శత్రువైన సంసారమును అడుగంటేలా నిర్మూలించు మని - ప్రార్థించడం ఇక్కడ పరమార్థము.

ఇతిశం

## బ్రదుకజాలము

లక్ష్మణా! మా తల్లి కౌసల్యాదేవి దుఃఖాన్ని తొలిగించడానికి మన నాన్న దశరధుని ఈ స్థితిలో సంరక్షించడానికి నీవు వెంటనే అయోధ్యకు వెళ్లాలి అని అడిగాడు రామచంద్రుడు. 'నచసీతాత్వయాహీనా! నచా హమపిరాఘవ ముహూర్త మపి జీవావః జలాన్మత్స్యా వివోద్ధృతౌ'

లక్ష్మణుడు హఠాత్తుగా ఉలిక్కిపడ్డాడు. రామునికి అంజలి ఘటించి 'రాఘవా ! నిన్ను విడిచి నేనైనా సీతాదేవి అయినా క్షణమైనా జీవింపగల్గుతామా? మా పరిస్థితి నీటి నుండి తీయుబడి నేలపై వేయబడ్డ చేపవలె ఉంటుంది. చేప ఎక్కువ లోనికి ఎక్కువ నీటి తడి ఆరే దాకా మాత్రమే బ్రతుకగల్గుతుంది. నీవు దూరం చేసినా మళ్లీ దగ్గరికి తీసికొంటావనే ఆశ ఉన్నంత వరకే మా ఊపిరి ఉంటుంది.

❀ ❀ ❀

ఇక్కడో ముఖ్య విషయము సూచింపబడుతోంది. సీతా లక్ష్మణులు జీవస్వరూపులు. రాముడు పరమాత్మ. వీరిమధ్య శరీర శరీరి సంబంధము సహజమైంది –'యస్యాత్మా శరీరం' అని శృతి –పరమాత్మకు జీవాత్మ శరీరము వంటిదని వివరించింది.

ఆత్మ ఉన్నంత వరకే శరీరానికి విలువ. కేశవుడు విడిచి వెళ్లగానే శరీరము శవము కావలసిందే కదా! అలాగే రాముడు వెంటనుంచు కొన్నంత వరకే సీతా లక్ష్మణులు జీవిస్తారు. తమను ఆయన పూర్తిగా వదిలివేశాడని తెలిసిన తక్షణమే వారికి మరణమే గతి. ఈ విషయాన్నే లక్ష్మణుడు శ్రీరామునితో మనవి చేశాడు.

అయితే ఇక్కడ రాముడు లక్ష్మణునొక్కడినే అయోధ్యకు తిరిగి వెళ్లమన్నాడు. కారణం సీతాదేవి ఇంతకుముందే 'యస్త్వయా సహ స స్వర్గో - నిరయోయస్త్వయా వినా' । రామా! నీ తోటిదే నాకు స్వర్గము. నీవు లేనిదే స్థలమైనా నాకు నరకమే అని నిశ్చయంగా తెలిపి ఉంది.

సీతాదేవి శ్రీదేవే. శ్రీ దేవి ఎప్పుడూ భగవంతుని ఆశ్రయించే ఉంటుంది. 'శ్రీయతే' - అంతే కాదు భగవద్జ్ఞానం కలిగే ఉంటుంది.

మిగిలిన జీవులలా కాదు. అజ్ఞానం వలన భగవంతునికి దూరమై కూడ ఉండగల్గుతారు. ఆచార్య కటాక్షం వలన మళ్లీ భగవద్జ్ఞానం కలిగి - ఆయన కటాక్షంతో పరమాత్మను చేరుతారు.

ఇక్కడ లక్ష్మణుని అధ్యవసాయాన్ని పరీక్షించడానికే ఆయనను రాముడు అయోధ్యకు తిరిగి వెళ్లమన్నాడు. కాని తన అధ్యవసాయాన్ని నిరూపించుకొని లక్ష్మణుడు రామునికి ప్రీతిపాత్రుడయ్యాడు. తెల్లవారి రాముడు సీతా లక్ష్మణులతో కలిసి మరింత ముందుకు ప్రయాణం సాగించాడు. వారు త్రివేణి సంగమమైన ప్రయాగకు చేరారు. అక్కడే భరద్వాజాశ్రమముంది.

## భరద్వాజుడు

భరద్వాజుడు విద్యాప్రియుడు - మూడు మానవాయుష్యకాలాలను బ్రహ్మను ప్రార్థించి లభించి జ్ఞానార్జనకే వినియోగించాడు. అంతేకాదు మిగిలిన జీవిత కాలాన్నంతటిని అధ్యయన, అధ్యాపనాలతో గడిపిన జ్ఞానప్రియుడాయన.

ప్రకృతి సౌఖ్యాలకు పరవశించక, ఇంద్రియ నిగ్రహంతో భగవద్ధ్యానంతో జీవితాన్ని తరింపజేసికొంటున్న జితేంద్రియుడా మహాముని.

ద్వాజమనగా వీర్యము. దానిని భరించినవాడు అనగా ఊర్ధ్వరేతస్కుడని జితేంద్రియుడని అర్థము.

భరద్వాజ మహర్షి సీతారామలక్ష్మణులను గో, మధుపర్క, అర్ఘ్యపాద్యాచనీయాదులతో సత్కరించి - తన ఆశ్రమంలోనే అరణ్యవాసాన్ని పూర్తిజేసుకొనుమని శ్రీరామునికి సూచించాడు.

ఆ ఆశ్రమము అయోధ్యకు సమీపంగా ఉన్నందువలన తాము అక్కడ ఉండజాలమని, అందువలన తమకు ఆవాసయోగ్యమయిన స్థలాన్ని చూపుమని అర్థించాడు శ్రీరాముడు.

అక్కడికి పది క్రోసుల దూరంలో ఉన్న చిత్రకూటమే వారికి నివాసయోగ్యమయినదని, అక్కడ ఎందరో మహర్షులు తపస్సు చేసి స్వర్గానికి వెళ్లారని భరద్వాజుడు తెలిపాడు. (భరద్వాజుని మహిమను గురించి ముందు వివరంగా చూస్తాము) సీతారామ లక్ష్మణులు భరద్వాజ మహామునికి నమస్కరించి ముందుకు సాగారు.

## పరతంత్రుడను

ఒక క్రోసు దూరంలో వారికొక నల్లని అడవి అగుపించింది. అది దాటి వారు యమునా నదిని సమీపించారు. వడివడిగా ప్రవహించే ఆ నదిని కట్టె తెప్ప సహాయంతో దాటారు. సీతాదేవి యమునా నది జలాలను అర్చించి తమ ప్రయాణము సుఖాంతం కావాలని ప్రార్థించింది - ఆ నదిని దాటాక కొంత దూరంలో వారికొక పచ్చని ఆకులు గల నల్లని మఱ్ఱిచెట్టు కనవడింది. సీతాదేవి ఆ వృక్ష రాజాన్ని కూడ హృదయపూర్వకంగా అర్చించింది.

ఆ వన సౌందర్యము అద్భుతమైనది. అక్కడ మహర్షుల ఆశ్రమాలున్నాయి. అనేక పక్షుల కిలాకిలారావములతో ఆ వన పరిసరాలు హాయిని గొల్పుతున్నాయి.

అక్కడే వాల్మీకి ఆశ్రమము ఉంది. సీతారామలక్ష్మణులు ఆ ఆశ్రమంలోకి వెళ్లి వాల్మీకి మహర్షిని సందర్శించి ప్రణమిల్లి తమ విషయం వివరించారు. అక్కడ

ఆ మహర్షి సత్కారాలను, ఆశీర్వాదాలను పొంది ముందుకు సాగారు.

చిత్రకూటము చేరుకోగానే – శ్రీరాముడు 'లక్ష్మణా! నీవు ఇక్కడ స్థల సౌందర్యాన్ని, జలవసతిని చూచి ఒక ఆశ్రమాన్ని నిర్మించు మని' తమ్ముని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు పరతంత్రుడు. పరతంత్రుడంటే స్వామి కొరకే జీవించేవాడు. తన కొరకే జీవించడం స్వాతంత్ర్యము. సౌమిత్రి స్వాతంత్ర్య భారాన్ని సహింపరానిదిగా భావించేవాడు. స్థల జల రామణీయకాలను చూచి ఆశ్రమ స్థలాన్ని అన్వేషించే భారము వహించడానికి ఆయన ఇష్టపడలేదు.

'పరవానస్మి కాకుత్స్థ ! త్వయి వర్షశతే స్థితే

స్వయంతురుచిరే దే శే! క్రియతామితి మావద!'

శ్రీరామభద్రా ! నేను జీవించి ఉన్నంత కాలము నేను నీ దాసుడనే ! అందువలన ఆశ్రమ స్థలాన్ని వెదికే భారాన్ని నాపై వేయక నీవే నిర్ణయించి – నిర్మాణాన్ని నిర్ణయించు' మని ప్రార్థించాడు.

రామాజ్ఞతో రమణీయంగా ఒక ఆశ్రమాన్ని రామానుజుడు నిర్మించాడు. వాస్తు శాంతికై శ్రీరాముడు హోమం చేసి దేవతలను సంతోషింపజేశాడు.

ఆ ఆశ్రమంలో దేవతా స్థానం నిర్మింపబడింది. ఆయా స్థానాల్లో ఆయా దేవతలు ప్రతిష్ఠ జేయబడ్డారు.

ఆ అరణ్యవాసమే – ఆ ఆశ్రమ నివాసమే వారికి అయోధ్యా జీవనము కంటే హాయినిచ్చింది. తన సేవలతో సీతారాములిద్దరిని ఆనందపరుస్తూ – దశరథుని మరిపింపజేశాడా సౌమిత్రి.

ఇతిశం.

## దశరథ నిర్యాణము

కౌసల్యా భవనములో ప్రవేశించిన దశరథుడు కన్నీరు మున్నీరుగా రాముని

కొరకు విలపించాడు. మూడు రకాల బాధ అయినను ముంచి వేసింది. 1. రామ వియోగ బాధ – 2. కైకేయి ద్రోహబాధ – 3. కౌసల్య ఉపేక్ష బాధ.

ఒకవైపు రాముడు – తన రాముడు – క్షణమైనా ఇంతకాలం తనను విడిచి ఉండని రాముడు తనకు దూరంగా అతి దూరంగా వెళ్ళిపోయాడనే బాధ దశరథుని మనస్సును కలచి వేస్తోంది.

దానికి తోడు కైకేయి ఎంత తెగించింది! ఎంత ద్రోహము చేసింది! తాను ఏనాడైనా కైకేయి ఇంత నయవంచకురాలని, క్రూరురాలని, తనను ఇంతగా వెన్నుపోటు పొడుస్తుందని (దశరథుడు) కలలో నైనా ఊహించాడా? లేదు. హఠాత్తుగా కైకేయి చేసిన ఈ దారుణము దశరథుని గాయపడిన మనస్సును ముల్లుగా మరింత కెలికింది.

ఈ రెండు బాధలతో పాటు తాను కౌసల్యా దేవికి చేసిన ద్రోహము దశరథుని మనస్సును మరింత గాయపరిచింది.

ఇంత కాలం రామ మాతను తాను ఎంత ఉపేక్షించాడు!

మొదట్లో ఏ కొద్దికాలమో ఆ దేవి తన వలన సుఖించింది. ఆ తరువాత సంతానమనే నెపంతో వరుసగా వివాహాలు చేసికొంటూ తాను క్రొత్త భార్యల వ్యామోహంలో పడి ఆమెను నిర్లక్ష్యం చేసినా ఎన్నడూ పెదవి విప్పకుండా వంటిచాటున తన బాధను దిగమ్రింగుకొన్న క్షమా శీలిని ఆమె. తాను 'పట్టపు రాణిని' అని తన సవతులపై ఎన్నడైనా తన అధిక్యాన్ని చూపిందా ఆ దేవి? లేదు పైపెచ్చు – ఒక్కొక్క క్రొత్త సవతి ఆమెకు భర్తృవాల్లభ్యం లేదని అవహేళన చేస్తూంటే భరించి ఊరుకుంది. ముఖ్యంగా కైకేయి వివాహంతో దాసీజనము కూడ కౌసల్యను నిర్లక్ష్యంగా చూచింది.

శ్రీరాముడు జన్మించింది మొదలు ఆయనను చూచుకొనే జీవించింది ఆ తల్లి. అదేమోకాని ఆతల్లికి ఆ ఆనందం కూడ దక్కలేదు. ఒక్క క్షణం కొడుకును విడిచి ఉండలేని దశరథుడు బాలరాముని కూడ కైకేయి ఇంటికి తీసుక వెళ్లేవాడు. తన కొడుకు పెరిగి పెద్దవాడై – కోడలు తన ఇంటికి వచ్చాక ఈ మధ్య కాలంలో

కౌసల్యాదేవి సుఖసంతోషాలతో జీవిస్తోంది. ఇంతలోనే కాచి, పూచిన చెట్టును పూర్తిగ నేలమట్టము చేసినట్లు ఆమె ప్రాణప్రియులైన సీతారాములను దశరథుడు కైకేయీ వ్యామోహంతో అడవుల పాలు చేశాడు. ఇక ఏమి చూచుకొని ఆ సాధ్వి జీవింపగల్గుతుంది ?

దశరథుడు ఇవన్ని నెమరు వేసికొంటుంటే ఆయనకు పుండు మీద కారము చల్లినట్లయింది. తాను స్వయంగా పుత్రశోకాన్ని అనుభవిస్తున్నా ఆ తల్లి తన భర్తను ఓదారుస్తోంది. అయినా ప్రతి క్షణము దుఃఖ సముద్రము ఆయనను ముంచి వేసేట్లు పెరిగిపోతోంది. ఇక ఎంతో సేపు తాను ఆ దుఃఖాన్ని తట్టుకొలేనని తెలిసికొన్నాడు దశరథుడు. అయినా సుమంత్రుడు తిరిగి వచ్చేదాకా దశరథుని మనసులో ఏదో ఒక చిన్న ఆశాదీపం మినుకు మినుకుమనుకుంటూ వెలిగింది. తనను అంత దుఃఖములో ఎన్నడు చూడని తన ప్రియ కుమారుడు తన బాధను తలచుకొని తిరిగి వస్తాడేమో అని ఆశ ఉండేది. సుమంత్రుని రాకతో అదికూడ అడుగంటింది.

దశరథుడు తన అంతిమ గడియలలో 'శ్రవణ కుమారుని తండ్రి శాపాన్ని' గుర్తుకు తెచ్చుకొని – కౌసల్యకా సంఘటనను వివరించి – రామ వియోగ బాధను భరింపజాలక రామా! రామా! అని ఎలుగెత్తి పిలుస్తూ ప్రాణాలను వదిలాడు.

దశరథుని మరణ సమయంలో భరతుడు సోదరుడైన శత్రుఘ్నునితో మాతామహుల ఇంట్లో కైకేయి రాజ్యంలో ఉన్నాడు.

దశరథుడు మరణించిన తరువాత దూతలు కేకయ దేశానికి పంపబడ్డారు. వారు కేకయ రాజధానికి చేరుకొన్న రోజే భరతునికి ఒక స్వప్నం వచ్చింది.

## భరతుని స్వప్నం

ఆ స్వప్నము రాత్రి నాలుగవ జాముని అనగా తెల్లవారు జాముని వచ్చింది కనుక సత్యము సత్వరఫలదాయకంగా ఉంటుంది.

భరతునికి వచ్చిన స్వప్నములో దశరథుడు మలిన వస్త్రధారియై చెదిరిన కేశాలతో ఒక పర్వతము పైనుండి ఆవు పేడతో నిండిన ఒక బావిలో పడిపోయి

దానిలో ఈదుతూ పైకి రావడానికి ప్రయత్నిస్తున్నాడు. దోసిలితో నూనె త్రాగుతూ పకపక నవ్వుతున్నాడు. నువ్వుల అన్నం తింటున్నాడు. నూనె శరీరానికి రాచుకొని తలక్రిందులుగా నూనెలో స్నానం చేస్తున్నాడు.

సముద్రమంతా ఎండిపోయింది. చంద్రుడు భూమిపై పడియాడు. జగమంతా చీకటి ఆవరించింది. దిగ్గజాల కోరలు విరిగిపోయాయి. అగ్ని జ్వాలలు చల్లారిపోయాయి. చెట్లన్ని ఎండిపోయి భూమిపై పడినాయి. పర్వతాలు పొగలువిండి బ్రద్దలయినాయి.

ఇనుప పీఠముపై నల్లని బట్టలు ధరించి దశరథుడు కూచొని ఉన్నాడు. నల్లని ఎరుపు రంగులు గల ప్రమదలు మహారాజును పరిహరిస్తున్నారు.

ఎర్రని మాలలతో, లేపనాలతో దశరథుడు, త్వరపడుతూ గాడిదలు కట్టిన రథముపై దక్షిణమువైపు వెళ్ళాడు. వికారమైన ముఖం రాక్షసాకారం గల ఒక స్త్రీ వికటాట్టహాసం చేస్తూ మహారాజును ఈడ్చుకుంటూ వెళ్ళింది.

ఇదుగో! ఇంత భయంకరమైన స్వప్నం భరతునికి వచ్చింది.

భరతునికి ఈ స్వప్నము మనస్సులో భయం కల్గించింది. విజ్ఞుడైన ఆ రాజకుమారుడు ఈ కల ఫలితంగా తానో రాముడో, మహారాజో, లక్ష్మణుడో మరణించడం తప్పదని భావించాడు.

స్వప్న విశ్లేషణ : ఎవ్వరు గాడిదలు కట్టిన రథంపై దక్షిణ దిశ వైపు వెళ్తారో ఆయన శరీరము శ్మశానంలో పొగతో నిండిన చితిపై ఉంటుందని శాస్త్రం వివరిస్తుంది.

భరతుని స్వప్నము అనేక అశుభ దృశ్యాలతో నిండివుంది.

1. మాసిన బట్టలు, చెదిరిన కేశాలు దశరథుని దీనావస్థను తెలుపుతున్నాయి. పర్వత శిఖరంనుండి అవు పేడలోపడి ఈదుతూ పైకి రావడానికి ప్రయత్నించడం ఆయన సత్యవాక్య పాలనమనే ధర్మమును కాపాడుకోవడానికి ప్రయత్నించడాన్ని సూచిస్తుంది! నూనెలో ఉండడం నువ్వుల అన్నం తినడం అశుభం.

2. సముద్రం ఎండిపోవడం మొదలైన లక్షణాలన్ని దేశంలో అరాజకత్వాన్ని సూచిస్తున్నాయి అశుభ ఫలితాలను తెలుపుతున్నాయి.

3. ఇనుప పీఠముపై ఆసీనుడవడం, నల్లని ఎరుపు రంగులు గల స్త్రీలతో పరిహసింపబడడం – ఆయన మాటలకు ఆదరం తగ్గడాన్ని అశుభాన్ని తెలుపుతున్నాయి.

4. ఎఱ్ఱని మాలతో గాడిదలు పూన్చిన రథంపై దక్షిణ దిశవైపు పయనించడం – ఒక వికృతాకారం గల స్త్రీ ఆయనను ఈడ్చుకుంటూ వెళ్ళడం ఆయన మరణానికి సంకేతాలు. దక్షిణంవైపు శ్మశానం యమపురి ఉంటాయి. వికృతాకార స్త్రీ అంటే మృత్యువే.

ఈ విధంగా భరతుని స్వప్నము స్పష్టంగా దశరథుని మరణాన్ని సూచిస్తుంది. అయినా భరతుడు ఆ స్వప్న ఫలితంగా – తానో రాముడో రాజో లక్ష్మణుడో మరణిస్తారని అనుకున్నాడు.

ఎవ్వరికైనా ముందుగా తనకే ఏదో ప్రమాదం జరుగుతుందనే భయం కలుగడం సహజం అన్నింటికంటే తాను క్షేమంగా వుండాలని ఏవ్యక్తి అయినా కోరుకుంటాడు కదా.

'ఆత్మానం సతతం రక్షేత్ – దారైరపి ధనైరపి'

తనవారికంటే – ధనం కంటే కూడా తన రక్షణే ప్రధానమనిపిస్తుంది ప్రతి వ్యక్తికి. అందువలన తనకే ప్రమాదమనుకున్నాడు భరతుడు ముందుగా.

తన తరువాత భరతునికి ప్రియుడు రాముడు. అందువలన రామునికేమి ప్రమాదం కలుగుతుందో అని ఆయనకు అనంతర ఆలోచన కలిగింది.

రాముని తరువాత భరతుడు ప్రేమించేది తన తండ్రిగారిని. అందువలన దశరథునికి ప్రమాదాన్ని ఆ తరువాత శంకించాడు.

ఆ తరువాత ఆయన హృదయంలో ప్రేమార్హుడు లక్ష్మణుడు. ఆయనకేదైనా విపత్తు సంభవిస్తుందేమో అని చిట్టచివరలో అనుమానించాడు.

స్వప్నము గురించి మరింత శాస్త్ర విశ్లేషణ :

స్వప్నము అంటే ఏమిటని అనేక శాస్త్రవేత్తలు దర్శన కారులు ఆనాటినుండి నేటికి ఆలోచిస్తున్నారు.

1. 'స్వప్నమంటే అసత్యము' అని కొందరు అభిప్రాయపడ్డారు. స్వప్నానికి ముందు తెలివితో ఉన్నప్పుడు మనకున్న పరిస్థితి స్వప్న కాలంలో పనికి రాకుండాపోతుంది.

ఉదాహరణ : తలుపులన్ని బిగించుకొని గదిలో మంచంపై హాయిగా నిర్భయంగా నిద్రించిన మనకు స్వప్నంలో మనము ఒక అడవిలో పరిగెత్తుతున్నట్లు మనను ఒక సింహము మ్రింగబోతున్నట్లు కల వస్తుంది.

మేలుకొని ఉన్నప్పుడు మన మెలుకువలు స్వప్న స్థితికేమైనా తోడ్పడుతాయా? లేదు. అంతే కాదు ఆ కల తర్వాత మళ్ళీ తెలివికి వచ్చి చూస్తే స్వప్న దృశ్యాలు అగుపిస్తాయా? లేదు.

అందువలన కల అంటే కల్ల–స్వప్నమంటే అసత్యమని ఆధునికులు ముఖ్యంగా నాస్తికులు తేలికగా తీసిపారేస్తారు. 'జగన్మిథ్యా' వాదాన్ని సాధించుకోవాలనే అద్వైత వాదులు కూడా స్వప్నము అసత్యమని అలాగే జగత్తు కూడా స్వప్నము వలె అసత్యము 'జగన్మిథ్యా స్వప్నవత్' అని తార్కికంగా సాధిస్తారు.

2. స్వప్నమంటే జాగ్రదాలోచనానుభవము 'మెలకువతో వున్నపుడు మనకు అసాధ్యమయిన ఆలోచనలు కల్గుతాయి. వాటిని స్వప్నానుభవం ద్వారా సాధించుకొని సంతోషిస్తాము.

3. స్వప్నమనేది ఒక దశ – జాగ్రత్, స్వప్న , సుషుప్తి అంటే తెలివితో ఉండడం, కలగనడం గాఢ నిద్ర పొందడం అనేవి మనకున్న మూడు దశలు.

ఈ మూడు దశలు వేర్వేరు కనుక ఈ దశలలో వేర్వేరు అనుభూతులను పొందుతాము. ఒకదశలోని అనుభూతులు వేరొకదశలోని అనుభూతుల కంటే భిన్నంగా ఉంటాయి.

4. స్వప్నము కూడా సత్యమే! 'స్వప్న మపి సత్యమితి వేదవిదాంమతమ్' అని విశిష్టాద్వైత మార్గ ప్రవర్తకుల విశ్లేషణ.

జాగ్రత్ 'స్వప్న' సుషుప్తి దశలు మూడు వేర్వేరైనప్పుడు వీటి అనుభూతులు వేరువేరుగా వుండటంలో వింతేమిలేదు.

వేర్వేరు అనుభవాలైనంత మాత్రమున అవి అబద్ధాలనే నిర్ణయానికి రావడం అనవసరం.

ఉదా; బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు ఉన్నాయి కదా! ఒకడు బ్రహ్మచర్యమునుండి గృహస్థాశ్రమంలో ప్రవేశించాడు అనుకుందాము. అయితే ఆయన అంతవరకు గడిపిన బ్రహ్మచర్యాశ్రమము అసత్యమా? కాదే.

అదేవిధంగా ఒక వ్యక్తి బాల్యం నుండి యవ్వన దశకు చేరుకోవచ్చు. అంతమాత్రాన అతని బాల్యం అసత్యమా? బాల్య దశలేకుండానే అకస్మాత్తుగా యువకుడయ్యాడా? లేదే? బాల్యము సత్యమే. అందువలన స్వప్న దశకూడా సత్యమే.

అతీతము (గడిచిపోయినది) అయినంత మాత్రాన అనుభవము అసత్యమవుతుందా ? కాదు. అందువలన స్వప్నము అసత్యము అనుకొని జాగ్రత్తును కూడా (జగత్తును) స్వప్నమువలె అసత్యమని నిర్ధారించడం సరికాదు. జాగ్రత్తు ఎలా సత్యమో 'స్వప్నము కూడా అలాగే సత్యమనే సిద్ధాంతాన్ని అంగీకరించాలని భగవద్రామానుజులు శాస్త్రీయంగా నిరూపించారు.

5. స్వప్నము భవిష్యత్తును సూచిస్తుంది. స్వప్నము భవిష్యత్తును సూచిస్తుందనే విషయాన్ని శ్రుతులు, బ్రహ్మ సూత్రాలు మన ఇతిహాసాలు పాశ్చాత్య సాహిత్యాలు కూడా ధృవరుస్తున్నాయి. 'సూచకశ్చహిశృతే రాచక్షతేచతద్విదః 3-2-6 శ్రుతులు, స్వప్న విశేజ్ఞులు చెప్పునట్లు స్వప్నము భవిష్యత్తును సూచిస్తుంది.' అని బ్రహ్మ సూత్రము తెలుపుతుంది.

శ్రీరామాయణంలో భరతుని స్వప్నం దశరథ మహారాజు మరణాన్ని సూచిస్తుంది కదా

అలాగే హరిశ్చంద్రుడు; విశ్వామిత్రుని చేస్పృజింపబడబోయే విషకవ్యలను తన స్వప్నములో ముందుగానే దర్శిస్తాడు.

పాశ్చాత్య సాహిత్యంలో 'జూలియస్ సీజర్' అనే షేక్స్పియర్ నాటకంలో సీజర్ సతీమణి – తన భర్తను మరుసటి రోజు పార్లమెంటులో హత్యచేస్తారని స్వప్నములో సందర్శిస్తుంది. అదే విధంగా తెల్లవారి సీజర్ చక్రవర్తి పార్లమెంట్‌లో హత్య చేయబడుతాడు.

6. స్వప్నము కొద్ది కర్మానుభవాన్ని కల్గిస్తుంది. మనము చేసేకొద్ది కర్మల ఫలితాలను స్వప్నము ద్వారా అనుభవిస్తాము.

ఉదా: చిన్న పాపకర్మ మనం చేస్తే ఏదో ఒక పాము మనను తరిమినట్లు కలగంటాము. దాని వలన కలిగిన తాత్కాలిక భయంతో ఆ పాప ఫలానుభవము తీరిపోతుంది.

అలాగే ఒక స్వల్ప సుకృతాన్ని సాధించామనుకోండి. స్వప్నములో మనను ఒక రాజుగా చేసినట్లు మనము సింహాసనాసీనులమై కిరీటధారులమైనట్లు సంతోషానుభవము స్వప్నము ద్వారా సంభవిస్తుంది.

ఆ చిన్న పుణ్యఫలము ఆ స్వప్న సంతోషానుభవముతో తీరిపోతుంది. కనుక స్వల్పమయినా స్వప్నానుభవం సత్యమే.

## బ్రహ్మసూత్రాలలో స్వప్న విశ్లేషణ :

మనము పూర్తిగా తెలివితో వున్నస్థితిని 'జాగ్రత్‌దశ' అని పూర్తిగా నిద్రలో ఉన్న పరిస్థితిని – 'సుషుప్తిదశ' అని మధ్యలో కొంత నిద్ర, కొంత మెలకువ ఉన్న స్థితిని 'స్వప్నదశ' అని అంటారు కదా. ఈ రెండు (జాగ్రత్, సుషుప్తి) దశల మధ్య స్వప్న దశ కదా. అందుకే స్వప్నాన్ని 'సంధి (మధ్య) దశ' అనికూడా వేదము వివరిస్తుంది. 'సంధ్యం తృతీయం స్వప్న స్థానం' అని శాస్త్రము విశదం చేస్తుంది.

'మాయా మాత్రంతు కార్త్స్న్యేనానభివ్యక్తస్వరూపాత్' అని ఒక బ్రహ్మ సూత్రం స్వప్నాన్ని గురించి తెలుపుతుంది.

స్వప్న సృష్టిమాయామాత్రమైనది. ఎందుకంటే మెలకువ వచ్చిన తర్వాత దాని స్వరూపమును ఇలాగా అని నిర్ణయం చేయరాదు. ఈ సూత్రమే 'జగన్మిథ్యా' సిద్ధాంతానికి బలాన్నిచ్చింది స్వప్నము మాయకదా! స్వప్నము వలె జగత్తుకూడా మాయే అని ఆదిశంకరులు తమ అద్వైత సిద్ధాంతాన్ని ప్రవచించారు. 'స్వప్నవత్ జగన్మిథ్యా'

అయితే మాయ అంటే ఏమిటి? 'యామాసామాయా' అని కొందరు నిర్వచిస్తారు. 'మాయ అంటే' 'మిధ్య'లేనిది 'అని వారి అర్థము. కాని 'మాయావయునం జ్ఞానం' అని నిఘంటువు. మాయ అంటే మిధ్య కాదు, జ్ఞానము అని నిఘంటువు. జ్ఞానము సత్యము కనుక స్వప్నము కూడ సత్యమే.

ఈ స్వప్న సృష్టికి కారకుడు జీవుడా? బ్రహ్మ? అని సందేహము కలిగినప్పుడు జీవుడే స్వప్న సృష్టికి కారకుడు అని పూర్వ పక్షము ( కొందరి అభిప్రాయము).

అయితే స్వప్న సృష్టికి జీవుడు కారణం కాదు. ఎందుకంటే సంసారంలో ఉన్నంత వరకు జీవుడు కర్మాధీనుడే. ఆయన జ్ఞానానికి సత్య సంకల్పాదులకు ప్రకాశము లేదు.

అంతే కాదు స్వప్న సృష్టి జీవాధీనమైతే, ప్రతి వ్యక్తి సుఖ స్వప్నాలనే సృష్టించుకోవాలి. తనకు అనిష్టమైన స్వప్నాలను సృష్టించుకొంటాడా? లేదు. కాని స్వప్నాలు సుఖ దుఃఖములనే రెండు రకాల అనుభూతులను కల్గిస్తాయి. కనుక అన్ని సృష్టులవలె – స్వప్న సృష్టి కూడా భగవదధీనమే.

'య ఏష సుప్తేషు జాగర్తి – కామం కామం పురుషో

నిర్మమాణః' అని ఉపనిషత్తు వివరిస్తుంది.

ఈ జీవులందరు నిద్రిస్తుంటే, కర్మవశ్యులుగా ఉంటే, ఎవ్వడు జాగరూకుడై (మెలకువతో ఉండి) – జీవులు అనుభవించే వాటిని నిరంతరము సృష్టిస్తుంటాడో ఆయన పరమాత్మ అని శాస్త్రము విశదము చేస్తుమది.

'సృజతే సహికర్తా' జగత్కర్తే స్వప్నకర్తకూడ. అందువలన స్వప్నము

సత్యమని. దానిని కలిగించేది పరమాత్మే అని అది మాయా మాత్రము అనగా ఆశ్చర్యకరమని స్వప్న విషయాలు కూడ ఈశ్వర నిర్మితాలే అని అవి 'సూశచకశ్చ' అన్నట్లు భవిష్యత్తును సూచిస్తాయని శ్రుతులు, బ్రహ్మ సూత్రాలు వివరిస్తున్నాయి.

భరతునికి వచ్చిన కలకూడ దైవికంగా, భవిష్యత్తులో ప్రమాదాన్ని సూచిస్తూ వచ్చింది.

ఇతిశం

## భరతుని రాక

భరతుడు తన స్వప్నాన్ని గురించి స్నేహితులతో విషాదముతో సంభాషిస్తూ ఉండగానే దూతలు - అయోధ్య నుండి వచ్చి భరతుని దర్శించి 'పురోహితులు మీ అందరి కుశలము అడిగారు. అత్యవసర పరిస్థితుల కారణంగా మిమ్మల్ని తక్షణమే అయోధ్యకు తిరిగి రమ్మన్నారు. మీ మేనమామకు, మాతామహులకు అనేక అమూల్యములైన వస్త్రాభరణాలను పంపారు.' అని నివేదించారు 'అయోధ్యలో అందరు బాగున్నారని' సంగ్రహంగా తెలిపి 'మీ రథం సిద్ధంగా ఉంది, బయలుదేరండి' అని త్వరపరిచారు.

మాతుల మాతామహుల అనుజ్ఞ తీసికొని భరతుడు శత్రుఘ్నునితో సహా వెంటనే బయలుదేరాడు. అనేకోద్యాన నదీపర్వత, పట్టణాలను దాటి అయోధ్య సమీపించాడు.

భరతుని మనస్సులో భయం చోటుచేసుకొంది. త్రోవలో దేవాయతన చైత్యాలలో మృగపక్షులు-స్త్రీ పురుషులు అశ్రునయనాలతో అగుపించారు.

అయోధ్యా నగరోద్యానాలలో జనము సందడి లేదు. నగరంలో గజతురంగఘోషలు వినరావడం లేదు. భేరీ మృదంగ వాద్య నినాదాలు వినిపించడంలేదు.

భరతుడు ముందుగా మహారాజా మందిరానికి వెళ్లాడు. అక్కడ మహారాజా

అగుపించనందున మాతృమందిరానికి చేరాడు.

కొడుకును చూచిన కైక సంభ్రమంతో సువర్ణాసనము నుండి లేచి ఎదురుగా వచ్చింది. భరతుడు ఆమెకు పాదాభివందనం చేశాడు.

భరతుడు ఆమె కుశల ప్రశ్నలకు సంగ్రహంగా సమాధానాలిచ్చి మహారాజును చూడాలనే మనోవాంఛను తెలిపాడు.

'నాయనా! సర్వభూతములకు ఏది అంతిమగతో, యజ్ఞశీలురకు ఏది ప్రాప్తమో– దాన్ని మీ నాన్నగారు చేరుకొన్నార' ని గుంభనంగా తెలిపింది.

భరతుడు భరింపరాని దుఃఖముతో గొడ్డలి దెబ్బతో నేలకూలిన సాలవృక్షమువలె క్రిందపడ్డాడు.

కైక 'రాజా! కీర్తి వంతుడా! నీలాంటి విద్వాంసులు కాలగతికి శోకింపరుకదా! భాస్కరుని ప్రభామందిరమైన మేరు పర్వతము వలె నీ బుద్ధి నిశ్చలమైనది కదా! అని ఓదార్చింది.

'రాజా!' అన్న కైక సంబోధన భరతుని భయభ్రాంతుని కావించింది. దుర్భర దుఃఖంతో 'అమ్మా!' నాన్న గారు ' నా అన్నగారికి పట్టాభిషేకం చేసి యజ్ఞాలనాచరిస్తారనుకొన్నాను. మహారాజు మరణానికి కారణమేమిటిమ్మా! మా నాన్నగారి మరణ సమయంలో రామ లక్ష్మణులు సమీపంలో ఉండి సేవింపగల్గిన సౌభాగ్యవంతులు కదా!' అని అడిగాడు.

'లేదు నాయనా! మీ నాన్నగారి నిర్యాణానికి ముందుగానే సీతారామలక్ష్మణులు నార చీరలు ధరించి అడవులకు వెళ్లారు' అని కైకేయి తెలిపింది.

భరతునికి భయంవేసి 'అమ్మా! నా అన్న! రామచంద్రుడు వనవాస శిక్షను అనుభవించడానికి ఏ నేరము చేశాడమ్మా? పరదారను ఆశించాడా? బ్రాహ్మణ ధనాన్ని అపహరించాడా? దరిద్రులను, పూజ్యులను నిష్కారణంగా దండించాడా? భ్రూణహత్యా పాపానికి ఒడిగట్టాడా?' అని పరిపరి విధాల ప్రశ్నించాడు.

ఆనాడు కఠిన శిక్షార్హములైన నేరాలు ఈనాడు సమాజములో ఎంత

సాధారణములయ్యాయో గమనించండి. నేటి పాలకులు ప్రజలు ఈ నేరాలేవి తాము చేయడం లేదని నిస్సందేహంగా చెప్పగల్గుతారా? పరదారాపేక్ష, బ్రాహ్మణ ధనాపహారము, అన్యాయ దండనము, భ్రూణహత్య నేడు అతిసామాన్యములైన సామాజిక విషయాలు! కలి ప్రభావం ఎంత దారుణమైందో కదా!

'శ్రీ రాముడు శీలవంతుడని, తానే తనయునికి రాజ్యాధికారాన్ని ఇప్పించడానికి రామునికి వనవాసము భరతునికి రాజ్యాభిషేకాన్ని సాధించానని' కైక తెలిపింది.

పిడుగు పడ్డట్లు బాధపడి భరతుడు పాపపు మాట వింటున్నట్లు భావించి చెవులు మూసుకొని, 'హా నాన్నా! మహారాజా!' 'హా రామా' అని ఘోరున విలపించాడు. కొంతసేపు మూర్ఛిల్లి, లేచి క్రోధంతో కైకనుద్దేశించి 'దుష్టురాలా! ఎంత దుర్మార్గానికి తెగించావే? నీ భర్తను నీవే చేజేతులా చంపావు కదే? రాముని అరణ్యాలపాలు చేశావు కదే! ఎవ్వరిని అడిగి ఎవ్వరి కొరకు ఈ పాడుపనులు చేశావే? నిన్నెప్పుడైనా నాకు రాజ్యంకావాలని కోరానా? నీ గర్భంలో జన్మించిన కారణంగా నన్ను కూడ ఈ పాపంలో పాలువంచుకొన్నట్లు లోకులు కాకుల్లా పాడుస్తారు కదే?

పాపిష్టురాలా! నీవు చేసిన ఈ మహా పాపాలకు ప్రాయశ్చిత్తంగా వెంటనే ఉరివేసికో! విషముత్రాగు! నిన్ను ఈ నేరానికి నేనే చంపేవాడిని! కాని మాతృహంతకుడని మా రాముడు నన్ను దూరం చేస్తాడని ఆగి పోతున్నాను' అన్నాడు.

చూచారా? భరతుని భ్రాతృప్రేమ! చూచారా! దశరథ నందనుల ధర్మనిష్ఠ!

కఠినమైన మాటలంటూ చూపులతోనే కాల్చివేసేట్లు భయంకర దర్శనుడైన భరతునితో కైక మళ్లీ :–

'కుమారా! వ్యర్థప్రసంగాలు ఎందుకు? మహారాజు మరణించారు. రామ లక్ష్మణులిద్దరు అడవులకు వెళ్లారు. రాజ్యరమకు నీవే అధికారివి. వెంటనే రాజువుకా'! అని రెట్టించింది.

భరతుడు కైకను ఛీత్కరించి, 'శ్రీరాముడు నిన్ను కన్నతల్లి కంటె మిన్నగా

భావించాడు కదే? జ్యేష్ఠుడిని కాదని రాజ్యాభిషేకానికి నేను సిద్ధమవుతానని ఎలా అనుకొన్నావే? అశ్రునయనాలతో నన్ను అందరు చూస్తుండగా రాజ్యానందము నాకురుచిస్తుందటే?

కామధేనువు తన సంతానమైన వృషభాలు ఎండలో నాగళ్లను ఈడ్చుకొంటు వెళ్తుంటే అది చూచి కామధేనువు దుఃఖంతో కన్నీరు కారుస్తుంటే ఇంద్రుడే తల్లడిల్లాడే? ఏకైక పుత్రుడుగల కౌసల్యావమాత పుత్రశోకాన్ని ఎలా భరింపగలుగుతుందే?' అని పరుషంగా తల్లిని దూషించి భరతుడు కౌసల్యా మందిరము వైపువెళ్లాడు.

❀ ❀ ❀

కారణమేదైనా తనకు కలిగిన దుఃఖాన్ని, కొడుకు ఛీత్కారాన్ని, లోకుల అసహ్యాన్ని మౌనంగా భరించక తప్పలేదు కైకకు.

అందని సుఖాలకు అఱ్ఱులు చాచే మనుష్యులకు కైక వృత్తాంతము ఒక గుణపాఠము. రాముని అడవులకు పంపే ముందు భరతుడు రాజ్యాధికారాన్ని వహిస్తాడో లేదో అని ఆమె ఆలోచించిందో లేదో తెలియదు. భావిపరిణామాలను అవిడ ఊహించిందో లేదో తెలియదు.

కాని కైకకు కఠినాత్మురాలుగా చరిత్రలో చిరస్థాయిగా ముద్రపడింది. దురాశ ఎంత దుఃఖకరమో కైక కథ మనకు గుణపాఠాన్ని అందిస్తుంది. భర్త మరణమును భరతుని ధిక్కారాన్ని పాపము కైకేయి ఎలా భరింపగల్గిందో! కనీసపాను భూతినైనా నోచుకోని దురదృష్టవంతురాలు కైక.

## భరతుని శపథాలు

భరతుని రాక గురించి విని – కౌసల్యాదేవి సుమిత్రతో కలసి ఆయన దగ్గరకు వెళ్లాలనుకొంది. అయితే అంతకు ముందే, ఆపుకోలేని శోకావేశముతో –ఆమె అంతఃపురానికే – సోదరుడు శత్రుఘ్నునితో కలసి భరతుడు వెళ్లాడు.

భరత శత్రుఘ్నులను చూచి, భరింపరాని దుఃఖంతో కౌసల్య మూర్ఛిల్లింది. వారిద్దరు రామ మాతను పదిలంగా లేపి పట్టుకొన్నారు. అప్పుడా తల్లి ఆయనతో:–

'భరతా ! నీ తల్లి నీకు నిష్కంటకమైన రాజ్యాన్ని ఆర్జించి ఇచ్చింది. అకారణంగా నా కొడుకును అడవులకు అంపింది. తల్లినైన నన్ను కూడా ఎప్పుడు తరిమివేస్తుందో ? అగ్నిహోత్రుని అర్థించి నేనే స్వయంగా సుమిత్రతో కలసి నా కుమారుని చేరుకొంటాను. అని ఆక్రోశంతో అంది. భరతుని రామ విరహప్రణాన్ని కౌసల్య మాటలు సూదితో కెలికించాయి. అవశుడై ఆయన ఆమె పాదాలపై పడి :–

'అమ్మా! నన్నెందు కింత నిందిస్తావమ్మా ! శ్రీ రామ భద్రునిపై నాకున్న అనన్య సోదర ప్రేమ నీకు తెలియదా ? నేను నిజంగా రాముని అరణ్య వాసాన్ని అభిలషిస్తే ఇదుగో ఇటువంటి దురాగతాలకు పాలువడిన వాడిని అగుదు గాక ! అని కఠినంగా ఒట్లు పెట్టుకొంటున్నాడు :–

1. సుశిక్షితమైన నా శృతిస్మృతి జ్ఞానము విస్మృతి చెందుగాక ।
2. క్షత్రియ భావము కోల్పోయి నీచ భావాన్ని పొందుదుగాక ।
3. సూర్యుని కెదురుగా మల మూత్రాలను వదిలిన దురాచారుడను అగుదు గాక !
4. నిద్రిస్తున్న గోవును కాలితో తన్నిన వాడిని అగుదు గాక ।
5. పని చేయించుకొని ఫలితాన్నివ్వని పాపాన్ని పొందుదుగాక.
6. ప్రజలకు ద్రోహము చేసి – పన్నులను గ్రహించి కూడ వారిని ఆదుకొనని పాలకుడను అగుదుగాక
7. యాగాన్ని ఆచరించి ఋత్విక్కులకు దక్షిణలనివ్వని యజమాని నగుదు గాక!
8. గజతురగ బలాన్వితమైన యుద్ధరంగంలో భయంతో పారిపోయే పిరికి పందను అగుదు గాక!

9. శాస్త్రము యొక్క సూక్ష్మార్థాలను తెలిసికొని దానిని దుర్వినియోగ పరిచే దుష్టాత్ముడనగుదు గాక!

10. శ్రీ రాముని సౌందర్యాన్ని సందర్శింపజాలని సౌభాగ్యహీనుడను అగుదుగాక !

11. భగవన్నివేదన కొరకు గాక, పితృ శ్రాద్ధము కొరకు గాక స్వార్థము కొరకు పాయసాన్ని తిలాన్నాన్ని వండుకొని తినే పాపిని అగుదు గాక!

12. గురువులను పరాభవించే వాడు, మిత్రద్రోహి అనుభవించే పాపాలను అనుభవించెదను గాక !

13. అనవసరంగా అపనిందలు వేసేవాడు, నమ్మకంతో స్నేహితులు చెప్పిన రహస్యాలను బట్టబయలు చేసేవాడు అనుభవించే పాపాలకు అర్హుడనగుదు గాక !

14. ప్రత్యుపకారము చేయక, తనకు ఉపకారం చేసిన వాడికే అపకారాన్ని తల పెట్టే కృతఘ్నుడను అగుదు గాక.

15. భార్యాపుత్రాదులను విడిచి - వారికి ఆహారమివ్వక తానొక్కడే కడుపునింపుకొనే స్వార్థపరుడనగుదు గాక !

16. సత్సంతానమును కని - ధర్మకార్యముల ద్వారా దేవర్షి పితృఋణములను తీర్చుకోకుండా బ్రహ్మ చర్యములోనే జీవితముపట్ల భయముతో సన్యాసము తీసుకొనే వాడి పాపాన్ని పంచుకొందును గాక!

17. వంశ నిర్వాహకమగు సంతానము పొందకుండానే అల్పాయుష్యముతో మరణించే సంసార విచ్ఛేదకుని దుర్గతిని పొందుదు గాక !

18. రాజ, స్త్రీ, బాల, వృద్ధులను వధించి నపాపిని, భరింపవలసిన భార్యా పుత్రాదులను పరిత్యజించిన వాడిని అగుదుగాక !

19. లక్కను, లోహాన్ని, మాంసాన్ని, విషాన్నైనా అమ్మకొని భృత్యులను పోషించాలి. అటువంటి భృత్యులను పోషించని వాడి దుర్గతిని పొందుదు గాక !

20. కపాలహస్తుడై, మలిన వస్త్రముతో, పిచ్చివాడై భిక్షాచరణము చేయు వాని దుస్థితిని లభింతుగాక !

21. సురాపానము, జూదము, జారత్వము, కామ క్రోధాలు విపరీతంగా కల్గే వాని దుర్గతిని అందుదు గాక!

22. లోభియై కూడ బెట్టిన ధనము – తస్కరులచే అపహరింపబడిన వాని అకృత్యములను కల్గి ఉందు గాక!

23. ఉదయ సాయం సంధ్యలందు నిద్రించే వాడి దుస్థితి నందుదు గాక !

24. అన్యాయంగా గృహదహనం చేసేవాడు, గురుపత్నీగమనుడు, మిత్రద్రోహి అనుభవించే పాతక ఫలాలననుభవింతును గాక.

25. దేవర్షి పితృగణాలను, మాతా పితరులను సేవించని వాడి దుష్కృతాలను అనుభవించెదను గాక !

26. సత్కర్మ నుండి సత్కీర్తి నుండి స్వర్గాన్నుండి భ్రష్టుడైన వాడి పతన దశను అనుభవించెదను గాక !

27. బహు పుత్రుడు, దరిద్రుడు జ్వరరోగి, నిరంతర దుఃఖములను అనుభవించేవాడి కష్టాలను అనుభవించెదను గాక !

28. ఉత్తమ శ్లోకుడై, ఉన్నత పదవులలో ఉంటు కూడ, అర్హులను ఆదరించని అధముని బాధలనుభవించెదను గాక !

29. ఋతుస్నాతను, ఋతుకాలదూర అయిన ధర్మపత్నిని అతిక్రమించిన అధముని దుస్థితిని అనుభవించెదను గాక !

30. ధర్మ పత్నిని వీడి పరదారను అనుభవించే అధర్మపరుని అకృత్యఫలాన్ని అనుభవించెదను గాక !

31. పానీయములను చెడగొట్టేవాడు, విషమునిచ్చేవాడు పొందే పాప ఫలాన్ని పొందుదు గాక.

32. దాహార్తుడై ఇంటికి వచ్చిన వానికి ఇంట్లోని పానీయములను ఇవ్వని వాడనుభవించే పాపాలను పంచుకొందుగాక,

33. బ్రాహ్మణ పూజను భంగము చేసేవాడు, దూడకు పాలను మిగల్చకుండా త్రాగే అధర్మపరుని అనుసరించే వాడినగుదు గాక !

34. వాద ప్రతివాదాలలో పక్షపాతంతో తీర్పు ఇచ్చేవాడి పాపానుభవానికి పాలుపడుదుగాక !

ఈ విధంగా కఠోరములైన శపథాలను చేస్తూ అవశుడై భూమిపై పడిపోయిన భరతుని లేవనెత్తి కౌసల్యాదేవి అతని సౌశీల్యాన్ని అభినందించింది. నాడు భరతుడు నిందించిన ఈ పాపాలు నేడు ప్రజలలో ఎంత బలంగా వ్యాపించాయో గమనించండి.

## అంత్యక్రియలు

కౌసల్యాదేవి సన్నిధిలో కన్నీరు మున్నీరుగా విలపిస్తుండే భరతుని వశిష్ఠాదులు ఓదార్చి మృతుడైన మహారాజుకు అంత్యక్రియలను ఆచరింపవలసిందని త్వరపరిచారు.

తైల ద్రోణము (నూనెతొట్టి) నుండి దశరథుని శవాన్ని తీసి పల్లకిలో కూచోబెట్టి బంగారు నాణాలను అమూల్య వస్త్రాలను, త్రోవలో చల్లుతూ శ్మశానానికి తీసుకవెళ్లారు. చందన, దేవదారు కాష్ఠాలతో చితిని పేర్చి చందనాగరుధూపాలతో దహనము చేశారు. అరువై వేల సంవత్సరాలు అవనిని పాలించిన దశరథ మహారాజు శరీరము క్షణంలో దహనమయింది. చరిత్రలో ఆయన యశస్సు మాత్రము మిగిలింది. మనందరి పరిస్థితి కూడ అంతే కాదా ! 'నేను, నావారు' అని – ఎంతో సంపాదించాలని, ఎంతో మిగిల్చాలని జీవితాంతము

ప్రయత్నించిన వారందరు చివరకు మట్టిపాలు, బూడిదపాలు కావలసిందేకదా. శ్రీలకొరకు పరితపించడం కంటే శ్రియః పతి కొరకు ప్రయత్నించడం శాశ్వతానందాన్ని ఇస్తుంది.

పదవ రోజునుండి మహీపాలుని శ్రాద్ధ కర్మలు ఆచరింపబడ్డాయి. బ్రాహ్మణులకు సమస్త ప్రజానీకానికి మృష్టాన్న భోజనవసతులు కల్పించబడ్డాయి. నూతన వస్త్రాలు, వజ్రవైడూర్యాలు, అమూల్యాభరణాలు, గోసహస్రాలు దానం చేయబడ్డాయి.

శత్రుఘ్నుడు భరతుని దుఃఖాగ్నిని చల్లబరచాడు. అకస్మాత్తుగా మహాసంతోషంతో తిరుగుతున్న మంథర సకలాభరణాలంకారములతో త్రాటిచే కట్టబడ్డ ఆడ కోతివలె అగుపించింది. సకల దుఃఖాలకు మూలమైన మంథరను జుట్టు పట్టుకొని ఈడుస్తూ శత్రుఘ్నుడు వెళ్ళసాగాడు. ఆమెను ఆదుకోవాలనుకొన్న కైకేయి కూడ శత్రుఘ్నుని క్రోధానికి వణికిపోయింది. 'స్త్రీ వధ' శ్రీరామునికి అసహ్యమని అంతటితో శత్రుఘ్నుని యత్నాన్ని భరతుడు ఆపాడు.

## రాజసభ

అవనీపతి అంత్యక్రియల అనంతరము రాజసభ ఏర్పరచబడింది. సామంతులు, సచివులు, మంత్రులు, మహర్షులు, విద్వాంసులు సభను అలంకరించారు. భరతుడు రాజసభకు ఆహ్వానింపబడ్డాడు.

సువర్ణాసనాసీనుడైన వశిష్ఠ మహర్షి మేఘగంభీరధ్వనితో 'భరతకుమారా! మీ తండ్రి దశరథ మహారాజు మరణించాడు. రామలక్ష్మణులు దశరథుని సత్య సంధుని కావించడానికి అడవులకు వెళ్లారు. అందువలన ఈ అవనీ భారాన్ని పట్టాభిషిక్తుడవై మంత్రి సామంత సచివుల సలహాతో నీవే వహించాల'ని ఆదేశించాడు.

భరతునికి కులగురువైన వశిష్ఠుని వాక్కులు పిడుగుపాటువలె మహాభయాన్ని కల్గించాయి. ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. శోకావేశ సంతప్తుడై సభామధ్యలో ఘోరున విలపించాడు. బ్రహ్మర్షి అయిన వశిష్ఠునే సభాసదులందరి సమక్షంలో ప్రశ్నించాడు.

'విలలాప సభామధ్యే – జగర్హేచ పురోహితం'

నిజానికి ఎంత సామాన్యుడైనా సభలో విలపించడానికి ఇష్టపడడు. పామరుడైనా పదిమంది ముందు గంభీరంగా ఉండాలనుకొంటాడు.

సామాన్యుల పరిస్థితే అలా ఉంటే భరతుని వంటి చక్రవర్తి కుమారుడు, సార్వభౌమునిగా సభా సదులచే నిర్ణయింపబడే వాడింకెంత గంభీరంగా ఉండాలి? జనుల సమక్షంలో విలపించవచ్చా? సభాసదులు కదా - వీరులు శూరులు, సచివులు, సామంతులు, విద్వాంసులు, కదా. వారి ముందు వీరుడు విలపించవచ్చునా? ఏదో ఎవ్వరు చూడకుండా కన్నీరు కార్చాడా ? కాదే భోరున రోదించాడు. దుర్భరమైంది భరతుని రామవియోగ దుఃఖము.

అంతే కాదు. అమితమైన ఆగ్రహంతో వశిష్ఠర్షినే సకల సభా సదుల సమక్షంలో తీవ్రంగా విమర్శించాడు.

సభలో ఎవ్వరైనా తప్పుగా మాట్లాడితే అందులో అధికులు ఏదైనా అనుచితంగా మాట్లాడితే మౌనంతో సహించాలి. తరువాత వారికి తమ తప్పు గుర్తించేలా నెమ్మదిగా రహస్యంగా తెలియజేయాలి. ఇది నీతి, సామాన్యనీతి, సభానీతి కూడ.

వశిష్ఠుడంటే సామాన్యుడా? బ్రహ్మర్షి. తాను బ్రహ్మర్షి కావడమే కాదు. విశ్వామిత్ర మహర్షిని ఒక్కమాటతో బ్రహ్మర్షి కావించిన మహాత్ముడు.

దశరధుని తాతలు, తండ్రుల నుండీ రాజవంశ పురోహితుడుగా గౌరవాన్ని కలిగిన ధీశాలి. ఆయనంతవాడు అందరి ముందు ఏదైనా ఒకవేళ తప్పుగా మాట్లాడినా ఎదురు చెప్పకూడదు. ఎందువలన? ఆ సంయమీంద్రుడు ఆ తరువాత స్వయంగా తన తప్పును తానే తెలిసికోగల్గుతాడు కనుక.

ఒకవేళ ఆ మహానుభావుని అందరి ముందు మందలించినా ఎంత మృదువుగా మందలించాలి? ఆ మహర్షి గౌరవానికి అవగింజంత అయినా అమర్యాదకలుగకుండా మందలించాలికదా.

కాని భరతుడెంత కఠినంగా మాట్లాడాడు!

'జగ్మర్తే చపురోహితం'

'జగద్దే' సామాన్యంగా మందలించలేదు. తీవ్రంగా నిందించాడు. మొదటినుండి తమ ముందు తరాల వారికందరికి హితాన్ని ఉపదేశిస్తూ వచ్చిన వశిష్ఠ మహర్షిని ముక్కు ముఖం చూడకుండా తీవ్రంగా తిట్టాడు.

ఇంతకు రాజగురువు ఏదైనా తప్పు మాట్లాడాడా? లేదే మహారాజు మరణించాడు. శ్రీరాముడు అరణ్యం వెళ్లాడు కాబట్టి వారి అనంతరము వారసుడైన భరతుని భూభారం వహించుమన్నాడు. అందులో అన్యాయమేమి లేదు.

మరి భరతుడెందుకు ఆ మహర్షిని అంత తూలనాడాడు? ఆయన అంత అజ్ఞుడా? కాదు 'భరతస్తు మహాత్మా' అని వాల్మీకి పలుస్థలాలలో భరతుని మహాత్మునిగా ప్రస్తుతించాడు. మరెందుకు సభలో దూషించాడు. ఇదుగో ఇక్కడే భరతుని మాహాత్మ్యము మనందరికి వివరిస్తున్నాడు వాల్మీకి భగవానుడు.

భరతుడెటువంటివాడు? రామునికి ఎన్నడైనా మనస్సులోనైనా అణువంత అయినా హానిని తలపెట్టాడా? లేదే? ఎన్నడైనా తాను రాజు కావాలని ఎవ్వరితోనైనా చివరకు కన్న తల్లి కైకతోనైనా అన్నాడా? లేదే.

అటువంటప్పుడు అన్ని తెలిసిన వశిష్ఠుడే తన గురువే తనకు రాజ్యాశ ఉన్నట్లు తలచి సభలో రాజావుకమ్మని ఆదేశిస్తాడా? అది అన్యాయంకాదా? తన కులగురువు తన స్వభావానికి విరుద్ధంగా అందరి ముందు అలా అనడం అన్యాయం కాదా? అందులో అది మామూలు సమయమా ? కాదే? రాముడు దూరమయ్యాడని, మహారాజు మరణించాడని తాను పుట్టెడు దుఃఖంలో మునిగి ఉన్నాడే? అప్పుడు వశిష్ఠుడంతటివాడు తనను రాజ్యాశ కలవానిగా పలుకడం తప్పు కాదా?

అంతటితో ఆగలేదు భరతుడు – తన స్వభావాన్ని ఆ మహామునికి – సభా సదులందరికి స్పష్టపరుస్తున్నాడు.

'రాజ్యంచాహంచరామస్య'

ముందు – ముందు తరాలనుండి పురోహితుడుగా ఉంటూ వస్తున్న ఆ మహర్షిని అందరి ముందు నిలదీసి అడుగుతున్నాడు.

ఆచార్యా! తరతరాల నుండి మా అందరి ఆచారవ్యవహారాలను, వారి అనుష్ఠానాలను చక్కగా గ్రహించిన సమర్థుడవే! సంయమీంద్రుడవే! మా వంశంలో ఎవ్వరైనా రాజ్యాన్ని అపహరించిన అవినీతి పరులు అగుపించారా? దశరథుని తనయులైన మమ్మల్ని నలుగురిని మొదటినుండి గమనిస్తున్నావే? మాలో ఎవ్వరైనా మహారాజ్యాన్ని అపహరించాలని అనుకోవడం గమనించావా? దశరథునికి జన్మించిన వాడెవ్వడు దేన్నైనా తస్కరించాలని చూస్తాడా? ప్రస్తుత పరిస్థితుల వలన రాజ్యభారము నామీదే పడిందంటావా మహానుభావా? నీ దృష్టిలో రాజ్యానికి నాకు ఏమైనా తేడా కనుపిస్తుందా?

నా దృష్టిలో రాజ్యము నేను ఒకే రకము. రాజ్యము ఎలా రాజా కాజాలదో - నేను కూడా రాజును కాను, రాజ్యము తనను తాను పాలించుకొంటుందా? నన్ను పాలించగల్గుతుందా? లేదే? రాజ్యమెప్పుడు పరతంత్రమే కదా?

అలాగే నన్ను నేను పాలించుకొనే స్వతంత్రుడిని కాదు. రాజ్యాన్ని పాలించే మహారాజును కాను. రాజ్యమెలా పరతంత్రమో నేను కూడ రామునికి పరతంత్రుడనే రాముడే రాజ్యాన్ని నన్ను కూడ పాలించడానికి సమర్థుడు.

'ధర్మం వక్తుమి హార్హసి' అందువలన ధర్మజ్ఞా! ఇప్పుడు కూడ ధర్మమే - నేను అనుసరించే విశేష ధర్మాన్నే అందరికి తెలుపు' మని వశిష్ఠ మహర్షి యంతటి వానిని నిలదీసిన మహాత్ముడు భరతుడు.

ఆశ్చర్యకరమైంది భరతుని త్యాగశీలము. ఓమహాత్మా! భరత కుమారా! ఆశ్చర్యకరమైంది నీ త్యాగఫలము. అందువలననే భరత జాతికి కంతటికి నీ నామమే శిరోధార్యమైంది! మా దేశమే భారత దేశమయింది.

భరతుని మనస్సు ఎల్లప్పుడు రామ భక్తితోనిండి ఉంటుంది. దానితోపాటు తన కారణంగా తన తల్లి శ్రీరాముని అడవులకు పంపిందనే అపరాధ భావము కూడ ఆయన మనస్సులో చోటు చేసికొంది.

వశిష్టాది మహర్షులు ఆజ్ఞాపించినా పౌర, సామంతాదులు అభ్యర్థించినా - ప్రాణంలేని రాజ్యంవలె, ప్రాణంకల తాను కూడ శ్రీరామునికే పరతంత్రుడనని

నిస్సందేహంగా తన మనస్సులోని భావాన్ని భరతుడు స్పష్టము చేశాడు.

తాను అయోధ్యకు వచ్చిన తరువాత జరుగుతున్న ప్రతి సంఘటన భరతుని మనస్సులో శోకావేశాన్ని పెంచుతున్నది. తాను శ్రీరాముని పాదద్వంద్వమును ఆశ్రయించనిదే తనకు దుఃఖశాంతి కలుగదనే నిర్ణయానికి వచ్చాడు. తన నిర్ణయాన్ని దశరథ పత్నులకు, మంత్రి సామంత్రులకు, పౌర జానపదులకు తెలిపాడు. భరతుని వెంట వెళ్లడం ద్వారా తమకందరికి శ్రీరామచంద్రస్వామి సందర్శన సౌభాగ్యము లభింపగలదని సకల జనుల స్వాంతాలు సంతోష తరంగాలతో సముద్రాలవలె ఉప్పొంగిపోయాయి.

అరణ్యంలో దారిని సుగమం చేయడానికి, మధ్య మధ్యలో గుడారాలు వేయడానికి ఆహార పదార్థాలను తీసికవెళ్లడానికి, ఏర్పాట్లు చేయబడ్డాయి, చతురంగ బలాలు కదిలాయి.

తాను ఒక్కడే వెళ్లి ప్రార్థిస్తే రాముడు తిరిగి వస్తాడో రాడో అని తల్లులను, పురోహితులను, మంత్రి, సామంత్రులను పౌర జానపదుల నందరిని తన వెంట తీసుకవెళ్లాడు. కరుణా మయుడయిన శ్రీరామచంద్రుడు ఇందరి కన్నీరును చూచి కరిగి తప్పక వెంటనే తిరిగివస్తాడని భరతుడు గాఢంగా భావించాడు. అయోధ్య అంతా ఆయనవెంట ఆనందంతో తరలి వెళ్ళింది. వారు ఆ రాత్రి గంగా తీరంలోని శృంగి బేరపురానికి చేరారు. ఆ రాత్రి అక్కడే విశ్రమించి, ఆ పవిత్ర గంగా జలాల్లో దశరధుని కొరకు నివాపాంజలిని ఘటించివెళ్లాలని నిర్ణయించారు.

## గుహుని సౌజన్యము

శృంగిబేర పురాధీశుడయిన గుహుడు ఒక సేనా సముద్రము తమ ప్రాంతంవైపు తరలి వస్తుండడం – అనుచరులతో సహా గమనించాడు. – ఆసేన మధ్యలో కోవిదార వృక్షము గుర్తుగా గల జండా రెపరెపలాడుతుండడం చూచాడు. ఆ పతాకము అయోధ్యాధి పతులదే అని ఆయనకు తెలుసు.

గుహుని మనో భూమిలో ఒక అనుమానము మొలకెత్తి పెనుభూతంగా పెరగసాగింది. భరతుడు భయంకరమైన సేనతో రామ భక్తులయిన తమపై దండెత్తి

వస్తున్నాడని, సీతారామలక్ష్మణులను హతమార్చి శత్రుకంటకాలను నిశ్శేషం చేయబోతున్నాడని గుహుడు భావించాడు. భరతుని భావాన్ని పరీక్షించి ఆయనలో దుర్బుద్ధి ఏమాత్రము ఉన్నా భరతుని పరివారాన్ని అంతటిని పుట్టిముంచి గంగపాలు చేయాలని, లేదా భరతుడు సదాలోచనా భరితుడై వస్తుంటే ఆయన పరివారాన్ని అంతటిని గంగను క్షేమంగా దాటించాలని గుహుడు తన అనుచరవర్గాన్ని ఆదేశించి అప్రమత్తం చేశాడు.

నిషాదాధిపతి అయిన గుహుడు వన్యములయిన ఆహార పదార్థాలను తీసికొని సుమంత్ర సహితుడైన భరతుని సందర్శించాడు. సుమంత్రుడు స్థపతి అయిన గుహుని రామానురక్తి గురించి రామానుజులకు తెలిపాడు. అయోధ్యాధిపతులకు పెరటి తోట వంటి తన అరణ్య ప్రాంతంలో హాయిగా విహరించుమని – తమ ఆతిధ్యాన్ని స్వీకరించుమని భరతుని – గుహుడు ప్రార్థించాడు.

భరతుడు గుహుని ఔదార్యాన్ని ప్రస్తుతించాడు. 'అర్చిరాది మార్గంలో పయనించే ముక్త పురుషుడు – మార్గంలోని దేవతా భోగాలను కన్నెత్తి చూడకుండా శ్రియః పతిని చేరుకోవడమే ఎలా తక్షణ కర్తవ్యంగా భావిస్తాడో' భరతుడు కూడ అలాగే గుహుని అతిధ్యాన్ని స్వీకరించడం కంటే రామ సందర్శనమే ప్రధానమని తన ఆంతర్యాన్ని ఆయనకు సూచించాడు.

అయినా గుహుని అంతరంగంలో అనుమానము అంతరించలేదు. అడవులలో తిరిగే ఆయన తన మనస్సులోని ఆలోచనలను దాచుకోలేక – తన అనుమానాన్ని భరతుని ముందు బయలు పరచాడు.

'భరతా! ఇంత సైన్యంతో రాముని దగ్గరకు ఏగుతున్నావు కదా! నీ మనస్సులో రామునికి ప్రమాదం కలిగించాలనే దుర్మార్గం దాగిలేదు కదా? అని సూటిగా అడిగాడు.

భరతుడు గుహుని ప్రశ్నను విని నిర్మలంగా నవ్వాడు. చెడు చేయాలనే తలంపు ఉన్నవారికి, లేదా తమను చెడు వారిగా అన్యులు అనుమానిస్తారని తమలో తక్కువదనము భావనతో బాధపడే వారికి 'గుహుని ప్రశ్న' ఉలికి పాటు

కలిగించగలుగుతుంది. కాని భరతుని మనస్సు ఆకాశము వలె అమలిన (నిర్మల)మైంది. వాల్మీకి భగవానుడు భరతుని మనస్సును ఆవిష్కరింపజేస్తూ.

'ఆకాశ ఇవ నిర్మలః - భరతః శ్లక్ష్ణయా వాచా గుహం వచన మబ్రవీత్' అంటాడు. గుహుని ప్రశ్న భరతునిలో కోపాన్ని కల్గించేలేదు. తన తల్లి కోరికకు బాధపడే రామ భక్తులం తాతనను అనుమానించడం సహజమే అనుకొన్నాడు. స్థిర చిత్తులకు అస్థిర మనస్కులకు ఇదే ముఖ్యమైన అంతరము.

భరతుడు మృదువుగా మధురంగా తన మనస్సులోని భావాన్ని స్పష్టము చేస్తున్నాడు. శ్రీరామ భక్తుడైన గుహునితో ప్రేమతో :-

'వన రాజా! నీవు అనుమానించేట్లుగా నా మనస్సులో రాముని పట్ల దుష్టబావన మొలకెత్తే దుష్కాలము దాపురించకుండుగాక! రాముడు నా అన్న! తండ్రి వంటి వాడు. ఆ ప్రభువును అయోధ్యకు తిరిగి తీసుకవెళ్లాలనుకొంటున్నాను' అని తెలిపాడు.

భరతుని మాటలు గుహుని స్వాంతాన్ని సంతోష భరితంకావించాయి. ఆయన ఆనందంతో 'భరతా! అప్రయత్నంగా లభించిన అవనీ సామ్రాజ్య సంపదనంతటిని తృణప్రాయంగా భావించిన నీవు ధన్యుడవు! నీతో సమానుడు ఈ ప్రపంచంలో ఎక్కడా లేడు. శ్రీ రాముని తిరిగి తోడుకొని రావాలనుకొనే నీ కీర్తి లోకాలన్నిటిలో వ్యాపిస్తుంది' అని భరతుని ప్రస్తుతించాడు.

భరతుడు గంభీరస్వభావుడు. తన లోని బాధను ఆయన తన ముఖంలో బయట పడకుండా అదిమిపట్టే ప్రయత్నం చేస్తున్నాడు. అయినా ఆయన హృదయాంతరాళాలలో రామ వియోగబాధ వృక్షాగ్ని వలె రగులుతూనే ఉంది. ఆయన గుహునితో సీతారామ లక్ష్మణుల గురించి అడిగాడు. గుహుడు ఆయనకు వారి క్షేమాన్ని తెలిపాడు-ముఖ్యంగా మహాత్ముడైన లక్ష్మణుని సద్భావాన్ని వివరించాడు. ఆ సందర్భాన్ని వాల్మీకి కవీంద్రుడు తన మనోహరవాక్కులతో వివరించాడు.

ఇతిశం

# లక్ష్మణుని సద్భావన

'ఆచచక్షేZ థ సద్భావం। లక్ష్మణస్య మహాత్మనః

భరతాయా ప్రమేయాయ। గుహో గహనగోచరః'

గుహుడు గహన గోచరుడు అనగా అడవులలో నివసించేవాడు. నాగరికుల మనస్సులను గుర్తించే నేర్పు ఆటవికులలో ఉండదు.

అందులో భరత లక్ష్మణులు స్వయంగా ఒకే తండ్రి పిల్లలు. అంతేకాదు భరతుడు లక్ష్మణుని ప్రతి అడుగును ఎంతో ఆదరంతో పరిశీలించిన వాడు. భరతుడు కూడ రామభక్తిలో అప్రమేయుడు – సాటిలేనివాడు. అంతటి భరతునితో గుహుడు లక్ష్మణుని సద్భావాన్ని వివరించడానికి ముందుకొచ్చాడు. 'గుహుడెంత?' అని భరతుడు ఆయనను అనాదరించకుండా ఆయన చెప్పే మాటలను చెవులుకోసుకొని వినసాగాడు.

భగవద్విషయమే అటువంటిది. చెప్పేవారు, వినేవారు తమ శక్తి సామర్థ్యాల పట్ల స్పృహకలిగి ఉండరు. మధురాతి మధురమైన మధుసూదనుని విషయాన్ని ఎవ్వరు చెప్పినా వీనులారా వింటారు విషయం పట్ల ఆదరం లేక వినేవారు మాత్రమే వక్తల శక్తియుక్తుల పరీక్ష చేయాలనుకొంటారు.

'సీతారాములు దర్భశయ్యలపై పడుకోగానే గుహుడు లక్ష్మణునితో 'రాకుమారా!' ఈ రాత్రి నీవుకూడా విశ్రమించు. నేను, నా అనుచరులందరము సీతారాములను జాగ్రత్తగా కాపాడుతాము' అని తెలిపాడు.

లక్ష్మణుని స్థానములో మరే మానవుడున్నా 'గుహా! నీవన్నది నిజమే! అయోధ్య నుండి బయలుదేరినప్పటినుండి ఇంతవరకు నాకళ్లరెప్పలు వాల్చలేదు. నెత్తిమీద తట్ట, బట్టల మూట, చేతిలో పలుగుపార ధరించి అడవిలో సంచరించి నా ఒళ్ళు అంతాహూణమైపోయింది. సీతారాముల సంరక్షణాలోచనతో నా స్వాంతమంతా బరువెక్కిపోయింది! మిత్రమా గుహా! నీవు రక్షిస్తానని మాటిచ్చావు. కనుక ఈ ఒక్క రాత్రి హాయిగా నిద్రిస్తాను. తెల్లవారి లేవగానే మళ్లీ క్రొత్త

ఉత్సాహంతో సీతారాముల సంరక్షణ బాధ్యతను స్వీకరిస్తాను' అని తట్ట బుట్టలను తలపైనుండి దించుకొని పలుగు పారను క్రిందపడవేసి – గుహునిపై రక్షణ భారాన్ని వదిలి ఒళ్లు మరచి హాయిగా నిద్రించేవాడు.

కాని ఇక్కడే లక్ష్మణుని స్వభావంలో ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడే సాధారణులమైన మనకు సౌమిత్రికి మధ్య అగాధమైన తేడా ఉంది.

వాల్మీకి మహర్షి – లక్ష్మణుని స్వభావాన్ని 'సద్భావమని' వ్యవహరించాడు. 'సత్' అనగా ఎప్పుడూ ఉండే 'సహజమైన భావము' అనగా స్థితి.

తనను విశ్రాంతి తీసికొమ్మని సలహా ఇచ్చిన గుహునికి సౌమిత్రి ఇచ్చిన సమాధానాన్ని సావధానంగా గమనిద్దామా! 'కథం దాశరథౌ భూమౌ! శయానే సహసీతయా శక్యా నిద్రా మయాలబ్ధుం! జీవితం వా సుఖానిచ!'

తమకు కావలసిన వాళ్లకు ఏదైనా ఘోరాపద సంభవించినపుడు – 'కొంచెమైనా మేను వాల్చు'మని తోటివారు అంటే ఎవ్వరైనా ఏమంటారు?

'ఏమయ్యా! నిద్ర పొమ్మని అంటున్నావే? ఎలాగయ్యా (కథం) నిద్రపోయేది? మా ఆయన ఇంత ఆపదలో ఉంటే నిద్ర ఎలా వస్తుందయ్యా? నాకు సుఖాలెందుకు ? నాకు జీవితమెందుకు?' అనరా?

లక్ష్మణునికి తన జీవితం పట్ల – తన సుఖాలపట్ల కోరికలేదు. తల్లిదండ్రులను, రాజ్యాన్ని, ప్రియపత్నిని తన వారందరిని వదిలి సీతారాములను అనుసరించిన సౌమిత్రికి స్వంత జీవితం పట్ల సౌఖ్యాల పట్ల స్పృహ ఉంటుందా? ఆయన అంటున్నాడు.

'గుహా! దశరథ సార్వభౌముని పెద్దకొడుకు – ముద్దుల కొడుకు, సుకుమారుడు అయిన మా శ్రీ రామ భద్రుడు – ఎండవేడిని తట్టుకోజాలని సుకుమార గాత్రి, జనక చక్రవర్తి కుమారి, తన ప్రియ ధర్మపత్ని అయిన మా సీతమ్మతో కూడ కరకు అడవి నేలపై పడుకొన్నాడయ్యా? ఎంతకష్టకాలము వచ్చింది ? వాళ్లను ఇంతటి కష్టాలలో చూస్తున్న నాకు నిద్ర ఎలా వస్తుందయ్యా ? నాకు సుఖాలెందుకు ? నాకు జీవితంతో ఏమిపని ?

మా రాముడు సురాసురులను సమరాంగణములో ఓడించగల సమర్థుడు. తనను అడవులకు పంపిన తండ్రిపైగాని, కైకేయిపై గాని, భరతునిపైగాని ఏ మాత్రము ఆగ్రహించని ధర్మమూర్తి – మాసీత అయోనిజ. సీతారాములు అడవికి బయలుదేరగానే అంతఃపుర పరివారమంతా గొల్లుమంది. వారంతా ఏడ్చి, ఏడ్చి శోకాన్ని సహించజాలక చనిపోయి ఉంటారు. మా తండ్రి దశరథుడు – రామ విరహాన్ని భరించలేక ప్రాణాలు వదిలి ఉంటాడు. మా కన్న తల్లి సుమిత్రాదేవి మా సోదరుడైన శత్రుఘ్నుని జూచుకొని ఒకవేళ బ్రతికితే బ్రతుకవచ్చుగాక. కాని ఒకే ఒక కొడుకును – రాముని వంటి లోకోత్తర పుత్రుని కన్నతల్లి కౌసల్యాదేవి జీవించి ఉండజాలదు. అయ్యో! మరణించిన మా తండ్రిగారికి అంత్యక్రియలను జరుపుకొనే అవకాశము, పితరుల ఋణాన్ని తీర్చుకొనే అదృష్టము కూడ మాకు లేదు కదా!' అని లక్ష్మణుడు ఆ రాత్రంతా ఆక్రోశిస్తు ఉండిపోయాడు. తెల్లవారి నారవస్త్రములను ధరించి జటాధారులైన వారిని సీతతో సహా నౌకపై గంగానదిని నేనే దాటించాను. 'మహాత్ముడైన లక్ష్మణుని మనస్సు ఎంత విశాలమైనదో! – సోదరప్రేమ ఎంతలోతైనదో! అని ఆశ్చర్యముతో భరతునికి లక్ష్మణుని సద్భావాన్ని వివరించాడు.

భరతుడు గుహుని వలన సీతారాముల దుస్థితిని, లక్ష్మణ సద్భావాన్ని గురించి విని భరించరాని దుఃఖముతో మూర్ఛిల్లాడు. కౌసల్యాదేవి భరతుని లేవనెత్తి అతని ఆరోగ్యమును పరామర్శించింది. సీతారామలక్ష్మణుల గురించి ఏమైన దుర్వార్త తెలిసిందేమో అని అనుమానించింది. భరతుడామె సందేహాలను తీర్చాడు. తిరిగి గుహుని వైపు తిరిగి సీతారామలక్ష్మణుల వృత్తాంతాన్ని మరింత వివరించుమని కోరాడు.'

గుహుడా రాత్రి శ్రీ రాముడేమి తినలేదని జలోపవాసం చేశాడని ఆ జలాలనే సీతాలక్ష్మణులు కూడ సేవించారని తెలిపాడు. మరొక అద్భుతాన్ని భరతునికి వివరించాడు.

గుహుని ప్రార్థనను అంగీకరించక లక్ష్మణుడు రక్షణార్థము విల్లమ్ములు చేత ధరించి సీతారాముల చుట్టు తిరగసాగాడు – గుహుని మనస్సులో సందేహము

కలిగింది. 'ఒక సోదరుని కారణంగా శ్రీరాముడు అడవుల పాలయ్యాడు. మరొక సోదరుడు రాముని అనుసరించాడే. అయన వలన సీతారాముల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందేమో' ఆ అనుమానంతో లక్ష్మణునికి కొద్ది దూరంలో ఆయన కూడ అతనినే అనుసరిస్తూ శ్రీ రామలక్ష్మణులను కాపాడసాగాడు. ఇక గుహుని అనుచరులు శ్రీరాముని ఎప్పుడో ఒకసారి చూచారు. మొదటి చూపులోనే ఆ అభిరాముని భువన మోహన సౌందర్యము వారిని పరవశులను చేసింది. వారికి 'లక్ష్మణ, గుహులిద్దరిలో ఎవ్వరివలన సీతారాములకు ఏమి ప్రమాదము కలుగుతుందో' అని వారిద్దరిని అనుమానించి, విల్లమ్ములు ధరించి వారిచుట్టు వారందరు పరిక్రమించసాగారు. చూచారా! గుహుని, గుహానుచరుల రామభక్తిని! రామభక్తి కల్గడానికి అసాధ్యములయిన నియమనిష్ఠలు అవసరములేదు. రాముని నామ రూప సంస్మరణమే చాలు కదా!

శ్రీరాముని సౌందర్యమెంత గొప్పది! శరీర సౌందర్యము పట్ల ఏ మాత్రము స్పృహలేని, అటవీచరుల మనస్సులను కూడ ఆకర్షించింది. స్త్రీలనే కాదు పురుషులను కూడ పిచ్చివారిని కావించేది. ఆ మధురమూర్తి అతిలోక సౌందర్యము.

ఈ సంఘటన వలన మరొక ముఖ్య సందేశాన్ని మనము గ్రహించాల్సిఉంది. సీతారాముల పట్ల అనన్యమైన ప్రేమ కలిగిన వారిలో - ఎవ్వరివలన ఆ దివ్య దంపతులకు ఏమి ప్రమాదము కలుగుతుందో అనే అనుమానం కలుగుతుంది.

'అతిస్నేహః - పాపమాశంకతే'

అంతేకాదు ఆ పుణ్య దంపతుల సంరక్షణ భారము.తామే వహించాలనే ఆరాట మేర్పడుతుంది. తాము నిజంగా రాముని రక్షింప గల్గుతామా లేదా అనే అనుమానము వారికి కల్గదు.

నిజంగా సకల జగద్రక్షకుడైన రామభద్రునికి ఇతరుల రక్షణ అవసరమా ? లేదు. అయినా ఆ భగవంతుని దివ్య మంగళ విగ్రహ సౌందర్యముపై కలిగిన ప్రేమ అందరిలో - అజ్ఞానులలో - జ్ఞానులలో కూడ అజ్ఞానాన్నే కలిగించి భగవంతుని రక్షణ భారము తామే వహించాలనే ప్రవృత్తిని కలిగిస్తుంది. ఆ విధంగా

ఆ జగదభిరాముని కంటికి రెప్పలా కాపాడాలనే లక్ష్మణుని, గుహుని, గుహానుచరుల మనస్తత్వమే మన అందరికి కావలసింది.

## భరతుని దుఃఖము

ఆ రాత్రి సీతారాములు శయనించిన ఆ స్థలాన్ని చూపెట్టుమని భరతుడు గుహుని కోరాడు.

గుహుడు ఒక మహాభక్తుడు. పూర్వజన్మలో ఆయన రామంత్రోపాసకుడైన ఒక ఋషి. ఆయన మరో ఇద్దరు మునులతో కలిసి రామనామ జపంతో కాలం గడిపేవాడు. ఒకసారి ఒక ఆపద కలిగిన వ్యక్తి పరుగు పరుగున ఆయన దగ్గరికి వచ్చి తన ఆపద ఎలా తొలిగి పోతుందని అడిగాడు. ఆ ఋషి 'రామనామాన్ని మూడు మారులు అనుసంధిస్తే ఆ ఆపద తొలగుతుందని' చెప్పాడు. మిగిలిన ఇద్దరు మునులు రామనామమహిమను ఆ ముని తగ్గించాడనే కోపంతో వచ్చే జన్మలో నిషాదుడుగా జన్మించాలని ఆయనను శపించారు.

ఈ జన్మలో స్థపతిగా జన్మించినా – పూర్వజన్మ సంపాదిత రామభక్తి గుహునిలో అలాగే నిలిచి ఉంది. రామునిపై గల ప్రేమతో సీతారాములు శయనించిన అశయ్యను జాగ్రత్తగా చెదిరి పోకుండా ఇన్ని రోజులు ఆయన కాపాడాడు.

భరతుని కోరికపై గుహుడా శయ్యను ఆయనకు చూపెట్టాడు. రాముడు పడుకొన్న గడ్డి పడక, సీతమ్మ అభరణాలనుండి విడివడిన సన్నని తీగలు, గడ్డిలో చిక్కుకున్న ఆమె పట్టుచీర దారాలు భరతునికి అగుపించాయి. శ్రీ రాముని అనుసరించిన సీతా లక్ష్మణుల అదృష్టాలను కొనియాడుతూ తన దౌర్భాగ్యాన్ని నిందించుకొంటూ ఆ రాత్రి అమిత దుఃఖంతో భరతుడు నిద్రలేకుండా గడిపాడు.

## భరద్వాజ మహాముని

భరతుడా రాత్రి అంతా సీతారాములు శయనించిన చోటనేగడిపి – తెల్లవారి శత్రుఘ్నుని ముందుగా లేపాడు. శత్రుఘ్నునికి కూడ సీతారామ లక్ష్మణుల విచారంతో నిద్ర పట్టలేదు.

గుహుని నౌకల సహాయంతో భరతుడు సపరివారంగా గంగను దాటాడు. భరతుడు గంగను తరించిన ముహూర్తము 'మైత్రేయ ముహూర్తము' ఆ ముహూర్తములోనే ఆయన ప్రయాగలోని భరద్వాజ మహాముని ఆశ్రమానికి చేరుకొన్నాడు. అందువలనే ఆ మహాముని విశేషానుగ్రహానికి భరతుడు పాత్రుడు కాబోతున్నాడు.

భరద్వాజుడు వేదవేత్తలలో అగ్రేసరుడు. ఆయనకు వేదవిద్యాధ్యయన ప్రీతి ఎక్కువ. అందువలననే ఆయన బ్రహ్మను ఉపాసించి మూడు మాన వాయుష్యముల వరాన్ని పొందాడు. ఈ మూడు వందల సంవత్సరాలు మూడు (ఋక్, యజు, స్సామ)వేదాల అధ్యయనంతో గడిపాడు. చివరకు బ్రహ్మోపదేశంతో తపస్సుద్వారానే సమగ్ర వేదవిజ్ఞానమము లభిస్తుందని తెలిసి – సమగ్ర తపస్సును తద్వారాబ్రహ్మ సాక్షాత్కారమును సాధించి మహానుభావుడయ్యాడు.

కొంత కాలము ఈయన వాల్మీకి మహర్షి సన్నిధానములో గడిపాడు. రామాయణావతరణము కంటె ('మానిషాద' శ్లోకావిష్కారము కంటె) ముందు – వాల్మీకి వెంట ఉండి – ఆయన ఆశ్రమంలో ఆయనతో పాటు నారదోపదేశాన్ని బ్రహ్మ సాక్షాత్కారాన్ని అనుభవించాడు. రామాయణావిష్కరణాన్ని దర్శించాడు.

భరతుడు తన సేనా పరివారాన్నంతటిని ఆశ్రమానికి దూరంగా నిలిపి వశిష్ఠాది మహర్షిగణాన్ని ముందుంచుకొని వినమ్రుడై భరద్వాజ మునీంద్రుని సేవించడానికి ఆయన ఆశ్రమంలోనికి వెళ్ళాడు. భరద్వాజ మహర్షి వశిష్ఠాది ముని గణాన్ని దర్శించగానే తన ఆసనం నుండి లేచి – వారికి అర్ఘ్యపాద్యాచమనీయాది సత్కారాలను గావించాడు. భరతుడా మునీంద్రునికి ప్రణమిల్లాడు. భరద్వాజుడు భరతుని కుశలప్రశ్నల గావించి, ఆయన రాకకు కారణమడిగాడు.

'భరతా! పాపవిదూరుడైన శ్రీరాముని విషయంలో నీవు పాపం చేయడానికి (ప్రమాదాన్ని కల్గించడానికి) వెళ్లడం లేదు కదా? ఎందుకంటే నిష్కంటకంగా నీవు రాజ్యం చేయాలనుకొంటే ఏనాటికైనా రామలక్ష్మణులు అడ్డుపడుతారు కదా?' అని భరద్వాజుడు ముక్కుసూటిగా ప్రశ్నించాడు. మహర్షులు ఋజుమార్గవర్తనులు.

వారికి సంసారుల వలె మనస్సులో ఒక అభిప్రాయాన్ని దాచుకొని – పైకి మరొక విధంగా ప్రశ్నించే అలవాటు ఉండదు. అంతే కాదు మహర్షులు రాజదండనకు అతీతులు. అందువలన కూడ వారు నిర్భయంగా రాజునైనా సూటిగా ప్రశ్నింపగల్గుతారు.

భరద్వాజుని ప్రశ్న భరతుని మనస్సరోవరాన్ని అల్లకల్లోలం చేసింది. ఇంతకు ముందు గుహుడీ ప్రశ్నే అడిగినప్పుడు భరతుని మనస్సు ఎక్కువగా బాధపడలేదు. కారణము తన హృదయంలో గూడు కట్టుకొన్న రామభక్తిని గుహుడు గ్రహించే అవకాశము లేదు.

కాని భరద్వాజుడు త్రికాలజ్ఞుడు. జరిగిన, జరుగుతున్న జరుగబోయే విషయాలన్నింటిని తన తపశ్శక్తితో సంపూర్ణంగా గ్రహింపగలిగినవాడు. అంతటి మహర్షి కూడ తనను అనుమానిస్తున్నాడే? ఎంతటి దుస్థితిలో పడిపోయాడు తాను? భగవంతునికి అపకారాన్ని తెలిసి చేసినా, తెలియక చేసినా, స్వయంగా చేసినా లేక ఆ అపరాధానికి తాను పరోక్ష కారణమైనా – లోకనిందకు పాత్రుడు కాక తప్పదని – భరతునికి అనుభవం ద్వారా అర్థమైంది.

భరతుడు తన దుఃఖాన్ని అంతటిని ఎలాగో నిగ్రహించుకొని 'మహాత్మా రాముని అడవులకు పంపి రాజ్యమేలాలనే చెడ్డ కోరిక నాలో ఏనాడు లేదు. నా తల్లి మా తండ్రి గారిని యాచించిన వరాలకు నేను సిగ్గుతో, బాధతో, దుఃఖంతో కుమిలిపోతున్నాను. నేనిప్పుడు శ్రీరాముని ప్రసన్నుని చేసికొని ఆయనను తిరిగి అయోధ్యకు తీసిక వెళ్లాలనే తలపుతోనే ఇంత మందితో బయలుదేరాను. నన్ను భూతభవిష్యద్వేత్తలయిన మహర్షులు అనుగ్రహింప ప్రార్థన' అని భరద్వాజుని వేడుకొన్నాడు. వశిష్ఠాది మహామునులందరు భరతుని సమర్థించారు.

భరద్వాజ మునీంద్రుడు కరుణించి 'నాయనా – భరతా! నీ హృదయము నాకు తెలుసు. అయినా నిన్ను అలా ప్రశ్నించడానికి రెండు కారణాలున్నాయి.

1. నీ హృదయాభిప్రాయాన్ని నీవు ధృఢపరుచుకోవడానికి. మహర్షుల ముందు తెలిపిన అభిప్రాయాన్ని మార్చుకోవడం సులభ సాధ్యం కాదు.

2. నీ కీర్తిని లోకానికి చాటిచెప్పడానికి. భరతా! నీవు నీ పరివారాన్నంతటిని నా ఆశ్రమ ప్రాంతంలోనికి తీసికొనిరా! నీ పరివారానికంతటికి చక్కని విందును కల్పిస్తాను.

మహర్షి ఆహ్వానాన్ని అంగీకరించి తన సమస్త సేనా వాహినితో, మహర్షిగణంతో మంత్రి సామంతాది రాజోద్యోగ వర్గంతో – అంతఃపురపరివారంతో – భరద్వాజాశ్రమంలో ఆ రాత్రి గడువడానికి – ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించడానికి భరతుడు సిద్ధమయ్యాడు.

## భరద్వాజుని విందు

భరద్వాజుడు ఒక గొప్ప మహర్షి. ఆయన సంపూర్ణ జితేంద్రియుడు.

'ద్వాజము' అనగా 'వీర్యము'. దానిని తనలోనే భరించినవాడు – అందుకే ఆయన భరద్వాజుడు.

దేవతల ప్రార్థనతో సురగురువు వీర్యాన్ని 'మమత' అనే దివ్యకాంత భరించినందువలన జన్మించినవాడు.

'వాజ' మనగా సంతానము – 'ప్రజావైవాజః' తా ఇవ బిభర్తీతి భరద్వాజః' దీనులను, ద్విజాలను, దేవతలను సంతానము వలె కాపాడే వాడు.

ఇంద్రియ జయముగల భరద్వాజుని ప్రకృతి సుఖాలు పరవశుని చేయలేదు. ఆయన మూడు మానవాయుష్యకాలాలను మూడు వేదాల అధ్యయనము కొరకు గడిపి బ్రహ్మ ఆదేశంతో అనంతకాలము దీర్ఘ తపము గావించి సమగ్ర వేదరాశిని సస్వరంగా స్వాధీనము చేసికొన్నాడు. తన తపశ్శక్తితో దీర్ఘయాగాలను గావించి దేవతలను ద్విజాలను ప్రసన్నులను గావించుకొన్నాడు. దేవర్షి పితృఋణాలను సంపూర్ణంగా తీర్చుకొన్నవాడు.

'తప – ఆలోచనే' అన్నట్లుగా వేదార్థాన్ని సంపూర్ణాలోచనతో అర్థం చేస్కొన్నవాడు. వేదాధ్యయనానికి ఆరంభంలో, అంతంలో 'హరిః ఓం' అని ఉంటుంది. సంపూర్ణ వేద సారము ప్రణవమే – లేక ఓంకారమే. అందలి 'అ, ఉ,

మ' అనే అక్షరాలు శ్రీమన్నారాయణునికి మనకు ఉండే నిత్య సంబంధాన్ని తెలుపుతాయి. 'నదేవో కేశవాత్పరః' అని వేదవ్యాసుని నిర్ణయం. అదే సకల వేద సారము. అలాగే శ్రీహరికి సంబంధించిన అనేక మంత్రాలలో 'విష్ణుగాయత్రి' లోని 'విష్ణు వాసుదేవ నారాయణ' మంత్రాలు ముఖ్యమైనవి. ఆ మూడింటిలో కూడ శ్రీమన్నారాయణునికి సంబంధించిన 'అష్టాక్షరీ మంత్రమే సర్వ శ్రేష్ఠమని 'నాస్తి చాష్టాక్షరాత్పరః' అని వ్యాస భగవానుని తాత్పర్యము.

అష్టాక్షరీ మహామంత్రము, ద్వారా జీవాత్మలమైన మనమందరము ఒక్క శ్రీమన్నారాయణునికి మాత్రమే కాక అతని పరివారమైన భక్తులకు భాగవతోత్తములకందరికి విధేయులమని స్పష్టమవుతున్నది.

భరద్వాజుడు తన మహత్తరతపశ్శక్తి ద్వారా అష్టాక్షరీ మహామంత్రాన్ని పరకాల మహాముని వలె సమగ్రంగా దర్శించిన వాడు - అందువలననే ఆయన శ్రీరాముని కంటే మిన్నగా భరతుని ఆయన పరివారాన్ని ఆదరింపదలిచాడు.

భరద్వాజుడానాడు భరతుని పరివారానికిచ్చిన విందు విశ్వసాహిత్య చరిత్రలోనే విశిష్టమైనది ఆయన ఆజ్ఞ ప్రకారము ఆ విందునివ్వడానికి పూనుకొన్నవారు సాక్షాత్తుగా దేవతలే.

భరద్వాజమహర్షి మంత్రస్వరంతో విశ్వకర్మను ఆవాసాలను నిర్మించడానికి, వడ్రంగి పని కొరకు 'త్వష్టను', ఏర్పాట్లను చూచుకోవడానికి, ఇంద్ర, కుబేర, వరుణయములను ఆహ్వానించాడు.

చైత్ర, నందనవనాలు చిత్రంగా భూమిపైకి దిగివచ్చాయి. పరివారానికి పరిచర్యలు చేయడానికి అప్సరసలే పూనుకొన్నారు. ఓషధీనిర్వాహకుడు, రసాధిపతి అయిన సోముడు భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య, పానీయములనే నాలుగు విధాల భోజన పదార్థాలను సమకూర్చాడు.

మద్యమును, అనేక విధాలైన సురలను, ఫలరసాలను నిరంతరము అపరిమితముగా ప్రవహింపజేసే అనేక నదులు భోజన, పానీయాల తరువాత త్రాగడానికి చల్లని, తీయని నీరుని ప్రవహింపజేసే అనేక నదులు వెలిశాయి.

భోజన, పానీయాల తర్వాత భరతుని పరివారానికి మనోల్లాసము కల్పించడానికి అప్సరసల నాట్యాలు, తుంబుర, నారదాది గంధర్వుల మధురవాద్య నాదాలు గాత్ర సంగీత కచేరిలు నిర్వహింపబడ్డాయి.

భరతుని పరివారము మొత్తానికి బంగారు మేని రంగు గల 'హేమ' స్వాగతాన్ని పలికింది. పరివార సభ్యులు అందరికి అమూల్యమైన ఆసనాలు కల్పించబడ్డాయి. ఒక్కొక్క సైనికునికి ఏడెనమిది మంది అప్సరసలు కలసి అభ్యంగన స్నానములు చేయించారు. శరీరములకు నూనెలను రాచువారు, పరిమళ భరితములైన పిండ్లతో నలుగు పెట్టేవారు, పరిమళ ద్రవ్యములతో స్నానాలను చేయించేవారు, శరీరముల తడిని నూతన సుకుమార వస్త్రాలతో అద్దేవారు దివ్య పీతాంబరాలను ధరింపజేసేవారు, నూతనాలంకారాలను చేయించేవారు, అనేక రకాలైన రుచికరాలైన మాంసాహార, శాకాహారాలను వడ్డించేవారు, పూల మాలలను, చందన, తాంబూలాదులను అందించేవారు, పాదసంవాహనము చేయువారు, నిద్ర పుచ్చువారు అందరు అప్సరసలే. అప్సరసల అంగాంగ స్పర్శతో భరతుని పరివార సభ్యులు ఆనందపుటంచుల దాకా వెళ్లారు. వారు ఒకరకమైన మత్తులో తేలియాడసాగారు. ఆ ఆనందము తమదే అని, అదే శాశ్వతమని అనుకోసాగారు. ఆ సంతోషానుభవంలో ఏ కొద్ది అంతరాయాన్నైనా సహించే స్థితిలో వారు లేరు.

'నైవాయోధ్యాం గమిష్యామః నగమిష్యామదండకాన్‌! కుశలం భరతస్యాస్తు! రామస్యాస్తు తథాసుఖం'

వారికి రాముడున్నదండకారణ్యాలకు వెళ్లాలని లేదు. వారి స్వంత స్థలానికి అయోధ్యకు వెళ్లాలని లేదు. వారి గృహాలు, భార్యలు, పిల్లలు ఎవ్వరి గురించి ధ్యాస లేదు.

ఉన్నచోటునుండే భరతుడికి క్షేమం కల్గాలని, రాముడికి సుఖం కలుగాలని కోరుకొన్నారు. భరతుడు అడవికే వెళ్లనీ – అయోధ్యకే వెళ్లనీ – రాముడు అయోధ్యకు తిరిగిరానీ అడవులలోనే ఉండిపోనీ – ఎవ్వరెక్కడ ఎట్లా ఉన్నా, వారికి అవసరము లేదు. వారి ఆనందమయ ప్రపంచమే వారిది. అది అలాగే ఉంటుందని. ఉండాలని వారి అభిప్రాయము.

సామాన్యుల పరిస్థితి ఈ రకంగా ఉంటే భరతుని మనస్థితి ఎలా ఉందో చూద్దామా! భరతుని కొరకు ప్రత్యేకంగా విశాలమైన వసతితో ఒక స్వస్తిక రమ్యహర్మ్యము నిర్మించబడింది. సార్వభౌముడు అధిష్ఠించే రత్న ఖచితమైన సువర్ణ సింహాసనము కల్పించబడింది.

మంత్రి, సామంతాదులకు, పురోహిత వర్గానికి ప్రత్యేక ఆసనాలు ఏర్పరుచబడ్డాయి.

భరద్వాజుని అనుమతితో భరతుడు కొంత, ముఖ్య పరివారంతో తన మందిరములో ప్రవేశించాడు. మహోన్నత సింహాసనం ముందు నిల్చున్నాడు. భరద్వాజమునితో పాటు అక్కడి వారందరు ఆ సింహాసనము పై భరతుడు కూచుంటాడనుకొన్నారు. నిజానికి ఆయన కొరకే ఆ సింహాసనము ఏర్పరుచబడింది. ఆ అద్భుత సన్నాహాలన్ని భరతుని కొరకు ఉద్దేశించబడ్డవే.

కాని భరతుని ఆలోచన వేరు. ఆయన తనను ఒక రాజుగా ఎన్నడు భావించుకోలేదు. రామచంద్రుడెక్కడ ఉన్నా - ఆయనే మహారాజు, తాను ఎల్లప్పుడు రామదాసుడే.

భరతుడు ఆ దివ్య సింహాసనం ముందు క్షణం నిలబడ్డాడు, హఠాత్తుగా వంగి దానికి నమస్కరించాడు. దాని చుట్టు ప్రదక్షిణం చేసి వచ్చి, ప్రక్కనున్న మరో చిన్న ఆసనంపైన కూచొన్నాడు. అక్కడ ఉన్న వారందరు, మహామునులతో సహ నివ్వెరపడ్డారు. ఆ తరువాత భరతుని విధేయ పారతంత్ర్య స్వభావమును గుర్తించి తమ తమ మనస్సులలో భరతుని పరార్థదీక్షకు జోహారులర్పించారు.

ఆ రాత్రి భరతుడు తన నియమనిష్ఠలను ఏ మాత్రము సడలించక పరిమితాహారమును గైకొన్నాడు. ఆ రాత్రంతా శ్రీ సీతారామలక్ష్మణుల గురించి చర్చిస్తునే గడిపారు. ఆయునకు భరద్వాజ మహర్షి అందించిన అత్యద్భుతమైన విందువట్ల ఏ మాత్రము ఆనందాశ్చర్యాలు లేవు. కనీసం ఆసక్తి కూడ లేదు. ఆయున ధ్యాస అంతా సీతారామలక్ష్మణుల విషయంలోనే. ఆయున త్వర అంతా ఎప్పుడు శ్రీ రామ చంద్రుని దివ్య పాదారవిందములపై వాలాలా అనే.

ఒకే రకమైన ప్రాపంచిక విషయముల గురించి ఎవ్వరి అనుభూతి వారిది. గీతాచార్యుడు ఈ అనుభూతుల వైవిధ్యాన్ని ఈ విధంగా వివరించాడు.

యా నిశా సర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమీ

యస్యాం జాగ్రతి భూతాని సానిశాపశ్యతో మునేః

సర్వ ప్రాణులకు రాత్రిప్రాయమైన భగవద్విషయంలో సంయమి సంతోషంతో గడుపుతాడు. వారందరు ఆనందంతో విహరించే ప్రాపంచిక విషయాలలో మునినిస్పృహతో ఉంటాడు.

ఆ రాత్రంతా భరతుని పరివారానికి మహాద్భుతంగా గడిచింది. ప్రతి వారు తమకు కావలసిన భోజన పానీయాలతో గాన, నాట్య కేళీ విలాసాలలో ఆనందంతరంగాలలో ఉన్మత్తకంగా మునిగి తేలి ఒళ్లు మరచి నిద్రించారు.

తెల్లవారింది. ఒక్కొక్కరే మేలుకోసాగారు. వారు తమ రాత్రి ఆనందానుభవాలను స్మరించుకొంటూనే లేవసాగారు. కాని ఆశ్చర్యము! వారు పడుకొన్న దివ్య పర్యంకాలు లేవు వారిని నిద్రబుచ్చిన అప్సరోభామినులు లేరు. గాన వినోదములు లేవు. ఆ ప్రపంచమే లేదు. ఒకే మారు అంతా తారుమారు అయింది. రాత్రి అంతా తాము అత్యంత ప్రముఖులు – తెల్లవారడంతోనే తాము అతి సాధారణ సైనికులు.

ఇదంతా ఎలా, ఎందుకు జరిగిందో వారి ఆలోచనా పరిధికి అందలేదు. ఆకస్మాత్తుగా సంభవించిన ఇంతటి మార్పును వారు జీర్ణించుకోలేక పోయారు. వారి మెదళ్లు ఒక్క సారి మొద్దుబారిపోయాయి. ఇదంతా కలా? నిజమా? వారికి అర్థం కావడం లేదు. అయితే వారిది స్వప్నానుభవము ఎంత మాత్రం కాదు. ఎందుకంటే వారు రాత్రి ధరించిన పుష్పహారాలు, అలదుకొన్న చందనం, వేసికొన్న తాంబూలాది భోగశేషాలు అలాగే ఉన్నాయి. కనుక ఆ రాత్రి వారు అనుభవించిన ఆనందము ఎంత మాత్రము అసత్యము కాదు.

మనము అనుభవించే ప్రాపంచిక విషయాలేవి నిత్యాలు, శాశ్వతాలు కావు. అవి క్షణికాలు. అవి వచ్చి, వెళ్లేవి ('ఆగమా పాయినులు') చక్రగమనం వలె సుఖ

దుఃఖాలు మారిపోతూ ఉంటాయి.

అయితే ప్రాపంచికానుభవాలు అసత్యాలు కూడ కావు. మన సంచితాగామి ప్రారబ్ధఫలాలైన సుఖ దుఃఖాలు వాటి మూలములైన పుణ్యపాపకర్మలేవి అబద్ధాలు కావు అందువలననే భగవ ద్రామానుజులు ప్రకృతి కూడ పరమాత్మ, జీవాత్మలతో పాటు సత్యమని సెలవిచ్చారు. చిత (జీవాత్మ) అచిత (ప్రకృతి) ఈశ్వరుడు అని మూడు తత్వాలు యధార్ధాలు అని 'తత్వత్రయ' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అలాగే స్వప్నము కూడ సత్యమే అని నిరూపించారు.

అందువలన భరద్వాజుని విందులోని అందరి అన్ని అనుభవాలు యదార్ధాలే.

## చిత్రకూటము

తెల్లవారి – తన తల్లులను భరద్వాజమునికి పరిచయం చేసి, తాను కూడ వారితోపాటు ఆ మహర్షికి ప్రణమిల్లి – అయన అనుజ్ఞవడసి – భరతుడు సీతారామలక్ష్మణులు నివసించే చిత్ర కూటాశ్రమాన్ని దర్శించడానికి బయలు దేరాడు.

చిత్ర కూట పర్వతము నీరుగలమబ్బు వలె – నల్లని కాంతితో మెరుస్తున్నది. ఆ కొండలోని శిలలు ఏనుగుల రాపిడి చేత చూర్ణములవుతున్నాయి.

ఆ పర్వత ప్రాంతాలు కిన్నర, కింపురుష, విద్యాధర, దేవతలకు ఆవాసములయ్యాయి. అక్కడ అనేకరకాలయిన వృక్షములు – తమ తలల్లో పుష్పాలను ధరించాయి.

మోదుగు పూలతో, జీడిఫలాలలతో, సరసజలప్రదేశాలతో చిత్ర కూటము శోభాయమానంగా ఉంది.

భరతుడు తన సేనా పరివారాన్ని అంతటిని దూరంగా నిలిపి – కొద్ది మందితో కలసి – ముందుకు వెళ్లాడు. అక్కడ వారికి చెట్ల మధ్య నుండి కొండపై భాగాన్నుండి పొగవస్తూకనబడింది. 'యత్ర ధూమః – తత్ర వహ్నిః,' – పొగ ఎక్కడో నిప్పు

అక్కడ' అని న్యాయము. అందువలన అక్కడ సీతారామలక్ష్మణులో – లేక మరే ఋషులో ఉంటారని భరతుడు నిశ్చయించాడు. కొంతముందుకు వెళ్లే వరకు చెట్లకు కట్టబడిన నార చీరలు కనబడి – వారి ఆలోచనను బలపరిచాయి.

'చిత్రములకు కూటము' (శిఖరము) చిత్ర కూటము. లేక చిత్రములైన కూటములుగలది ఈ సంసారమే ఒక చిత్ర కూటము ఇందులో పుష్పాలు, ఫలాలు తేనె పట్టులు, పానీయాలు, విహారభూములు మొదలైన చిత్రాలు, ఆకర్షణలు ఎన్నో మరెన్నో.

ఇక్కడి ఆనందాలకు ఆశపడి – కిన్నర, కింపురుష దేవతా గణాలు నివాసాలను ఏర్పరచుకొన్నాయి.

ఇక్కడి వన భూములు – పవిత్రమైన నదీ ప్రదేశాలతో, పుష్ప, ఫల భరిత వృక్షాలతో – తమ తపస్సులకు అనువుగా ఏకాంతంగా ఉన్నాయని అనేక మహర్షులు తమ ఆశ్రమాలను నిర్మించుకొని – నివసిస్తున్నారు.

అహింసా పరులు, తపో జీవులైన సాధు జనులెందరో – తమకు సులభాహారంగా లభిస్తారని రాక్షసులు కూడ అప్పుడప్పుడు రహస్యంగా తమ రాక పోకలను కొనసాగిస్తున్నారు.

సంసారమనే చిత్ర కూటంలో కూడ కామ భోగాలతో పరవశులై ఉండే సురులు కొందరు, ఈ సంసారమునే తపోవనముగా చేసికొని వీతరాగులై పరబ్రహ్మ సాక్షాత్కారమునకు ప్రయత్నించే మునులు కొందరు.

అన్యాయాలతో, అక్రమాలతో – పరదారలను పరుల విత్తాలను, పరుల ప్రాణాలను కూడ కొల్ల గొట్టే రాక్షసులు కొందరీ సంసార చిత్ర కూటంలో ఉండడము మనము చూస్తూనే ఉన్నాము కదా!

ఇతి శం.

# లక్ష్మణుని తొందరపాటు

చిత్రకూట పర్వత సానువులలో సీతారాములు ఎంతో సంతోషంగా విహరిస్తున్నారు. నిజానికి వారికి అయోధ్యానగర జీవనం కంటే – ఈ అరణ్య జీవనమే సౌందర్య సంతోష సౌఖ్యమయంగా అగుపించసాగింది. లక్ష్మణుని సలక్షణ పరిచర్యలు, ఆ పర్వతంలోని ఏకాంత ప్రశాంత పరిసరాలు – వారి దాంపత్య జీవన మధువును మరింత మధురం కావించాయి. ఈ వన జీవనమే తమకు శాశ్వతముగా నిలిచిపోతే బాగుండేది అనే ఆలోచన వారి మనస్సుల్లో చోటుచేసికోసాగింది. సీతారాములిద్దరు ఒకరితో ఒకరు మనఃప్రియంగా మెదులుకొనే ఆసమయంలో హఠాత్తుగా ఆ వనమంతా భయంకరమైన ధూళి, ధ్వని వ్యాపించసాగాయి. ఈ హఠాత్పరిణామానికి మొట్టమొదలు తీవ్రంగా స్పందించిన వాడు లక్ష్మణుడు. ఆయన ఆకులు ఎక్కువగా లేని ఒక ఎత్తైన చెట్టు ఎక్కి చుట్టు ప్రక్కల తన చూపులను జాగ్రత్తగా ప్రసరింపజేశాడు. అల్లంత దూరంలో ఆయనకు ఒక పెద్ద సైన్యము తమ వైపే కదిలి వస్తుండడం కనిపించింది.

వెంటనే ఆయన తన అన్నతో 'ఆర్యా! వెంటనే అగ్నిని చల్లార్పు. లేకపోతే దాని ధూమాన్ని అనుసరించి ఒక భయంకర సైన్యము మనపై పడబోతోంది.

అంతే కాదు అన్నా! సీతాదేవిని ఒక గుహలో దాచి ఉంచు. నీ ధనుస్సును సిద్ధం చేసికొని బాణాన్ని సంధించు అలాగే కవచమును ధరించి కయ్యానికి సిద్ధముగా ఉండుమని హెచ్చరించాడు.

స్థిత ప్రజ్ఞుడైన శ్రీ రామచంద్రుడు లక్ష్మణుని హెచ్చరికకు భయపడలేదు. ఆయన తమ్ముడితో – ఆ వచ్చే సైన్యమెవరిదో గమనించుమన్నాడు.

లక్ష్మణునికి ఆ సైన్యము మధ్యలో 'కోవిదార ధ్వజము' కనిపించింది. కోవిదార వృక్షము అయోధ్యాధిపతుల సేనా ధ్వజము. ఆ జెండాను గుర్తించిన లక్ష్మణునికి అందోళన స్థానంలో ఆగ్రహావేశాలు చోటు చేసికొన్నాయి.

భరతుడు రాజ్యాభిషేకాన్ని చేసికొని – అయోధ్య నుండి మహాసైన్యంతో తమ ఇద్దరిని చంపి – శత్రుశేషము లేకుండా చేసికోవడానికి వస్తున్నాడని

ఊహించాడు లక్ష్మణుడు. అందువలన భరతుని - ససైన్యంగా చంపాలనే నిర్ణయించుకొన్నాడు. అదే మాట రామునితో అన్నాడు.

'పూర్వాపకారిణోత్యాగే నహ్యధర్మో విధీయతే' అన్నా రాజ్యభ్రష్టత, అరణ్యవాసము ఎవ్వరి వలన నీకు కలిగాయో అటువంటి అపకారిని హతమార్చినా అధర్మమేమి కాదు' అని నేనొక్కడినే ఈ సైన్యమునంతటిని సంహరిస్తాను. సపరివారంగా కైకను చంపి వేస్తాను. వచ్చిన సైనికుల గజాశ్వములు ఈ వన ప్రాణులకు ఆహారములు అవుతాయి.' అని ఒడలు తెలియని లక్ష్మణుడు ఆగ్రహావేశాలతో ఊగిపోసాగాడు.

## సోదర ప్రేమ

లక్ష్మణుడు ఆదిశేషుని అవతారము. శత్రువు కంటబడగానే బుసలు కొట్టడం - కాటు వేయడానికి సమ కట్టడం సర్పము యొక్క సహజధర్మాలు.

సౌమిత్రికి సహజ శత్రువెవ్వరు లేరు. కాని శ్రీ రామునికి అపకారము చేసే వారెవ్వరైనా సౌమిత్రికి శత్రువులే. తక్షణమే తన నిర్ణయాన్ని మార్చుకొని, కైక మూలంగా రాముని కానల పాలు చేయాలనుకొన్న దశరథుని - లక్ష్మణుడు మహారాజుగా లక్ష్యపెట్టలేదు. కనీసం కన్న తండ్రిగానైనా గౌరవించలేదు.

'అహంతావన్మహారాజే - పితృత్వం నోపలక్షయే'

తనకు రాముడే తండ్రి, తల్లి, అన్న, దైవము, సర్వము - అటువంటి ప్రాణాధిక ప్రియునికి శ్రీ రామునికి ఎవ్వరు ఏ చిన్న అపకారము చేయాలనుకొన్నా - వారిని హతమార్చడమే తన విధి అని అనుకొన్న ఆదర్శ సహోదరుడు సౌమిత్రి.

అయితే శ్రీరామునికి సౌమిత్రి సౌభ్రాత్రము కంటే భరతుని సోదర భక్తి అంటేనే ఎక్కువ ఇష్టము. అంతే కాదు తన కొరకై ఏనాడు రాజ్య సంపదలను ఆశించని ధర్మమూర్తి శ్రీ రామచంద్రమూర్తి. బంధువుల రక్తతర్పణముతో ప్రాప్తించిన రాజ్య సంపద - ఆయనకు విషాన్నముతో సమానము.

అందువలననే ఆయన లక్ష్మణునితో 'సోదరా! భరతుడంటే

ఎవ్వరనుకొన్నావు? ఆయన నా ఆరవ ప్రాణము. ఆయన నిన్నెప్పుడైనా నీ మనస్సుకు బాధ కలిగించే మాట అన్నాడా? ఆయనను 'హతమారుస్తానని' అంత కఠినంగా అంటావా? భరతునిని నీవు నిజంగా బాధించాలనుకొంటే నన్ను బాధించినట్లే సుమా!

ఇంతకు నీవు ఆయనను ఎందుకు అనుమానిస్తున్నావు ? ఆయన రాజ్యకాంక్షతో మనను చంపడానికి ససైన్యంగా వస్తున్నాడని ఎందుకు అనుకొంటున్నావు? ఆయనలో రాజ్యకాంక్షను నీవు ఎన్నడైనా గమనించావా ?

నా దృష్టిలో భరతుడు మహాత్ముడు, అనఘుడు. కైకేయి – మన తండ్రిగారైన దశరథ మహారాజును వరాలనుకోరుకొన్నప్పుడు భరతుడు కేకయ దేశంలో ఉన్నాడు. మనము అడవికి వచ్చిన తరువాత ఆయన అయోధ్యకు వచ్చి ఉంటాడు. ఆయన తల్లి కైక కోరికను అసహ్యించుకొని ఉంటాడు. మన తండ్రిగారి సమ్మతితో మనను అయోధ్యకు తీసికవెళ్లడానికి సైన్యంతో వస్తూ ఉంటాడు.

లక్ష్మణా! అకారణంగా భరతుని మనస్సులో రాజ్యకాంక్ష ఉన్నట్లు అనుమానించి, అవమానించినందువలన నీ మనస్సులోనే రాజ్యకాంక్ష ఉన్నట్లు నా మనస్సుకు తోస్తున్నది. ఒక వేళ నిజంగానే నీ మనస్సులో రాజ్యకాంక్ష నిలిచి ఉంటే భరతునికి చెప్పి – నీకు రాజ్యాధికారాన్ని ఇప్పిస్తాను. భరతుడు నా మాట కాదనడు ఆయన మనస్సు నాకు తెలుసు' అన్నాడు.

లక్ష్మణునికి తన తొందరపాటు అర్థమయింది. పాము తన పడగను ముడుచుకొన్నట్లు ఆయనలో ఆగ్రహావేశాలు ఒక్కసారి అడుగంటాయి. తెలివి తక్కువగా భరతుని తప్పుగా అర్థము చేసికొన్నందుకు ఆయన సిగ్గుపడ్డాడు. ఆయన మనస్సులో ఆవేశముతో కూడిన అవివేకము తొలగి ఆలోచనతో కూడిన వివేకము తిరిగి ప్రవేశించింది. ఆయన అన్న ఆలోచనలనే బలపరిచి,' అవును అన్నా! నీవన్నట్లే అయోధ్యాపుర పరివారము – మనల్ని అయోధ్యకు తీసికవెళ్లడానికే వస్తుండవచ్చు. కాని నాకెందుకో సమూహంలో వెలితి కొట్టవచ్చినట్లు కనపడుతోంది. మన తండ్రిగారు అధిరోహించే శత్రుంజయ మహాగజము సేన ముందు భాగంలోనే నడిచి

వస్తోంది. కాని దానిపై మహారాజ లక్షణలక్షితమైన. తెల్లగొడుగు కన పడడం లేదు. అది లేకపోవడం వలన మహారాజు లేనట్లనిపిస్తోంది.' అని అన్నాడు.

శ్రీ రామ చంద్రునికి లక్ష్మణునిపై జాలి కలిగింది. 'అయ్యో! లక్ష్మణుడెంత అమాయకుడు? ఆయన మనస్సులో ఒకటి ఉంచుకొని పైకి మరొకటి మాట్లాడే వంచకుడు కాదు. తన కొరకు ఆయన భార్యను, రాజ్యసౌఖ్యాలను తృణప్రాయంగా వదలి తన వెంట తరలి వచ్చిన త్యాగశీలి. ఇటువంటి అమాయకుని అంత పరుషంగా దూషించానే? అని బాధపడి - 'సోదరా! నీవు అంతగా అనుమానించకు - అనవసరంగా అంత బాధ పడడం దేనికి? నీవు ముందు చెట్టు దిగిరా!' అని ఆప్యాయతతో పిలిచాడు. శ్రీ రామచంద్రుని ఓదార్పు ఆ అమాయకుని అంతరంగంలో అనురాగామృతాన్ని వర్షించింది. చూచారా! శ్రీరామునికి - ఆయన సహోదరులకు మధ్య ఉన్న అపార సోదర ప్రేమ. శ్రీరాముని స్థానంలో ఇంకెవ్వరు ఉన్నా లక్ష్మణుని ఆగ్రహావేశాలను తన స్వార్థం కొరకు మలచుకొని మరొక సోదరుని దూరం చేసికొనే వారే. సోదరులే తన సర్వస్వంగా భావించిన సౌభ్రాత్ర సౌజన్యమూర్తి శ్రీ రామచంద్రమూర్తి.

## శ్రీ రామ సందర్శనము

భరతుడు కేకయ రాజ్యాన్నుండి వచ్చింది మొదలు రామవియోగ బాధాభరితుడయ్యాడు. ముఖ్యంగా తన మూలంగా తన తల్లి కైక రామ వివాసనానికి కారకురాలయిందని తెలిసి మరింత బాధపడ్డాడు. లోకులంతా తనను బహిరంగంగానే అసహ్యించుకొంటున్నారని అవమానంతో కృంగిపోసాగాడు. తన బాధ పూర్తిగా తొలగాలంటే తనకు రామ సందర్శనం కావాలి. తాను ఆయన పాదాలపై బడి బిగ్గరగా ఏడ్చి తన శోక భారాన్ని తగ్గించుకోవాలి. ముఖ్యంగా తన ప్రార్థనను అంగీకరించి శ్రీరామచంద్రస్వామి సీతాలక్ష్మణ సమేతంగా సాకేతపురికి తిరిగి వచ్చి సామ్రాజ్యాన్ని స్వీకరించాలి.

భరతుడు అడవిలో సంచరిస్తూ అశాంతితో ఊగిపోతున్నాడు ప్రక్కనే ఉన్న సోదరుడు శత్రుఘ్నుడు, కులగురువు వశిష్ఠుడు 'భరతుని అశాంతి ఎలా

తొలిగిపోతుందో' అని విచారింపసాగారు. వారికి భరతుడు ఈ క్రింది విధంగా సమాధానమిచ్చాడు.

1. 'యావన్న రామంద్రక్ష్యామి – లక్ష్మణం వా మహాబలం
వైదేహింవా మహాభాగాం – నమేశాంతిర్భవిష్యతి'

2. 'యావన్న చంద్ర సంకాశం ద్రక్ష్యామి శుభమాననం భ్రాతుః పద్మపలాశాక్షం – నమేశాంతిర్భవిష్యతి'

3. 'యావన్న చరణౌ భ్రాతుః పార్థివ
వ్యంజనాన్వితౌశిరసాధారయిష్యామినమే శాంతిర్భవిష్యతి'

4. 'యావన్న రాజ్యే రాజ్యార్హః పితృపైతామహేస్థితః అభిషేక జలక్లిన్నో – నమేశాంతిర్భవిష్యతి'

భరతుడు మహానుభావుడు. మనవలె శరీర సుఖాలతో శాంతిని పొందేవాడు కాదు – కైక కోరిన వరాలు భరతునికి శాంతి సంతోషాలను కల్గించక పోగా దుఃఖాన్ని ఉద్వేగాన్ని కల్గించాయి.

'మన శరీరమే కైక' మన కెప్పుడు భోగాలు కావాలనిపట్టుబట్టుతుంది.

'మహాత్ములకు, శరీర సౌఖ్యాలు శాంతినివ్వవు. 'భరతేన మహాత్మనా' అని భరతునికి 'మహాత్ముడ' ని వాల్మీకి శ్రీ రామ ముఖంగా బిరుదునిచ్చాడు.

భరతుడు ఎలాగైతే తనకు శాంతి లభిస్తుందో వివరిస్తున్నాడు.

1. తన అశాంతి తొలిగి – శాంతి లభించాలంటే ముందు సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీ రామచంద్రస్వామి దర్శనము కావాలి. లక్ష్మణుడు శ్రీరాముని నిరంతరము అంటిపెట్టుకొని ఉండే ఆచార్యుడు. భరతుడు ఆయనను 'మహాబలుడు' అంటున్నాడు. మన తాపత్రయాలను పోగొట్ట కల్గిన మహాబలుడు ఆచార్యుడేకదా.

2. 'గురు ముఖాత్ శ్రీశంప్రపద్య' – ఆచార్యలాభము వలన

భగవల్లాభము కలుగుతుంది. అయితే నేరుగా శ్రీరాముని ఆశ్రయింపకూడదు. ముందుగా మహాభాగ అయిన సీతాదేవిని ఆశ్రయించాలి. సీత గొప్ప సౌభాగ్యవతి, భర్తృవాల్లభ్యం కలిగిన దేవేరి. ఆమెను ముందుగా చేరి – ఆమె ద్వారా రాముని సేవించాలి. సీతా దేవి పురుషకారము లభించినవాడు శ్రీరాముడు మనను తిరస్కరింపజాలడు. ఆశ్రితరక్షా దీక్షుడాస్వామి.

ఆ తరువాత శ్రీరాముని చంద్రబింబము వంటి ముఖమండలాన్ని – పద్మ పత్రముల వంటి నేత్రాలను సేవించాలి. అంటే భగవంతుని దివ్య మంగళ విగ్రహాన్ని కనులార సేవించాలి. తన మనస్సులో గాఢంగా ముద్రించుకొనే విధంగా స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని సేవించాలి.

3. ఆ తరువాత శ్రీరామభద్రుని రాజలక్షణ లక్షితములైన శ్రీపాదాలను శిరసావహించాలి. భగవంతుని దాస్య కిరీటాన్ని (పాదయుగ్మాన్ని) తలపై ధరించాలి.

4. చివరకు శ్రీరామ చంద్రుడు పితృ పైతామహంగా వస్తున్న రాజ్యాధికారాన్ని స్వీకరించి సమ్రాట్టుగా పట్టాభిషిక్తుడు కావాలి.

'స్వామిత్వం బ్రహ్మణి స్థితం' – 'పతిం విశ్వస్య' ఈ విశ్వాని కంతటికి అధినేత శ్రీమన్నారాయణుడు. 'ఆత్మేశ్వరగ్ం' ఆయన తనకు తానే పతి. అందరిని శాసించే వాడు ఆయన అయితే – ఆయనను శాసించేవాడు ఎవ్వరైనా ఉన్నారా అన్న ప్రశ్నకు ఉపనిషత్తు – ఆయనను 'ఆత్మేశ్వరుడు' అని తెలిపింది. అనగా ఆయనకు ఆయనే ప్రభువు.

అందువలన ఆశ్రియః పతి – తాను స్వామిగా మనచే గుర్తింపబడి – తన 'పాదవఱ్ఱు' పాదపద్మాలను. 'తలై శేర్తు' మన తలపై చేర్చాలి. అప్పుడే మనకు స్వామికి శాశ్వతానందము.

ఇది భగవల్లాభము యొక్క క్రమము ఈ క్రమ పద్ధతిని భరతుడు కావాలని కోరుకొంటున్నాడు. ఈ కోరిక సిద్ధించినప్పుడే తనకు సంపూర్ణ శాంతి లభిస్తుందని తన వారికి తెలిపాడు.

క్రమంగా – శ్రీరాముని అగ్ని శాలలోని 'ధార్యగ్ని' ధూమాన్ని బట్టి – చెట్లకు కట్టబడిన నారవస్త్రములను బట్టి భరతుడు శ్రీరాముని ఆశ్రమానికి చేరుకొన్నాడు. అగ్ని శాల ప్రక్కనే అతిథులు వచ్చి కూచోవడానికి అనువుగా ఒక పర్ణశాల ఉంది. భరతుడు ఆ పర్ణశాలలోనికి ప్రవేశించాడు.

శ్రీరామచంద్రుడు జింక చర్మమును ఉత్తరీయంగా, నార వస్త్రములపై కూడ ధరించి ఉన్నాడు. జడలు కట్టిన వెంద్రుకలతో ఉన్నాడు. ఆ స్థితిలో కూడ ఆయన ముఖము ప్రజ్వరిల్లే అగ్ని హోత్రము వలె ప్రకాశిస్తు ఉంది. దర్భాసనము పై కూచొని ఉన్నాడు. సింహాసనాసీనుడై పీతాంబరములను స్వర్ణ రత్నమయ ఆభరణాలను ధరించి సమస్త రాజమౌళి మణిమండిత పాద పీఠుడుగా వెలుగొంద దగిన స్వామిని – నార చీరలతో – జడలతో – జింక చర్మంతో చూడడం భరతునికి వశం కాలేదు. ఆయన ఒక్క మారుగా ఎలుగెత్తి 'ఆర్యా' అని మాత్రమే సంబోధింపగలిగి మూర్ఛిల్లాడు. తిరిగి కొద్ది సమయానికి తెలివికి వచ్చి. ఏదో విధంగా శ్రీరాముని చేరి ఆయన పాదాలపై పడి పోయాడు. 'జటిలం చీరవసనం – ప్రాంజలిం పతితం భువిదదర్శరామః' – భరతుడు కూడ నారచీరలు ధరించాడు. జడలుదాల్చాడు. రామ భరతులిద్దరికి మాటలు రావడం లేదు. ఒకరినొకరు అశ్రునయనాలతో చూచుకొంటున్నారు.

కొంత సమయానికి శ్రీరాముడు భరతుని ప్రేమతో లేపాడు. అత్యంత దుర్లభమయిన తన గాత్ర పరిష్వంగాన్ని (కౌగిలిని) భరతునికి కలిగించాడు. 'ఓహో! భరతా! ఎంత మహాత్ముడవయ్యా దేవతలకు కూడ అసాధ్యమైన శ్రీరాముని శరీర పరిష్వంగాన్ని లభించి ధన్యుడవయ్యావు కదా!

శ్రీరామునికి భరతుని చూడడం అత్యంత ఆమోదమును కలిగించింది. 'భగవంతుడు – భక్తుల కలయికలో' భగవదానందము సముద్రము' జీవానందము గోష్పదము వంటివని శాస్త్రాలు వివరిస్తున్నాయి. 'అంకేభరతమారోప్య' అన్నట్లు కౌగలితో తనివితీరక స్వామి – భరతుని (పరమపదములో ముక్త పురుషుని కూచోబెట్టుకొన్నట్లు) తన తొడపై కూచోబెట్టుకొని – ఆయనతో సంభాషించసాగాడు.

# రాజనీతి

శ్రీరామాయణము అనేక ఆధ్యాత్మిక రహస్యాలతో పాటు అనేక ప్రాపంచిక విషయాలను కూడ వివరించింది. ఒక కుటుంబ సభ్యులు ఎలా ఉంటారో, ఎలా ఉండాలో వారి మధ్య మమత, ప్రేమాను రాగాలు ఎలా వెల్లివిరియాలో కష్టసుఖాల్లో ఎలా పాలుపంచుకోవాలో శ్రీ రామాయణము తెలిపినంతగా మరేగ్రంథము తెలుపలేదనే విషయము ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ఒక సత్యము.

కుటుంబ వ్యవస్థతో పాటు - ప్రభుత్వవ్యవస్థ ఎలా ఉండాలో కూడ శ్రీరామాయణము అద్వితీయంగా వివరిస్తు ఆనాటి సామాజిక వ్యవస్థకు దర్పణము పట్టింది.

భరతుడు తన సేనాపరివారముతో - శ్రీరాముని దగ్గరకు రాగానే - భరతుడు రాజ్యాధికారాన్ని చేపట్టి తనను చూడ్డానికి వచ్చాడనుకొని - శ్రీరామచంద్రుడు భరతునికి రాజ్య వ్యవస్థ గురించి సుదీర్ఘోపన్యాసము చేశాడు.

'మహారాజుకు రాజ్యాన్ని ధర్మ పద్ధతిలో నడుపుటకు సలహా ఇచ్చేవాడు కులగురువు. ఆయన మాట మహారాజుకు శిరోధార్యము. వశిష్ఠ మహాముని పరంపరాగతంగా వస్తున్న కులగురువు. ఆ మహానుభావుడిని మన పూర్వులందరి వలె నీవు పూజిస్తున్నావా ? భరతా !

కుటుంబానికి వస్తే తల్లిదండ్రులు పూజనీయులు. మన తండ్రి, ముగ్గురు తల్లులు నీకు గౌరవ పాత్రులుగా ఉన్నారా ?

కులగురువు ఆదేశాలను అనుసరించి వెంట ఉండి ధార్మిక కార్యక్రమాలను రాజుచే నిర్వహింపజేసేవాడు 'ఉపద్రష్ట' అయిన పురోహితుడు. నీవు శాస్త్ర విధానములను తెలుసుకొని వైదికకర్మలను ఏకరూపంగా అనుష్ఠింపజేసే పురోహితుని నియమించుకొన్నావా ? మహారాజుకు శస్త్రాస్త్ర విద్యలో సహాయ పడువాడు 'ఉపాధ్యాయుడు'. ధనుర్వేద నిష్ణాతుడైన సుయజ్ఞుడు అటువంటి ఉత్తమోపాధ్యాయుడు. ఆయనను నీవు గౌరవిస్తున్నావా ?

మహారాజుకు రాజ్యనిర్వహణలో తోడ్పడేవారు మంత్రులు. వారు నిశిత

ఆలోచనాపరులు. పరాక్రమవంతులు, విశ్వాసపాత్రులు. స్త్రీ, ధన, మాదకద్రవ్యాలకు లొంగని వారు, రహస్యములను తమలోనే దాచుకొనేవారు కావాలి. అట్టి మంత్రులను నీవు నియమించుకొన్నావా? 'ఉపధ' అనే 'పరీక్ష' ద్వారా వారి స్వభావాలను పరిశీలిస్తున్నావా ?

క్రింది తరగతి ఉద్యోగులు 'సేవకులు' ఉంటారు. వారు మూడురకాలు - (1) ముఖ్యులు - (2) మధ్యమములు - (3) అధములు - వారిని వారి యోగ్యతలను, స్వభావాలను బట్టి ఆయాకార్యాలలో నియోగిస్తున్నావా ?

కొన్ని సమయములలో మహారాజుకు కావలసిన అంతః పురస్త్రీల, అంతరంగిక పురుషుల - సిఫారిష్‌తో (పురుషకారంతో) కొందరు ఉద్యోగాలు కోరివస్తారు.

అభ్యర్థుల స్వరూపస్వభావాలను, అర్హతలను గమనింపక కేవలం పురుషకారము ఆధారంగా ఉద్యోగాలను ఇవ్వకూడదు. అట్లని అంతరంగికుల సిఫారిష్‌లను పూర్తిగా నిరాదరణచేయకూడదు. దాని వలన అంతరంగికుల అంతరంగాలలో అసంతృప్తి ఏర్పడుతుంది.

మహారాజా తమబంధువులను జ్ఞాతులను మనః ప్రియకరములైన మాటల ద్వారా ప్రీతికార్యముల ద్వారా సంతోషపెట్టవలెను.

అదే విధంగా వైద్యులను గౌరవించి, వారి విశ్వాసాన్ని చూరగొనవలెను. అప్పుడే వారు తమ వృత్తులలో నిష్ణాతులుగా నుండి విశ్వాస పాత్రంగా సేవలను అందిస్తారు. రాజా నిద్రావ్యసనాలకు వశుడు కాకూడదు. అవసరమైనప్పుడు అర్థ రాత్రులలో నిర్ణయాలను తీసికోవలెను. నిర్ణయకరణంలో అత్యధిక సంఖ్యాకులను భాగస్వాములను చేయకూడదు. దాని వలన నిర్ణయాలు - ఆచరణకంటే ముందే ప్రజలకు తెలిసిపోతాయి. అలాగని - తానొక్కడే - ఎవ్వరిని సంప్రదించకుండానే నిర్ణయాలు తీసికోకూడదు. ఎంత తెలివిగల వాడైనా ఒక్కడే అన్ని పరిస్థితులను ఊహింపజాలడు. మంచి చెడులను సమగ్రంగా విచారింపజాలడు. అందువలన సమర్థులయిన మంత్రులను సంప్రదించి నిర్ణయాలు

తీసికోవాలి. రాజు అసమర్థుడయినా సమర్థులైన మంత్రులు రాజ్యాన్ని కాపాడగలుగుతారు.

రాజు ముఖ్యంగా సేనాపతి విషయంలో జాగరూకుడుగా ఉండవలెను. శత్రువులను తన పరాక్రమంతో లొంగదీసికోగల్గినవాడు, సైనికవ్యూహరచనలు చేయగలవాడు, శత్రువ్యూహాలను ఛేదింపగల్గేవాడు సేనాపతిగా నియమింపబడాలి.

సేనాపతి - స్వభావాన్ని - స్త్రీ, ధనాల ద్వారా పరీక్షిస్తూ ఉండాలి. ఆయనను అనవరతము సంతృప్తునిగా ఉంచాలి. ఆయనకు - ఇతర సేనానాయకులకు పారితోషికముల ద్వారా, బిరుదుల ద్వారా సత్కారములు చేస్తుండాలి.

సైనికులకు సకాలంలో జీతభత్యాలు చెల్లించాలి. అప్పుడప్పుడు వారికి అదనపు మొత్తాలను (బోనస్‌లను) చెల్లించాలి. వారు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించినందుకు ఆయా సమయాలలో వారికి 'బేటాలను' ప్రత్యే పారితోషికాలను ఇవ్వవలెను.

విదేశాలలో నియమింపబడే రాయబారులు మన దేశంలో జన్మించిన వారుకావాలి. అప్పుడే వారికి స్వదేశాభిమానము ఉంటుంది. ఎదుటి వారి మనస్సులను చదువగల్గినవారు, మహారాజు పట్ల అభిమానము గలవారు రాయబారులుగా నియమింపబడాలి.

గూఢచారుల గూర్చి రాముడు వివరిస్తున్నాడు. వేర్వేరు స్థలాలలో నియమింపబడిన గూఢచారులలో ఒకరికొకరు తాము గూఢచారులమనే విషయము తెలియనీయకూడదు. ఇతరులకు తెలియకుండా ఇతరుల రహస్యాలు తెలిసికోగలిగేవారు. తాము తెలిసికొన్న రహస్యాలను తమలోనే దాచుకోగలిగేవారు, స్త్రీ, ధనము, మత్తుపానీయాలకు లొంగనివారు, తమకు తెలిసిన విషయాలను రాజుకు, తమ అధికారులకు నిర్భయంగా నేర్పుతో తెలుపగలిగినవారు, శత్రువులకు ప్రాణములు పోయినా లొంగనివారు గూఢచారులుగా ఉండవలెను.

తన రాజ్యంలో మంత్రులు, పురోహితులు, యువరాజుల విషయంలో

గూఢచారులను నియమింపక, స్వయంగా తానే వారిస్వభావాలను కనిపెట్టుతుండవలెను.

విదేశాలకు వెళ్లి కొంత కాలానికి స్వదేశానికి తిరిగి వచ్చిన వారిని ఆదరంతో చూడాలి. శిక్షితులను శాశ్వతంగా అవమానించకూడదు. శత్రువులను యుద్ధాల్లో ఓడించాలి గాని అవమానింపకూడదు.

విద్వాంసులలో కూడ నాస్తికులు కొందరుంటారు. వారిని 'లోకాయతికులు' అంటారు. ప్రత్యక్షాన్ని, అనుమానాన్ని మాత్రమే నమ్మి - వేదశాస్త్రాలను నమ్మనివారు, వాటివల్ల ప్రజల విశ్వాసాన్ని చెడగొట్టేవారు ఉంటారు. అట్టివారిని రాజు చేరదీయరాదు. వారివలన ప్రజలలో ధార్మికత - విలువలు, నీతినియమాలు నశిస్తాయి.

నేరస్థులను దండించడంలో రాజు నేర్పు, ఓర్పు చూపించాలి. నేరానికి తగిన శిక్షవిధించాలి. అధికశిక్షలు విధించినా అసలే శిక్షవేయకున్నా - అత్యల్ప శిక్షలు విధించినా అరాజకత్వమేర్పడుతుంది. అమాయకులను శిక్షింపకూడదు. నేరస్థులను శిక్షింపకుండా వదిలి పెట్టకూడదు.

ఇక రాష్ట్ర విషయాలను రాముడు వివరిస్తున్నాడు. మహాయజ్ఞాలు చేసిన చోట 'చైత్యములనే' - ఇటుక నిర్మాణాలు ఉంటాయి. వాటిని జాగ్రత్తగా 'జ్ఞాపకాలు' గా కాపాడాలి. అదే విధంగా దేవాలయాలను జాగ్రత్తగా పోషించాలి. అర్చకులను సంతుష్టులుగా ఉంచాలి. అప్పుడు మాత్రమే వారు దేవతార్చలను మనఃపూర్వకంగా చేయగలుగుతారు. దేవాలయాల వలన ప్రజలలో మానసిక సుఖ సంతోషాలు - దేశంలో శాంతి భద్రతలు నెలకొంటాయి. రాష్ట్రంలో ప్రజలలో సత్వర సముచితన్యాయాన్ని అందివ్వడానికి వారికి దగ్గరలో అనేక 'ధర్మసభల' ను నిర్వహించాలి.

రాజు ప్రజల నుండి - వారిస్థితి గతులను చూడకుండా అధికంగా శిస్తులు వసూలు చేయకూడదు. శిస్తు చెల్లించే వారిశక్తిని బట్టి వసూలు చేయాలి. అంతేకాదు వారు చెల్లించే పన్నుల ధనంలో నుండి రాజు - తన జీవితానికి - తన

అంతఃపురపరివారాని కొరకు ఎక్కువగా వాడుకోకుండా – అధనంలో నుండి అత్యధిక భాగాన్ని ప్రజల సౌకర్యాల కొరకు వారి సుఖశాంతుల కొరకే వినియోగించాలి. అప్పుడే రాజా అన్నా ఆయన పరిపాలనము అన్నా ప్రజలు ప్రాణాధికంగా ప్రేమిస్తారు.

రాష్ట్రంలో భూముల సారాన్ని పెంచి, వాటిని వ్యవసాయభూములుగా మార్చి నీటి పారుదలను మేలిరకాల విత్తనాలను, ఇతర సౌకర్యాలను కలిగించి పంటలు ఎక్కువగా పండేట్లు చూడాలి.

అదే విధంగా ప్రజలకు కావలసిన వస్తువులను దేశవిదేశాలలో నుండి సేకరించి – వ్యాపార, వర్తకాలను చక్కగా జరిగేట్లు చూడాలి.

రాజు వ్యక్తిగతంగా : – వ్యసనాలకు బానిసకాకూడదు. దాని వలన పరిపాలన పట్ల నిర్లక్ష్యము ఏర్పడి – అరాజకత్వము ఏర్పడుతుంది.

రాజు దినంలో ప్రొద్దున – దేవ, పితృ, ఋషుల పూజలు చేసి ధర్మార్జన చేయాలి.

మధ్యాహ్నములలో ధనార్జన చేయాలి రాజోద్యోగులతో సంప్రదించి – రాజకార్యాలను నిర్వహించాలి (సాయంకాలంలో) – రాత్రి సమయంలో కామసుఖాలను అనుభవించాలి.

రాజు ఈ క్రింది విషయాలకు దూరముగా ఉండాలి. 1. నాస్తిక్యము – 2. అసత్యము – 3. కోపము – 4. వరాకు – 5. పనులను వాయిదావేయడం. 6. జ్ఞానమును అనాదరించడం. – 7. ఆలస్యము. 8. ఇంద్రియ లోలత్వం.

రాజు దగ్గరవుండే ఉద్యోగవర్గాన్ని పేర్కొంటున్నాడు శ్రీరామచంద్రుడు :– 1.దౌవారికులు 2. అంతర్వంశికుడు 3. కారాగారాధికారులు 4. అర్థసంచయకర్త 5. కార్యనియోజకుడు 6. ప్రాడ్వివాకుడు 7. సేనాధిపతి 8. నగరాధ్యక్షుడు 9. కర్మాంతికుడు (వేతనాలిచ్చేవాడు) 10. రాజసభలనలంకరించే ఉద్యోగి.

ఇతిశం

# భరతుని ప్రార్థన

శ్రీరాముడు ప్రవచించిన రాజనీతి విషయాలను విన్న భరతుడు సామాన్య ధర్మమేలేని తనకు రాజ్య ధర్మాలతో పనిలేదన్నాడు. ప్రజాభిమతుడు, జ్యేష్ఠుడైన శ్రీరాముడు వుండగా రాజు కావడానికి సిద్ధపడిన తాను సామాన్య ధర్మాన్ని కూడా నిర్లక్ష్యం చేశానని వాపోయాడు.

'నా విష్ణుఃపృథివీపతిః' అన్నట్లు సామాన్యమైన రాజే భగవంతుడని లోకము విశ్వసిస్తుంది – అయితే తనకు భగవంతుడే రాముడుగా అవతరించాడనే విశ్వాసం ఉందని వివరించాడు.

దశరథుడు రామనామాన్ని జపిస్తూనే మృతి చెందాడని తండ్రికి పిండప్రదానము చేయుమని సూచించాడు.

శ్రీరామునికి తండ్రి మరణవార్త అశనిపాతంగా అనిపించింది. దశరథుని అంతటి మహారాజు పరిపాలించిన అయోధ్యను తాను పాలింపచాలనని 14 సంవత్సరాల తరువాత కూడా తన తండ్రిలేని అయోధ్యలో తాను కాలిడ జాలననిశోకించాడు.

అయ్యో! మా తండ్రిగారి మరణ సమయంలో దగ్గరలేని దౌర్భాగ్యులము కదా! అని దుఃఖించాడు. తన తండ్రి మరణము తమకంటే సీతాదేవికే దుర్భరమని తలచి 'సీతే! మృతస్తే శ్వశురః' సీతా మీ మామగారు మరణించారమ్మా అని రోదించాడు. లక్ష్మణా! నీవు తండ్రిలేని వాడవు అయ్యావయ్యా 'పితృ హీనోసి లక్ష్మణ' అని తమ్ముని పైపడి బిగ్గరగా ఏడ్చాడు.

రాముని దుర్భరదుఃఖాన్ని చూసి వారందరూ రోదించారు సుమంత్రుని ఆలోచననుసరించి దశరథునికి పితృ కార్యాలను. చేయడానికి సీతాదేవిని ముందుంచుకొని మందాకిని నదికి వారు వెళ్ళారు అశుభకార్యంలో ముందుగా స్త్రీలు నడవాలి.

మందాకిని నది తీరంలో గారపిండి రేగుపిండి కలిపి ముద్దలుచేసి దశరథునికి

పిండాలను పెట్టారు అంతకుముందు. సోదరునితో కలిసి శ్రీరాముడు దశరథునికి ధర్మోదకాలను వదిలాడు.

పిండితో మహారాజుకు పిండప్రదానం చేయటం శ్రీరామునికి సహింప సాధ్యం కాలేదు. 'అయ్యో మహారాజా! మీ అంతటి సార్వభౌమునికి పిండితో కూడిన పిండాలను తిన వలసి వచ్చింది కదా! అని విలపించాడు. అయితే 'మేము తినేవాటితోనే కదా మీకు పెట్టేది వీటిని మీరు ఆరగించాల' ని వేడుకున్నాడు.

పితృ కార్యాల తర్వాత సీతా రామలక్ష్మణులు పర్ణశాలకు చేరి భరతాది సోదరులతో కలిసి బిగ్గరగా రోదించారు. వారి ఏడుపు ధ్వని కొండ క్రిందవున్న సైనికులు అందరికి వినబడింది.

దశరథుని పత్నులు – పరివారమంతా మందాకిని నదికి చేరుకొని అక్కడ రామలక్ష్మణులు ఉంచిన పిండాలను చూసి చింతాక్రాంతులయ్యారు వారలాగే పర్ణశాలకు చేరుకున్నారు.

పర్ణశాలలో అందరూ ఆసీనులయ్యాకా భరతునితో శ్రీరాముడు 'సోదరా! పట్టాభిషేక యుక్తుడవు పట్టు వస్త్రాలతో బంగారు ఆభరణాలతో ప్రకాశింప వలసిన నీవు నార చీరలతో జడలతో తాపసి వేషాన్ని ధరించవలసిన కారణాన్ని వివరించుమని' కోరాడు. అప్పుడు రామభక్తి భరితుడైన భరతుడు 'అన్నా! జ్యేష్ఠునికి ధర్మ బద్ధంగా చెందవలసిన రాజ్యశ్రీని – మా తల్లి కైకేయి అధర్మమైన కోరికలతో నాకు ఇప్పించాలనుకుంది. దానితో భరింప జాలక దశరథ మహారాజా మరణించారు. ఆ కారణంగా మా తల్లి కైకతనతో పాటు రాజ్యాన్ని కూడా విధవను చేసింది.

నీవు పాలించవలసిన రాజ్యానికి నేను రాజును కావటం అంటే గుర్రం నడకను గాడిద అనుసరించినట్లుంటుంది. పక్షీశ్వరుడైన గరుత్మంతునితో ఒక సామాన్య పక్షి పోటి పడినట్లుంటుంది. సకల ప్రాణులు తమతమ మనస్సులలో రాముడే రాజా కావాలని కోరుకొంటున్నారు. ఇక్కడికి ఇంత సైన్యంతో జంతుజాతముతో వచ్చింది, ఏ ఒక్కరి ఏడుపును కూడా భరింపజాలని కరుణామయుడవైన నీవు ఇందరి కన్నీరును చూసి సహింపజాలక మా అందరి ప్రార్థనను మన్నించి సాకేత

పురానికి మరలి వస్తావనే ఆశతోనే'.

నీకు తమ్ముడినైన నేనంటే ప్రాణాధిక ప్రేమ. అందువలన నేను తలవంచి ప్రార్థిస్తున్నాను. నేను కేవలం సోదరున్ని కాదు - శిష్యుడిని. నీవునాకు గురువు. ఎక్కడైనా గురువు తన సచ్ఛిష్యుని కోరికను కాదన గలుగుతాడా ?

నీకు నేను దాసుడిని నీవు నాకు స్వామివి నా ప్రార్థనను మన్నించి నా దాస ధర్మాన్ని రక్షించవల్సింది నీవే కదా! అందువలన నీవు నన్ను తప్పక అనుగ్రహించాలి' అని కైకేయీ నందనుడు కోరాడు.

రాజ్యాశ రవ్వంత అయినా లేని రాముడు. 'భరతా! నీ తల్లి కైకేయి వరాలు కోరినందున నీకు రాజ్యము సంక్రమించింది. దానిని కాదనడం ధర్మమా?' అని అడిగాడు. అందుకు భరతుడు 'సాంత్వతామామికా మాతా! దత్తం రాజ్యంఇదం మమః తద్ద దామి తవైవాహం భుంక్ష్వరాజ్యమకంటకం'!

'అన్నా! మా అమ్మ వరాలను కోరింది. కోరినట్లు నాకు రాజ్యాన్ని ఇప్పించింది. ఇప్పుడు రాజ్యము నా స్వంతమయింది కదా! ఈ రాజ్యాన్ని ఏమైనా చేసికొనే అధికారము నాకు ఉంది కదా! ఇప్పుడే ఈ రాజ్యాన్ని రాజ్యార్హత కలిగిన నీకు నీ కొరకే ఇచ్చివేస్తున్నాను. దీనిని నీవే అనుభవించుమని' అర్థించాడు.

ఈ శరీరవేం మన రాజ్యము - దీనిని మన కొరకే వాడుకోక 'ఈశ్వరాయనివేదితుం' అన్నట్లు పరమాత్మ కొరకే వాడాలి'.

రామచంద్రా! ప్రతి పురుషునికి పుట్టుకతో మూడు ఋణాలు ఉంటాయి.

1. దేవ ఋణము 2. పితృ ఋణము 3. ఋషి ఋణము. దేవతల ఋణము తీర్చడానికి నీవు రాజావు అయి యజ్ఞ యాగాదులు చేయాలి.

ఋషి ఋణాన్ని తీర్చడానికి నీవు రాజావై ఋషులను రక్షించి, వారు నిర్విఘ్నంగా తమ ఆశ్రమ ధర్మాలను అనుష్ఠించ గలిగే విధంగా రాజ్యపాలనము చేయాలి.' అని వేడుకొన్నాడు.

# పితృ వాక్యపాలనము

భరతుని పలుకులన్ని పరమసత్యాలు. ఆశ్రమంలో ఆసీనులయిన మహర్షులు, పౌరులు, ప్రజలందరు భరతుని మాటలను బలపరిచారు. భరతుని మాటలను మన్నించి – అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యభారాన్ని వహించుమని రాముని కోరారు.

రాముని స్థానంలో ఇంకెవ్వరున్నా – భరతుని ప్రార్థనను, ప్రజాభిప్రాయాన్ని పరిరక్షించడానికి రాజ్యాన్ని సంతోషంగా స్వీకరించేవారే.

కాని ధర్మ నిరతుడు, పితృవాక్యపాలకుడు, సత్యవాక్య సంరక్షకుడైన శ్రీరామభద్రుడు అవనీ సంపదను అభిలషించలేదు. ఆయనకు రాజ్యరమ పట్ల ఆవగింజంత అయినా అపేక్షలేదు. పితృ వాక్యపాలనమే ప్రధాన ధర్మంగా ఆయన భావించాడు.

'పున్నామ్నో నరకాద్యస్మాత్ – పితరం త్రాయతేసుతః

తస్మాత్ పుత్ర ఇతిప్రోక్తః!'

భరతా! కొడుకు అంటే ఎవ్వరు అనుకొన్నావు? పితరులను రక్షించేవాడు పున్నామ నరకం నుండి తండ్రిని కాపాడేవాడు పుత్రుడు అనబడుతాడు.

మన తండ్రి – తాను మీ తాతగారికి (కేకయదేశాధీశుడైన అశ్వపతికి) మీ అమ్మ కైకేయి కొరకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడానికి – నీకు రాజ్యాన్ని – నాకు అరణ్యాన్ని పంచి ఇచ్చాడు. ఇప్పుడా మహారాజు మరణించి – స్వర్గస్థుడయ్యాడు. నీవేమో కైకేయినీకిచ్చిన రాజ్యాన్ని నీకిచ్చివేస్తున్నాను' అని అంటున్నావు. నేను రాజ్యాన్ని స్వీకరించడం మీ తల్లికి కూడ ఇష్టమేనంటున్నావు. కాని నాకు పదునాల్గేండ్ల వనవాసాన్ని విధించిన మన తండ్రిగారి మాటేమిటి? ఇప్పటి నీ కోరికను – మీ అమ్మ కోరికను మన్నించి నన్ను మళ్లీ అయోధ్యకు తిరిగి రమ్మని ఆజ్ఞాపించగలిగిన మన తండ్రి గారు మన మధ్యలో లేరు కదా! పరలోకాల నుండి ఆ ప్రభువు ఆవిధంగా ఆజ్ఞాపించలేరు కదా.

కైకేయి – దశరథుల మధ్య జరిగిన ఒప్పందాన్ని ఒక్క కైకేయి

మార్పుగలుగుతుందా ? నీవు, ఆమె ఇద్దరు కలిస్తే మాత్రము ఆ ఒప్పందము మారుతుందా ? ఒప్పందము కుదుర్చుకొన్న దశరథుడనే రెండవ పక్షాన్ని ముఖ్య పక్షాన్ని – మరచిపోయి మీరిలా మాట్లాడడం మీకు తగినదేనా?

నన్ను ఏమనుకొంటున్నారు ? మీరు రమ్మనగానే వచ్చి – రాజ్యాన్ని స్వీకరించి – మన తండ్రి గారిని అసత్యవచనుడుగా జేసి – ఆయనను స్వర్గాన్నుండి నరకంలోకి పడవేస్తానను కొంటున్నారా ? నరకాన్నుండి ఉద్ధరించేవాడు పుత్రుడు. నరకంలో తండ్రిని పడవేసేవాడు నరుడేకాదు.

నేను పితృ వాక్యపాలనను ప్రధాన ధర్మంగా భావిస్తాను. మీరందరు ఎన్ని విధాలుగా చెప్పినా – నేను నా ధర్మాన్ని విడనాడి నా తండ్రిని నరకంలో పడవేయను' అని నిష్కర్షగా చెప్పాడు.

అందుకు భరతుడు 'అన్నా! నేను నీ దాసుడను – స్వామి పక్షాన స్వామి కార్యాన్ని దాసుడు నిర్వహింపవచ్చును కనుక నీకు బదులు పదునాల్గేండ్లు అరణ్యవాసాన్ని కావిస్తాను. నీవు అయోధ్యకు వెళ్లి హాయిగా రాజ్యపాలనగావించి – అందరి ఆమోదాన్ని పొందమని' మళ్లీ ప్రార్థించాడు.

అప్పుడు శ్రీరాముడు 'భరతా! నాకు బదులు నీవు వనవాసం చేస్తానంటున్నావు. నాకు చేయుడానికి శక్తి లేకపోతే నాకు బదులు – దాసుడుగా శిష్యుడుగా – తమ్ముడుగా వనవాసం చేస్తాననడం సబబే కాని నాకు అటువంటి అశక్తత ఏమిలేదే ? అశక్తత మూలంగానే కదా! ఒకరి బదులు మరొకరు కార్యములు నిర్వహించేది.

రెండవది మన నాన్న గారి ఆజ్ఞలో – నాకు బదులు మరొకరు అరణ్యవాసాన్ని ఆచరింపవచ్చుననే విషయము లేదు. మహారాజు గారి ఆజ్ఞలో మాటలు మార్చి – క్రొత్త విషయాలను చేర్చడమంటే మహారాజు మాటను జవదాటడమే కదా! ఆయనను అసత్యవచనుని కావించడమే కదా! పుత్రునిగా పితృ వాక్యాన్ని ప్రత్యక్షరము పాటించాలనుకొనే నేను దానికి సిద్ధమవుతానా ?

అందువలన కొడుకుగా నేను అరణ్యవాసమే చేస్తాను. నీవు అయోధ్య

పాలనమే నిర్వహించాలి, అని నిష్కర్ష చేశాడు శ్రీరామచంద్రుడు.

## జాబాలినాస్తికవాదము

ఈ రోజుల్లో తామే అధునికులమని అనుకొనే కొందరు 'నాస్తికులే అధునికులని, వారివాదానికి తిరుగులేదని ఆస్తిక్యము ఒక బూజుపట్టిన వాదమని తమ 'అతి తెలివి'ని ప్రదర్శిస్తుంటారు.

కాని నిజానికి 'ఆస్తిక్యము' 'నాస్తిక్యము' అనే రెండు వాదాలు ప్రాచీనమైనవే

'అస్తి' 'నాస్తి' శబ్దాలు రెండు వేదాల్లోనివే. వేదము ప్రమాణముగా 'అస్తి' ఉందని నమ్మేవాళ్లు ఆస్తికులు, వేదము ప్రమాణము కాదు (నాస్తి) అని వాదించేవాళ్లు నాస్తికులు.

వేదములో 'నాస్తి' వాదము మొదట ప్రస్తావింపబడి ఆ తరువాత – 'అస్తి' వాదంతో ప్రతిహతం చేయబడింది. 'అస్తి' వాదమే వేదంలో ప్రతిష్ఠింపబడింది.

వేదాన్ని వివరించే ఇతిహాస, పురాణ, ధర్మశాస్త్రాలు కూడ నాస్తిక వాదమును ఖండించి ఆస్తిక వాదాన్ని ప్రధానంగా ప్రతిష్ఠించాయి.

ప్రధాన ఇతిహాసమైన శ్రీరామాయణం కూడ 'జాబాలి' అనే ఒక మహర్షి ద్వారా నాస్తికవాదాన్ని ప్రస్తావిస్తుంది. ఈనాడు గొప్ప తెలివి తేటలతో మనమేలేవనెత్తుతున్నామని అనుకొనే పండితమ్మన్యుల నాస్తిక వాదాంశాలన్నిటిని దశరథుని గోష్ఠిలో ఉండే జాబాలి అనే ఒక మహర్షి – అరణ్యంలో శ్రీరాముని ముందు అందరి ముందు లేవనెత్తాడు. చివరకు శ్రీరామునితో చీవాట్లు తిని – ముఖము మాడ్చుకొన్నాడు. ఇంతకు జాబాలి అనాడు చేసిన నాస్తిక వాదాంశాలను గమనిద్దామా ?

'శ్రీరామచంద్రా! నీవు అన్ని తెలిసినవాడివి,' ధీశాలివి. ఇంతటి బుద్ధిమంతుడివి – నీవు ఒక అజ్ఞుడివలె మాట్లాడడము నీకు తగునా?' అని ఆరంభించి, ముందుగానే ప్రశంసతో శ్రీరాముని – తన నాస్తిక వాదంవైపు త్రిప్పుకోవడానికి తెలివిగా జాబాలి ప్రయత్నించాడు. ముందుగానే ఎదుటి వ్యక్తి

మూతిని ముగుదాళ్లతో బంధించే పద్ధతి ఇది.

జాబాలి తన నాస్తిక వాదాన్ని కొనసాగిస్తున్నాడు. 'రామభద్రా! ఈ లోకంలో ఎవరికి ఎవరు? నిజానికి ఎవరికి వారే పుట్టుతున్నారు. ఎవ్వరికి వారే చస్తున్నారు. ఎవరికి ఎవరు తల్లి ? ఎవరు తండ్రి ? ఎవడు తనయుడు? ఈ సంబంధాలన్ని మనమేర్పరుచుకొన్నవి. ఇవేవి సత్యాలుకావు.

ఈ లోకంలో మన వేర్పరుచుకొన్న ఈ సంబంధాలన్ని – తోటి ప్రయాణికులతో ఒక ప్రయాణంలో మనమేర్పర్చుకొనే సంబంధాల వంటివే. ప్రయాణానికి ముందు వారితో మనకు సంబంధాలు లేవు. ప్రయాణం తరువాత వారితో సంబంధాలు ఉండబోవు. అలాగే లోకంలో మన సంబంధాలన్ని తాత్కాలికములే.

ఒకప్పుడుమనకు ఒక సత్రంలో గడుపవలసి వస్తుంది. అప్పుడు అక్కడ ఆ సత్రంలో ఉన్నవారితో మనకేవో సంబంధాలు ఏర్పడుతాయి. అంత మాత్రాన ఆ సత్రం వాళ్లతో మన సంబంధాలు అలాగే శాశ్వతముగా నిలిచిపోతాయా ?'

'సంబంధాల మాట అటుంచు రామచంద్రా! నీవు రాజకుమారుడవు కదా – రాజ్యాన్ని పాలించాల్సిన ఒక క్షత్రియుడు రాజ్యపాలనానంతరము తన వారసులకు రాజ్యాధికారాన్ని అప్పగించి – వార్థక్యంలో వాన ప్రస్థాన్ని స్వీకరిస్తాడే తప్ప – నీవలె మొదటే రాజ్యాన్ని పరిత్యజించి అడవుల పాలు కావడానికి అంగీకరిస్తాడా ?

'రామా! నీ బుద్ధి ప్రమాదంలో పడింది నిజానికి దశరథునికి నీకు శాశ్వత సంబంధమేది లేదు. ఒకరిజన్మ ఎంత అనుకోకుండా జరుగుతుందో తెలుసా ?

లోకంలో సాధారణంగా స్త్రీ పురుషులు ఆవేశంలో కామంతో కళ్లుగప్పుకొని తమ శరీరావసరాలను తీర్చుకొంటారు. ఆ సమయంలో అనుకోకుండా వారికి కూడ తెలియకుండా వారి శుక్రశోణితాలు ఏకమవుతాయి. ఆ రెండింటి అకస్మికమైన కలయికే ఒక వ్యక్తి జన్మకు కారణమవుతుంది. అంతమాత్రాన ఆ వ్యక్తికి – ఆ స్త్రీ పురుషులతో శాశ్వతమైన తల్లిదండ్రుల సంబంధాన్ని అంటగట్టాలా ? ఇక మరణమంటే ఏమిటనుకొంటున్నావు ? పుట్టుకకు కారణమైన భూమి,

నీరు, అగ్ని, వాయువు అనే నాలుగు భూతాలు – దేనికది విచ్చుకపోవడమే మరణము. మరణం తరువాత ఏది మిగులదు ఎవ్వరు మిగులరు. మిగిలేది శూన్యమే.

ఇంత మాత్రమే సత్యము అయితే – కొందరు స్వార్థపరులు 'ఆత్మ' అనేది శాశ్వతమైన తత్వమని – అది శరీరాలను మార్చుకోవడమే జనన మరణాలని – మరణం తరువాత ఆత్మ – తన కర్మానుగుణంగా స్వర్గ నరకాలలో సుఖ దుఃఖాలను అనుభవిస్తుందని కల్పించారు. తమ అందమైన మాటలతో లోకులను మోసం చేశారు. పండితులు కల్పించిన ఈ మాటలు ఎంత మాత్రము పరమార్థాలు కావు'.

'రామ చంద్రా! పుక్కిటి పురాణాలు కల్పించిన మరొక మోసంతో కూడిన విషయముశ్రాద్ధము మరణించిన వ్యక్తులు – ఏవో లోకాలకు వెళ్తారని వారికి ఆహారము లభించాలంటే మన మిక్కడ కొందరు బ్రాహ్మణులకు – చనిపోయిన వారి పేర్లతో భోజనాలు పెడితే తద్వారా మరణించిన వ్యక్తులకు ఆ ఆహారము అందుతుందని – స్వార్థపరుల అసత్య ప్రచారము కొనసాగుతోంది.

ఒక వేళ శ్రాద్ధమే సత్యమైతే మన ఇంట్లో ఎవరికో భోజనాలు పెట్టి వేరే ఊళ్లోకి వెళ్లిన మన వాళ్లకొరకు ఇక్కడ ఆహారాన్ని అందివ్వొచ్చుకదా? వేరే ఊళ్లకు వెళ్లిన వాళ్ళుదాకా ఎందుకు? మన ఇంట్లో క్రింద అంతస్తులోని వాళ్లకు భోజనము పెడితే మేడపైన ఉన్నవాళ్ల కడుపులు నిండుతాయా? లేదే! సత్యము ఇంత ఖచ్చితంగా ఉంటే – 'ఆత్మ' అనేది వాస్తవమని మరణానంతరము కూడ ఆ ఆత్మ – తన కర్మానుగుణంగా స్వర్గనరకాలకు వెళ్లి – అక్కడ సుఖదుఃఖాలను అనుభవిస్తుందని – మరణించిన వాళ్లకు శ్రాద్ధం ద్వారా ఆహారాన్ని అందివ్వాలని వాదించడం ఎంత మూర్ఖమో చూచావా?

అందువలన రామా! దశరథునితో నీకు ఏర్పడ్డ సంబంధము శాశ్వతము కాదు. మరణించిన దశరథుడు ఇప్పుడు ఎక్కడా లేడు. లేని దశరథుని మాటను పాటిస్తాననడం అవివేకమైన మాట.

ఈ లోకవములో సుఖించడమే స్వర్గము దుఃఖించడమే నరకము.

స్వర్గనరకములు వేరేలేనే లేవు.

కనుక అనవసరంగా అడవులపాలయి, కష్టాలనుకొని తెచ్చుకోకుండా - భరతుని ప్రార్థనను మన్నించి అయోధ్యకు తిరిగి వచ్చి హాయిగా సుఖాలను అనుభవించు' ఇది జాబాలి వాదము.

ఆధునిక నాస్తికులందరికి జాబాలి నాస్తిక వాదము శిరోధార్యమైంది. వారికి అదే పరమ ప్రమాణము. ఇంకొక రకంగా శ్రీ రామాయణమంతటి సత్య ఇతిహాస గ్రంథంలో కూడ, గొప్ప ఆధ్యాత్మిక గ్రంథంలో కూడ, జాబాలి నాస్తికవాదం ఉందని - నాస్తిక వాదానికి ప్రాచీనత్వాన్ని - తద్వారా దాని ప్రాబల్యాన్ని నిరూపించడానికి ప్రయత్నిస్తారు.

నాస్తిక వాదము ప్రాచీనమైనదే - శ్రీ రామాయణం కూడ దానిని ప్రస్తావించంది. నిజమే - కాని శ్రీరామాయణము జాబాలి వాదాన్ని బలపరుచలేదు. దానినే పరమ ప్రమాణంగా తెలుపలేదు. పైపెచ్చు శ్రీరాముని సమాధానము ద్వారా జాబాలి నాస్తిక వాదాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించింది.

నాస్తికులకు శ్రీరాముని సమాధానము నచ్చదు. అందువలన శ్రీరాముని సమాధానాన్ని వారు అంగీకరింపరు - పట్టించుకోరు.

శ్రీరామాయణాన్ని - తమకు అవసరమున్నంత వరకే అంగీకరించి - అనుకూలము కాని భాగాలను అంగీకరింపని - అవకాశవాదుల పక్షపాత దృష్టిని చూచి - జాలితో నవ్వడం తప్ప మనము చేయదగింది ఏమి లేదు.

అయితే ప్రాజ్ఞునివలె శ్రీరామాయాణాన్ని అంతా విశ్వసించు. లేకపోతే అజ్ఞానివలె అసలే అంగీకరించకు. నా ఇష్టమున్నంత వరకే అంగీకరిస్తాననడం మూర్ఖత్వమే కదా!

## శ్రీరాముని సత్యనిష్ఠ

జాబాలి చేసిన నాస్తికవాదము శ్రీరామునికి తీవ్రమైన అసంతృప్తిని ఆగ్రహాన్ని కలిగించింది. నిజానికి జాబాలి ముఖ్య ఉద్దేశ్యము నాస్తిక వాదాన్ని చేయడం కాదు.

ఏదో ఒక విధంగా శ్రీరాముని అయోధ్యకు తీసిక వెళ్లడమే. శ్రీరాముని అడవుల నుండి పిలుచుక వెళ్లడంలో తన వంతు ప్రయత్నాన్ని చేయుడం కొరకే జాబాలి నాస్తిక మార్గాన్ని ఎన్నుకొన్నాడు. జాబాలి ఉద్దేశ్యము మంచిదే కావచ్చు. కాని ఆయన ఎన్నుకొన్న మార్గము సత్పురుషుల ఆదరానికి దూరమైంది.

రామభద్రుడదే విషయాన్ని తన సమాధానంలో స్పష్టం చేశాడు. 'జాబాలీ మీరు నన్ను అయోధ్యకు తీసిక వెళ్లాలనుకోవడం మీ ఉద్దేశ్యం కావచ్చు. కాని దానికొరకు మీరు పలికిన పలుకులు నాకే కాదు సజ్జనులెవ్వరికి హితకరములు కావు. అవి ఎవ్వరికి శ్రేయస్సును కలిగింపవు.

మీ మాటలు విని, నేను అయోధ్యకు తిరిగి రావాలా ? అలా వస్తే నాకు సత్పురుషాదరం లభిస్తుందా ?

లోకంలో అన్నిటికంటే వ్యక్తుల ప్రవర్తనే ముఖ్యమైనది. ప్రవర్తనమునుబట్టే మనుష్యులను వీరులని, భీరులని పవిత్రులని అపవిత్రులని నిర్ణయించడానికి వీలవుతుంది.

లోకంలో ధర్మ ప్రవర్తకుడైన రాజే అధర్మపరుడైతే ప్రజలందరు అధర్మాన్నే ఆశ్రయింపరా? - రాజే విధంగా నడిస్తే ప్రజలా విధంగానే నడుస్తారు కదా!

'యద్వృత్తాస్సంతి రాజానః తద్వృత్తా స్సంతిహి ప్రజాః!'

శ్రీరాముడు తన సమాధానాన్ని కొనసాగిస్తూ సత్యము యొక్క మహిమను వివరింపసాగాడు.

సత్య పాలన ద్వారా ఒకడు ఇక్కడ లోకపాలకుడు కావచ్చు. మరొకడు స్వర్గంలో భోగాలననుభవింపవచ్చు. సత్యాన్ని పాలించని వాడు ఇక్కడ కష్టపడొచ్చు. మరణానంతరము నరకానికి వెళ్తాడు.

అసత్య వచనుని, పితరులు దేవతలు అసహ్యించుకొంటారు. అంతే కాదు జాబాలీ! సత్య ధర్మ స్వరూపమైన ( ప్రత్యక్) ఆత్మను నేను చూడ గల్గుతున్నాను '( ఉత్క్రామంతం, స్థితంవాపి, భుంజానంవా గుణాన్వితం విమూఢా నానుపశ్యంతి

– పశ్యంతి జ్ఞాన చక్షుషః – గీత) (ఈ శరీరములో ఉండే, – గుణకర్మఫలాలను అనుభవించే, ఈ శరీరాన్నుండి లేచివెళ్లే ఆత్మను విమూఢులు చూడ లేరు. కాని జ్ఞానులు దర్శింపగల్గుతారు – గీత) శ్రీ రాముడు తన వాదాన్ని కొనసాగించాడు.

'జాబాలీ! తమ సుకృతాచరణ ద్వారానే చేతనులు అగ్ని వాయువు, సూర్యచంద్ర నక్షత్రాది స్థానాలు పొందగల్గుతున్నారు.

'సుకృతం వా ఏతాని జ్యోతీగ్ంషి – యన్నక్షత్రాణి'

ఇంద్రుడికి 'శతక్రతువు' అనే పేరు ప్రసిద్ధమే కదా!

జాబాలీ! నీవు పుట్టుకతో (బ్రహ్మ – వేదాన్ని, అణతి, అధ్యయనం చేసే వాడివి) బ్రాహ్మణుడవు. అయినా నిందింప దగిన నాస్తిక వాదాన్ని చేస్తున్నావే? నీ పూర్వులు శుభకర్మాచరణ ద్వారా ఉత్తమ లోకాలను సాధించారే వారందరు నీ కంటె అజ్ఞానులా ? వాళ్లకు లేని క్రొత్త జ్ఞానాన్ని నీవు సాధించావా ?

నీవంటి విపరీత బుద్ధిగల వాని ముఖాన్ని చూడడానికే సజ్జనులు సమ్మతింపరే? అట్టి నిన్ను మా నాన్నగారు తమ సభలో ఎలా ఉండనిచ్చారో తెలియడం లేదు.' అని రోషకషాయిత నేత్రుడై శ్రీరామభద్రుడు జాబాలిని తీక్షణ దృక్కులతో మందలించాడు.

జాబాలి వాదంలో 'సత్యానికి విలువలేదు. వైదికకర్మలకు ప్రాధాన్యములేదు. మరణమంటే శరీరములోని అగ్ని, వాయువు, నీరు, భూమి అనే నాలుగు భూతములు దేనికది విచ్చుకపోవడమే. తల్లిదండ్రి, కొడుకు, అనే సంబంధాలన్ని అసత్యాలు, ఆత్మ అనేది లేనేలేదు. ఆత్మ కొరకు పెట్టే శ్రాద్ధాదులకు ఉపయోగం లేదు'.

శ్రీరాముడు తన సమాధానములో 'సత్యమూలాని సర్వాణి సత్యేలోకః ప్రతిష్ఠితః' సత్యమే వరమ ధర్మమని శాశ్వత ధర్మమని నొక్కి వక్కాణించాడు.

'మజ్జత్యే కోపి నిరయే – ఏక స్స్వర్గే మహీయతే'

సత్యమును పాలించని వాడు నరకములో పడిపోతాడు సత్యమును పాలించే

మరొకడు స్వర్గములో అనేక మహాభోగాలనుభవిస్తాడని, స్వర్గ, నరక లోకములు అందరి భోగాలు, బాధలు సత్యములని తెలిపాడు.

(ప్రత్యక్) ఆత్మ సత్యమని – తాను దానిని దర్శింపగలుగుతున్నానని ప్రకటించాడు.

వైదిక కర్మలన్ని సత్యాలని – వాటిని చక్కగా ఆచరించినందువలన సూర్యాగ్ని, చంద్ర ఇంద్రాది దేవతా పదవులు లభిస్తాయని ధృవపరిచాడు.

వేదవేత్త – తపస్వి అయి కూడ వైదిక కర్మలను, ఇహపరలోకాలను, సత్యమహాత్మ్యాన్ని విశ్వసింపని జాబాలి భ్రష్టుడని – దశరథ మహారాజు సభలో ఉండే అర్హతే లేని వాడని దూషించాడు. వేదమును విశ్వసింపని నాస్తికుడు చోరుడని ఆయన ముఖాన్ని చూడడానికి కూడ బుద్ధిమంతుడు అంగీకరింపడని – కఠినంగా పలికాడు.

వైదిక కర్మలన్ని సత్యాలని – అవి తప్పక ఫలవంతములే అని బల్లగుద్ది చెప్పాడు.

## శ్రాద్ధము

వైదిక కర్మలలో శ్రాద్ధమొకటి. అది సత్యకర్మ. దాని ఆచరణ మూలంగానే పితరులకు స్వర్గ సౌఖ్యాలు – అది ఆచరింపబడకపోవడం వలననే నరక ప్రాప్తి కలుగుతాయి.

శ్రాద్ధ స్వరూపాన్ని – దాని మూలంగా పితరులకు ఆహార మందే విషయాన్ని పరిశీలిద్దాము.

పితరులు – దేవతా స్వరూపులు – వసురుద్ర, ఆదిత్య స్వరూపులు.

మనుష్యులమైన మనకు దేవతలు అయిన పితరులకు కాల భేదము ఉంది. మనకు ఆరు నెలలు అయితే దేవతలకు పగలు. దానినే 'ఉత్తరాయణము' అంటారు. మనకు 'దక్షిణాయనము' – ఆరునెలలు – దేవతలకు రాత్రి – అందువలన మనకు పూర్తిగా ఒక సంవత్సరము అయితే దేవతలకు ఒక రోజు అవుతుంది. మనము సంవత్సరానికి ఒక సారి పెట్టే శ్రాద్ధము వలన దేవతలకు ప్రతి రోజు

ఆహారమందుతుంది.

ఇక ఇక్కడ ఎవ్వరో భోక్తలకు పెట్టే భోజనము పితరులకు ఎలా అందుతుందనేది ప్రశ్న. జాబాలి ఒక ఉదాహరణతో ఈ విషయాన్ని ఖండించాడు.

'మన ఇంట్లో క్రింది గదిలోని వారికి భోజనం పెట్టితే – మన ఇంట్లోనే మేడపై ఉన్నవారికి ఆ భోజనం అందుతుందా? పరదేశాలకు వెళ్లిన వాళ్ల కడుపులు నిండుతాయా? అని.

సమాధానము :– నీ ఇంట్లో వాళ్లకు భోజనము పెడితే – మేడపై వాళ్లకో గ్రామాంతర, ధేశాంతర వాసులకో ఆ భోజనం అందుతుందని వేదము తెల్పలేదు. అది నీ వితండ వాదమే. వేదము చెప్పని విషయాన్ని నీ అంతట నీవు ఊహించుకొని నీ ఊహను నీవే ఖండించుకోవడంలో విజ్ఞతలేదు.

నీ ఇంట్లో పై మేడలో ఉన్న వాళ్లైనా – గ్రామాంతర, దేశాంతర వాసులయినా – అందరు ఈ లోకంలో ఉన్న వాళ్లే. శ్రాద్ధము ఒకే లోకంలో వేర్వేరు స్థలలాలో ఉన్న వాళ్లకు ఆహారాన్ని అందించేందుకు శాస్త్రం చేత విధింపబడలేదు. రెండు వేర్వేరు లోకాలకు సంబంధించిన వైదిక కర్మ అది. అందువలన నీ ఉదాహరణమే దుష్టమయినది.

'మజ్జత్యేకోహినిరయే – ఏకః స్వర్గే మహీయతే' ( ఒకడు నరకంలో దుఃఖంలో మునిగిపోతాడు – మరొకడు స్వర్గంలో భోగాలను అనుభవిస్తాడు) అనే శ్రీ రాముని సమాధానం ద్వారా స్వర్గ నరకాలనే రెండు పరలోకాలు సత్యములే అని శ్రీ రామాయణం తెలుపుతోంది. అంతేకాదు 'అసత్య సంధస్య – నైవదేవాః నపితరః ప్రతీచ్ఛంతీతి నశ్శుతం' అసత్యవాక్యుని దేవతలు పితరులు ఆదరింపరు ' అనే మాటల ద్వారా పితరులు దేవతలు ఉంటారని స్పష్టమవుతున్నది.

ఇక శ్రాద్ధం ద్వారా ఆహారాన్ని పితృలోకానికి ఎలా అందించవచ్చునో చూచేముందు జాబాలి ప్రశ్నలోని అనౌచిత్యాన్ని ఒక లౌకిక ఉదాహరణం ద్వారా గమనిద్దామా ?

మన సౌకర్యము కొరకు ప్రభుత్వంలో పోస్టల్ శాఖ ఒకటి ఉంది. ఆ శాఖ

దాదాపు అన్ని ఊళ్లల్లో పోస్ట్ ఆఫీస్‌లను నెలకొల్పింది.

నగరాలలో అయితే అనేక పోస్ట్ ఆఫీసులు ఉంటాయి. అంతే కాదు వాడ వాడకు పోస్ట్‌బాక్స్‌లు ఉంటాయి. నీవు ఒక ఉత్తరాన్ని వ్రాసి - ఏ పోస్ట్ ఆఫీస్ లోనైనా లేక ఏ పోస్ట్ బాక్స్ లోనైనా - దానిని వేయవచ్చు ఆ ఉత్తరము - నీవు వ్రాసిన వాళ్లకు అందుతుంది. అట్లానీ ఉత్తరాన్ని వాళ్లకు చేర్చే బాధ్యతను పోస్టల్ అధికారులు వహిస్తారు.

పోస్టల్ శాఖ ఏర్పరిచిన ఈ క్రమాన్ని నమ్మని జాబాలి ఆయన వారసులు 'ఇదేమిటండీ ? నా ఇంటి ముందు ఉన్న ఒక పోస్ట్ బాక్స్‌లో నేను వ్రాసిన ఉత్తరాన్ని వేస్తే దూరంలో ఉన్న నా బంధువులకు ఎలా చేరుతుందండీ ? ఒక వేళ అదే నిజమైతే నేను ఒక ఉత్తరాన్ని వ్రాసి - నా ఇంట్లో ఒక సూట్‌కేస్‌లో వేస్తాను. ఏదీ ఆ ఉత్తరం నా మిత్రులకో బంధువులకో (వేరే ప్రాంతాల్లో ఉండే వాళ్లకు) ఎలా చేరుతుందో చూపుమనండి' అంటారనుకోండి. అప్పుడు జాబాలి - ఆయన వారసుల 'అతి తెలివికి' నవ్వాలా? ఏడ్వాలా ?

పోస్టల్ శాఖ ఏర్పరచిన క్రమాన్ని వీడి - 'జాబాలి' తన ఇష్టము వచ్చిన పద్ధతిని అనుసరించినందువలన ఆయన ఉత్తరము దూరంలో ఉన్న ఆయన వాళ్లకు చేరదు. అయితే దాని వలన పోస్టల్ శాఖ ఏర్పరచిన క్రమంలో లోపమా ? కాదే?

అదే విధంగా శ్రాద్ధ పద్ధతిని అంగీకరింపని జాబాలి తన ఇష్టము వచ్చినట్లు భోజనము పెడితే ఇతరులకు అది అందదు. అంతమాత్రాన అది శ్రాద్ధ ప్రక్రియలోని లోపము కాదు. శాస్త్రలోపము అంతకంటే కాదు. ఇంతకు వేదము శ్రాద్ధ ప్రక్రియను ఎలా నిర్వహించాలని విధించిందో తెలుసుకొందామా ?

వేదము రెండు రకాల కర్మలను వివరించింది. ఒకటి హవ్యము, రెండవది కవ్యము.

హవ్య కర్మలనగా యజ్ఞయాగాదులు. అవి ఇంద్రాది దేవతల ప్రీతి కొరకు మనము చేసే కర్మలు.

కవ్యము అనగా పితరుల కొరకు మనము చేసే శ్రాద్ధకర్మ. హవ్య కర్మకంటే

కూడ కవ్యకర్మలో శ్రద్ధ చాలా అవసరము, శ్రద్ధతో చేసేది కనుక పితృ కర్మకు 'శ్రాద్ధము' అని పేరు.

శ్రాద్ధ కర్మ చేసేవాడు కర్త. ఆయన ఒకరోజు ముందు రాత్రి ఉపవసించాలి. తెల్లవారి ఆరుగురు శ్రోత్రియుల దగ్గరకు వెళ్ళి వారికి పాదాభివందనము చేసి 'బ్రాహ్మణార్థము' ఆహ్వానించాలి.

ఆ ఆరుగురు మూడు రకాలయిన దేవతల ప్రతినిధులు. ఇద్దరు విశ్వే దేవతల ప్రతినిధులు. 'పురూరవ – ఆర్ద్రకుల' ప్రతినిధులు. ముగ్గురు – (కర్త తండ్రి – తాత – ముత్తాతలు) 'వసు, రుద్ర' ఆదిత్య' స్వరూపులు (ప్రతినిధులు) చివరి వ్యక్తి విష్ణువు. ఈయన శ్రాద్ధ సంరక్షకుడు. పురూరవ, ఆర్ద్రకులు అనే ఇద్దరు విశ్వేదేవులు శ్రాద్ధంలో ముందు ఉంటారు. తరువాత పితరులు – వసు, రుద్ర ఆదిత్యులు. తరువాత విష్ణువు.

ఈ ఆరుగురిని మంత్ర పూతంగా ఆహ్వానించి, వారిపై మంత్రాక్షతలతో ఆయా దేవతలను ఆవహింపజేసి, వారికి పాద ప్రక్షాళనము చేసి – వీరిని కర్త శ్రాద్ధ భోజనానికి కూచోబెడుతాడు. ఆయా దేవతలకు వేదము వేర్వేరు దిశలను నిర్దేశించింది.

విశ్వేదేవులను తూర్పువైపే కూచో బెట్టాలి. పితరులకు దక్షిణం వైపే ఆసనాలను కల్పించాలి. ఇక విష్ణువుకు – అన్ని దిశలు ఆయనవే 'విష్ణు స్సర్వదిక్' – కనుక ఏ వైపు కూచోబెట్టినా ఫరవాలేదు.

వారి విస్తర్లలో నేయి వేసిన తరువాత మొదట అన్నము తరువాత పాయసము – చివరకు భక్ష్యములు వడ్డించి – తరువాత కూర గాయలను – చివరకు సూపాన్ని (పప్పును) వడ్డించాలి. ఈ పద్ధతి కేవలం శ్రాద్ధాలకే వర్తిస్తుంది.

ఆయా దేవతల స్వరూపులైన భోక్తలకు ఆరుగురికి – మంత్ర బద్ధంగా అపోశనాన్ని ఇచ్చి 'యద్రోచతే తద్గ్రాహ్యం యన్న రోచతే తత్యాజ్యం' ఇష్టమైన పదార్థాలనే తృప్తితో భుజింపుమని వారిని వేడుకోవాలి.

తాను గయలో అక్షయ వట వృక్షము క్రింద శ్రాద్ధాన్ని ఆచరిస్తున్నాని - ప్రాజ్ఞ రూపి అయిన జనార్ధనుడు ఈ కర్మ ద్వారా సంప్రీతి చెందుతున్నాడని మనస్సులో భావించుకొని 'గయ గయ' అని స్మరించుకోవాలి 'ఏకో విష్ణుః' అనుసంధించి ఉత్తరము వైపు తర్పణము వదలాలి.

వారి భోజనానంతరము తిరిగి తీర్థాన్నిచ్చి - వారు హస్త ప్రక్షాళనము చేసికొని వచ్చాక వారికి దక్షణ తాంబూల, చందన పుష్పమాలలను సమర్పించి - వారిని 'వామదేవ' మంత్రంతో ఇంటి వెలుపలి దాకా సాగనంపాలి. దీనితో శ్రాద్ధ ప్రక్రియకు ఉద్వాసనము (ముగింపు) జరుగుతుంది. సాధారణంగా మనము ఏదైనా ఒక వస్తువును ప్రతినిధికిస్తే ఆయన దాన్ని యజమానికందిస్తాడు కదా. అలాగే మనము పెట్టే శ్రాద్ధ భోజనము భోక్తల ద్వారా పితృదేవతల కందడంలో విచిత్రమేమి ఉంటుంది?

ఒక వేళ ఆరుగురు శ్రోత్రియులు లభించకపోతే - ముగ్గురిని నిమంత్రణము చేయవచ్చు. అప్పుడు ఒకరు విశ్వేదేవరూపులు. ఒకరు పితృ స్వరూపులు - మరొకరు విష్ణు స్వరూపులు.

చివరకు ఒక్కరు లభించినా వారికి పితృ క్షణమిచ్చి శ్రాద్ధాన్ని నిర్వహించాలి. భోక్తలుగా ఆహ్వానించిన వారెవ్వరు సమయానికి రాజాలకపోతే అప్పుడు సాలగ్రామ స్వరూపుడైన శ్రీ మహావిష్ణువు ముందు - ఆ భోజన పదార్థాలు వడ్డించిన విస్తర్లను ఉంచి - మనస్సులో ఆయా దేవతలకు వాటిని సమర్పించినట్లుగా భావించి - వాటిని నదీ జలాల్లోని ప్రాణులకో గోవులకో సమర్పించాలి. సమయానికి రాకున్నా ముందుగానే భోక్తలెవ్వరు లభించని రోజునా తాను ఏ ఆహారాన్ని స్వీకరించక - ఉపవాసాన్ని చేయాలి. మరో పక్షంలో అదే తిథికి అయినా లేక ద్వాదశి తిథికైనా శ్రాద్ధాన్ని మళ్లీ పెట్టాలి.

భోక్తలు స్వీకరించగా మిగిలిన వండిన పదార్థాలను వారి అనుమతితో తనకు ఇష్టమైన వారితో పితృ దేవతా ప్రసాదంగా భుజించాలి 'ఇష్టైస్సహ భుజ్యతాం'.

ఇది శ్రాద్ధ ప్రక్రియ. దీని ఈ క్రమాన్ని వేదము విధించింది. దీనిని విశ్వసించి

పితృ కర్మను ఆచరించాలి. సామాన్యంగా ఒక ఉత్తరము ఎన్ని రవాణా మార్గాలను అనుసరించి – దూరంలో ఉన్న బంధు మిత్రులకు చేరుతుందో తెలియకున్నా – ఆ క్రమాన్ని తాను కళ్లతో చూడకున్నా – పోస్టల్ అధికారులు నిలిపిన పోస్ట్ బాక్స్‌లో విశ్వాసంతో వేసిన ఉత్తరము ఎలా దూరంలో ఉన్న బంధు మిత్రులకు చేరుతుందో – అలాగే శాస్త్ర విశ్వాసంతో మనము ఆచరించిన శ్రాద్ధ ప్రక్రియ ద్వారా ఆహారము మన పితరులకు అందుతుంది.

కళ్లతో చూడజాలని దానిని, మనస్సుతో ఊహింపజాలని దానిని ఆప్తవచనంతో విశ్వసించాలి. 'మాతా పితృ సహస్రేభ్యోఽపి వత్సలతరం శాస్త్రమ్' వేలమంది తల్లిదండ్రులకంటే ప్రియ హితాలను కలిగించేది శాస్త్రము.

'యః ధర్మేణానుసంధత్తే సతర్కో నేతరః స్మృతః'

ధర్మాన్ని అనుసరించే తర్కమే తర్కము. తన ఇష్టము వచ్చినట్లు ఊహించి వాదించే వాదము తర్కము కాదు. దానికి ఆధారము ఉండదు. అది పరిపూర్ణము కాదు. జాబాలి చేసింది స్వేచ్ఛాతర్కమే, కుతర్కమే.

గీతాచార్యుడు కూడ శాస్త్రాన్నే ప్రమాణంగా విశ్వాసించాలని బోధించాడు. 'తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే'

శ్రాద్ధ ప్రక్రియకు సంబంధించిన మరికొన్ని విషయాలను కూడ గమనిద్దామా!

'శ్రద్ధా సమన్వితైర్దత్తం – పితృభ్యో నామగోత్రతః

యదాహారాస్తుతే జాతాః – తదాహారత్వమేతి తత్'

మన ముగ్గురు పితరులను (తండ్రి, తాత, ముత్తాతలను) వారి వారి నామములతో – వారి గోత్రాలతో సహా ఆహ్వానించి, శాస్త్రీయంగా శ్రద్ధతో వారి ఆహారాన్ని వారి ప్రతినిధులకు సమర్పిస్తే – ఆ ఆహారము పితృలోకానికి చేరి – అక్కడ వసురుద్ర ఆదిత్యుల శక్తి వలన – అక్కడ నుండి మన పితరులు ప్రస్తుతం ఏ రూపంలో ఏ లోకాల్లో ఉన్నారో – ఆ రూపాలకు అనుగుణమైన ఆహారముగా మారి ఆలోకాలకు చేరుతుంది.

ఉదాహరణకు మన పితరులు ప్రస్తుతము స్వర్గంలో దేవతలుగా ఉంటే మనమిక్కడ వారి కొరకు ఇచ్చిన శ్రాద్ధాహారము – వారికొరకు అమృతంగా మారి – స్వర్గానికి చేరుకొంటుంది. వారు ప్రస్తుతం మానవ రూపంలో తిరిగి జన్మిస్తే – వారెక్కడ ఉన్నా – వారికి అన్నంగా అందుతుంది. వారు పశురూపంలో జన్మిస్తే గడ్డిగా పాము రూపంలో జన్మిస్తే పాలుగా – జన్మ రాహిత్యాన్ని పొంది – పరమ పదములో ముక్తులుగా చేరితే – వారికి కావలసిన భగవత్కైంకర్యంగా అందుతుంది.

'యదాహారాస్తు తేజాతాః – తదాహారత్వమేతి తత్'

అనే మంత్ర భాగానికి అర్థమిదే. ఈ విషయాన్నే ఒక లౌకికోదాహరణంతో అర్థము చేసికొందాము.

విదేశాలలో మన బంధుమిత్రులెవరో ఉన్నారనుకొందాము. వారికి మనము డబ్బు పంపాలి. అప్పుడు మనము ఏమి చేయాలి ? ఇక్కడ ఉన్న రిజర్వు బ్యాంకుకో – అది అనుమతించిన కమర్షియల్ బ్యాంకుకో వెళ్లాలి. అక్కడ ఉన్న అధికారికి మన రూపాయిల కరెన్సీనివ్వాలి. ఆ అధికారి మన మిచ్చిన రూపాయిలకు తగిన మొత్తములో, మన బంధుమిత్రులున్న దేశానికి చెందిన కరెన్సీగా మార్చి, ఆ దేశంలోని బ్యాంకు ద్వారా మన వారికి అందజేస్తాడు. మనమిక్కడ, బ్యాంకు అధికారికిచ్చిన రూపాయలు, విదేశీ కరెన్సీగా మారి విదేశాలలోని మన వాళ్లకు అందినట్లే ఇక్కడ నిమంత్రితులైన భోక్తలకు మనము సమర్పించిన ఆహారము మన పితరులకు, ప్రస్తుతము ఏ లోకంలో ఏ రూపంలో ఉన్నా వారికి తగిన ఆహారంగా మారి, వారికి అందుతుందని శాస్త్రము వివరిస్తుంది.

అయితే ఇంత మాత్రాన జాబాలి వాదులు శ్రాద్ధాన్ని అంగీకరిస్తారా ? వారు శాస్త్రాన్నే అంగీకరింవరు కదా! కంటికి కనుపడని ఏ విషయాన్ని వారు విశ్వసింపరు. మరి వారికి సమాధానమేమిటి ?

రామాయణాన్ని అధ్యయనం చేయడం వలన మనకు పై విషయాలు సులభంకా లేదా ? వీటన్నింటికి శాస్త్రమే ఆధారం కాదు! పూర్వుల అనుభవాలే ఆధారాలు కదా!

ఈనాడు శాస్త్రం ద్వారా యాంత్రిక శక్తి అభివృద్ధి చెందిలోకాంతరాలతో సంబంధాలు ఎలా ఏర్పడుతున్నాయో అలాగే ఒకనాడు శాస్త్రం ద్వారా మాంత్రిక శక్తి కూడ అభివృద్ధి చెంది పరలోక వాసులతో సంబంధాలు ఏర్పడ్డాయి.

శాస్త్రము శక్తివంతమైనది. దాని పూర్ణ శక్తి రెండు రూపాలలో ఉంటుంది. 1. యంత్ర శక్తి 2. మంత్ర శక్తి ఈ రెండు శక్తి స్వరూపాలను కలిగిందే శాస్త్రము యొక్క పూర్ణ స్వరూపము.

ఈనాడు శాస్త్రము యొక్క యంత్ర శక్తిని మన మందరము కళ్లారా చూస్తున్నాము. మన వెలుపలి కళ్లకందని మంత్ర శక్తిని మహర్షులు, ప్రాచీన కాలంలోనే గుర్తించి మనకా శక్తిని అందించారు. మనము చూడజాలని విషయాలను చూడగలిగిన వారే మహర్షులు 'అపూర్వద్రష్టామహర్షిః' వారి వారసులుగా మనము ఆ శక్తిని వినియోగించుకోవాలి కదా! శాస్త్రము యొక్క యంత్ర శక్తిని మాత్రమే ఆదరించి, మంత్ర శక్తిని గుర్తించడానికి ఇష్టపడకపోవడం వలన శాస్త్రము పట్ల పక్షపాతము చూపినట్లే అవుతుంది. మనము – ఒకరిని నిందిస్తే, ఆ నిందా శబ్దాల వలన ఆ వ్యక్తికి ఆగ్రహము కలుగుతుంది. ఒకరిని ప్రశంసిస్తే ఆ వ్యక్తికి సంతోషము కలుగుతుంది. మనము వాడిన దూషణ, భూషణ, శబ్దాల వలన కలిగే ఫలితాలను మనము చూడగలుగుతునే ఉన్నాము.

సాధారణ శబ్ద శక్తి కంటె అసాధారణ శబ్దాలయిన మంత్రాల శక్తి చాల గొప్పది. మంత్రాలు బీజాక్షరాలతో కూడుకొన్నవి. 'మంతారంత్రాయతఇతిమంత్రః' జపించే వ్యక్తులను సంరక్షింపగలిగే శక్తి వంతములు మంత్రములు.

యంత్ర శక్తి ద్వారా ఈనాడు గ్రహాంతరాల నుండి లోకాంతరాల నుండి రాళ్లు మొదలైన వస్తువులను ఎలా తీసుక రాగల్గుతున్నామో – రాకెట్లలో క్షిపణులలో ప్రయాణించే వ్యక్తులకు (అస్ట్రోనాట్‌లకు) ఇక్కడ నుండే ఆక్సిజను – ఆహారపదార్థాలను అక్కడ వాడుకోవడానికి ఎలా అందివ్వగల్గుతున్నామో మార్గము మధ్యలో ఏవైనా లోపాలేర్పడితే ఇక్కడి కంట్రోలింగ్ స్టేషన్ నుండి ఉపగ్రహ ప్రయాణీకులకు ఆదేశాలు ఇచ్చి ఎలా వారి సమస్యలను పరిష్కరించగల్గుతున్నామో

– అలాగే మంత్ర శక్తివలన – ఇక్కడి నుండి శ్రాద్ధ ప్రక్రియ ద్వారా ఇతరలోకాల్లో ఉన్న మన పితరులకు ఆహారాన్ని అందివ్వగల్గుతాము.

అయితే మన కళ్ల ముందున్న వ్యక్తులను శ్రాద్ధ భోజనానికి ఆహ్వానిస్తే వారిలో దేవత్వము ఆవహిస్తుందా అని మరో ప్రశ్న కలుగవచ్చు కదా!

ఈ ప్రశ్నకు యదార్థమైన భారతేతిహాసం సమాధానాన్ని అందిస్తోంది.

ఏకలవ్యుడు అనే ఎరుకబాలుడు ప్రత్యక్షంగా తనకు శస్త్ర విద్యను ఉపదేశించడానికి ద్రోణాచార్యుడు అంగీకరించనందు వలన ఆయన ఆకృతిని మట్టి ముద్దతో తయారు చేసికొని దానిలో తన భావన ద్వారా ద్రోణుని ఆవహింపజేసికొని – శస్త్ర విద్యను సాధించాడే! అందువలన మన భావనా మహిమ వలన మనము ఆహ్వానించిన వ్యక్తులలోనే విశ్వేదేవత్వము, పితృ దేవత్వము విష్ణు దేవత్వము కల్గడంలో అసాధ్యమేమిలేదు అట్లా ఆవహింపజేసికోవడానికి కావలసినవి – శాస్త్ర విశ్వాసము – భావనాప్రకర్ష మాత్రమే.

ఎవరో శాస్త్రవిశ్వాసంలేని మూర్ఖులు భావనా మహిమను గుర్తింపలేని అజ్ఞానులు చేసే వితండవాదాలకు మోసపోకుండా అన్ని విషయాలను – సంపూర్ణంగా అంగీకరించి – ఆదరించి ఆచరించడమే – భారతీయులమైన మనకు ఆర్ష విజ్ఞాన సంపదకు వారసులమైన మనకు శ్రీ రామరక్ష. ముఖ్యంగా కావలసింది అదే మనకు.

ప్రత్యక్షాన్ని మాత్రమే నమ్మాలి ' అని కదా జాబాలి వాదము. ప్రత్యక్షమంటే ఏమిటి? కన్ను ఒక్క రూపాన్ని మాత్రమే చూడగల్గుతుంది కదా? ఆ రూపాన్ని అయినా కన్ను పూర్తిగా చూడ గల్గుతుందా ? లేదు కన్ను రూపాన్ని కూడ కొంతవరకే చూడగల్గుతుంది.

కన్ను యొక్క చూచే శక్తి యొక్క పరిమితిని శాస్త్ర కారులీ విధంగా తెలుపుతారు.

'అతిదూరాత్ – సమీపాత్ – ఇంద్రియఘాతాత్

మనోనవస్థానాత్ – సౌక్ష్మ్యాత్, వ్యవధానాత్

అభిభవాత్, సమానాభిహారాచ్చ'సాంఖ్యకారిక'

అతిదూరాత్ – మన కన్ను కొంత దూరంలో ఉన్న వస్తువులను మాత్రమే చూడగల్గుతుంది. 'దూరదర్శిని' (టెలిస్కోప్) ద్వారా మరికొంత దూరమును చూడొచ్చు. దూరదర్శినికి కూడ అందని దూరంలో ఉన్న వస్తువును చూడజాలమే?

అతిసమీపాత్ :- అతి దూరంలో ఉన్న వస్తువును చూడకపోవచ్చు, దగ్గరలో ఉన్న వస్తువును చూస్తాము కదా? అని మరో ప్రశ్న.

మరీ దగ్గరలో ఉన్న వస్తువును కూడ చూడజాలదు మన కన్ను, మన శరీరములోనే మన ముఖము ఉందికదా? మన ముఖాన్ని – ముఖంలోని నాలుకను, పళ్లను, కళ్లను నుదురును, కనుబొమ్మలను – అద్దము వంటి ఏదో ఒక దృశ్య సాధనం లేకుండా మన కళ్ళు చూడగల్గుతాయా ? లేదే!

ఇంద్రియ ఘాతాత్ :- మన ఇంద్రియాలకేదో ప్రమాదం కలుగవచ్చు. మన కళ్లకే పొరలు రావచ్చు. అప్పుడు ఆ పొరల (కాటరాక్టు) కళ్లతో వస్తువులను చూడగలుగుతామా ? లేదే! అలాగే పసిరికలు – కళ్లకు రావచ్చు – అప్పుడా పచ్చ కామెర్ల కళ్లతో వస్తువులను ఉన్నదున్నట్లు చూడగల్గుతామా? లేదు. తెల్లగా ఉండే శంఖము మన కళ్లకు పచ్చగా కనపడుతుంది.

మనోనవస్థానాత్ :- మనమనస్సు ఏదో ఒక విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తుందని అనుకొందాము. అప్పుడా విషయంలోనే మన మనస్సు లీనమవుతుంది. అది చదివే పుస్తకం గురించి కావచ్చు. ధూరంలో ఉన్న బంధువుల గురించి కావచ్చు. మరే విషయాన్ని గురించి కావచ్చు. అప్పుడు మన కన్నులు సాధారణ విషయాలను చూడగల్గుతాయా? లేదే? మనముందే పిల్లి వెళ్లి వంట ఇంట్లో పాలు పెరుగు త్రాగినా, మనము ఇంట్లో ఉండగానే ఎవ్వరో ఒక దొంగ ఇంట్లో ప్రవేశించి మొత్తము దోచుకొని వెళ్లినా 'ఆ సమయంలో' మన కళ్లు చూడజాలవు.

సౌక్ష్మ్యాత్ :- మనము చూచే వస్తువు. మన కంటికి కనపడే పరిమాణంలో ఉంటేనే మన కళ్ళు ఆ వస్తువును చూడ గల్గుతాయి. ఊరక చూడజాలక పోతేనేమి ? సూక్ష్మదర్శిని (మైక్రో స్కోపు) ఉంటుంది కదా? దానితో ఎంత చిన్న వస్తువునైనా చూడొచ్చు కదా? అని జాబాలి వాదులు ప్రశ్నించవచ్చు.

సూక్ష్మదర్శినికి కూడ అందనంత చిన్న పరిమాణంలో ఉండే విషయాలమాటేమిటి ?

వ్యవధానాత్ :- ఏ వస్తువునైనా మనము చూడాలనుకొన్నప్పుడు ఆ వస్తువుకు మన కంటికి మధ్య ఏ అడ్డు ఉండకూడదు. తలుపులు మూసి ఉన్న ఒక గదిలో ఉన్న మన భార్యాపుత్రులనే మనకళ్ళు చూడజాలవే? చూడజాలనంత మాత్రాన వాళ్ళు లేనట్లేనా ?

'అభిభవాత్' అభిభవమంటే ఒక వస్తువు ఆధిక్యముచే ఇతర వస్తువులు ఆక్రమింపబడుట.

పట్ట పగలు సూర్యుని చండ ప్రకాశము కారణంగా ఆకాశములో ఎప్పుడూ ఉండే నక్షత్రాలు మనకు కనపడవు. అంత మాత్రాన ఆకాశంలో నక్షత్రాలు లేనట్లేనా?

సమానాభిహారాచ్చ :- ఒక వస్తువు మరొక వస్తువుతో గుర్తు పట్ట రానంతగా కలిసిపోయినప్పుడు.

ఉదా :- ఒక నల్లని బట్టకు మసి అంటింది. ఆ బట్ట మొదటే చాలా నల్లగా ఉంది. అప్పుడా అంటిన మసిని గుర్తు పట్ట గల్గుతామా ?

అంతే కాదు ఒక వస్తువులో మరొక వస్తువు గుర్తు పట్టరానంతగా దాగి ఉంటుంది. అప్పుడా లోపలి వస్తువును మన కళ్ళు చూడలేవు.

'దారువహ్నివత్'

ఉదా:- అరణి కట్టెలో అగ్ని దాగి ఉంటుంది కదా! ఆ అరణికట్టెలలోని, అగ్గిపుల్లలోని దాగిన అగ్నిని మనము చూడగలుగుతామా ? లేదు రాపిడి వలన

వాటిలో మంట ఏర్పడ్డప్పుడు మాత్రమే అగ్ని చూడగలుగుతాము.

2. అలాగే 'తిలతైలవత్' నువ్వులలో నూనె దాగి ఉంది. నువ్వులను చూచినప్పుడు వాటిలో దాగి ఉన్న నూనె కనబడుతుందా మన కళ్ళకు? ఎంత మాత్రము కనబడదు కదా!

ఆ నువ్వులను గానుగ ద్వారానో యంత్ర సహాయముతోనో పిండిచేసి, ముద్దచేసి, దానిలో నుండి నూనెను వెలికి తీసి చూపినపుడు అప్పుడా నూనెను మన కళ్ళు చూడగలుగుతాయి.

ఈ విధంగా వేర్వేరు కారణాలవలన దగ్గరలోని వస్తువులనే మన కనులు చూడజాలవే ? మన కళ్ళు చూడజాలనంత మాత్రాన ఆ వస్తువులు లేనివి కావు కదా ? మనము మన కళ్లతో ఒక రూపాన్ని మాత్రమే, దాన్ని అయినా కొంత వరకు మాత్రమే చూడగల్గుతాము కదా ?

కంటికి బొత్తిగా కనబడని, రూపమే లేని శబ్ద, స్పర్శ, రస గంధాలు ఉంటాయి కదా! వాటిని మన కళ్ళతో చూడజాలము. అంత మాత్రాన అవి లేవనగల్గుతామా ? లేదు. కారణము – శబ్దాన్ని చెవులతో, స్పర్శను చర్మంతో, రసాన్ని నాలుకతో, గంధాన్ని ముక్కుతో అనుభవింపగల్గుతాము కనుక. అందువలన ప్రత్యక్షమంటే 'అక్షం ప్రతి' కంటికి కనబడేది మాత్రమే కాదని, మిగిలిన నాల్గు ఇంద్రియాలతో అనుభవించేది కూడ ప్రత్యక్షమే అని శాస్త్రము వివరిస్తుంది.

అయితే ఈ అయిదు ఇంద్రియాలకు ( కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మంలకు) అందని విషయాలు ఉంటాయి, అవి అనుమానానికి (ఊహకు) మాత్రమే అందుతాయి. వాటిని మనస్సు గ్రహిస్తుంది.

ఉదా :- మనము వెళ్ళే దారిలో ఒక గుట్టపై నుండి పొగ వస్తుంది. పొగ కంటికి కనపడుతుంది. కాని పొగకు కారణమైన నిప్పు గుట్టపైన ఉన్న కారణంగా కనబడదు. అయినా 'పొగ ఉందంటే నిప్పు తప్పక ఉండాలి.' అనేది ఒక నియమము. దాన్ని బట్టి గుట్టపై అగ్ని తప్పక ఉంటుందని అనుమానిస్తాము

(ఊహిస్తాము) – ఈ విధంగా అనుమానించడానికి పంచేంద్రియాలు సాధనాలు కావు అనుమానానికి మనస్సు సాధనము.

అయితే ఈ అనుమానానికి కూడ ఇంతకు ముందెప్పుడో మనము పంచేంద్రియాలతో పొందిన అనుభవమే ఆధారము.

గుట్ట మీద పొగకు కారణమైన నిప్పును వెంటనే చూడజాలకున్నా, ఇది వరకు వంట ఇంట్లో ఎప్పుడో వచ్చి కట్టెల నుండి పొగ రావడం చూచాము. అందువలన ఆ విషయాన్ని గుర్తు చేసికొని గుట్టపై తప్పక అగ్ని ఉంటుందని మనస్సులో నిశ్చయించుకొంటాము.

ఇంద్రియాల ద్వారా అనుభవించడానికి, మనస్సు ద్వారా ఊహించడానికి వీలు లేని అపూర్వ విషయాలు ఉంటాయి. వాటిని శాస్త్రం ద్వారా మాత్రమే (శాస్త్రయోనిత్వాత్) గుర్తింపగల్గుతాము.

'శాస్త్రాన్ని నమ్మడమెలా' అని జాబాలి వాదులు మళ్లీ ప్రశ్నింపవచ్చు. మనము రాకెట్ల ద్వారా, క్షిపణుల ద్వారా చంద్ర మండలంలోని విషయాలను గమనించలేదా ? పాత్ ఫైండర్ ద్వారా అంగారక వాతావరణాన్ని పరిశీలించి, నమ్మడం లేదా ? అలాగే శాస్త్ర విషయాలన్నిటిని నమ్మాల్సిందే కదా!

ఇతిశం

## వశిష్ఠుని ప్రబోధము

జాబాలి వాదానికి ఆగ్రహోదగ్రుడయిన శ్రీ రామచంద్రుని శాంతింపజేయడానికి వశిష్ఠ మహర్షి ఇక్ష్వాకు వంశ పూర్వ మహారాజుల చరిత్రలను వినిపించాడు ఈ కథా కథనములో వశిష్ఠుని ఉద్దేశ్యాలు రెండు 1. శ్రీరాముని మనస్సును సంతోషింపజేయడం 2. ఆయన వంశంలో ఆది నుండి పెద్ద కొడుకే రాజ్యార్హుడని సూచించడం.

అందుకే దశరథుని వరకు ఇక్ష్వాకు రాజన్యుల చరిత్రలను తెలిపి 'రామభద్రా! నీవు కూడ దశరథ సార్వభౌముని ప్రథమ పుత్రుడవు కనుక నీవే రాజ్యార్హుడవు'

అని ముగించి రాముని శాంతింపజేశాడు. అంతే కాదు జాబాలి కూడ నాస్తికుడు కాదని ఆయన ఒక మహర్షి అయికూడ రాముని అయోధ్యకు పిలుచుకొని వెళ్లడానికి నాస్తికవాదం చేశాడని తెలిపాడు. మాటలు చెప్పడంలోని ఒక నేర్పును వశిష్ఠుడు చూపాడు. ముందుగా శ్రీరాముని పూర్వ రాజులందరు 'జ్యేష్ఠుడే రాజ్యార్హుడనే నియమాన్ని ఏర్పరచి పాటించారని తెలిపి, అటువంటి క్రమాన్ని శ్రీ రాముడు కూడ పాటించాలి కదా! అని ప్రబోధించాడు.

అయితే ధర్మాచరణలో స్థిర చిత్తుడైన శ్రీరాముని పై వశిష్ఠమహాముని వాక్చాతుర్యము పని చేయలేదు. అందువలన ఆ మహాభాగుడు 'ఆచార్యా! మా పూర్వులలో జ్యేష్ఠులెవ్వరికి నా వలె – పితృ వాక్యపాలనా ధర్మానికి రాజ్యార్హతకు మధ్య అవరోధము ఏర్పడలేదు కదా! నాకేర్పడిన ఈ సంఘర్షణలో పితృ వాక్యపాలనమే నాకు శిరోధార్యము కాదా? అని వశిష్ఠమునీంద్రుని నిలదీశాడు.

తాను అనుసరించిన 'జ్యేష్ఠునికి రాజ్యార్హత' అనే మార్గములో ఇక తాను ముందు వెళ్లజాలనని – గ్రహించిన వశిష్ఠమహాముని 'తండ్రి కంటే తల్లి' గురువులు అధికంగా ఆదరణీయులు అనే మరో మార్గమును అనుసరింపదలిచాడు.

'శ్రీ రామచంద్రా! మనకు ఈ శరీరాన్ని ప్రసాదించిన వారు తల్లి దండ్రులు. ఆ ఇద్దరు మన జన్మకు కారణమైన వారే. సందేహంలేదు. అయితే, ఆ ఇద్దరిలో తల్లి ముఖ్యమైనది. నవమాసాలు మోసి, ప్రసవవేదనను భరించి, జన్మనిచ్చేది తల్లి. గర్భంలో ఉండగా, శిశు సంరక్షణార్థము తన సహజమైన ఆహార విహారాలను మార్చుకొని, ఎన్నో కష్టాలను సైతము లెక్క చేయకుండా మాతృత్వాన్ని అపురూపంగా భావించుకొనేది తల్లి.

'పితుశ్శత గుణం మాతా' తండ్రి కంటే నూరు రెట్లు ఎక్కువగా ఆదరింపబడవలసింది తల్లి.

సామాన్యమాతే ఆ విధంగా ఆదరణీయురాలు అయితే ఇక కౌసల్యాదేవి గురించి చెప్పాల్సిందేమిటి? ఆమె మహాసాధ్వి, వృద్ధురాలు, ప్రస్తుతము భర్త మరణించి దీనావస్థలో ఉంది. ఆమెకు నీవు ఒక్కడివే కొడుకువు. ఆమె మాటను

వినడం నీ ధర్మం కదా?' అని ప్రశ్నించాడు. శ్రీరామచంద్రునికి కన్నతల్లిపై ప్రాణాధిక ప్రేమ. శ్రీరాముని 'మాతృ ప్రేమ'నో – పాశంగా ఉపయోగించి ఆయనను కట్టివేయాలని వశిష్టుని ప్రయత్నము.

కొంత వరకు శ్రీరాముడు మౌనంగా ఉన్నందువలన ఆయనను మాతృప్రేమ పాశబద్ధుని చేయగలిగానని భావించుకొని, ఆయనపై 'గురుభక్తి' అనే మరో పాశాన్ని విసరాలనుకొన్నాడు వశిష్టమహాముని.

'శ్రీరామచంద్రా! భౌతికమైన జన్మనిచ్చిన వారు తల్లి దండ్రులు. మనకు ఇటువంటి జన్మలు ఎన్ని వచ్చిపోవు? ఇవి ముఖ్యము కాదు. వాటికంటే శ్రేయస్కరమైనది 'జ్ఞాన జన్మ'. సమస్త పాపములు, వాటి వలన కలిగే వ్యాధులు బాధలు అన్నిటికి మూలము అవిద్య. సమస్త దుఃఖాలకు మూలమైన అజ్ఞానాంధకారాన్ని పటా పంచలు చేసి, జ్ఞాన జ్యోతిని వెలిగించిన సూర్యుడు ఆచార్యుడే కదా! అందువలన ఆచార్యుడు మనకు మహోపకారకుడు. ఆయనకు తగిన ప్రత్యుపకారము భగవంతుని రెండు విభూతులలో కూడ లభించదు. అందుచేత, రామా! నీ కొక్కనికే గాక నీ వంశానికే గురువైన నా మాట విని, అయోధ్యకు తిరిగి వచ్చి నా మనస్సుకు సంతోషాన్ని కల్గించు' మని బోధించాడు.

అప్పటికీ శ్రీరాముడు మౌనంగానే ఉన్నాడు. కులగురువైన వశిష్టుని మాటలను శ్రద్ధగా వింటున్నాడు. తన పట్ల శ్రీరామునికుండే శ్రద్ధా భక్తులు అపారమైనవని వశిష్ట గురువర్యులకు అనుభవ పూర్వకంగా తెలుసు. అందువలన 'ఆచార్య భక్తి పాశము' కూడ రామునిపై మరింత ప్రభావాన్ని కలిగిస్తుందని భావించాడు.

ఇప్పుడు చివరగా వశిష్టమునీంద్రుడు 'సోదరప్రేమ' అనే మరొక త్రాటితో శ్రీరాముని పూర్తిగా బంధించాలనుకొని,

'రామా! భరతుడు నీకు ప్రాణ ప్రియుడైన సోదరుడు. కేవలం సోదరుడేనా? నీకు శిష్యుడు, దాసుడు. నీకు ఆయనకు 'శరీరాత్మ' సంబంధము కదా! ఒకరి నుండి మరొకరిని విడదీయరాని దృఢ సంబంధము కదా! మీది. ఎంత ఆర్తితో

దీనంగా కరుణామయంగా నిన్ను ప్రార్థిస్తున్నాడో చూడుమని అశ్రునయనాలతో అంజలి బద్ధుడైన భరతుని వైపు చూపాడు.

వశిష్ఠ మహాభాగుడు చేయవలసిన ప్రయత్నమంతా చేశాడు. చెప్పవలసిన మాటలన్ని చెప్పాడు. శ్రీ రాముని స్థానంలో మరెవ్వరు ఉన్నా మారు మాటాడక మాతృ ప్రీతికో, గురుభక్తికో, సోదరప్రేమకో కట్టుబడవలసిందే.

కాని స్థిర చిత్తుడు, ధీరోదాత్తుడు, అచంచల ధర్మానురక్తుడయిన రామభద్రుడు మహా ప్రభావశాలి అయిన వశిష్ఠ మహర్షి మాటలకు వివశుడు కాలేదు. ఆయన ముందు 'సత్య పాలనము, పుత్ర ప్రేమ అనే పాశాల మధ్య ఇరుక్కొని విలవిలలాడుతూ, సత్యము కొరకు పుత్ర ప్రేమను కూడ త్యాగం చేసిన తన తండ్రి దశరథుని' దైన్యము కళ్లకు కట్టింది. తన తండ్రి ఎంత గొప్పవాడు! సత్య ధర్మము కొరకు ప్రాణ ప్రియుడైన తనయుని తనను వదలుకొన్నాడు. తనయుని కొరకు తన ప్రాణాలనే వదిలాడు. 'ఓహో దశరథ సార్వభౌమా! అనితర సాధ్యమైనది కదా నీ సత్య నిష్ఠ! అని ఆ మహానుభావునికి మనస్సులోనే అంజలి ఘటించి – ఆచార్యుడైన వశిష్ఠునికి ప్రత్యుత్తరమును ప్రారంభించాడు.

'గురువర్యా ! మీరు ఉపదేశించిన మాతృ భక్తి, గురుభక్తి నాకు శిరోధార్యములు. అయినా 'పితృ వాక్య పాలనము' ను నేను విడువజాలను.

మీరన్నట్లు జ్ఞాన ప్రదుడైన ఆచార్యుడు శ్రేష్ఠుడే కాని ఆ జ్ఞానాన్ని సంపాదించుకొని, స్థిర పరుచుకోడానికి శరీరము కావాలి కదా! 'శరీర మాద్యంఖలు ధర్మ సాధనం' అనే నుడువి పెద్దలు సాదించింది. ఆ శరీరాన్ని ఇచ్చిన వారు తల్లి దండ్రులు. అందువలన ముందుగా ఆదరించవలసింది మాతా పితరులనే. తనను నవమాసాలు మోసి కని, పెంచిన తల్లి రుణాన్ని ఏ కొడుకయినా తీర్చుకోజాలడు.

అయితే తల్లి తన గర్భంలో ధరించి, వహించి జన్మ నివ్వడానికి కావలసింది ఆమె భర్త బీజమే కదా! బీజప్రదుడు తండ్రే కదా! తల్లి గర్భము ఒకసంచి ఆ సంచిలో పదిలంగా దాచుకోవలసింది భర్త బీజసంపదనే కదా! సంపద కొరకే కదా సంచి ఉన్నది. అందువలన తల్లి, తండ్రి, ఆచార్యుడు ముగ్గురు ముఖ్యులే అయినా,

ఈ ముగ్గురిలో ప్రధానుడు బీజప్రదుడైన తండ్రే' అని శ్రీరాముడు తన నిశ్చయాన్ని వెల్లడించాడు. ఇక్కడ ముఖ్యంగా మనము గమనించవలసింది తల్లి, తండ్రి, ఆచార్యడు. ఈ ముగ్గురిలో ఎవ్వరు ముఖ్యులని నిశ్చయించి మిగిలిన వారి ప్రాధాన్యాన్ని తగ్గించడము కాదు. ఈ ముగ్గురు ముఖ్యులే. అయితే ఒక్కొక్క సందర్భములో వారి వారి నిస్సహాయ స్థితిని బట్టి వారిని కాపాడడానికి ముందుకు రావాలి.

ప్రస్తుతము శ్రీరాముడు తల్లి, గురువు, తమ్ముడు చెప్పిన మాటలను బట్టి అయోధ్యకు తిరిగి వెళ్తే, మరణించిన దశరథుడు కైకేయికి ఇచ్చిన మాట ఏమికావాలి ? దశరథుడు ఆచరించిన సత్యవాక్య పాలన మనే ధర్మమేమి కావాలి? దాని ఫలితంగా దశరధుడు పొందిన స్వర్గమేమి కావాలి ? నరకాన్నుండి తండ్రిని కాపాడవలసిన తనయుడైన తాను, తన తండ్రి దశరథ మహారాజాను ఇప్పుడు స్వర్గం నుండి తొలగించి నరకంలో పడవేయాలా?

ఈ ఆలోచనలు ఆయన మనస్సులో గట్టిగా నిలిచి పితృవాక్యపాలనానికే కట్టుబడేట్లుగా చెశాయి. అందువలన తాను ముందుగా తండ్రికిచ్చిన మాటకే కట్టుబడి ఉంటానని శ్రీరాముడు స్థిరంగా పలికాడు.

## పాదుకా పట్టాభిషేకము

స్వయంగా కుల గురువు వశిష్ట మహాముని అంతటి వాని ప్రయత్నం కూడ వ్యర్థమైన తరువాత భరతుడు ప్రజల వైపు తల్లుల వైపు చూచి 'మీ( రంద) రయినా శ్రీరాముని అయెాధ్యకు తిరిగి రమ్మని ప్రార్థించి నిర్బంధించండి' అని వేడుకొన్నాడు. కాని వారెవ్వరికి శ్రీరాముని స్థిర నిర్ణయాన్ని మార్చే అవకాశము కనుపడలేదు.

చివరకు భరతుడు తానే ముందుకు వచ్చాడు. సుమంత్రుని చూచి దర్భలను పరచుమన్నాడు. శ్రీరాముడు 'తనకు బదులు, భరతుని పదునాల్గేండ్లు వనవాసం చేయడానికి అంగీకరించయినా, అయోధ్యకు తిరిగి వెళ్లాలని', లేకుంటే తాను 'ప్రాయోపవేశం' చేస్తానని సిద్ధమయ్యాడు.

శ్రీరాముడు భరతుని ప్రయత్నాన్ని తీవ్రంగా గర్హించాడు. తనకు బదులు భరతుడు వనవాసం ఎందుకు చేయాలనుకొంటున్నాడ'ని అడిగాడు. ఒకరి ధర్మాన్ని మరొకరు నిర్వర్తించడం అపద్ధర్మం, అపద్ధర్మానికి ఏదో ఒక 'అశక్తత' కారణంగా ఉండాలి. తాను ఆరోగ్యంగా, శక్తిమంతుడై ఉన్నప్పుడు తనకు బదులు భరతుడు వనవాసము చేయడానికి వీలులేదని శ్రీరాముడు తీవ్ర స్వరంతో నిర్దేశించాడు.

'ప్రాయోపవేశం క్షత్రియుడికి తగినది కాదు. బ్రాహ్మణుడో మరొకడో నిస్సహాయుడై, తనకు జరిగిన తీవ్ర నష్టాన్ని, మహారాజుకు నివేదించినా, మహారాజు పట్టించుకోకపోతే ప్రాయోపవేశం చేయాలి కదా! ఇప్పుడు స్వయంగా క్షత్రియుడు మహారాజస్థితిలో ఉన్న భరతుడు ప్రాయోపవేశానికి పూనుకోవడం మహాపావమ'ని తెలిపాడు.

తన చివరి ప్రయత్నం కూడ వ్యర్థం కావడంతో భరతుడు తీవ్ర దుఃఖంతో జలాలను గ్రహించి, అక్కడ అందరు ప్రజల ముందు, తల్లుల ముందు 'శ్రీరామచంద్రుని మాటననుసరించి తాను, తన పరివారము అయోధ్యకు తిరిగి వెళ్తామని, శ్రీరాముని పాదుకలను, ఆయనకు బదులు సింహాసనంపై ఉంచి పారతంత్ర్య పరిపాలన చేస్తానని, ఒక వేళ పద్నాలుగు సంవత్సరాలు గడిచాక కూడ శ్రీరామచంద్రుడు రాకపోతే, ఒక్కరోజైనా ఆగక తాను అగ్ని ప్రవేశం చేస్తాన'ని భీషణ ప్రతిజ్ఞ చేశాడు.

భరతుని ధర్మ శీలానికి అక్కడ ప్రజలు, తల్లులతో పాటు శ్రీరాముడు కూడ సంతోషించాడు. ఆయన తన ప్రియ సోదరుడైన భరతుని అక్కున జేర్చుకొని ఓదార్చాడు.

వశిష్ట భగవానునికి 'శ్రీరామభద్రుడు వనవాసాన్ని మధ్యలో విరమించుకొని, అయోధ్యకు ఏ పరిస్థితులలో తిరిగి రాడని' తెలుసు. అందువలన, తాము అయోధ్య నుండి బయలు దేరేప్పుడే 'బంగారు పాదుకలను', ఆయన చేయించి తెచ్చాడు. భరతుడా పాదుకలను శ్రీరాముని పాదాల ముందు ఉంచాడు. శ్రీ రాముడు

వాటిని ధరించి, విడిచాడు.

భరతుడు ఆ పాదుకలను శిరస్సుపై ఉంచుకొని, ముందు 'శత్రుంజయము'నే పట్టపుటేనుగు పై ఉంచి, ఆ తరువాత, శిరస్సుపై ఉంచుకొని రథములో కూచొన్నాడు. భరతునితో పాటు ఆయన పరివారమంతా అయోధ్యకు బయలు దేరింది.

అయోధ్యకు చేరాక తల్లులను వారి వారి భవనాలలో నిలిపి, తాను ఈ పదునాల్గేండ్లు 'నంది గ్రామంలో' ఉండి, శ్రీరాముని పాదుకలను సింహాసనముపై నుంచి వాటికే రాజ కార్యాలన్ని నివేదిస్తూ గడుపుతానని మంత్రి పురోహితులకు తెలిపాడు. వారందరు భరత భక్తి భావనకు ప్రసన్నులయ్యారు.

వెంటనే నంది గ్రామానికి భరతుడు, ఆయన వెంట పరివారము బయలుదేరారు. నిజానికి భరతుడు తన వెంట రమ్మని ఎవ్వరిని కోరలేదు. అయితే ఆ ధర్మాత్ముని అనుసరించడమే తమకు ఉజ్జీవనకరమని భావించి, చంద్రుని వెన్నెలవలె వారాయనను అనుసరించారు.

రాజ సింహాసనాన్ని, నంది గ్రామంలో ప్రతిష్ఠించి, దానిపై రామ పాదుకులకు పట్టాభిషేకముగావించి, వాటినే శ్రీరాముడుగా భావించి, వాటికే రాజ్య సమస్యలను, సంపదలను నివేదించి తానొక ప్రతినిధిగా, పరతంత్రుడుగా మెదులుకోసాగాడు.

విశ్వనాధవారు, తమ 'కల్పవృక్షం' ద్వారా రామపాదుకలకు భరతుని భక్తి భావ వీచికలను పరమ రమణీయంగా ప్రసరింపజేశారు.

భరతుడు తానే వందిమాగధుడయి 'మేలుకోవయ్య స్వామీ' అని పాదుకలకు మేలుకొల్పు పాటలను పాడేవాడు. 'సుఖ నిద్ర పట్టిందా స్వామి!' అంటూ పరామర్శించేవాడు.

'ఏ సమయంలో ఏ ఆజ్ఞవస్తుందో అనుకొంటూ' వాటివైపు ఎదురు చూచేవాడు. తానే వార్తాహరుడై, వార్తలను వినిపించే వాడు. నిద్రా సమయం కాగానే పాద సేవ చేసేవాడు.

తెల్లవారగానే తాను సుస్నాతుడై పాదుకలకు పంచామృతములతో అభిషేకము గావించి సన్నని వస్త్రాలతో తడి అద్ది, మంచి పట్టు వస్త్రాలను ధరింపజేశేవాడు. పరిచారకులు తెచ్చిన పరిమళ భరితములైన పుష్పాలతో పాదుకలను అలంకరించే వాడు. వాటికి ధూప దీపాలతో అర్చనలు కావించే వాడు. సహస్రనామార్చనతో పూజించే వాడు. రస భరితములైన పదార్థాలను, 'ఆరగింపు' మని సమర్పించేవాడు.

వాటికి శయ్యాసనమును సమర్పించి వింజామరలతో వీస్తూ జోల పాటలు పాడుతూ తన్మయుడయ్యేవాడు భాగవత శిఖామణి, మహాత్ముడైన భరతుడు. ఆయన దృష్టిలో అవి పాదుకలు కావు, సాక్షాత్తు శ్రీ రామచంద్ర ప్రభువే!

❀ ❀ ❀

శ్రీరాముడు పదునాలుగేండ్లు రాజ్యాన్ని పాలించుమని భరతునికిచ్చాడు. అలాగే కొంతకాలము పాలించుమని మనకు 'శరీరమనే రాజ్యా' న్నిచ్చాడు. దానిని మనమెలా నిర్వహిస్తామో పరిశీలిస్తాడు ఆ ప్రభువు.

భరతుడెప్పుడు తనను తాను స్వతంత్ర రాజని భావించుకోలేదు. 'రాజ్యంచాహంచరామస్య' రాజ్యము రాముడిదే, తాను రాముడి వాడినే. రాజ్యాన్ని, తనను రాముడే పాలించేవాడని' దృఢంగా విశ్వసించాడు. తిరిగి ఎప్పుడా రాజ్యాన్ని రామునికి అప్పగిస్తానా అని ఎదిరి చూచాడు. రాజ్యాన్ని తనకు భారంగా భరించాడు. పదునాల్గేండ్లు గడచిన తరువాత వెంటనే రాజ్యాన్ని రాముని కొరకు రామునికి సమర్పించి, తేలిగ్గా ఊపిరి పీల్చుకొన్నాడు.

మనమే ఈ శరీరాన్ని మనకిచ్చిన ఈశ్వరుడిని మరిచిపోతాము. ఇది మనదే మన కొరకే అనుకొంటాము. మనమే స్వతంత్రులమనుకొంటాము. అటువంటి మనకు భరతుడా దర్శము కావాలి.

## అనసూయ

భరతుడు సేనా సమేతంగా చిత్ర కూటం వదిలి అయోధ్యకు తిరిగి వెళ్లిన తరువాత కొద్దిరోజులకు చిత్ర కూట పరిసరాలలో కొంత మార్పును శ్రీ రాముడు

గమనించాడు. అక్కడ మునులందరు ఎందుకో తమ వైపు భయం భయంగా చూస్తూ ఏవో సైగలను చేసికొంటూ వారిలో వారే మాట్లాడుకొంటూ ఉండడము శ్రీరాముని దృష్టిలో పడింది. అందువలన రామభద్రుడు ఒక ముని ముఖ్యుని సమీపించి

'అయ్యా! మీ వాళ్లెందుకో మమ్మల్ని చూస్తూ భయగ్రస్తులవుతున్నట్లు కనబడుతోంది. మా సోదరుల వలననో, లేక సీతా దేవి వలననో మీకేమైనా అపచారము కలిగిందా?, అని ప్రశ్నించాడు.

ఆ మునివర్యుడు. 'రామచంద్రా ! నీవడిగినట్లు మీ వలన ఎటువంటి అపచారము జరుగలేదు. అయితే మీరు చిత్రకూటానికి వచ్చినప్పటి నుండి రాక్షసులు మధ్య మధ్యలో వస్తూ మమ్మల్ని తమ చూపులతో, చేష్టలతో బెదిరిస్తున్నారు. మా తపస్సులకు, యజ్ఞాలకు విఘ్నాలను కల్పిస్తున్నారు. మేమీ ప్రాంతాన్ని విడిచి - సమీపంలోని 'పురాణా' శ్రమానికి తరలి వెళ్లాలనుకొంటున్నాము. మీకు ఇష్టమైతే మాతో పాటు మీరు కూడ రావచ్చున' ని ఆహ్వానించాడు.

రామభద్రునికి చిత్ర కూటము వదిలి ముందుకు వెళ్లాలని ఆలోచన కలిగింది. దానికి అనేక కారణాలేర్పడ్డాయి. ఒకటి భరతాదులకు చిత్రకూటాశ్రమము తెలిసింది. వాళ్ళ మళ్లీ మళ్లీ వచ్చి తమను అయోధ్యకు తిరిగి రమ్మని నిర్బంధించవచ్చు. అది రామునికి ఇష్టము లేదు. 2. భరతుని సేన, గజతురగాది మృగాలు – మలమూత్ర విసర్జన చేసి – ఆ ప్రాంతాన్ని మలిన పరచి – ఆవాసయోగ్యం కాకుండా చేశాయి.

3. తమ కారణంగా రాక్షసులు ముని గణాన్ని బాధిస్తున్నారు.

ఈ కారణాల వలన సీతారామలక్ష్మణులు అక్కడి ముని జనుల అనుమతితో ఆ ప్రాంతాన్ని తామే వదిలారు.

సీతాసమేతులయిన శ్రీ రామ లక్ష్మణుల ప్రయాణము మధ్యలో 'అత్రి మహాముని ఆశ్రమము' కనుపడింది. శ్రీ రాముడు అత్రిమహర్షికి అభివాదము

చేసి, సీతా లక్ష్మణులను, తనను పరిచయం చేసికొన్నాడు.

అత్రిమునీంద్రుడు వారికి స్వాగత సత్కారాలతో ఆతిధ్యమిచ్చి, సీతాదేవిని, అనసూయ దగ్గరికి వెళ్ళమని పంపించాడు.

సీతారామ లక్ష్మణులకు అత్రి సంయమీంద్రుడు అనసూయాదేవి ప్రభావాన్ని వివరించాడు.

'లోకమంతా పది సంవత్సరాలు వర్షాభావము వలన క్షామ పీడితం కాగా ఆమె తన తపశ్శక్తితో గంగా నదిని ప్రవహింపజేసింది.

2. ఆమె పదివేల సంవత్సరాలు నిరంతరంగా నిరంతరాయంగా తపస్సు గావించింది. అంతే కాదు ఎన్నో వ్రతాలు పూర్ణంగా ఆచరించింది.

3. దేవతల కార్య సిద్ధి కొరకు పది రాత్రులను ఏక రాత్రము చేయగలిగింది. రామభద్రా! అనసూయ మీకు అమ్మవంటిది. ఆమెను సేవించండి' అని తెలిపాడు.

శ్రీరాముడు సీతాదేవిని అనసూయ దగ్గరకు పంపాడు సీతాదేవి అడుగులో అడుగు వేసికొంటూ అనసూయను సమీపించి తన పేరు తెలిపి ఆమెకుశలాన్ని అడిగింది.

అనసూయ సీతాదేవిని తన అక్కున చేర్చుకొంది. ఆమెను అనురాగంతో లాలించింది. తన తపశ్శక్తిని చూచుకొని, తన వ్రతాచరణ సామర్థ్యాన్ని చూచుకొని అనసూయాదేవి తన అంతరంగంలో అణువంతైనా అహంకారమునకు చోటు చేసికోనివ్వలేదు. పై పెచ్చు ఆ సాధ్వీమణి 'తన శక్తి కంతటికి మూలము పాతివ్రత్య ప్రభావమే' అని గుర్తించింది.

ఆ తపశ్శాలిని సీతాదేవికి పాతివ్రత్యమహిమను గురించి వివరించింది.

'నగరస్థో, వనస్థోవా, పాపోవా యదివా శుభః

యాసాం స్త్రీణాం ప్రియోభర్తా, తాసాంలోకా మహోదయాః'

భర్త మంచివాడు కానీ, చెడ్డవాడు కానీ, నగరంలో సంపదలతో తులతూగనీ,

లేక అడవులలో ఆపదలలో మునిగి తేలనీ, ఎవ్వరు తమ భర్తలనే ప్రాణాధికంగా ప్రేమిస్తారో, వారు ఉత్తమ లోకాలను పొంది శుభాభ్యుదయాలను అనుభవిస్తారు.

సీతాదేవి వంటి పరమ పతివ్రతకు ఈ విషయాలు తెలియనివి కావు. తనకు తెలిసినవే చెప్పిందని అనసూయను ఆమె అనాదరించలేదు. పైపెచ్చు ఎంతో వినయంతో, 'అమ్మా! మీవంటి సాధ్వీమణులు పాతివ్రత్య మహిమను ఉపదేశించడము సహజమే. ఇంతకు ముందు పాణిగ్రహణ సమయంలో అగ్నిసన్నిధిలో మా అమ్మ, అడవులకు బయలుదేరే ముందు మా అత్తయ్య కౌసల్యాదేవి కూడ ఈ మాటలే చెప్పారు.

అమ్మా! మీరన్నట్లు సతికి పతియే దైవము. సామాన్యులైన భర్తలనే సాధ్వులు తమ దైవాలుగా భావిస్తారే? ఇక శ్రీరాముని వంటి భర్తను పొందిన నేను భర్తనే సర్వస్వంగా భావించడంలో వింతేముంది ?

రాముని సన్నిధిలో నేను తల్లిదండ్రుల లాలనను, సఖీ జనుల స్థిరానురాగాన్ని, భర్త యొక్క ఆప్యాయతను సర్వస్వాన్ని పొందుతున్నాను.

రాముడు ధర్మాత్ముడు, మహావీరుడు. పర స్త్రీలను కౌసల్యను చూచినట్లు వినయంతో మాతృ భావనతో చూస్తాడు. అటువంటి పతిలభించిన నేను అతనికంటె ఆశించ దగిన విషయమేమి ఉంటుంది ?

పతి శుశ్రూషవలననే కదా సావిత్రి స్వర్గమును సంపాదించింది. రోహిణి శశాంకుని క్షణమైనా విడిచి ఉండదు కదా! అని బదులు చెప్పింది.

''ఈ నాడు కూడ పుట్టినింటికి మెట్టినింటికి కీర్తి దెచ్చే భాగ్య కల్పలతలెందరో భారత భూమిని తమ ప్రవర్తనతో పవిత్రం చేస్తూనే ఉన్నారు కదా!''

అనసూయ అంతరంగం సీతాదేవి చల్లని మాటలతో ఆమందానందాన్ని అందుకొంది. 'సీతా! చిన్న దానివైనా ఎంత చక్కగా మాట్లాడావమ్మా! నీ సంభాషణకు తగిన సత్కారాన్ని నేనేమి చేయగల్గుతానమ్మా? అని అనసూయ అడిగింది. సీతాదేవి శ్రీరాముని నుండి తప్ప ఇతరుల నుండి దేన్ని ఆశించే స్వభావం కలది కాదు. అందువలన ఆమె అనసూయతో 'అమ్మా! మీరింత అనురాగము

చూపారు. ఇంతకంటె ఆశించదగింది ఏముంటుంది ? అని అంది.

అయినా అనసూయాదేవి సీతాదేవికి దివ్య పుష్పమాలలను, దివ్య వస్త్రాలను, దివ్యాంగరాగాలను ప్రసాదించింది. ఇవి తమ సువాసనను, సౌందర్యాన్ని ఎన్నటికి కోల్పోవని తెలిపింది.

చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను అత్త మామలను, అంతఃపుర సౌఖ్యాలను, అన్నిటిని వదులుకొని, భర్తతో అడవులకు తరలి వచ్చిన, సీతాదేవిని అనసూయ అపురూపంగా అప్యాయతతో చూస్తూ, సీతా కల్యాణాన్ని గురించి ప్రశ్నించింది.

సీతాదేవి తన స్వయంవర వృత్తాంతాన్ని వివరించింది. జగత్కల్యాణ కరమైన సీతారామ కల్యాణాన్ని అనసూయా దేవి ఎంతో అదరంతో విన్నది. ఆనందాన్నుండి తేరుకొని సీతాదేవితో 'అమ్మా! ఇక రాత్రి అయింది. నీవు మీ వాళ్ల దగ్గరికి వెళ్లుమని' పంపింది. అసమాన మహిమాన్వితురాలైన అనసూయాదేవి అభిమానానికి ఆదరణకు పాత్రురాలై, అలంకార వస్తువులను అందుకొన్న సీతాదేవిని చూచి వాటి వలన అతిశయించిన ఆమె అందాన్ని చూచి శ్రీరాముడు సంతసించాడు.

సీతారామ లక్ష్మణులు చిత్ర కూటాశ్రమాన్ని విడిచి వెళ్తూ అత్రిమహాముని ఆశ్రమాన్ని చేరుకొన్నారు కదా! ఆ మహాముని, ఆయన భార్య అనసూయాదేవి అసమాన ప్రభావవంతులు.

❀ ❀ ❀

'అత్రి, అంటే త్రి (మూడు) గుణాలు లేనివాడు. సత్వ రజస్తమోగుణాలు మూడు. మనమందరము ఈ మూడు గుణాల మిశ్రమ ప్రభావంలోనే కదా పడిపోయి సంసార వ్యామోహంలో చిక్కునేది. అత్రి మహాముని ఈ త్రిగుణాలకు అతీతుడు. రజస్తమోగుణాల దుష్టప్రభావము ఆ మహామునిపై ఆవగింజంతయినా లేదు. శుద్ధ సత్వుడా మహర్షి. అందువలననే అహంకార రహితుడైన ఆ మహాముని తన ప్రభావాన్ని గురించి చెప్పుకోక, 'ఆడది' అని చులుకనగా చూడకుండా తన అతివ ప్రభావాన్ని ఆగంతకులయిన సీతారామలక్ష్మణులకు వివరించాడు.

ఇక అనసూయ ఎటువంటి సాధ్వి ! అసూయకు ఆమె అంతరంగంలో ఇసుమంతైనా చోటు లేదు. తాను తపశ్శక్తి శాలినని ఆమెకు స్వాతిశయము అణువంతైనా లేదు. తన గుణాన్ని అధికంగా భావించుకొని, అన్యులగుణాలలో దోషాలను అన్వేషించే స్వభావానికే 'అసూయ' అని పేరు. అనసూయలో ఈ అసూయ లేశమైనా లేదు. తన తపశ్శక్తి కంటే పాతివ్రత్యమే ప్రభావవంతమని నమ్మిన పతివ్రతామతల్లి అనసూయ.

మనమందరము అత్రి సంయమీంద్రుని వలె సంయమనంతో త్రిగుణాలకు అతీతులమై - శుద్ధ సత్వ గుణ సంపన్నులమై, అనసూయాదేవి వలె అసూయారహితులమై, భగవత్, భాగవత, ఆచార్యులకు పరతంత్రులమై ఉండి ఆత్మోజ్జీవనాన్ని సాధించాలని శ్రీరామాయణము - అత్రి అనసూయల ద్వారా తన సందేశాన్ని అందిస్తోంది.

ఇతిశం

అయోధ్య కాండ సమాప్తము

శ్రీసీతారామచంద్రః సతాంగతిః

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# కృతజ్ఞతాభివందనములు

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి (చిన్న) శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారు దాసునిపట్ల విశేషవాత్సల్యము కలవారు. దాసుడు విజ్ఞాపనం చేసికొన్న బాలకాండకు వారు ''బదరీక్షేత్రం'' నుండి ప్రతీక్షా పూర్వకంగా తమ ''ఆమోదం'' తెలిపారు. ఈ పర్యాయము వారిని ఈ గ్రంథాన్ని కటాక్షించి తరువాత మంగళాశాసనాలను కృపజేయవలసిందిగా ప్రార్థించాను. క్షణం తీరికలేకుండా బహుకార్యవ్యగ్రులయిన ఆ మహాత్ములు వీలు కల్పించుకొని గ్రంథాన్ని కటాక్షించి తమ ''ఆమోదమును'' అందించారు. ప్రాతస్స్మరణీయ పాదారవిందులైన ఆ మహనీయుల పవిత్ర పాదారవిందములకు శతకోటి కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు.

''ఆపరితోషాద్విదుషాం నసాధుమన్యే ప్రయోగ విజ్ఞానం'' అన్నట్లు సాహసించి ప్రప్రథమంగా దాసుడు బాలకాండను విజ్ఞాపనం చేసికొన్న తరువాత మొట్టమొదట తమ ''రసాస్వాదనముతో'' ఆ గ్రంథాన్ని గుణవంతం చేసిన పండిత ప్రకాండులు, ప్రవచన వాచస్పతులు శ్రీ ఉ.వే.ప్ర. శ్రీభాష్యం అప్పళాచార్యస్వామివారు తమ ఆరోగ్యము ప్రస్తుతం అంతంత మాత్రమే అయినప్పటికి అభిమానంతో తమ ''ఆస్వాదము''ను ''అయోధ్యకాండ'' కు కూడ అందించారు. ఆ మహానుభావుల శ్రీచరణములకు అనేకానేక నమోవాకములు.

సర్వేశ్వరునికి భక్తి ప్రసూనములను స్వాచార్యుల ద్వారా సమర్పించినప్పుడు అవి పవిత్రములై పరిమళ భరితములై భగవత్ప్రీతికి మరింత పాత్రములవుతాయి. అందకే ఈ అయోధ్యాకాండను అస్మత్ గ్రందాచార్యులు, షట్శాస్త్ర పారంగతులు, ''ఉభయ వేదాంతాచార్య'' బిరుద సమ్మానితులు, శతావధానులు, పరమ పదవాసులైన శ్రీమాన్ శ్రీ.ఉ.వే.ప్ర శిరిశినగల్ కృష్ణమాచార్యస్వామి వారి శ్రీపాదములకు భక్తిపూర్వకంగా అంకితమిస్తున్నాను.

''బాలకాండ'' ముద్రణ భారాన్ని వహించిన మ.రా.శ్రీ సిరికొండ వేంకటరావు, అడ్వకేటు (సిద్ధిపేట) గారు ''అయోధ్య కాండ'' భారాన్ని మ.రా.శ్రీ అయోధ్య రామారావు గారికి అప్పగించుమన్నారు. వారి సూచనను తెలుపగానే సంతోషంగా సమ్మతించి ఆ ప్రయత్న భారాన్ని తమ భుజములపై వేసికొన్న ఉదార చరితులు మ.రా.శ్రీ చిటి అయోధ్య రామారావు గారు.

అలాగే అయోధ్యకాండ విషయాన్ని తెలుపగానే వెంటనే తమ ఔదార్యాన్ని ప్రకటించి దానిని పూర్తిచేసే భారము తాము కూడ స్వీకరిస్తామన్న మహాదాతలు, సుప్రసిద్ధులైన కంట్రాక్టర్లు మ.రా.శ్రీ దొనకంటి వేంకటేశ్వరరావు (పోరుమల్ల) గారు. రాముని అలయాన్ని నిర్మించడమే కాక ఈ అక్షరాలయ నిర్మాణానికి కూడ కైంకర్యాన్ని అందించిన వదాన్యులు మ.రా.శ్రీ మేచినేని నారాయణరావు గారు.

అదేవిధంగా ఈ గ్రంథ ముద్రణ విషయంలో అడిగిన వెంటనే తమవంతు కైంకర్యాన్ని అందివ్వడానికి అంగీకరించిన వదాన్యులు సిరికొండ సోదరులు మ.రా.శ్రీ సిరకొండ కమలాకర్‌రావు గారు, మ.రా.శ్రీ సిరికొండ ప్రభాకర్‌రావు గారు.

శ్రీరామచంద్రస్వామి విషయంలో ఇది దాసుడు హృదయపూర్వకంగా సమర్పించిన ద్వితీయ భక్తి ప్రసూనము. అయోధ్యాధినాథునికి సమర్పించిన ఈ అపురూప భక్తి పుష్ప పరిమళాన్ని కరీనగరము కమనీయంగా గుబాళింపజేసింది. ఈ అయోధ్యా పుష్పసువాసనలను నలుదెసలలో వెదజల్లడానికి పైవిధంగా తమ ద్రవ్య సహకారాన్ని అందించిన మాన్యులకు, వదాన్యులకు అయోధ్యానగర ప్రభువైన శ్రీరామచంద్రస్వామి ఆయురారోగ్యైశ్వర్యాలను ఇతోధికంగా అందజేయుగాక !

– ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఎ.

# రచయిత పరిచయము



ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఎ

| | | |
|---|---|---|
| జననము | - | శ్రీశాల (సిరిసిల్ల కరీంనగర్ జిల్లా) |
| జననీ జనకులు | - | శ్రీమతి ఆచి వేంకట నరసమాంబ<br>శ్రీ మదాచి వేంకట నృసింహాచార్య<br>(ఆవునూరు) స్వామివారు |
| వృత్తి | - | ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట |
| ప్రవృత్తి | - | ఉపన్యాసాలు, కాలక్షేపాలు, కవిత్వము |
| ముద్రిత గ్రంథాలు | - | శ్రీరామాయాణానుభవము (బాలకాండ) |
| ప్రవేశము | - | శ్రీ రామాయణ, భగవద్గీతా, శ్రీభాష్యాది సంస్కృత గ్రంథాలలో, భగవద్విషయాది తమిళ గ్రంథాలలో |
| ఉపన్యసించిన స్థలాలు | - | యాదగిరి, హైదరాబాద్, విజయవాడ, శ్రీరంగాది ప్రముఖ స్థలాలలో |
| శాశ్వత సభ్యత్వము | - | ఉభయ వేదాంతాచార్య పీఠము (సీతానగర్) లో |